

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

పేజీలు: 16+16+40 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 6.00 | సంపుటి: 11 సంచిక: 299

SUNDAY Special

ఆదివారం 20-1-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



దోపిడీని ఆపినందుకే మహాకూటమి

- విపక్ష నేతల సభపై ప్రధాని
- తనపై భయంతో వారంతా ఒక్కటయ్యారని ఎద్దేవా

- 15లో



నేనే రాణి.. నేనే మంత్రి

నా లైఫ్ నాదే అంటున్న కాజల్ అగర్వాల్‌తో సాక్షి ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూ

- ఫ్యామిలీలో



శనివారం ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న గవర్నర్ నరసింహన్

ప్రగతి వైపు పయనం

ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం

- ఇచ్చిన హామీలే కాకుండా కొత్త పథకాలు అమలు
- ఈ ఏడాది నుంచే 10 వేలతో రైతుబంధు పథకం
- సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసే లక్ష్యంగా ముందడుగు
- పెంచిన పింఛన్లు, రుణమాఫీ, నిరుద్యోగ భృతి అమలు
- మార్చికల్లా ఇంటింటికీ మిషన్ భగీరథతో తాగునీరు
- రిజర్వేషన్లపై రాజీలేని పోరాటం చేస్తున్నామని స్పష్టీకరణ
- ఎమ్మెల్యేలకు హృదయపూర్వక శుభాకాంక్షలు

- 4లో

వసంత పంచమిన కేబినెట్ విస్తరణ!

ఫిబ్రవరి 10 ముహూర్తం

తొలి విడతలో 8 మందికే లభించనున్న చోటు

- ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారంటున్న అధికార వర్గాలు
- ఇతర కీలక పదవుల భర్తీ కూడా అప్పుడే...
- లోక్‌సభ ఎన్నికలయ్యాక మరో 8 మందికి చాన్స్... తొలి విస్తరణలో కొత్త వారికి చోటు డౌటే
- మార్చి రెండో వారంలో అసెంబ్లీ సమావేశాలు, తాత్కాలిక బడ్జెట్
- లోక్‌సభ ఎన్నికల తరువాతే పూర్తిస్థాయి కేబినెట్.. జూలైలో బడ్జెట్ సమావేశాలు

సాక్షి ప్రత్యేక ప్రతినిధి–హైదరాబాద్: ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు తన మంత్రివర్గాన్ని ఫిబ్రవరి రెండో వారంలో విస్తరించనున్నారు. అత్యున్నత అధికార వర్గాలు అందించిన సమాచారం ప్రకారం ఫిబ్రవరి 10వ తేదీ వసంత పంచమి పర్వదినాన మంత్రివర్గ విస్తరణ జరగనుంది. పంచాయతీ ఎన్నికల ప్రక్రియ మధ్యలో ఉండటం, మంచి ముహూర్తాలు లేకపోవడంతో మంత్రివర్గ విస్తరణను ఫిబ్రవరిలో పెట్టుకోవాలని సీఎం కేసీఆర్ నిర్ణయించుకున్నారు. అయితే తొలి విడతలో ఎనిమిది మందికే చోటు ఉంటుందని, లోక్‌సభ ఎన్నికల తరువాత జరిగే విస్తరణలో మరో ఎనిమిది మందికి అవకాశం కల్పించి పూర్తి స్థాయి మంత్రివర్గాన్ని ఏర్పాటు చేస్తారని తెలుస్తోంది. మంత్రివర్గాన్ని ఎప్పుడు విస్తరిస్తారు, ఎవరెవరికి స్థానం లభిస్తుందన్న దానిపై రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతోంది. విస్తరణలో మంత్రి పదవులు పొందే ఆ ఎనిమిది మంది ఎవరన్నదానిపై అధికార పార్టీలో ఎవరి అంచనాలు వారు వేసుకుంటున్నారు. ఈసారి విస్తరణలో కొత్త వారికి అవకాశం ఇవ్వకపోవచ్చని, అందరూ పాతవారే ఉంటారని కొందరంటుంటే కనీసం ఇద్దరు కొత్త వారు ఉండే అవకాశం ఉందని మరికొందరు అంటున్నారు. మంత్రివర్గ విస్తరణలో అవకాశం రాని వారికి



మిగతా 2వ పేజీలో ▶

పేలిన ఆయిల్ పైప్‌లైన్

మెక్సికోలో 66 మంది దుర్మరణం

15లో

అదానీలకు ప్రేమతో!

ఏపీలో ఎన్నికల ముందు కమీషన్ల కోసం బొగ్గు గనుల సంతర్పణ

- అదానీకి సులియారీ, ఎస్సెల్‌కు దక్షిణ మదన్‌పూర్ బొగ్గు గనులు
- ఓ కీలక అధికారి ద్వారా 'ముఖ్య'నేత సంప్రదింపులు
- రెండు సంస్థలకే టెండర్లు దక్కేలా చక్రం తిప్పిన వైనం
- ఎండీవో ఎంపిక టెండర్లలో అక్రమాలు... వాటాలు ఇచ్చిన సంస్థలకే కాంట్రాక్టు
- ఫిర్యాదులు పట్టించుకోకుండా రివర్స్ వేలం, 'టెయిలర్ మేడ్' నిబంధనలతో ప్రక్రియ పూర్తి

2లో

జేఈఈ మెయిన్‌లో..

సత్తాచాటిన తెలుగు తేజాలు

- దేశవ్యాప్తంగా 15 మందికే 100 పర్సెంటైల్
- వారిలో తెలంగాణ నుంచి నలుగురు, ఏపీ నుంచి ఒకరికి అత్యధిక స్కోర్
- ఏప్రిల్ 6–20 మధ్య మరోసారి జేఈఈ మెయిన్
- ఫిబ్రవరి 8–మార్చి 7 వరకు దరఖాస్తులు

- 3లో

యువతతోనే అద్భుతాలు

- తెలంగాణ జాగృతి అంతర్జాతీయ సదస్సులో అన్నా హజారే
- పెళ్లి విషయంలో తనను అనుసరించొద్దని చలోక్తి
- ప్రజలే దేవుళ్లు, సమాజమే దేవాలయమని వెల్లడి
- హక్కుల సాధనకు ఉద్యమించాలి: కవిత

- వివరాలు 5లో

విపక్షాల సమరశంఖం

- ప్రధాని మోదీని సాగనంపాలని పిలుపు
- విభేదాలు మరచి, ఐక్యంగా ఎన్డీయేను ఢీకొట్టాలని ప్రతిన
- కోల్‌కతా ర్యాలీ విజయవంతం
- హాజరైన కీలక నేతలు

- వివరాలు 15లో

సాక్షి
రౌండప్
2 నల్లగొండ | ఆదివారం | జనవరి | 20 | 2019
www.sakshi.com

భారత్‌లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో 1952, జనవరి 21న జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది.



నవ్వుల సడినీ, విషాదపు తడినీ
కొలిచేస్తారు సుమండీ!

వర్షించే మేఘాలనూ, శీతాకాలం వణికించే మంచురాత్రులనూ, సెగలుపుట్టించే వేసవి వేడినీ కొలిచే సాధనాలున్నాయి. కానీ ఇప్పుడు ప్రపంచ మానవాళి ముఖకవళికలను బట్టి వారిలోని ఆనందాశ్చర్యాలకూ లెక్కకట్టేస్తున్నారు పరిశోధకులు. మీలోని దుఃఖాన్నీ, ఆనందాన్నీ, కోపాన్నీ, విషాదాన్నీ స్కేల్‌తో కొలిచిమరీ మీ అభివ్యక్తిని ఇట్టే పట్టేస్తారు. నిజంగా మీరు సంతోషంగా ఉన్నారా? ఉంటే ఎంత సంతోషంగా ఉన్నారు? కోపమా? అయితే దాని బరువెంత? ఇలా మీ ముఖాన విరిసే అన్ని హావభావాలనూ ముఖ కండరాల కదలికలను బట్టి అంచనా కట్టేస్తున్నాయి తాజా అధ్యయనాలు. అలా లెక్కలు వేసే ప్రపంచంలో ఎన్ని రకాల నవ్వులు పూయించొచ్చో, ఎన్ని రకాలుగా మీలోని కోపాన్ని ప్రదర్శిస్తున్నారో తేల్చి చెప్పేశారు.



ఆనందానికి 17 వ్యక్తీకరణలు..

ప్రపంచవ్యాప్తంగా మనుషులు విసుగుని ప్రదర్శించడానికి ఒకే ఒక్క ముఖ కవళిక ఉందట. కానీ మనలోని సంతోషాన్నీ, ఆనందాన్నీ, ఉట్టిపడే ఉల్లాసాన్నీ 17 రకాలుగా మనం వ్యక్తీకరిస్తున్నట్టు తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. అయితే మనలో భయాన్ని మాత్రం కేవలం మూడు రకాలుగా ప్రదర్శిస్తున్నాం. ఆశ్చర్యాన్ని నాలుగురకాలుగా అభివ్యక్తీకరిస్తే, ప్రపంచ ప్రజలంతా తమలోని కోపాన్నీ, విషాదాన్నీ మాత్రం ఐదు విభిన్న ముఖ కవళికల ద్వారా, ముఖాకృతుల ద్వారా ప్రదర్శిస్తున్నారు. మన ముఖంలోని కండరాల కదలికలను బట్టి మన నవ్వునీ, నవ్వుతున్నప్పుడు మన కళ్ళ దగ్గర పడే చర్మపు ముడతలని బట్టి మనలోని ఆనందాన్ని చాలా సునాయాసంగా కొలిచేయొచ్చంటున్నారు పరిశోధకులు. ''ఈ పరిశోధన చాలా సంతోషాన్నిచ్చింది. ఎందుకంటే సంతోషంలోని క్లిష్టమైన విషయాలెన్నింటినో ఇది విడమరిచి చెప్పింది''అని ఓహియో యూనివర్సిటీ అధ్యాపకులు అలెక్సీ మార్టినెజ్ పేర్కొన్నారు.



35 రకాల ఎమోషన్స్ కామన్

మనుషులు తమలోని ఆనందం, కోపం, సంతోషం, దుఃఖం, విషాదం లాంటి ఉద్విగ్నభరిత క్షణాలను వేనవేల రకాలుగా వ్యక్తీకరిస్తుంటారు. అయితే అందులో కేవలం 35 రకాల అభివ్యక్తులు మాత్రమే ఉంటాయని ఈ పరిశోధన తేల్చి చెప్పింది. వివిధ రకాల ఫీలింగ్స్‌ని వివరించే 821 రకాల పదాలను ఇంటర్‌నెట్‌లో పరిశోధించి వాటిని మనుషుల ముఖాభినయాలతో పోల్చి చూసినట్టు ఐఈఈఈ జర్నల్‌లో ప్రచురించిన వ్యాసంలో వివరించారు. స్పానిష్‌లోనూ, చైనా భాషలోకీ, పార్సీ, రష్యన్ మొదలుకొని ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, యూరప్, ఆసియా, ఆస్ట్రేలియాల్లోని మొత్తం 31 దేశాల భాషల్లోకి ఈ పదాలను అనువదించి సంబంధిత ముఖచిత్రాలతో పోల్చి చూశారు. ఈ అధ్యయనంలో దాదాపు 72 లక్షల ఫొటోల్లోని ముఖాభినయాలను పరిశీలించారు. అయితే కంప్యూటర్ ఆల్గరిథమ్స్ ఆధారంగా ముఖ కండరాల కదలికలను బట్టి 16,384 రకాలుగా మనుషులు తమలోని భావోద్వేగాలను వ్యక్తీకరించగలరని ఈ పరిశోధన తేల్చి చెప్పింది. అయితే 72 లక్షల ఫొటోలను పరిశీలించిన మీదట అందులో 35 రకాల ఎమోషన్స్ సర్వసాధారణంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్నట్టు ఈ అధ్యయనం వెల్లడించింది.

అద్దంలా .. గ్రామీణ రహదారులు

- రెండేళ్లలో ప్రతీ ఊరికి కచ్చితంగా రోడ్డు ఉండాలి
- రోడ్ల నిర్వహణ, మరమ్మతుల తీరుపై అసంతృప్తి
- రోడ్లు–భవనాల శాఖ సమీక్షలో సీఎం కేసీఆర్



ప్రగతి భవన్‌లో శనివారం రహదారుల పరిస్థితిపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు

సాక్షి, హైదరాబాద్: రానున్న రెండేళ్లలో తెలంగాణలోని అన్ని రహదారులను అద్దంలా మార్చాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణం తర్వాత ప్రభుత్వం రహదారులకే ప్రాధాన్యమిస్తుందని స్పష్టం చేశారు. కొత్తగా ఏర్పాటైన గ్రామ పంచాయతీలతో సహా రాష్ట్రంలోని మొత్తం 12,751 గ్రామ పంచాయతీలకు బీటీ(డాంబర్) రహదారి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. ప్రస్తుతం రహదారుల పరిస్థితి ఎలా ఉంది? వాటిని అద్దంలా తయారు చేయడానికి ఏం చేయాలి? అనే విషయంపై ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. దీనికి అవసరమైన బడ్జెట్ కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు.రాష్ట్రంలో రహదారుల పరిస్థితిపై ముఖ్యమంత్రి కేసీఆర్ శనివారం ప్రగతిభవన్‌లో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేంద్రం ద్వారా రికార్డు స్థాయిలో జాతీయ రహదారులు సాధించుకున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలో రోడ్లు–భవనాల శాఖ, పంచాయతీ రాజ్ శాఖల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రోడ్ల నిర్మాణం చేపట్టామని చెప్పారు. రాష్ట్రంలో ఇంకా అవసరమైన చోట రహదారులకు మరమ్మతులు చేయాలని సూచించారు. శిథిలావస్థకు చేరిన వంతెనలకు మరమ్మతులు చేయాలని, ఇరుకు బ్రిడ్జిలను వెడల్పు చేయాలని చెప్పారు. దీనికోసం రోడ్లు, భవనాల శాఖలోని ఈఎన్‌సీ స్థాయి నుంచి అసిస్టెంట్ ఇంజనీర్ స్థాయి అధికారుల సదస్సు నిర్వహించాలని చెప్పారు. గ్రామ స్థాయి నుంచి ప్రతీ రోడ్డు పరిస్థితిని సమీక్షించి, తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళిక రూపొందించాలని కోరారు. జిల్లా, మండలం అనే తేడా లేకుండా... ఏ పార్టీ ప్రజాప్రతినిధి ప్రాతినిధ్యం వహిస్తున్నారనే విషయం పక్కన బెట్టి... ఎక్కడ అవసరం ఉంటే అక్కడ రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు సైతం రోడ్ల మరమ్మతు పనులను చేయించుకోవాలని సూచించారు. పంచాయతీరాజ్ నుంచి రోడ్లు–భవనాల శాఖకు, ఆ శాఖ నుంచి జాతీయ రహదారులకు రోడ్లు బదిలీ , నిర్వహణ, మరమ్మతులపై నిర్లక్ష్యం వహిస్తున్నారని సీఎం కేసీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కొత్త రోడ్ల నిర్మాణం పూర్తయ్యే వరకు పాత రోడ్లు పాడుపడినా ఎవరూ పట్టించుకోవడం లేదని, దీని వల్ల ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. రోడ్లను బదిలీ చేసే సందర్భంలో అనుసరించాల్సిన వ్యూహం ఖరారు చేయాలని సూచించారు.

ఎమ్మెల్యే కార్యాలయాలు పూర్తిచేయాలి..

దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ఎమ్మెల్యే కార్యాలయాల నిర్మాణం చేపట్టామని, వాటి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తగా నిర్మించిన నివాసగృహాలను ఎమ్మెల్యేలకు కేటాయించనున్నట్లు తెలిపారు.ముఖ్య కార్యదర్శులు సునీల్‌శర్మ, కె.రామకృష్ణారావు, రోడ్లు–భవనాల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) గణపతిరెడ్డి, ఎస్.ఇ. చంద్రశేఖర్, సీఎంవో అధికారులు స్మితా సబర్వాల్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు వెంటనే భూ పరిహారం...

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కాల్వల నిర్మాణం సందర్భంగా భూమిని కోల్పోయిన రైతులకు వెంటనే పరిహారం అందివ్వాలని సీఎం కె.చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. ముథోల్ నియోజకవర్గం పరిధిలోని రైతులకు పరిహారం ఇప్పించాలని ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి చేసిన విజ్ఞప్తికి ఆయన స్పందించారు. వెంటనే ఆర్థిక శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. చిన్న సుద్ధవాగు ప్రాజెక్టు నిర్మాణం వల్ల ముంపునకు గురైన ప్రజలకు భూ పరిహారం, పునరావాసం ప్యాకేజీ ఇవ్వాలని, ముథోల్ కమ్యూనిటీ హాల్‌ను అప్‌గ్రేడ్ చేయాలని ఎమ్మెల్యే కోరారు.

ముహూర్తం ఫిబ్రవరి 10

మొదటి పేజీ తరువాయి

ఇతరత్రా కీలక పదవులు కూడా అప్పుడే భర్తీ చేయాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. ఎవరెవరు మంత్రివర్గంలో ఉండాలి, అవకాశం లేని వారిని ఏ పదవుల్లో నియమించాలన్న విషయంలో సీఎం ఇప్పటికే పలుమార్లు కరసత్తు చేసినట్లు సమాచారం. కేబినెట్ హోదా ఉండే పదవుల్లో డిప్యూటీ స్పీకర్‌తోపాటు శాసనసభలో ప్రభుత్వ చీఫ్ విప్, మండలిలో చీఫ్ విప్, శాసనసభలో, మండలిలో ఇద్దరు లేదా ముగ్గురేసి చొప్పున విప్‌ల పదవులు ఉండనున్నాయి. ఇవి కాకుండా పార్లమెంటరీ కార్యదర్శుల పేరుతో మరికొందరికి కూడా అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు.

ఆ ఎనిమిది మంది ఎవరు?

తొలి దశ మంత్రివర్గ విస్తరణలో పాత మంత్రులకే అవకాశం లభించవచ్చు. టీఆర్‌ఎస్‌లో, ఉద్యమ సమయంలో కీలకపాత్ర పోషించిన సీనియర్ నేతలకు ముఖ్యమంత్రి అవకాశం ఇస్తారని పార్టీ వర్గాలు అంటున్నాయి. 'ముఖ్యమంత్రి ఇప్పటిదాకా తీసుకున్న నిర్ణయాలన్నీ పరిశీలిస్తే పాత వారికి దాదాపుగా మంత్రివర్గంలో స్థానం లభిస్తుందనే అనుకుంటున్నా. శాసనసభ ఎన్నికల్లో అనేక మంది సిట్టింగ్‌లు ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారని తెలిసినా ఆయన నలుగురు మినహా పాత వారందరికీ టికెట్లు ఇచ్చారు. మహమూద్ అలీ, పోచారం శ్రీనివాస్‌రెడ్డిలకు కీలక పదవులిచ్చారు. ఇవన్నీ గమనిస్తే ముఖ్యమంత్రి అందరికీ ఏదో విధంగా న్యాయం చేస్తారనిపిస్తోంది'అని సీనియర్ నేత ఒకరు విశ్లేషించారు. మంత్రివర్గంలో ఎవరు ఉంటారన్న విషయంలో సీఎం తన మనోగతాన్ని ఎవరితోనూ పంచుకోలేదన్నారు.

తొలి దశ విస్తరణ రేసులో ఉన్నది వీరే...

తొలి మంత్రివర్గ విస్తరణలో స్థానం పొందే వారిలో ఈటల రాజేందర్ (కరీంనగర్), కడియం శ్రీహరి (జనగామ), జి. జగదీశ్‌రెడ్డి (సూర్యాపేట), సి. లక్ష్మారెడ్డి (మహబూబ్‌నగర్), కేటీ రామారావు (సిరిసిల్ల), టి. హరీశ్‌రావు (సిద్దిపేట), తలసాని శ్రీనివాస్ యాదవ్ (గ్రేటర్ హైదరాబాద్), జోగు రామన్న (ఆదిలాబాద్) ఉండొచ్చని ఒక అంచనా. తొలి దశలోనే ఎస్టీ నేతకు మంత్రి పదవి ఇవ్వాలని సీఎం భావిస్తే డీఎస్ రెడ్యానాయక్ (మహబూబాబాద్ జిల్లా)కు అవకాశం రావచ్చని అంటున్నారు. ఇక డిప్యూటీ స్పీకర్‌గా ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖ పేరు వినిపిస్తోంది. స్పీకర్ పదవిని ఇప్పటికే రెడ్డి సామాజికవర్గానికి కేటాయించడంతో ఈసారి పద్మాదేవేందర్‌రెడ్డికి ఆ అవకాశం లేకపోవచ్చు. ఆమెకు మలి దశ మంత్రివర్గ విస్తరణలో మంత్రి పదవి లేదా మరో కేబినెట్ హోదా పదవి లభించొచ్చు. అయితే మలి విడత మంత్రివర్గ విస్తరణలో పదవులు ఆశించే వారి సంఖ్య రెండు డజన్ల దాకా ఉంది. రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారు ఎక్కువ మంది శాసనసభకు ఎన్నిక కావడంతో పోటీ కూడా తీవ్రంగా ఉంది. లోక్‌సభ ఎన్నికల తరువాత విస్తరించనున్న మంత్రివర్గంలో ముగ్గురు రెడ్లకు అవకాశం లభించవచ్చు. ఈ కోటాలో మంత్రి పదవి కోసం నాయిని నర్సింహారెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎ. ఇంద్రకరణ్‌రెడ్డి, పద్మాదేవేందర్‌రెడ్డి పోటీ పడుతున్నారు. వారిలో ఒకరిద్దరికి చీఫ్ విప్, విప్ పదవులు కట్టబెట్టే అవకాశం లేకపోలేదు.

ప్రస్తుతానికి ఓటాన్ అకౌంట్ బడ్జెట్...

కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టిన తరువాతే రాష్ట్రంలో పూర్తిస్థాయి బడ్జెట్ ప్రతిపాదించాలని ముఖ్యమంత్రి ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. అందువల్ల మంత్రివర్గ విస్తరణ తరువాత మార్చి రెండో వారంలో తాత్కాలిక బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని కేసీఆర్ భావిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలు పూర్తికాగానే మలి విడత మంత్రివర్గ విస్తరణ చేపట్టి జూలైలో పూర్తిస్థాయి బడ్జెట్‌కు సిద్ధం కావాలని ఆయన యోచిస్తున్నారు.

అదానీలకు ప్రేమతో...!

- ఏపీలో ఎన్నికల ముందు కమీషన్ల కోసం బొగ్గు గనుల సంతర్పణ
- అదానీకి సిలియారీ, ఎస్సెల్‌కు దక్షిణ మదన్‌పూర్ బొగ్గు గనులు
- ఓ కీలక అధికారి ద్వారా 'ముఖ్య'నేత సంప్రదింపులు

ఎన్నికల ముంగిట ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అవినీతి తవ్వకాలు తారస్థాయికి చేరిపోయాయి. అధికారం ఆఖరి క్షణాల్లో రూ.24 వేల కోట్ల విలువైన బొగ్గు గనుల్ని నిబంధనలకు విరుద్ధంగా కట్టబెట్టేస్తున్నారు. అది కూడా వేరెవరికో కాదు! తానిప్పుడు పోరాడుతున్నట్లు బిల్డప్ ఇస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి అత్యంత సన్నిహితులైన అదానీ, ఎస్సెల్ గ్రూపులకి!. చిత్రమేంటంటే మోదీకి అత్యంత సన్నిహితుడిగా అందరికీ తెలిసిన ఇదే అదానీకి భావనపాడు పోర్టు నిర్మాణాన్ని చంద్రబాబు అప్పగించారు. విశాఖలో సోలార్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తామంటే 500 ఎకరాలు ధారాదత్తం చేసి పది రోజుల కిందటే ఎంవోయూ కూడా చేసుకున్నారు. అదానీతో బొగ్గు బ్లాకుల చీకటి ఒప్పందాన్ని కూడా కుదుర్చుకుని... దాని ప్రకారం స్క్రీన్‌ప్లే నడిపిస్తున్నారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో ఏపీఎండీసీకి ఉన్న విలువైన గనుల్ని... అదానీ, ఎస్సెల్ గ్రూపులకు దక్కేలా అనుకూలమైన నిబంధనల్ని విధించడమే కాకుండా వారికి పోటీ లేకుండా చేసి మరీ రివర్స్ వేలంలో అధిక ధరకు అప్పగిస్తున్నారు. అంటే... ఆ బ్లాకుల్ని అప్పగించటమే కాకుండా అవి తవ్వి తీసే ప్రతి టన్నుకూ ఏపీఎండీసీ అత్యధిక ధర చెల్లించి కొంటుందన్న మాట. పనిగట్టుకుని పక్క రాష్ట్రాలు తిరిగి మరీ మోదీని విమర్శిస్తున్న చంద్రబాబు... మోదీ సన్నిహితులకు ఇంత భారీ ప్రాజెక్టులు అప్పగించటం వెనక అర్థమేంటి? రాష్ట్రాన్ని గుజరాత్‌లా మారుస్తానని చంద్రబాబు చెప్పే మాటలకు అసలు అర్థం ఇదేనా? గుజరాత్‌లా మార్చటమంటే నిబంధనల్ని కాలరాసి మరీ ప్రాజెక్టులన్నీ అదానీకి అప్పగించటమా? మరి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకుండా మోసం చేసిన మోదీతో చంద్రబాబుకు తెరచాటు బంధం లేదంటే నమ్మగలమా?

సాక్షి, అమరావతి: ఎన్నికలు శరవేగంగా సమీపిస్తున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెద్దలు డబ్బులు వెదజల్లే అన్ని మార్గాలనూ అన్వేషిస్తున్నారు. కమీషన్ల కోసం, అందుకు సహకరించే కాంట్రాక్టర్లను ఎంపిక చేసుకుని వారితో రాయబారాలు నడుపుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ)కి చెందిన బొగ్గు గనుల నిర్వహణ కోసం నిర్వహించిన టెండర్ల ప్రక్రియ దీనికి ఉదాహరణ. ఎప్పుడో ఏడాది క్రితం మొదలైన ఈ ప్రక్రియ ఎన్నికల సమయంలో క్లైమాక్స్‌కి చేరింది. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు 'టెయిలర్ మేడ్'నిబంధనలు రూపొందించి తమకు కమీషన్లు చెల్లించేవారివైపు మొగ్గు చూపుతున్నారు. ఈ బొగ్గు గనుల నిర్వహణ టెండర్ల వ్యవహారాన్ని చక్కబెట్టే బాధ్యతను ఓ సీనియర్ అధికారికి అప్పగించినట్లు తెలిసింది. అనంతరం రెండు సంస్థలతో మాట్లాడుకుని రివర్స్ టెండర్ల ద్వారా గనులు అప్పగించేందుకు సిద్ధపడ్డారు. అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ ఇటీవల అమరావతిలో పర్యటించిన అనంతరం ఆ గ్రూప్‌నకు సిలియారి బొగ్గు గని అభివృద్ధి నిర్వహణ (ఎండీవో) కట్టబెట్టేలా రంగం సిద్ధం కావడం గమనార్హం. నిజానికి ఈ టెండర్లు ఏడాది క్రితమే పిలిచారు. ఐదు సంస్థలు ఇందులో ఎంపిక కాగా తమకు నచ్చినవారికి అప్పగించేందుకే ఇంతకాలం సాగదీసినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక నేడే రేపో ఈ వ్యవహారాన్ని అధికారికంగా ప్రకటించనున్నారు. ఎన్నికల వ్యయం కోసం డబ్బులు ముందుగానే ముట్టజెప్పే సంస్థలతో ఒప్పందాలు చేసుకుని తమకు అనుకూలమైన నిబంధనలు పొందుపరిచినట్లు మైనింగ్ వర్గాలు పేర్కొంటున్నాయి.

అమరావతి పర్యటన వెనుక మతలబు?

ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థకు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లోని సులియారి, సౌత్ మదన్‌పూర్‌లో బొగ్గు బ్లాకులున్నాయి. బంగారు బాతుల్లాంటి వీటిని తనకు అనుకూలమైన సంస్థలకు కట్టబెట్టి వాటాలు పొందాలని ఎత్తుగడ వేసిన ముఖ్యనేత ఏపీఎండీసీని పావుగా మార్చుకుని తనకు అనుకూలమైన పెద్ద సంస్థలు మాత్రమే బిడ్డింగులో పాల్గొనేలా నిబంధనలు రూపొందించారు. టెండర్లలో పాల్గొనేందుకు ఆసక్తి చూపిన సంస్థలను కలిసిన ఓ కీలక అధికారి ముఖ్యనేత ఆంతర్యాన్ని వివరించారు. అనంతరం బొగ్గు గనుల అభివృద్ధి, నిర్వహణ (ఎండీవో) ఎంపిక కాంట్రాక్టు కోసం టెండర్లు పిలిచారు. మౌఖిక సంప్రదింపుల ద్వారా మరికొన్ని సంస్థలను టెండర్ల నుంచి తప్పించడంలో ఆ కీలక అధికారి పాత్ర పోషించారు. సాంకేతిక టెండర్లలో అర్హత సాధించిన రెండు సంస్థల యాజమాన్యాలతో ఇటీవల స్వయంగా సమావేశమైన 'ముఖ్య'నేత వాటాలపై సంప్రదింపులు జరిపారు. పది రోజుల క్రితం అమరావతిలో అదానీ గ్రూపు చైర్మన్ గౌతమ్ అదానీ పర్యటన అనంతరం సిలియారి బొగ్గు గని అభివృద్ధి, నిర్వహణ (ఎండీఓ) కాంట్రాక్టు అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్‌కు కట్టబెట్టేలా రివర్స్ వేలంలో మంత్రాంగం నడిచినట్లు పారిశ్రామిక వర్గాలు ఆరోపిస్తున్నాయి. విశాఖపట్నం సమీపంలో సోలార్ డేటా సెంటర్ ఏర్పాటు పేరుతో ఇదే గ్రూపు కోసం 500 ఎకరాలను ప్రభుత్వం అప్పగించడం గమనార్హం.

టెండర్ ప్రమాణాలకు విరుద్ధంగా...

దేశంలో ఇతర ప్రభుత్వ రంగ సంస్థలు ఇదే తరహా పనుల కోసం నిర్వహించిన టెండర్లలో అనుసరించిన నిబంధనలకు విరుద్ధంగా ఏపీఎండీసీ వ్యవహరించడం విమర్శలకు బలం చేకూరుస్తోంది. అత్యధిక సంస్థలు పోటీపడే అవకాశం కల్పించాలంటూ చేసిన విజ్ఞప్తులను ఏపీఎండీసీ పెడచెవిన పెట్టింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ చేసిన కేటాయింపుల్లో ఛత్తీస్‌గఢ్ లోని మదన్‌పూర్ దక్షిణ, మధ్యప్రదేశ్‌లోని సులియారి బొగ్గు గనులు ఏపీఎండీసీకి లభించాయి. వీటి అభివృద్ధి, నిర్వహణ సంస్థను ఎంపిక చేసేందుకు మెటల్ స్క్రాప్ ట్రేడింగ్ కార్పొరేషన్ (ఎంఎస్‌టీసీ) ద్వారా ఏపీఎండీసీ ఇ– టెండర్లు (ఆసక్తి వ్యక్తీకరణ దరఖాస్తులు) ఆహ్వానించింది. ఈమేరకు గత ఏడాది మార్చి 19వ తేదీన టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే ప్రభుత్వ పెద్దల ఎత్తుగడలను 'సాక్షి'ముందుగానే బహిర్గతం చేసింది. ఈమేరకు 2018 మే 2వ తేదీన 'సాక్షి'ప్రధాన సంచికలో 'బొగ్గు గనుల్లో మేత'శీర్షికతో కథనం ప్రచురితమైంది. అది నిజమేనని ఈరోజు తేలింది.

రివర్స్ వేలం ఇదీ..

మొదటి దశ టెండర్లలో అర్హమైనవిగా నిర్ణయించిన సంస్థలకు మాత్రమే తాజాగా రివర్స్ వేలం నిర్వహించారు. ఒక రేటు నిర్ణయించి దాని నుంచి ఏ సంస్థ తక్కువకు కోట్ చేస్తే దానికి టెండరు అప్పగించే విధానాన్ని రివర్స్ వేలం అంటారు. రివర్స్ వేలంలో రెండు గనులను దక్కించుకున్న సంస్థలకు బొగ్గు తవ్వినందుకుగానూ ఏపీఎండీసీ కనీసం రూ. 24,151.60 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. రూ. 24 వేల కోట్లకు పైగా విలువైన ఈ కాంట్రాక్టు పనులను ఎన్నికల ముందు హడావుడిగా రెండు సంస్థలకు కట్టబెట్టినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎస్సెల్‌కు రూ. 12,609.60 కోట్లు

టన్ను బొగ్గు తవ్వకానికి ఎస్సెల్ రూ. 888 చొప్పున ధర కోట్ చేసింది. దీంతో మదన్‌పూర్ గని ఎండీవోగా 'ఎస్సెల్'ను ఖరారు చేయనున్నారు. ఈ గనిలో సుమారు 187 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలున్నాయి. ఇందులో 142 మిలియన్ టన్నుల బొగ్గును తవ్వవచ్చని అంచనా. టన్నుకు రూ. 888 ప్రకారం 142 మిలియన్ టన్నులు తవ్వినందుకు ఏపీఎండీసీ ఈ సంస్థకు రూ. 12,609.60 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఇంతకంటే ఎక్కువగా ఖనిజం తవ్వితే ఆ మేరకు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎండీవోగా ఒప్పందం చేసుకోనున్న ఎస్సెల్ గ్రూపునకు హీన పక్షం రూ. 12,609.60 కోట్లు ఏపీఎండీసీ చెల్లించాల్సి ఉంటుంది.



అదానీకి రూ.11,542 కోట్ల కాంట్రాక్టు..

సులియారీలోని గనిలో 147 మిలియన్ టన్నుల ఖనిజం ఉండగా 116 మిలియన్ టన్నుల బొగ్గు తవ్వవచ్చని అంచనా. టెండర్లలో దీనిని దక్కించుకున్న అదానీ గ్రూపునకు టన్నుకు రూ. 995 చొప్పున 116 మిలియన్ టన్నుల బొగ్గు తవ్వినందుకు ఏపీఎండీసీ రూ. 11,542 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది.

స్పందించని ఏపీఎండీసీ అధికారులు

రివర్స్ వేలంలో అదానీ, ఎస్సెల్ తక్కువ మొత్తం కోట్ చేసి ఎల్–1గా నిలిచాయని, వీటికే ఆయా గనుల ఎండీవో కాంట్రాక్టును అప్పగించే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం. అయితే ఏపీఎండీసీకి ఈ కాంట్రాక్టును ఖరారు చేసే అధికారంతోపాటు రద్దు చేసే అధికారం కూడా ఉంది. వివరాలు లీక్ అయ్యాయని భావిస్తే కాంట్రాక్టును రద్దు చేసే అధికారం కూడా ఉందని సమాచారం. ఈ విషయంపై ఏపీఎండీసీ అధికారులను వివరణ కోరడానికి 'సాక్షి' ప్రయత్నించగా స్పందించలేదు.

ఎండీవో అంటే....?

ఎండీవో అంటే మైన్ డెవలప్‌మెంట్ అండ్ ఆపరేషన్ అని అర్థం. ఓ బొగ్గు గని అభివృద్ధి, నిర్వహణ అధికారం మొత్తం ఎండీవోకే ఉంటుంది. నిర్దేశిత ప్రాంతంలో బొగ్గు నిక్షేపాలను పూర్తిగా వెలికితీసే వరకూ ఆ ప్రాంతంపై పూర్తి హక్కులు ఎండీఓకే ఉంటాయి. అంటే ఇది జీవితకాల కాంట్రాక్టు. ఉదాహరణకు ఏపీఎండీకి చెందిన మదన్‌పూర్ గనిలో సుమారు 187 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలున్నాయి. ఇందులో 142 మిలియన్ టన్నుల దాకా బొగ్గు తవ్వవచ్చని అంచనా. (భద్రతా ప్రమాణాల దృష్ట్యా కొంత ఖనిజాన్ని తవ్వరు). ఇక సులియారీలోని గనిలో 147 మిలియన్ టన్నుల ఖనిజం ఉండగా 115 మిలియన్ టన్నుల బొగ్గు తవ్వవచ్చని అంచనా. నిబంధనల ప్రకారం గని నిర్వహణతోపాటు తవ్వకాలు జరిపి ఓవర్ బర్డన్ (వృథా మట్టి)ని తొలగించి విక్రయానికి పనికొచ్చే బొగ్గును ఏపీఎండీసీకి అప్పగించాల్సిన బాధ్యత ఎండీవోదే. ఈ రెండు గనుల ఎండీవోల ఎంపిక కోసం ఏపీఎండీసీ వేర్వేరుగా ఇ –టెండర్లు నిర్వహించినా దాదాపుగా అవే సంస్థలు బిడ్లు వేశాయి. వీటిలో అదానీ ఎంటర్‌ప్రైజెస్, సైనిక్ మైనింగ్, ఎస్సెల్ మైనింగ్ అండ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, బీజీఆర్ – ఎస్ఐసీ ఏఎల్ కన్సార్టియం బిడ్‌లో అర్హత పొందాయి.

ఎందుకింత రహస్యం?

సాధారణంగా టెండరు నోటిఫికేషన్‌ను ఎవరైనా ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకుని అర్హతలు, నిబంధనలు, పనుల వివరాలు తెలుసుకోవచ్చు. అయితే ఏపీఎండీసీ బొగ్గు గనుల ఎండీవో ఎంపిక టెండర్ల విషయంలో ఈ నిబంధనలను గాలికొదిలేసింది. సంస్థ వెబ్‌సైట్ టెండరు ప్రకటనలో కేవలం ఎండీఓ ఎంపిక కోసం ఆసక్తి వ్యక్తీకరణ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మాత్రమే పేర్కొంది. ఆసక్తి కలిగినవారు ఎంఎస్‌టీసీలో పేర్లు నమోదు చేసుకుని రూ. 50 వేల దరఖాస్తు రుసుము చెల్లించి నిబంధనలు తెలుసుకోవచ్చని పేర్కొంది. నిబంధనలు, పనుల వివరాలు తెలుసుకోవడానికి అంత డబ్బు కట్టాలని షరతు విధించడాన్ని బట్టే ఈ వ్యవహారాన్ని రహస్యంగా ఉంచాలనే ఉద్దేశం ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఏపీఎండీసీ గతంలో బెరైటీస్ ఖనిజ తవ్వకాలకు ఎంఎస్‌టీసీ ద్వారానే ఇ–టెండర్లు పిలిచింది. అయితే అప్పుడు నిబంధనలన్నీ టెండరు నోటిఫికేషన్‌లోనే పేర్కొంది.

ఇతర సంస్థలకు భిన్నంగా....

నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టీపీసీ) తలైపల్లి, మదన్‌పూర్ సౌత్ బొగ్గు గనులు, పశ్చిమ బెంగాల్ పవర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (డబ్ల్యూబీపీడీసీఎల్) పచ్వారా కోల్‌బ్లాకు, తెలంగాణ స్టేట్ జెన్‌కో తాడిచెర్ల –1 కోల్‌బ్లాకుకు ఎండీఓల ఎంపిక కోసం ఇ– టెండర్లు పిలిచాయి. అయితే ఈ సంస్థలు పేర్కొన్న సాంకేతిక అర్హతలకు భిన్నంగా ఏపీఎండీసీ షరతులు విధించింది. అధిక పరిమాణంలో బొగ్గు తవ్విన అనుభవం ఉన్న సంస్థలే టెండర్లలో పాల్గొనేలా షరతులు పెట్టింది.

లోక్‌సభ ఎన్నికలకు నోడల్ అధికారుల నియామకం

ఆదేశాలు జారీచేసిన కేంద్ర ఎన్నికల కమిషన్

సాక్షి, హైదరాబాద్: త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికలకు రాష్ట్రంలో పలువురు ఆలిండియా సర్వీస్ అధికారులను నోడల్ అధికారులుగా నియమిస్తూ ఎన్నికల కమిషన్ శనివారం ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రజత్‌కుమార్ కౌంటర్ ఆదేశాలిచ్చారు. ఎన్నికల్లో అభ్యర్థులు పెట్టే ఖర్చులను మానిటరింగ్ చేసేందుకు సీఈవో కార్యాలయం నుంచి అదనపు ఎన్నికల కమిషన్ బుద్ధా ప్రకాశ్ జ్యోతి, పోలీస్ శాఖ నుంచి ఐజీ సంజయ్‌కుమార్ జైన్, ఎక్సైజ్ విభాగం నుంచి కమిషనర్ సోమేశ్‌కుమార్, ఇన్‌కమ్‌ట్యాక్స్ నుంచి ఇరుకుల్ల సతీశ్‌కుమార్‌ను నోడల్ అధికారులుగా నియమించింది. ఇతర నోడల్ అధికారులుగా శాంతిభద్రతల అదనపు డీజీపీ జితేందర్, సిస్టమెటిక్ ఓటింగ్ ఎడ్యుకేషన్, ఎలక్ట్రోప్రాక్టీస్ విభాగం నుంచి జాయింట్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ టీ రవికిరణ్, ఈవీఎంల విభాగానికి డిప్యూటీ కలెక్టర్ బి.కిషన్‌రావు, వికలాంగుల కేటగిరీకి ఆ విభాగం డైరెక్టర్ బి. శైలజ, అబ్జర్వర్లుగా డిప్యూటీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ బి.యాదగిరి, శిక్షణ నిమిత్తం అసిస్టెంట్ చీఫ్ ఎలక్టోరల్ అధికారి బి సూర్యభాస్కర్‌ను నియమిస్తూ రజత్ కుమార్ ఆదేశాలు జారీచేశారు. సంబంధిత అధికారులంతా అన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలు, ఇతర ఎన్నికల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని ఆయన సూచించారు.

ఇదండీ సంగతి



అయితే అమరావతిని త్వరగా నిర్మించండి సార్!

జేఈఈ మెయిన్‌లో.. సత్తాచాటిన తెలుగు తేజాలు

- దేశ వ్యాప్తంగా 15 మందికే 100 పర్సెంటైల్
- అందులో ఐదుగురు తెలుగు విద్యార్థులే
- తెలంగాణ నుంచి నలుగురు, ఏపీ నుంచి ఒకరు
- ఏప్రిల్ 6–20 మధ్య మరోసారి జేఈఈ మెయిన్
- ఇందుకోసం ఫిబ్రవరి 8 నుంచి మార్చి 7 వరకు దరఖాస్తులు
- రెండింటిలో బెస్ట్ స్కోర్ పరిగణనలోకి..


సాయికిరణ్


చేతన్


జయంత్


కార్తికేయ


విశ్వనాథ్

సాక్షి, హైదరాబాద్: ఎన్ఐటీ, ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, ఇతర జాతీయస్థాయి విద్యాసంస్థల్లో బీఈ/బీటెక్, బీఆర్క్‌లో ప్రవేశాలకోసం నిర్వహించిన 'జేఈఈ మెయిన్–2019' ప్రవేశ పరీక్షలో తెలుగు విద్యార్థులు మరోసారి సత్తా చాటారు. ఎప్పటిలాగే ఈసారి కూడా తెలుగు విద్యార్థులు అత్యధిక స్కోర్ సాధించారు. దేశవ్యాప్తంగా 15 మంది మాత్రమే 100 పర్సెంటైల్ సాధించగా.. అందులో ఐదుగురు తెలుగు విద్యార్థులే కావడం విశేషం. ఇందులో తెలంగాణ విద్యార్థులు నలుగురు ఉండగా, ఒకరు ఆంధ్రప్రదేశ్ విద్యార్థి. 100 పర్సెంటైల్ సాధించిన వారిలో తెలంగాణకు చెందిన ఆదెల్లి సాయికిరణ్ జాతీయస్థాయిలో 3వ స్థానంలో, ఇందుకూరి జయంత్ ఫణిసాయి ఏడో స్థానంలో, విశ్వనాథ్ కె 8వ స్థానంలో, బట్టెపాటి కార్తికేయ 12వ స్థానంలో నిలిచారు. ఏపీ విద్యార్థి బొజ్జా చేతన్‌రెడ్డి నాలుగో స్థానంలో నిలిచాడు. ఈనెల 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు 8 షిఫ్టులలో.. ఆన్‌లైన్లో దేశ వ్యాప్తంగా 254 పట్టణాల్లోని 467 పరీక్ష కేంద్రాల్లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఈ పరీక్షలను నిర్వహించింది. ఈ పరీక్షలకు దేశవ్యాప్తంగా 9,29,198 మంది దరఖాస్తు చేసుకోగా, అందులో 8,74,469 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. విద్యార్థులు సాధించిన మార్కులు, ఆ షిఫ్ట్‌లో పరీక్షలకు హాజరైన విద్యార్థుల సంఖ్య, మొత్తం విద్యార్థుల సంఖ్యతో నార్మలైజ్ చేసి, వారి పర్సెంటైల్ స్కోర్‌ను ఎన్‌టీఏ ప్రకటించింది. వాస్తవానికి ఈనెల 31న ఫలితాలను వెల్లడిస్తామని ఎన్‌టీఏ గతంలోనే పేర్కొన్నప్పటికీ.. రికార్డు స్థాయిలో ముందుగానే ఫలితాలను వెల్లడించడం విశేషం. బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌లో (బీ–ఆర్క్) ప్రవేశాల కోసం నిర్వహించిన జేఈఈ మెయిన్ పేపర్–2 ఫలితాలను త్వరలోనే వెల్లడిస్తామని ఎన్‌టీఏ వెల్లడించింది.

తెలుగు వారే అత్యధికం!

ఈ పరీక్షలో 99.99 పర్సెంటైల్ సాధించిన విద్యార్థులు 600–700 మంది విద్యార్థులే ఉండే అవకాశం ఉంది. మరోవైపు 99.95–99.99 పర్సెంటైల్ వచ్చిన వారికే టాప్ 100 లోపు ర్యాంకులు వచ్చే అవకాశం ఉంది. అందులో తెలంగాణ విద్యార్థులు 30–40 మంది వరకు ఉండే అవకాశం ఉందని జేఈఈ నిపుణుడు ఉమాశంకర్ తెలిపారు. 90కి పైగా పర్సెంటైల్ సాధించిన వారిలో దాదాపు 3వేల మంది వరకు తెలుగు విద్యార్థులే ఉంటారని ఆయన అభిప్రాయపడ్డారు. పర్సెంటైల్ విషయంలో విద్యార్థుల్లో కొద్దిగా గందరగోళం ఉందని, ఫైనల్ కీ విడుదల చేయడంతోపాటు, విద్యార్థులు ఓఎంఆర్ రెస్పాన్స్ షీట్లను వెబ్‌సైట్ నుంచి తొలగించకుండా అలాగే ఉంచితే స్పష్టత ఉండేదన్నారు.

టాప్ స్కోర్ ఏదైతే అదే లెక్కలోకి..

2019–20 విద్యా సంవత్సరం నుంచి ఐఐటీల్లో ప్రవేశాల కోసం జేఈఈ మెయిన్‌ను ఏటా రెండుసార్లు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా మొదటి దశ పరీక్షలను ఈనెల్లో నిర్వహించింది. రెండో దశ పరీక్షలను ఏప్రిల్ 6 నుంచి 20వ తేదీ మధ్యలో నిర్వహించేందుకు ఏర్పాట్లుచేసింది. ఇందులో భాగంగా వచ్చే రెండో దఫా జేఈఈ మెయిన్ కోసం ఫిబ్రవరి 8వ తేదీ నుంచి మార్చి 7 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తామని ఎన్‌టీఏ ప్రకటించింది. ఆ పరీక్షల ఫలితాలను వెల్లడించాక ఈ రెండు పరీక్షల్లో టాప్ స్కోర్ ఏదైదే దాన్నే పరిగణనలోకి తీసుకొని ప్రవేశాల కోసం ర్యాంకులను ప్రకటిస్తామని వివరించింది. ఏప్రిల్‌లో జరిగే రెండో దశ జేఈఈ మెయిన్ ఫలితాల వెల్లడి తర్వాత టాప్ 2.56 లక్షల మందిని ఐఐటీల్లో ప్రవేశాలకు అవసరమైన జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసేందుకు అర్హులుగా ప్రకటించనుంది.

అడ్వాన్స్‌డ్‌కు కటాఫ్ 88 పర్సెంటైల్!

ఈసారి జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హులుగా పరిగణనలోకి తీసుకునే కటాఫ్ జనరల్ కేటగిరీలో 88 పర్సెంటైల్ ఉండే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ఓబీసీ కేటగిరీలో 70 పర్సెంటైల్, ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల కేటగిరీలో 60 పర్సెంటైల్ ఉండే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

100 పర్సెంటైల్ వచ్చినవారు

దరఖాస్తు నెంబరు	విద్యార్థి పేరు	రాష్ట్రం
190310086378	ధ్రువ్ అరోరా	మధ్యప్రదేశ్
190310096437	రాజ్‌ఆర్యన్ అగర్వాల్	మహారాష్ట్ర
190310126508	ఆదెల్లి సాయి కిరణ్	తెలంగాణ
190310131614	బొజ్జా చేతన్‌రెడ్డి	ఆంధ్రప్రదేశ్
190310139257	సంబిత్ బెహెరా	రాజస్తాన్
190310150035	నమన్‌గుప్తా	ఉత్తరప్రదేశ్
190310166518	ఇందుకూరిజయంత్ ఫణిసాయి	తెలంగాణ
190310167837	విశ్వనాథ్ కె	తెలంగాణ
190310204122	హిమానుష్ గౌరవ్‌సింగ్	ఉత్తరప్రదేశ్
190310208678	కెవిన్ మార్టిన్	కర్ణాటక
190310240908	శుభాంకర్ గంభీర్	రాజస్తాన్
190310244684	బట్టెపాటి కార్తికేయ	తెలంగాణ
190310324762	అంకిత్ కుమార్‌మిశ్రా	మహారాష్ట్ర
190310378068	జయేశ్ సింగ్లా	పంజాబ్
190310597090	గుప్తా కార్తికేయ్ చంద్రేశ్	మహారాష్ట్ర

సైంటిస్ట్ కావాలన్నదే లక్ష్యం

మాది సిద్ధిపేట జిల్లా గౌరారం మండలంలోని పాములపర్తి గ్రామం. న్యూక్లియర్ సైంటిస్ట్ కావాలన్నదే నాలక్ష్యం. న్యూక్లియర్ పవర్‌పై పరిశోధన చేస్తా. అందుకోసం ఇప్పటినుంచే ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తున్నా. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఐఐటీ బాంబేలో చదువాలని ఉంది. అందుకు ప్రిపేర్ అవుతున్నాను.

– సాయికిరణ్

సొంతంగా కంపెనీ స్థాపిస్తా

బాగా చదువుకొని సొంతంగా కంపెనీ స్థాపించాలన్నదే నా లక్ష్యం. అందుకు అవసరమైన పెట్టుబడి కోసం ముందుగా ఉద్యోగం చేస్తా. ఐఐటీ బాంబేలో కంప్యూటర్ సైన్స్ చదువుతాను. అందుకోసమే ప్రిపేర్ అవుతున్నాను.

– బొజ్జా చేతన్‌రెడ్డి

22న అఖిల భారత బీసీ సంఘాల సమాఖ్య సమావేశం

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల

హైదరాబాద్: రాజ్యాంగాన్ని రక్షించండి, సామాజిక న్యాయాన్ని అమలు చేయండి అనే నినాదంతో ఈ నెల 22 న 29 రాష్ట్రాల బీసీ ప్రతినిధులతో ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషనల్ క్లబ్‌లో అఖిల భారత బీసీ సంఘాల సమాఖ్య జాతీయ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రకటించారు. దేశ వ్యాప్తంగా రిజర్వేషన్లు ఎత్తివేయడానికి జరుగుతున్న కుట్రలపై ఈ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు. దోమలగూడలోని బీసీ భవన్‌లో శనివారం వివిధ బీసీ సంఘాల నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పంచాయితీరాజ్ రిజర్వేషన్ల తగ్గింపు, ఈబీసీలకు 10 రిజర్వేషన్లు కల్పించడాన్ని వ్యతిరేకిస్తూ జాతీయ స్థాయిలో పోరాడాలని సమావేశంలో నిర్ణయించినట్లు జాజుల తెలిపారు. జనాభాలో 56 శాతం ఉన్న బీసీల గురించి ఏనాడు పట్టించుకోని ప్రభుత్వాలు అగ్రవర్ణాల రిజర్వేషన్ల అంశం తెరమీదికి రాగానే కేవలం 48 గంటలల్లోనే రాజ్యాంగ సవరణ తీసుకు వచ్చాయని విమర్శించారు. కేవలం విద్య, ఉద్యోగాల్లో మాత్రమే రిజర్వేషన్లు అని చెప్పిన కేంద్ర ప్రభుత్వం రెండు రోజుల క్రితం అన్‌ఎయిడెడ్, ప్రైవేట్ విద్యా సంస్థల్లోనూ రిజర్వేషన్లు పెడతామని ప్రకటించిందన్నారు. అవకాశవాద రాజకీయానికి వ్యతిరేకంగా ఆయా రాష్ట్రాల బీసీ సంఘాలు పోరాడుతున్నారని చెప్పారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల సందర్భంగా పార్లమెంట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపడతామన్నారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మీనారాయణ, వివిధ బీసీ సంఘాల నాయకులు టి.విక్రంగౌడ్, జాజుల లింగం గౌడ్, కులకచర్ల శ్రీనివాస్, మహేష్ యాదవ్, కనకాల శ్యాం కురుమ, వై.గంగాధర్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన 26 కులాలను వెంటనే కలపాలి: ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్: బీసీ జాబితా నుంచి తొలగించిన 26 కులాలను వెంటనే తిరిగి కలపాలని బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ కమిషన్ సిఫార్స్ ప్రకారమే ఏదైనా కులాన్ని బీసీ జాబితాలో చేర్చడం లేదా తొలగించడం చేయాలని, కానీ అందుకు విరుద్ధంగా 2014 ఆగస్టులో 26 కులాలను బీసీ జాబితా నుంచి తొలగించారని చెప్పారు. దీంతో ఆయా కులాల వారందరూ నాలుగున్నర ఏళ్లుగా విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లతో పాటు, స్కాలర్‌షిప్‌లు కోల్పోతున్నారని అన్నారు. ఒకవైపు ఉద్యోగాలకు నోటిఫికేషన్ పడుతున్నప్పటికీ బీసీ సర్టిఫికెట్ లేకపోవడం వల్ల ఆయా కులాల వారికి ఇబ్బందిగా మారిందన్నారు. తొలగించిన కులాలను తిరిగి కలుపుతామని ఎన్నికల సమయంలో కేసీఆర్ హామీ ఇచ్చారని, ఆ హామీని వెంటనే నేరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, యువజన సంఘం అధ్యక్షుడు నీల వెంకటేష్, కోలా జనార్ధన్, దాసు సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

2030 నాటికి చైనా తరువాత మనదే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ

- సిపీ రౌండ్‌టేబుల్ సమావేశంలో ఐబీబీఐ చైర్మన్ డాక్టర్ సాహూ

సాక్షి, హైదరాబాద్ : జీఎస్‌టీ, ఐబీసీ వల్ల 2030 నాటికి చైనా తరువాత అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశం అవతరించనున్నదని ఇన్సాల్వెన్సీ, బ్యాంక్ రప్టసీ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఐబీబీఐ) చైర్మన్ డాక్టర్ ఎం.ఎస్. సాహూ అన్నారు. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని వాటిని తిరిగి చెల్లించలేని కంపెనీలను పునరుద్ధరించేందుకు పరిష్కార నిపుణులు (ఆర్‌పీ) ప్రయత్నించాలని, తద్వారా ఆ కంపెనీని నమ్ముకుని ఉన్న ఉద్యోగులు, కార్మికులకు న్యాయం చేసినట్లు అవుతుందని సాహూ అన్నారు. రుణ పరిష్కార ప్రణాళికల తయారీ విషయంలోనూ ముందుచూపుతో వ్యవహరించాలని, రుణదాతల కమిటీ ముందు కేవలం ఒక రుణ పరిష్కార ప్రణాళికనే ఉంచకుండా, దీర్ఘ కాలంగా ప్రయోజనం చేకూర్చే రుణ ప్రణాళికలను సైతం ఆ కమిటీ ముందు ఉంచాలని కోరారు. స్వయంగా రుణ పరిష్కార ప్రణాళికను సమర్పించే వెసులుబాటును దివాలా ప్రక్రియ ఎదుర్కొంటున్న కంపెనీకి సైతం కల్పించాలని, తద్వారా కంపెనీ పునరుద్ధరణకు ఆస్కారం ఉంటుందని తెలిపారు. సొసైటీ ఆఫ్ ఇన్సాల్వెన్సీ ప్రాక్టీషనర్స్ ఆఫ్ ఇండియా (సిపీ) ఆధ్వర్యంలో శనివారం నగరంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఇన్సాల్వెన్సీ బ్యాంక్‌రప్టసీ కోడ్ (ఐబీసీ) అమలులో ఎదురవుతున్న ఇబ్బందులపై ఈ సమావేశం చర్చించింది. ఇందులో సిపీ అధ్యక్షుడు సుమంత్ బత్రా, సిపీ హైదరాబాద్ కన్వీనర్ వీవీఎస్ఎన్ రాజులతో పాటు పలువురు న్యాయవాదులు, కంపెనీ సెక్రటరీలు, చార్టెర్డ్ అకౌంటెంట్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాహు మాట్లాడుతూ, 2016లో వచ్చిన ఐబీసీ వల్ల ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయని, ఈ కోడ్ వల్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెరిగాయని చెప్పారు. ఈ సమావేశంలో పాల్గొన్న పలువురు ఐబీసీ అమలులో ఎదురవుతున్న ఇబ్బందులపై చర్చించారు.

ఎన్‌ఐఏ ఎఫ్‌ఐఆర్‌ను రద్దు చేయండి

- తదుపరి చర్యలన్నీ నిలిపేయండి
- హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్
- అత్యవసరం ఏమీ లేదన్న హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విశాఖపట్నం విమానాశ్రయంలో జరిగిన హత్యాయత్నం దర్యాప్తు బాధ్యతలను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ)కు అప్పగిస్తూ కేంద్ర హోంశాఖ జారీ చేసిన ఉత్తర్వును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వు, తదనుగుణంగా ఎన్‌ఐఏ నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను చట్ట విరుద్ధంగా ప్రకటించి, వాటిని రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి ఏఆర్ అనురాధ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఇందులో కేంద్ర హోంశాఖ కార్యదర్శి, ఎన్‌ఐఏ డైరెక్టర్ జనరల్, ఎన్‌ఐఏ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌ను ప్రతివాదులుగా పేర్కొన్నారు. ప్రస్తుతం హైకోర్టుకు సంక్రాంతి సెలవులు ఉన్న నేపథ్యంలో ఈ వ్యాజ్యంపై హౌస్‌మోషన్ (న్యాయమూర్తి ఇంటి వద్ద)రూపంలో విచారణ జరపాలని అభ్యర్థించారు. హౌస్‌మోషన్‌గా విచారించేందుకు హైకోర్టు నిరాకరించింది. అత్యవసరంగా విచారించాల్సినది ఈ వ్యాజ్యంలో ఏమీ లేదని తేల్చి చెప్పింది. సంక్రాంతి సెలవుల అనంతరం సోమవారం నుంచి హైకోర్టు పునః ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈ వ్యాజ్యంపై ఆ రోజు న్యాయమూర్తి ముందు ప్రస్తావించే అవకాశం ఉంది.

చిన్న విషయంగా...: జగన్‌పై జరిగిన హత్యాయత్నం ఘటనను రాష్ట్ర ప్రభుత్వం తన పిటిషన్‌లో చాలా చిన్న విషయంగా అభివర్ణించింది. దీనిపై ఎన్‌ఐఏ దర్యాప్తునకు ఆదేశించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. శాంతి, భద్రతల వ్యవహారం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిదని, ఇందులో జోక్యం చేసుకునే అధికారం కేంద్రానికి లేదని తన పిటిషన్‌లో పేర్కొంది. కేంద్ర హోంశాఖ ఉత్తర్వు, ఎన్‌ఐఏ ఎఫ్‌ఐఆర్ చట్ట విరుద్ధమని, ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయమని ఆరోపించింది. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తు రికార్డులను, ఇతర మెటీరియల్‌ను స్వాధీనం చేయాలని ఎన్‌ఐఏ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని, అందువల్ల ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేస్తున్నామంది. అత్యవసర విచారణ జరపాల్సిన అవసరం ఉందంది. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వు, ఎన్‌ఐఏ ఎఫ్‌ఐఆర్‌కు సంబంధించిన తదుపరి చర్యలన్నింటినీ నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని అభ్యర్థించింది.


ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్‌లో విచారిస్తున్న ఎన్‌ఐఏ అధికారులు

ఠాణేల్లంకలో ఎన్‌ఐఏ విచారణ

ముమ్మిడివరం/సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన జనుపల్లి శ్రీనివాసరావు స్వగ్రామైన తూర్పుగోదావరి జిల్లా ముమ్మిడివరం మండలం ఠాణేల్లంకలో రెండో రోజు శనివారం కూడా ఎన్‌ఐఏ అధికారులు విచారణ జరిపారు. గతేడాది అక్టోబర్ 25న విశాఖ ఎయిర్‌పోర్టులో జగన్‌పై హత్యాయత్నం జరిగిన విషయం తెలిసిందే. ఎన్‌ఐఏ బృందం.. సీఐ మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో మరో ముగ్గురు అధికారులు శుక్రవారం శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను విచారించారు. రెండో రోజు శనివారం ఠాణేల్లంకలో వీఆర్వో భాస్కరరావు సమక్షంలో శ్రీనివాసరావుకు ఉత్తరం రాసిన సోదరి విజయదుర్గను, జగన్‌తో కలిసి ఉన్న ఫ్లెక్సీ వేయించిన శ్రీనివాసరావు స్నేహితుడు, విజయదుర్గ రాసిన ఉత్తరాల జిరాక్స్ కాపీలు తీసిన జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడు జె.శివసుబ్రహ్మణ్యంను విచారించారు. శ్రీనివాసరావు ప్రవర్తనపై గ్రామంలో పలువురు యువకులను విచారించారు. నిందితుడి తండ్రి తాతారావు, తల్లి సావిత్రి, సోదరుడు సుబ్బరాజులకు సంబంధించి ఆస్తి వివరాలు, బ్యాంకు అకౌంట్లు, ఇతర ఆర్థిక లావాదేవీలపై విచారణ చేశారు. నిందితుడిపై గతంలో ముమ్మిడివరం పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు వివరాలు, ఎయిర్‌పోర్ట్‌లో ఉద్యోగంలో చేరే సమయంలో ఎన్‌ఓసీ కోసం శ్రీనివాసరావు పోలీస్‌స్టేషన్‌కు దరఖాస్తు చేసుకున్నాడా.. లేదా.. తదితర వివరాలను లిఖిత పూర్వకంగా ఇవ్వాలని పోలీసులను కోరినట్లు తెలిసింది.

మీరైనా నిజాయితీతో విచారించి దోషులను పట్టుకోండి

'మీపై నమ్మకంతో వచ్చాం.. ఏం జరిగిందో మొత్తం చెబుతాం.. నిజాయితీతో విచారణ చేపట్టి అసలు దోషులను పట్టుకోండి. కుట్రదారులను, సూత్రధారులను బయటపెట్టండి' అంటూ ఎన్‌ఐఏ అధికారులను వైఎస్సార్‌సీపీ నేతలు కోరారు. శనివారం మధ్యాహ్నం ఎన్‌ఐఏ బృందం ఎదుట వారు విచారణకు హాజరయ్యారు. విశాఖ విమానాశ్రయంలో జగన్‌పై హత్యాయత్నం జరిగిన సమయంలో వీవీఐపీ లాంజ్‌లో ఉన్న నేతలందరినీ సాక్షులుగా పేర్కొంటూ ఎన్‌ఐఏ నోటీసులు జారీచేసింది. ముగ్గురు అధికారుల బృందం విడివిడిగా వివరాలు సేకరించింది.

గ్రామీణ వారసత్వమే మన సంపద

- అంతరించిపోతున్న సంస్కృతిని కాపాడుకోవాలి
- 'పరి' కార్యక్రమంలో పాలగుమ్మి సాయినాథ్



సాక్షి, హైదరాబాద్: గ్రామీణ వారసత్వం దేశానికి వెలకట్టలేని సంపద అని ప్రముఖ జర్నలిస్టు, రచయిత, రామన్ మెగసెసె అవార్డు గ్రహీత పాలగుమ్మి సాయినాథ్ పేర్కొన్నారు. ఆధునికత, నాగరికత పేరుతో అంతరించిపోతున్న గ్రామీణ సంస్కృతి, జీవనం, విలువలు, సంప్రదాయాలను కాపాడుకుని రాబోయే తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఆయన అన్నారు. 'పీపుల్స్ ఆర్కైవ్స్ ఆఫ్ రూరల్ ఇండియా'(పరి) పేరుతో శనివారం జూబ్లీహిల్స్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో మంథన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. హస్తకళలు, చేతివృత్తులు, గ్రామీణ భాషలు, లిపులు, సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేయడం, అంతరించిపోతున్న అరుదైన కళలు, భాషలు, వంటకాలు తదితరాలను వెలుగులోకి తీసుకొచ్చి ప్రాచుర్యం కల్పించే లక్ష్యంతో 'పీపుల్స్ ఆర్కైవ్స్ ఆఫ్ రూరల్ ఇండియా' పేరుతో డిజిటల్ జర్నలిజమ్ ఫ్లాట్‌ఫామ్ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పాలగుమ్మి చెప్పారు. దేశవ్యాప్తంగా పలు రంగాలకు చెందిన ఔత్సాహికులు, పాత్రికేయులు, 1000 మంది వాలంటీర్లు ఇందులో భాగస్వాములయ్యారన్నారు. కనుమరుగవుతున్న గ్రామీణ భాషలు, లిపులు, కళలు రికార్డు చేసి వెలుగులోకి తెస్తున్నామని, లక్షకు పైగా మరాఠీ గ్రామీణ గీతాలు, జనపదాలు వెలుగులోకి తెచ్చామని, ఇంకా బ్రతికి ఉన్న కొద్దిమంది స్వాతంత్ర సమరయోధుల అనుభవాలను ప్రజలకు పరిచయం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. స్వేచ్ఛా వాణిజ్యం, ప్రపంచీకరణ పేరుతో గ్రామీణ విధ్వంసం ఆమోదయోగ్యం కాదన్నారు. గ్రామీణ చేతివృత్తులు, అరుదైన కళలను ముందు తరాలకు అందించాలనే లక్ష్యంతో లాభాపేక్ష లేకుండా ఈ వెబ్‌సైట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పలు గ్రామీణ ప్రాంతాల్లోని చేనేతకారులు, కేరళ మలబార్‌లోని కళాసీలు జీవనాధారం కోల్పోయారని, 50 ఏళ్లలో 200 గ్రామీణ భాషలు వాడుకలో లేకుండా పోయాయని సాయి నాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. సువిశాల భారతంలో వివిధ ముఖకవళికలతో ఉండే ప్రజలను పరిచయం చేయడానికి 'ఫేస్ డైవర్సిటి' పేరుతో దేశంలోని అన్ని జిల్లాల నుండి జిల్లాకు ముగ్గురు చొప్పున ఫోటోలు సేకరించి అందుబాటులో ఉంచే ప్రాజెక్ట్ కూడా ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో మంథన్ ప్రతినిధి అజయ్‌గాంధీ సహ పలువురు ఔత్సాహికులు పాల్గొన్నారు.

అభివృద్ధిని గవర్నర్ స్పష్టంగా వివరించారు

టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: నాలుగున్నరేళ్ల టీఆర్ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఏ విధంగా ప్రజలకు చేరాయో, వాటిని ప్రజలు ఎలా స్వీకరించారో గవర్నర్ నరసింహన్ తన ప్రసంగంలో స్పష్టంగా చెప్పారని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం చేసిన ప్రతి పనినీ గవర్నర్ అభినందించారన్నారు. ప్రజలకు అందిన సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలితంగానే కొత్త ప్రభుత్వం ఏర్పడిందని కర్నె పేర్కొన్నారు. శనివారం గవర్నర్ ఉభయసభలనుద్దేశించి ప్రసంగించిన అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కర్నె మాట్లాడారు. గతంలో రాజకీయపార్టీలు ఎన్నికల సందర్భంగా ఇచ్చే హామీలు మోచేతికి బెల్లం పెట్టి నాకించే విధంగా ఉండేవన్నారు. అందుకు భిన్నంగా ఇచ్చిన మాట వేదంగా టీఆర్ఎస్ భావించిందన్నారు. మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించి అమలు చేసిందని చెప్పారు. రాబోయే ఐదేళ్లలో కూడా హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎస్టీలకు 10 శాతం, ఎస్సీలకు 12 శాతం రిజర్వేషన్ల కల్పనకు కృషి చేస్తుందన్నారు. ఈ విషయంలో న్యాయపరంగానూ ముందుకు వెళ్లేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రజల విశ్వాసం ఏమాత్రం వమ్ము కాని విధంగా నిరుద్యోగభృతి, రుణమాఫీ, పెన్షన్ల మొత్తం పెంపు, రైతుబంధు తదితర వాగ్దానాలు పూర్తిచేస్తుందన్నారు. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచేలా పాలన సాగిస్తుందన్నారు. కేసీఆర్‌పై కూడా ప్రజలు విశ్వాసాన్ని ఉంచారని, మరో రెండు దశాబ్దాల పాటు ఆయనే సీఎంగా కొనసాగుతారని కర్నె చెప్పారు.

బీసీలను ఓటుబ్యాంక్ గానే చూశారు

చంద్రబాబుపై ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా చంద్రబాబు ఉన్నపుడు బీసీలను ఓటుబ్యాంక్ గానే చూశారని, అందుకు భిన్నంగా టీఆర్ఎస్ ప్రభుత్వం గీత, చేనేత, యాదవ, రజక, నాయీ తదితర వర్గాలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయగలిగిందని టీఆర్ఎస్ ఎమ్మెల్యే వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. వివిధ చేతివృత్తుల వాళ్లు తమ కాళ్లపై తాము నిలబడేలా టీఆర్ఎస్ సర్కార్ చేస్తే, టీడీపీ ప్రభుత్వ హయాంలో చేనేతలతో సహా, ఇతర వృత్తులు పూర్తిగా ధ్వంసమయ్యాయన్నారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. గవర్నర్ తమ ప్రసంగంలో టీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి చక్కగా వివరించారని చెప్పారు. ప్రభుత్వ పనితీరుకు నిదర్శనంగా ఈ ప్రసంగం ఉందన్నారు. సీఎం కేసీఆర్ పనితీరును ఇక్కడి ప్రతిపక్షాలు విమర్శించే పరిస్థితి లేదని, ఏపీలో విపక్షాలను మెప్పించేలా చంద్రబాబు పాలన సాగించగలరా అని ప్రశ్నించారు. గవర్నర్ ప్రసంగాన్ని ప్రతిపక్షపార్టీలు అంగీకరించాయని, శాసనసభలో చేసిన ప్రసంగానికి ఎలాంటి అవరోధాలు కల్పించలేదన్నారు. వచ్చే ఐదేళ్ల పాటు సభ నడిచేలా విపక్షాలు సహకరించాలని కోరారు. వ్యవసాయం పండుగగా మారడం, రైతుబంధు, బీమా అమలు, భూరికార్డుల పరిశీలన వంటివి గణాంకాలతో సహా గవర్నర్ వివరిస్తే ఎవరు కాదనగలరని ఆయన అన్నారు.

అసెంబ్లీని రెండు రోజులు పొడిగించాలి

- సత్తుపల్లిని జిల్లాగా ప్రకటించాలి
- ఎమ్మెల్సీ పొంగులేటి డిమాండ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వర్షాభావం, రబీలో పంటల సాగు విస్తీర్ణం తగ్గిన నేపథ్యంలో వ్యవసాయ పరిస్థితిపై చర్చించేందుకు అసెంబ్లీ సమావేశాలను మరో రెండు మూడు రోజులు పొడిగించాలని ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం గవర్నర్ ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించిన అనంతరం ఆయన మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడారు. రబీలో పంటల సాగు విస్తీర్ణం 25 శాతానికే పరిమితమైందని, 18 జిల్లాల్లో వర్షాభావం నెలకొందని పేర్కొన్నారు. అందువల్ల తూతూమంత్రంగా అసెంబ్లీని ముగించకుండా వీటిపై చర్చించేందుకు సమావేశాలను పొడిగించాలన్నారు. గవర్నర్ ప్రసం గం కడుపునింపినట్లుగా ఉందని, కొన్ని అర్ధసత్యాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో విమర్శలు సహజమని, చేసిన మంచి పనులను తాము ఎప్పటికీ స్వాగతిస్తామన్నారు. భూప్రక్షాళన పూర్తిస్థాయిలో జరగలేదని, మిషన్ కాకతీయ మూడు, నాలుగో దశల చెరువులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. పెంచిన పింఛన్లు, నిరుద్యోగ భృతి ఎప్పటినుంచి అమలులోకి వస్తాయో గవర్నర్ ప్రసంగంలో ప్రస్తావించలేదన్నారు. ఇప్పటికీ ఆరోగ్యశ్రీ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, మల్టీలెవల్ మార్కెటింగ్ మోసాలను అరికట్టేందుకు పార్లమెంటులో చట్టం చేయాలన్నారు. అశ్వారావుపేటను కలుపుకొని సత్తుపల్లిని జిల్లాగా ప్రకటించాలని పొంగులేటి డిమాండ్ చేశారు.



శనివారం మీడియాతో మాట్లాడుతున్న సీఎల్పీ నేత భట్టి. చిత్రంలో గండ్ర వెంకటరమణారెడ్డి, శ్రీధర్ బాబు, షబ్బీర్ అలీ

బహిరంగ సభ స్పీచ్‌లా గవర్నర్ ప్రసంగం

- కాంగ్రెస్ సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఎద్దేవా
- కేసీఆర్ స్పీచ్‌నే గవర్నర్ కాపీ కొట్టారు: షబ్బీర్
- విద్యుత్ మిగులుపై గవర్నర్ అబద్ధాలు: దుద్దిళ్ల
- రుణమాఫీ ఎలా చేస్తారో చెప్పనే లేదు: గండ్ర

సాక్షి, హైదరాబాద్: ఉభయసభలనుద్దేశించి గవర్నర్ నరసింహన్ చేసిన ప్రసంగం బహిరంగ సభ స్పీచ్‌లా ఉందని కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) నేత మల్లు భట్టి విక్రమార్క ఎద్దేవా చేశారు. గవర్నర్ ప్రసంగంలో కొత్తదనం లేదని, గతంలో చెప్పిన విషయాలే చెప్పారని విమర్శించారు. 2014లో ప్రకటించిన, ప్రారంభించిన పథకాలను ఎప్పుడు పూర్తి చేస్తారో, ప్రస్తుత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎప్పట్నుంచి ప్రారంభిస్తారో చెప్పలేదన్నారు. శనివారం సీఎల్పీ కార్యాలయంలో మాజీ మంత్రులు షబ్బీర్ అలీ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మాజీ చీఫ్ విప్ గండ్ర వెంకటరమణారెడ్డిలతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగుల గురించి వాస్తవాలు చెబితే సంతోషించేవారమని భట్టి అన్నారు. పింఛన్లు, నిరుద్యోగ భృతిల ఊసే లేకుండా గవర్నర్ ప్రసంగం సాగిందన్నారు. తనను సీఎల్పీ నాయకుడిగా నియమించిన ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌తో పాటు టీపీసీసీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపిన ఆయన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలందరిని కలుపుకుని సమష్టిగా ముందుకెళ్తామన్నారు.

సీఎల్పీ రాష్ట్ర ప్రజల గొంతుక..: అసెంబ్లీలో సీఎల్పీ రాష్ట్ర ప్రజల గొంతుక అవుతుందని, ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలయ్యేలా నిరాటంకంగా పనిచేస్తామని భట్టి చెప్పారు. సభ హుందాగా, ప్రజాస్వామ్యయుతంగా నడుస్తుందని ఆశిస్తున్నామని, ప్రతిపక్షం బలంగా ఉండాలని పాలకులు కోరుకోవాలని అభిప్రాయపడ్డారు. టీఆర్ఎస్ ఆకర్ష్‌కు తమ ఎమ్మెల్యేలు ఎవరూ లొంగరని అన్నారు. ఈ విషయంలో టీఆర్ఎస్ కావాలని తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు.

ఆ విషయాలు చెబితే బాగుండేది: షబ్బీర్

ఎన్నికల ప్రచార సభలో కేసీఆర్ స్పీచ్‌ను గవర్నర్ కాపీ కొట్టారని షబ్బీర్ అలీ విమర్శించారు. గవర్నర్ ప్రసంగం కాపీ పేస్ట్‌లా సాగిందని, రైతు రుణమాఫీ, పింఛన్లు, డబుల్ బెడ్రూం ఇళ్లు ఎప్పుడిస్తారో చెబితే బాగుండేదన్నారు. నిరుద్యోగ భృతి, ఉద్యోగాల కల్పన, పదవీ విరమణ వయసు పెంపుపై స్పష్టత లేదని, ముస్లిం రిజర్వేషన్లపై కూడా అలాగే ఉందని ఆయన ఎద్దేవా చేశారు.

అప్పటి హామీలే ఇప్పుడు ప్రస్తావించారు: శ్రీధర్ బాబు

2014 ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ మేనిఫెస్టోలో రైతులకిచ్చిన హామీలనే గవర్నర్ ఇప్పుడు ప్రస్తావించారని మాజీ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. రాష్ట్రంలో మిగులు విద్యుత్‌పై గవర్నర్ అబద్ధాలు చదివారని, దేశంలో మిగులు విద్యుత్ ఘనత కాంగ్రెస్‌దేనని చెప్పారు. కాంగ్రెస్ అమలు చేసిన సంస్కరణల వల్లే ఇది సాధ్యమైందని, అలా కాకుండా గత ప్రభుత్వాలు తప్పు చేశాయనడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. గవర్నర్ ప్రసంగంలో రుణమాఫీపై స్పష్టత లేదన్నారు. రుణమాఫీ ఏకకాలంలో చేస్తారో లేదో చెప్పాలన్నారు. రైతుబంధు పథకం కింద ఇంకా చాలా మంది రైతులకు డబ్బులు అందలేదని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.





శనివారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగాన్ని వింటున్న ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు, టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, ఈటల రాజేందర్, కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ప్రగతి వైపు పయనం

ఇచ్చిన హామీలతోపాటు కొత్త పథకాల అమలు

- అసెంబ్లీ ఉభయసభలనుద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగం
- ఎమ్మెల్యేలకు హృదయపూర్వక శుభాకాంక్షలు
- ఈ ఏడాది నుంచే 10వేలతో రైతుబంధు
- సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసే లక్ష్యంగా ముందడుగు
- పెంచిన పింఛన్లు, రుణమాఫీ, నిరుద్యోగ భృతి అమలు
- మార్చికల్లా ఇంటింటికీ మిషన్ భగీరథతో తాగునీరు
- రిజర్వేషన్లపై రాజీలేని పోరాటం చేస్తున్నామని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనులు, పథకాలతో రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తోందని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ పేర్కొన్నారు. నాలుగున్నరేళ్లలో ఇచ్చిన హామీలే కాకుండా కొత్త పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిందని ప్రశంసించారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా శనివారం అసెంబ్లీ ఉభయసభలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన శాసనసభ్యులందరికీ తెలుగులో హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ గవర్నర్ ప్రసంగాన్ని ప్రారంభించారు. సభ్యులందరి పదవీకాలం దిగ్విజయంగా సాగాలని, అంకితభావంతో పనిచేయాలని గవర్నర్ ఆకాంక్షించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఏర్పడిన రెండో ప్రభుత్వంలో.. తొలిసారి కొలువుదీరిన ఉభయసభలనుద్దేశించి ప్రసంగించడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, చేయాల్సిన కార్యక్రమాలపై ఆంగ్లంలో ప్రసంగాన్ని కొనసాగించిన గవర్నర్ నరసింహన్ చివరకు తెలుగులో ముగించారు.

కీలక సమస్యల పరిష్కారం

ఆరు దశాబ్దాల సుదీర్ఘ పోరాటం తర్వాత తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్రం సాధించుకోగలిగారని, రాష్ట్ర సాధన ఉద్యమాన్ని ముందుండి నడిపిన కేసీఆర్ నేతృత్వంలో తొలి ప్రభుత్వం ఏర్పడిందని గవర్నర్ ప్రశంసించారు. ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ, అవినీతి రహిత పాలన అందించడంలో ప్రభుత్వం విజయం సాధించిందన్నారు. 29 రాష్ట్రాల్లో ఎవరికీ సాధ్యంకాని రీతిలో ఆర్థిక వృద్ధిని తెలంగాణ సొంతం చేసుకుందని ప్రశంసించారు. 2014–2018 వరకు 17.17% సగటు వార్షికాదాయ వృద్ధిరేటు నమోదైందని, ఈ ఆర్థిక సంవత్సరంలో నవంబర్ నాటికే రాష్ట్రం 29.93% ఆదాయ వృద్ధిరేటు సాధించిందని సభకు తెలియజేశారు. జీఎస్టీ వసూళ్లలోనూ దేశంలోనే తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. వృద్ధులు, వితంతువులు తదితర వర్గాల వారికి పింఛన్ల మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం గణనీయంగా పెంచిందని నరసింహన్ వెల్లడించారు. పేద ఆడ పిల్లల వివాహానికి ప్రభుత్వం ద్వారా రూ.1,00,116 సాయం అందించే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని గవర్నర్ కొనియాడారు. ప్రభుత్వమే ఇంటింటికీ నల్లా సౌకర్యం కల్పించి, శుద్ధమైన తాగునీటిని అందించేలా 'మిషన్ భగీరథ'ను ప్రభుత్వం చేపట్టిందని, రాష్ట్రంలోని మొత్తం 66 మున్సిపాలిటీలకు, 23,968 ఆవాసాలకు సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యంగా నిర్దేశించుకుందన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే 56 మున్సిపాలిటీలకు, అన్ని ఆవాసాలకు మిషన్ భగీరథ ద్వారా ప్రస్తుతం మంచినీళ్లు అందుతున్నాయన్నారు.

కోటిఎకరాలకు సాగునీరు

రాష్ట్రంలో కోటి ఎకరాలకు సాగునీరందించడమే లక్ష్యంగా ప్రభుత్వం భారీ నీటిప్రాజెక్టులను నిర్మిస్తోందని గవర్నర్ తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసే సీతారామ ప్రాజెక్టుకు అటవీ, పర్యావరణ అనుమతులను ఇటీవలే సాధించుకున్నామన్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కూడా అన్ని అనుమతులు సాధించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మిషన్ కాకతీయ ద్వారా నాలుగు దశల్లో 20,171 చెరువుల పునరుద్ధరణ పూర్తయిందని, ఈ చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యంతోపాటు భూగర్భ నీటిమట్టం గణనీయంగా పెరిగిందని ఆయన తెలిపారు. ఇందుకోసం గడిచిన నాలుగున్నరేళ్లలో రూ.77,777 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసిందని, రాబోయే కాలంలో రూ.1,17,000 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టిందన్నారు. తెలంగాణ ఏర్పడిన తొమ్మిదో నెల నుంచే నిరంతరాయ నాణ్యమైన విద్యుత్తును 24 గంటల పాటు సరఫరా చేస్తున్న ట్లు గవర్నర్ సభకు తెలియజేశారు. తెలంగాణ ను మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చేందుకు 28వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి లక్ష్యంగా తలపెట్టిన కొత్త విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం శరవేగం గా జరుగుతోందన్నారు. 800 మెగావాట్ల కేటీపీఎస్ 7వ దశను 42 నెలల రికార్డు సమయంలో పూర్తి చేసి, విద్యుదుత్పత్తి ప్రారంభించడం గొప్ప పరిణామమన్నారు. రైతుకు అండ గా ఉండేందుకు పంట పెట్టుబడి కోసం ఎకరా కు రూ.4వేల చొప్పున.. రెండు పంటలకు రూ.8వేలు అందడంపై రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోందన్నారు. ఈ పథకాన్ని ఐక్యరాజ్యసమితి ప్రశంసించడం తెలంగాణ ప్రజలకు గర్వకారణమన్నారు. భూ వివాదాలను శాశ్వతంగా పరిష్కరించడం కోసం, భూ రికార్డుల నిర్వహణ పారదర్శకతే లక్ష్యంగా రికార్డుల సమగ్ర ప్రక్షాళన కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రభుత్వం చేసిన కృషితో దాదాపు 94% భూముల యాజమాన్యాల హక్కుల విషయంలో స్పష్టత వచ్చిందన్నారు.



శనివారం అసెంబ్లీలో ఉభయసభలనుద్దేశించి ప్రసంగిస్తున్న గవర్నర్ నరసింహన్. చిత్రంలో మండలి చైర్మన్ స్వామిగౌడ్, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

కొత్త జిల్లాలతో పాలన సంస్కరణలు

పరిపాలనా సౌలభ్యం, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో వేగం, పారదర్శకతను పెంచేందుకు 10 జిల్లాలను 31 జిల్లాలు చేసుకున్నట్టు గవర్నర్ తెలిపారు. కొత్తగా నారాయణపేట, ములుగు జిల్లాలను కూడా ఏర్పాటుచేస్తున్నట్టు తెలిపారు. 43 రెవెన్యూ డివిజన్ల సంఖ్యను 69కి, 459 మండలాలను 584 మండలాలకు పెంచినట్టు తెలిపారు. గతంలో ఉన్న 8,690 గ్రామ పంచాయతీలను 12,751కు పెంచుకున్నట్లు సభకు వివరించారు. వచ్చేవారం జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 3వేల మంది ఎస్టీలు సర్పంచులయ్యే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. పోలీస్ శాఖలో రెండు పోలీస్ కమిషనరేట్లు మాత్రమే ఉండేవని, కొత్తగా మరో ఏడు కమిషనరేట్లు ఏర్పాటు చేసినట్లు గవర్నర్ వెల్లడించారు. కొత్త జిల్లాల ప్రాతిపదికన స్థానికుల హక్కులు పరిరక్షించటం కోసం, ప్రభుత్వం కొత్త జోనల్ వ్యవస్థను ఏర్పాటు చేసిందని, లోకల్ కేడర్ ఉద్యోగాలలో 95% అవకాశాలు స్థానికులకే లభించేలా చట్టం చేసిందన్నారు. జిల్లా కేడర్‌తో పాటు 7 జోన్లు, 2 మల్టీ జోన్లు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం చట్టం తీసుకొచ్చిందని.. కొత్త జోనల్ వ్యవస్థ ప్రకారమే తెలంగాణలో నియామకాలు జరుగుతాయన్నారు. రాష్టంలో పరిశ్రమల స్థాపనకోసం టీఎస్ఐపాస్ ద్వారా కేవలం 15 రోజుల్లోనే అనుమతులు లభిస్తున్నాయన్నారు. ఇప్పటివరకు 8వేల పరిశ్రమలకు అనుమతులు లభించగా అందులో 5,570 పరిశ్రమల్లో ఉత్పత్తి మొదలైందన్నారు. రూ.1.32 లక్షల కోట్ల పెట్టుబడులు రాగా.. 8.37 లక్షల మందికి ఉద్యోగాలు లభించాయన్నారు. నిరుపేదలకు గృహనిర్మాణం పథకంలో భాగంగా డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మిస్తున్నామని.. ఇప్పటివరకు 2,72,763 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. బలహీన వర్గాల గృహనిర్మాణ పథకం కింద లబ్ధిదారులు గతంలో బకాయి పడ్డ రూ. 4వేల కోట్లను ప్రభుత్వం రద్దుచేసిందన్నారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పునరుత్తేజం

కుల వృత్తుల మీద ఆధారపడి జీవించే బీసీలు, వారి వృత్తులకు ఆర్థిక చేయూత, ప్రోత్సాహం ఇవ్వడం వల్ల రాష్ట్రంలోని బీసీల స్థితిగతులను మార్చేందుకు ప్రభుత్వం కృషిచేసిందన్నారు. గొల్ల, కురుమలు, మత్స్యకారులు, నేత కార్మికులు, విశ్వకర్మలు, చాకలి, మంగలి తదితర కులాల వారికి ప్రత్యేక పథకాలు అమలు చేశామన్నారు. ఎంబీసీ కార్పొరేషన్ ద్వారా సంచార, ఆశ్రిత కులాలు తదితర వర్గాలకు రూ.1,000 కోట్ల నిధులు కేటాయించినట్టు తెలిపారు. కేజీటుపీజీ ఉచిత విద్యావిధానంలో నూతన స్కూళ్లు, రెసిడెన్షియల్ కాలేజీలను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్టు నరసింహన్ తెలిపారు. రాష్ట్రం ఏర్పడక ముందు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల కోసం 296 గురుకులాలు ఉండేవని, తెలంగాణ ప్రభుత్వం కొత్తగా 542 గురుకులాలు ఏర్పాటు చేసిందన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి బీసీల కోసం మరో 119 రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వాసుపత్రుల్లో అవసరమైన మందులను పేదలకు ఉచితంగా అందిస్తున్నామన్నారు. 40 ప్రభుత్వ ఆసుపత్రుల్లో డయాలసిస్ కేంద్రాలు, ఎంఆర్ఐ, సీటీ స్కాన్, డిజిటల్ రేడియాలజీ, 2డీ ఎకో తదితర అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తెచ్చినట్లు నరసింహన్ వెల్లడించారు.

సజావుగా శాంతిభద్రతలు

శాంతి భద్రతల పరిరక్షణలో రాష్ట్ర పోలీస్ శాఖ భేషుగ్గా పనిచేస్తోందని గవర్నర్ నరసింహన్ కితాబిచ్చారు. అభివృద్ధిలో శాంతి భద్రతలకున్న ప్రాధాన్యతను గుర్తించి, ప్రభుత్వం పోలీసు శాఖకు ఎక్కువ బడ్జెట్ కేటాయించిందన్నారు. త్వరలోనే హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయిలో పోలీస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభం కానుందని గవర్నర్ తెలిపారు. పేకాట, గుడుంబా తయారీ వంటి సమస్యలను పోలీస్ శాఖ సమర్థవంతంగా అరికట్టిందన్నారు.

ప్రసంగంలోని మరిన్ని అంశాలు

- ఆసరా పింఛన్లు రూ.1,000 నుంచి రూ.2,016లకు పెంపు
- దివ్యాంగులకు పింఛను రూ.1,500ల నుంచి రూ.3,016లు పెంచేందుకు నిర్ణయం
- వృద్ధాప్య పింఛన్ పథకం 57 ఏళ్లకు సడలింపు. ఈ వయస్సు నిండిన వారందరినీ లబ్ధిదారులుగా గుర్తించడం
- నిరుద్యోగులకు నెలకు రూ.3,016లు భృతి.
- ప్రస్తుత పద్ధతిలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం కొనసాగిస్తూనే, సొంతస్థలం ఉన్న అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇంటి నిర్మాణం కోసం రూ.5–6 లక్షల సాయం
- రైతులకు రూ.1 లక్ష వరకు పంట రుణాల మాఫీ
- ఈ సంవత్సరం నుంచి రైతుబంధు సాయం ఎకరానికి ఏడాదికి రూ.8 వేల నుంచి రూ.10వేలకు పెంపు
- రైతు సమన్వయ సమితి సభ్యులకు గౌరవ భృతి, ఎస్సీ, ఎస్టీ వర్గాల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక పథకాల రూపకల్పనకు కమిటీ నివేదిక ఆధారంగా అమలు
- చట్టసభల్లో బీసీలకు 33%, మహిళలకు 33% రిజర్వేషన్ అమలు కోసం ప్రభుత్వం పోరాటం.
- ఎస్టీలకు 12%, మైనారిటీలకు 12% రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ కోసం కేంద్రంతో రాజీలేని పోరాటానికి నిర్ణయం.
- రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు.. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు
- సందర్భోచితంగా ఐకేపీ ఉద్యోగుల సేవల క్రమబద్ధీకరణకు నిర్ణయం.

నేడు గవర్నర్ ప్రసంగంపై చర్చ

- ఉభయసభల్లో వేర్వేరుగా సమావేశాలు
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానాలు
- అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న కొప్పుల.. బలపర్చనున్న వేముల
- మండలిలో ప్రవేశపెట్టనున్న పల్లా.. బలపర్చనున్న బోడికుంటి
- 'పంచాయతీ' బిల్లును సభ ఆమోదం కోసం ప్రవేశపెట్టనున్న సీఎం
- ఎమ్మెల్యేలుగా ప్రమాణం చేసిన రాజాసింగ్, అహ్మద్‌ఖాన్

సాక్షి, హైదరాబాద్: గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఆదివారం అసెంబ్లీలో చర్చ జరగనుంది. శాసనసభ, శాసనమండలిలో వేర్వేరుగా చర్చ కొనసాగుతుంది. ఉభయ సభలు ఆదివారం ఉదయం 10.30 గంటలకు మొదలవుతాయి. గవర్నర్ నరసింహన్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చను అసెంబ్లీలో ధర్మపురి ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ ప్రారంభిస్తారు. బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి బలపరుస్తారు. అనంతరం కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత మల్లు భట్టి విక్రమార్క, ఎంఐఎం ఎమ్మెల్యే అహ్మద్ బిన్ బలాల, బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌లు చర్చను కొనసాగిస్తారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అవకాశం ఇచ్చిన మేరకు అధికార, ప్రతిపక్ష పార్టీల సభ్యులు మాట్లాడతారు. చివరగా ప్రభుత్వం తరఫున సీఎం కె.చంద్రశేఖర్‌రావు ప్రసంగించడంతో పాటు పంచాయతీ రాజ్ ఆర్డినెన్సును బిల్లు రూపంలో సభ ఆమోదానికి ప్రవేశపెట్టనున్నారు. అనంతరం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానానికి శాసనసభ ఆమోదం తెలుపుతుంది.

మండలిలో పల్లాతో మొదలు..

ఇటు శాసనమండలిలోనూ అదేరకంగా జరగనుంది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చను మండలిలో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మొదలుపెడతారు. మరో ఎమ్మెల్సీ బోడికుంటి వెంకటేశ్వర్లు తీర్మానాన్ని బలపరుస్తారు. తర్వాత కాంగ్రెస్, ఎంఐఎం, బీజేపీ సభ్యులు ప్రసంగిస్తారు. హోంమంత్రి మహమూద్ అలీ చివరగా ప్రభుత్వం తరుపున ప్రసంగిస్తారు. మండలి గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ఆమోదిస్తుంది. తీర్మానం ఆమోదం అనంతరం రెండు సభలు నిరవధికంగా వాయిదా పడతాయి.

రాజాసింగ్ ప్రమాణం...

బీజేపీ ఏకైక ఎమ్మెల్యే రాజాసింగ్ (గోషామహల్) శాసనసభలో శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి తన చాంబర్‌లో ఆయనతో ప్రమాణం చేయించారు. రాజాసింగ్ హిందీలో దైవసాక్షిగా ప్రమాణం చేశారు. ఇటీవల అసెంబ్లీలోని కొత్త ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్ ఖాన్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఎంఐఎంకు చెందిన అహ్మద్‌ఖాన్ స్పీకర్ స్థానంలో ఉన్నప్పుడు తాను ప్రమాణం చేయబోనని ప్రకటించారు. పోచారం శ్రీనివాసరెడ్డి స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టడంతో ప్రమాణం చేశారు.

వచ్చే సమావేశాల్లోపు బీఏసీ...

శాసనసభ నిర్వహణ వ్యవహారాలను నిర్ణయించే బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) ఏర్పాటుపై జాప్యం జరుగుతోంది. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోపు బీఏసీ ఏర్పాటు కానుంది. కాంగ్రెస్ శాసనసభ పక్ష నేత ఎన్నికపై ఆ పార్టీ శనివారం సమావేశాలు ముగిసిన తర్వాత స్పీకర్‌కు లేఖ ఇచ్చింది. ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ, టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఇంకా ఎమ్మెల్యేలుగా ప్రమాణం చేయలేదు. బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ శనివారమే ప్రమాణం చేశారు. బీఏసీలో ఉండాల్సిన వారిలో ఇద్దరు ఇంకా ప్రమాణం చేయకపోవడం, సీఎల్పీ నేతలపై శనివారం అధికారికంగా స్పష్టత రావడంతో బీఏసీ ఏర్పాటు కాలేదు. అయితే త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకోనున్నారు. అలాగే మండలి బీఏసీ విషయంలోనూ ఇదే పరిస్థితి ఉంది. మండలిలో కాంగ్రెస్ ప్రతిపక్ష హోదా గల్లంతైంది. దీంతో బీఏసీలో మార్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ కారణాలతో శాసనసభ, శాసనమండలి బీఏసీ సమావేశాలు జరగలేదు.

పక్షపాతం లేకుండా సభ నిర్వహిస్తా : స్పీకర్ పోచారం

శాసనసభను హుందాగా, పక్షపాతం లేకుండా, సజావుగా నడిపించే బాధ్యత తనపై ఉందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సభ నియమ నిబంధనల ప్రకారం ప్రతిపక్ష పార్టీల సభ్యులకు మాట్లాడే స్వేచ్ఛనిస్తానని చెప్పారు. ప్రతిపక్ష పార్టీలు సూచనలు, సలహాలను స్వీకరించి సభ సంప్రదాయాలను పాటిస్తామన్నారు. స్పీకర్ పోచారం అసెంబ్లీ ఆవరణలోని మహాత్మాగాంధీ, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూల మాల వేసి నివాళులర్పించారు. ఇందులో అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు పాల్గొన్నారు. పోచారం మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీజీ, రాజ్యాంగ రచయిత అంబేద్కర్‌లను స్పీకర్‌గా గౌరవించుకోవడం తనకు లభించిన అదృష్టమని అన్నారు.

'టీఆర్ఎస్ మేనిఫెస్టోలా గవర్నర్ ప్రసంగం'



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీలో గవర్నర్ నరసింహన్ చేసిన ప్రసంగం ఇటీవలి ఎన్నికల్లో టీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టో మాదిరిగా ఉందని సీపీఐ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి విమర్శించారు. సాధారణంగా గవర్నర్ ప్రసంగాల్లో 'నా ప్రభుత్వం'అని అనడం ఆనవాయితీ అని దానికి విరుద్ధంగా ఈ సారి ఒక చోట గవర్నర్ 'టీఆర్ఎస్ ప్రభుత్వం'అని పేర్కొనడం దీనికి నిదర్శనమన్నారు. ప్రసంగంలో ఎక్కడా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ అన్న మాటే లేకపోవడం దారుణమని శనివారం ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. ఐదేళ్లలో లక్షకు పైగా ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న వాగ్దానాన్ని మరిచిపోయారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ, రిటైర్‌మెంట్ వయసు 61 ఏళ్లకు పెంచడం వంటి హామీలు ఎప్పటి నుంచి అమలు చేస్తారో పేర్కొనలేదన్నారు. భూప్రక్షాళన తప్పుల తడకగా మారిందని, దాదాపు 94 శాతం భూముల యాజమాన్యాలకు హక్కులు వచ్చినట్టుగా చెప్పడం పచ్చి అబద్ధమన్నారు. ఖరీదవుతున్న వైద్య ఖర్చులపై, కార్పొరేట్ ఆసుపత్రుల చార్జీల నియంత్రణపై సూచనలేవీ చేయలేదన్నారు. మొత్తమ్మీద టీఆర్ఎస్ మాటలనే గవర్నర్ చెప్పినట్టుగా ఉందని చాడ పేర్కొన్నారు.

నిరాశాజనకంగా ఉంది

గవర్నర్ ప్రసంగంపై బీజేపీ ఎమ్మెల్సీ రామచంద్రరావు

సాక్షి, హైదరాబాద్: ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ నరసింహన్ చేసిన ప్రసంగం నిరాశాజనకంగా ఉందని బీజేపీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు వ్యాఖ్యానించారు. ప్రభుత్వం చెబుతున్న వాటినే చర్వితచర్వణంగా చెప్పారన్నారు. ఇటీవలి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎప్పటినుంచి అమలు చేస్తారన్న విషయాన్ని చెప్పలేదన్నారు. నిరుద్యోగ సమస్య, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల అమలు ప్రస్తావనే లేదన్నారు. ఉద్యోగాల కల్పన జరగక నిరుద్యోగులు తీవ్ర నిరాశ, నిస్పృహల్లో ఉన్నారన్నారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద రామచంద్రరావు మాట్లాడుతూ, కేంద్రం చేపడుతున్న 'ఆయుష్మాన్ భారత్' పథకంలో రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యం కావడం లేదనే విషయం ప్రసంగంలో లేకపోవడం శోచనీయమన్నారు. నిజాం షుగర్స్, ఇతర పరిశ్రమల ప్రస్తావన లేదన్నారు. రెండు పడకల ఇళ్లు 2.7 లక్షలు మంజూరు చేసినట్టు చెప్పినా, వాటిని ఎప్పుడు కడతారో చెప్పలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంత వేగంగా పాలమూరు–రంగారెడ్డి చేపట్టడం లేదన్నారు.

పాతమాటలే కొత్తగా: రాజాసింగ్



గవర్నర్ తమ ప్రసంగంలో పాత మాటలనే కొత్తగా వల్లెవేశారని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. టీఆర్ఎస్ మేనిఫెస్టోను చదివి వినిపించినట్టుగా ఈ ప్రసంగం ఉందన్నారు. తన నియోజకవర్గం పరిధిలో రెండుపడకల ఇళ్ల నిర్మాణమే చేపట్టలేదన్నారు. గ్రామ పంచాయతీలకు నీళ్లు అందడంలేదన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై బీజేపీ పోరాడుతుందన్నారు. ఈసారైనా ప్రజలకు మేలుచేసే దిశలో టీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేయాలని రాజాసింగ్ సూచించారు.

సాక్షి
రాష్ట్రీయం
నల్లగొండ | ఆదివారం | జనవరి | 20 | 2019
www.sakshi.com

1948, జనవరి 23న భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో క్రికెట్ దిగ్గజం డాన్ బ్రాడ్‌మన్ కేవలం 272 నిమిషాల్లో 201 పరుగులు సాధించి చరిత్ర సృష్టించారు.



ఈ ఫ్రాగియోకి జూలియెట్ దొరికింది





అదో బావిలో కప్ప. ఒంటరి జీవితం.. నీళ్లలో మాత్రమే బతికే అరుదైన జాతికి చెందిన ఈ కప్పను పదేళ్ల క్రితం బొలీవియాలో కనుగొన్నారు. సెహన్‌కస్ అనే ప్రత్యేకమైన జాతికి చెందిన ఈ కప్పను చాలా జాగ్రత్తగా అక్వేరియంలో ఉంచి సంరక్షిస్తున్నారు. ఈ పదేళ్లుగా అది ఒంటరిగా బెకబెకమంటూ అక్వేరియంలోనే ఉంటోంది. దీనికి రోమియో అని పేరు పెట్టారు. ఈ భూమ్మీద ఉన్న వాటర్ ఫ్రాగ్ ఇదొక్కటేనని హెర్పటాలజీ శాస్త్రవేత్తలు భావించారు. ఈ రోమియోకి ట్విట్టర్‌లో ప్రొఫైల్ కూడా క్రియేట్ చేసి ప్రపంచంలో మిగిలిన ఏకైక కప్ప ఇదే అంటూ ప్రచారం మొదలుపెట్టారు. ఆ ప్రొఫైల్‌కి నా జాతి అంతరించిపోతోంది అంటూ ట్యాగ్‌లైన్ కూడా ఇచ్చారు. దీంతో సామాజిక మాధ్యమాల్లో ఈ కప్పకి బాగా ఫాలోయింగ్ పెరిగింది. దీనికో జూలియెట్ కావాలంటూ డిమాండ్లూ పెరిగాయి. ఈ జాతి అంతరించిపోకూడదంటే రోమియోకు ఒక ఆడ తోడు ఉండాలి. అందుకే దానితో జత కట్టే జూలియెట్ కోసం శాస్త్రవేత్తలు తీవ్రంగా గాలించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కొండలూ, కోనలూ వాగులూ, వంకలూ జల్లెడ పట్టారు. వారి పదేళ్ల శ్రమకు ఫలితం దక్కింది. చివరికి హెర్పటాలజీ శాస్త్రజ్ఞురాలు తెరెసా కమాచో బదాని నేతృత్వంలోని బృందం బొలీవియాలోని ఓ దట్టమైన అడవుల్లో జూలియెట్‌ను పట్టుకుంది. ఆ అడవుల్లోని సరస్సుల్లో మూడు మగ కప్పలు, రెండు ఆడ కప్పలు దొరికాయి. వాటిని చూడగానే శాస్త్రవేత్తల ఆనందానికి హద్దులే లేవు. ఆ రెండు ఆడకప్పల్లో ఒకదాన్ని రోమియోకి జతకట్టారు. ''రోమియో, జూలియెట్ సరైన జంట. రోమియో ఎప్పుడు చూసినా ప్రశాంతంగా నిలకడగా కనిపిస్తుంది. నీళ్లలో ఎక్కువ సేపు కదలకుండానే ఉంటుంది. అదే జూలియెట్ ఉరిమే ఉత్సాహంతో తెగ ఈతకొడుతూ, పెట్టిందల్లా తింటూ ఉంటుంది. ఈ రెండూ ఒకరినొకరు ఆకర్షించుకుంటాయి. ఇక ఈ జాతి నిలబడుతుంది'' అని బదాని అన్నారు. నీళ్లలో మాత్రమే బతికే ఈ కప్పలు ఒకప్పుడు బొలీవియా అడవుల్లో ఎక్కువగా ఉండేవి. కానీ, వాతావరణంలో చోటు చేసుకుంటున్న భారీ మార్పులు, ఆహారం కొరత కారణంగా ఈ కప్పలు అంతరించిపోతున్న జాబితాలో చేరిపోయాయి. ఇక ఈ జాతిని కాపాడుకోగలం అన్న ఆనందంలో శాస్త్రవేత్తలు మునిగిపోతే, తోడు దొరికిందన్న ఆనందంలో రోమియో, జూలియెట్‌లు పండుగ చేసుకుంటున్నాయి!

యువతతోనే అద్భుతాలు..

- పెళ్లి విషయంలో నన్ను అనుసరించొద్దు
- ప్రజలే దేవుళ్లు.. సమాజమే దేవాలయం
- దేశమంతా మీ కుటుంబమే అనుకోండి
- తెలంగాణ జాగృతి అంతర్జాతీయ యువ నేతృత్వ సదస్సులో అన్నా హజారే పిలుపు
- హక్కుల సాధనకు ఉద్యమించాలి: కవిత



శనివారం జాగృతి సదస్సులో ప్రసంగిస్తున్న అన్నా హజారే

సాక్షి, హైదరాబాద్: సరైనమార్గనిర్దేశనం ద్వారా యువతతో అద్భుతాలు సృష్టించొచ్చని గాంధేయవాది, పద్మభూషణ్ అన్నా హజారే సూచించారు. ప్రజలే దేవుళ్లు, సమాజమే దేవాలయం, దేశమే మీకుటుంబం అన్న భావనతో యువత పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. అలా నమ్మి ఆచరిస్తున్న ఫలితంగానే ఒకప్పుడు కరువు కాటకాలకు నిలయమైన రాలేగావ్ సిద్ధీ ఈ రోజు పచ్చదనంతో కళకళలాడుతోందని చెప్పారు. తెలంగాణ జాగృతి సంస్థ వ్యవస్థాపకురాలు నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు కల్వకుంట్ల కవిత నేతృత్వంలో శనివారం హైదరాబాద్‌లో ప్రారంభమైన 'తెలంగాణ జాగృతి అంతర్జాతీయ యువ నేతృత్వ సదస్సు'కు అన్నా హజారే ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సదస్సుకు 110 దేశాల నుంచి 550 మంది యువ ప్రతినిధులు హాజరు కాగా, సుస్థిరాభివృద్ధికి, సృజనాత్మకతలకు గాంధేయ మార్గం అన్న ఇతివృత్తంపై ఈ సదస్సులో చర్చోపచర్చలు ఉంటాయి. సదస్సు ప్రారంభోత్సవం సందర్భంగా హజారే మాట్లాడుతూ..యువత గ్రామాలకు సేవ చేయడం మొదలుపెడితే మనదేశం అమెరికా, రష్యాలను అధిగమించి ప్రపంచంలోనే అగ్రస్థానానికి చేరుకుంటుందన్నారు. ఏదో సాధించాలన్న తపన యువతలో ఉన్నప్పటికీ తగిన మార్గనిర్దేశనం లేకపోవడంతో కొంతమంది పెడదారి పడుతున్నారన్నారు. ఒక లక్ష్యంతో ప్రణాళికబద్ధంగా కృషి చేసి యువత తమ ఆకాంక్షలను నెరవేర్చుకోవాలని పిలుపునిచ్చారు.

గాంధీ రచనలతో మార్పు..

యువకుడిగా ఉన్నప్పుడు ఈ జీవితం ఎందుకు? అన్న ప్రశ్న తనకూ వచ్చిందని..పాతికేళ్ల వయసులో ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో గాంధీజీ రచనలతో ఏర్పడిన పరిచయం తన జీవితాన్ని మార్చేసిందని హజారే గుర్తు చేసుకున్నారు. మానవ జీవిత పరమార్థం సేవేనని నిర్ణయించుకుని స్వగ్రామమైన రాలేగావ్‌సిద్ధీతో కొత్త ప్రస్థానం మొదలుపెట్టానని వివరించారు. తిండికి గతిలేని స్థితి నుంచి రోజుకు 150 ట్రక్కుల కూరగాయలు ఎగుమతి చేసే స్థితికి రాలేగావ్‌సిద్ధీ చేరుకుందన్నారు. ప్రకృతిని కాపాడుకుంటూనే రాలేగావ్‌సిద్ధీని అభివృద్ధి చేసిన విషయాన్ని గుర్తుంచుకోవాలని..అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని నాశనం చేయడం తగదని హితవు పలికారు. పెళ్లి విషయంలో తనను అనుకరించాల్సిన అవసరం లేదని అన్నా హజారే చలోక్తి విసిరారు. ''పెళ్లి చేసుకోండి. పిల్లల్ని కనండి. అలాగని అదే మీ కుటుంబం అనుకోవద్దు''ని చెప్పారు. అభివృద్ధి, అవినీతి రెండు ఒకే నాణేనికి రెండు పార్శ్వాలని, అవినీతి అంతానికి తాను చేసిన ఉద్యమం ఫలితంగా సమాచార హక్కు చట్టం వచ్చిందని గుర్తు చేశారు.

యువతకు తగిన విధానాలు అవసరం: కవిత

యువతకు, సమాజ శ్రేయస్సుకు, సమస్యల పరిష్కారానికి మనదేశంతో పాటుగా ఇతర దేశాల్లోనూ తగిన విధానాలు లేవని ఎంపీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో పేదరికం, ఆకలి నిర్మూలన, వాతావరణ పరిరక్షణ, స్వచ్ఛమైన గాలి వంటివి అనేకం ఉన్నాయన్నారు. ఈ సమస్యలన్నీ మనుషులుగా మనం సృష్టించినవేనన్నారు. ప్రతీరోజూ 22 వేల మంది పిల్లలు బాల్యంలోనే తనువు చాలిస్తుండటం, 80 కోట్ల మంది ఆకలితో నిద్రపోతుండటం, గాలి కాలుష్యం తనను ఎంతో కలచివేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. యువశక్తి సాయంతో ఈ సమస్యలకు పరిష్కారాలు కనుక్కునేందుకు ఈ సదస్సు ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే యువత ఈ సమస్యలను సరికొత్త దృక్కోణంతో చూడగలదని.. అదే స్థాయిలో పరిష్కారాలు కూడా చూపగలదని ఆమె అన్నారు. సుస్థిర అభివృద్ధికి నమూనాగా నిలిచిన రాలేగావ్‌సిద్ధీని నేటికీ వందలాది మంది సందర్శిస్తున్నారంటే అది అన్నా హజారే కృషి ఫలితమేనన్నారు. తమ హక్కులను సాధించుకునేందుకు.. సమస్యల పరిష్కారానికి ప్రపంచవ్యాప్తంగా యువత ఏకం కావాలని కవిత పిలుపునిచ్చారు. ఈ దిశగా వేసిన తొలి అడుగుగా యువ నేతృత్వ సదస్సును పరిగణించాలని అన్నారు.

రానున్నది ఫుడ్ ప్రాసెసింగ్ శకం

మైక్రోసాఫ్ట్ యూఎస్ డైరెక్టర్ శివకుమార్

సాక్షి, హైదరాబాద్: రానున్నది మొత్తం ఫుడ్ ప్రాసెసింగ్ శకమని మైక్రోసాఫ్ట్ యూఎస్ డైరెక్టర్ శివకుమార్ కొండూరి అన్నారు. వ్యవసాయంలో అధునాతన డిజిటల్ టెక్నాలజీ వినియోగంపై అగ్రికల్చర్ విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డిజిటల్ టెక్నాలజీ, వ్యవసాయంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బిగ్‌డేటా అనాలిసిస్, బ్లాక్ చైయిన్ టెక్నాలజీస్ వినియోగంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. 2050 సంవత్సరానికి పెరగనున్న జనాభాకు అనుగుణంగా 70 శాతం అదనంగా ఆహారధాన్యాల ఉత్పత్తి జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అందుబాటులో ఉన్న వనరులతో అధికోత్పత్తిని సాధించడంలో టెక్నాలజీ కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. రైతులకు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడంతో పాటు వినియోగదారుల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా నాణ్యతతో కూడిన పంటల ఉత్పత్తి జరగాలని ఆకాంక్షించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా యూనివర్సిటీలు నూతన కోర్సులను ప్రారంభించాలన్నారు. నాలెడ్జ్ ఆధారిత వ్యవసాయానిదే భవిష్యత్ అని వ్యవసాయ వర్సిటీ వీసీ వి.ప్రవీణ్‌రావు అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఆవిష్కృతమ వుతున్న టెక్నాలజీని స్థానిక అవసరాలకు అనుగుణంగా మార్చుకొని రైతులకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. తరిగిపోతున్న సహజ వనరులు, పెరిగిపోతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా విధానాల్లో మార్పు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎస్.సుధీర్‌కుమార్‌తోపాటు విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు, స్థానిక ఐసీఏఆర్ సంస్థ డైరెక్టర్లు, శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతను విస్మరిస్తున్నాం!

- రాజకీయాల్లో వీరికి అవకాశాలు పెంచాల్సిందే
- పెద్దోళ్లే ఎంపీలవుతున్నారు.. అందుకే యువత సమస్యల పరిష్కారంలో విఫలం
- జాగృతి అంతర్జాతీయ సదస్సులో కవిత, ఒవైసీ, గౌరవ్ గొగోయ్, సీమా మల్హోత్రా
- కశ్మీర్ సమస్యపై బీజేపీ, కాంగ్రెస్‌లకు చిత్తశుద్ధి లేదన్న ఒవైసీ



శనివారం హైదరాబాద్‌లో జాగృతి అంతర్జాతీయ సదస్సులో మాట్లాడుతున్న శేఖర్‌గుప్తా, చిత్రంలో సీమా మల్హోత్రా, గౌరవ్ గొగోయ్, అసదుద్దీన్ ఒవైసీ, కవిత

సాక్షి, హైదరాబాద్: 'మన దేశం యంగ్ ఇండియా అని గర్వంగా చెప్పుకుంటున్నప్పటికీ.. భారత్‌లో యువత సమస్యలను అర్థం చేసుకోవడంలో ఎంపీలు, విధాన రూపకర్తలు విఫలమయ్యారు. ఈ పరిస్థితి మారి యువత రాజకీయాల్లో మరింత చురుగ్గా పాల్గొనాల్సిన సమయం ఆసన్నమైంది' అని తెలంగాణ జాగృతి అంతర్జాతీయ యువ సదస్సు (టీజేఐవైసీ)లో వక్తలు అభిప్రాయపడ్డారు. హైటెక్‌సిటీ నోవాటెల్ హోటల్‌లో శనివారం 'వాక్ ద టాక్ ఆన్ యూత్ డెవలప్‌మెంట్'పేరుతో జరిగిన చర్చాగోష్టిలో.. నిజామాబాద్ ఎంపీ, జాగృతి అధ్యక్షురాలు కవిత (టీఆర్ఎస్), హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ (ఎంఐఎం), అసోం ఎంపీ గౌరవ్ గొగోయ్ (కాంగ్రెస్)లతోపాటు బ్రిటన్‌లోని లేబర్ పార్టీ ఎంపీ సీమా మల్హోత్రా పాల్గొన్నారు. భారత్‌లో మధ్యవయస్కులు, అంతకన్నా పెద్ద వయసున్న వారే ఎక్కువ సంఖ్యలో పార్లమెంటుకు ఎంపికవుతున్నందునే.. యువత సమస్యలను అర్థం చేసుకోవడం లేదని సీనియర్ జర్నలిస్టు శేఖర్ గుప్తా అన్నారు. దీన్ని ఒవైసీ సమర్థిస్తూ.. పార్లమెంటులో ఎంపీల వయసుకు సబంధించిన గణాంకాలను వెల్లడించారు. ప్రస్తుత లోక్‌సభలో ఎంపీల సగటు వయసు 55ఏళ్లుగా ఉందని.. 40ఏళ్లు, అంతకంటే తక్కువ వయసున్న వారు 13% కంటే తక్కువగా ఉన్నారని ఒవైసీ వివరించారు. నిరుద్యోగ సమస్య పెరిగిపోతుండటం, గత కొన్నేళ్లలోనే ఐటీ రంగంలో లక్షల ఉద్యోగాలు తగ్గిపోవడం వంటివన్నీ దేశ పార్లమెంటరీ వ్యవస్థలో లోపాన్ని ఎత్తిచూపుతున్నాయన్నారు. ఈ పరిస్థితి మారి యువతకు రాజకీయరంగంలో మరిన్ని అవకాశాలు కల్పించాలని ఒవైసీ ఆకాంక్షించారు. బ్రిటన్ ఎంపీ సీమా మల్హోత్రా మాట్లాడుతూ.. యూకేలో యువత సమస్యలు భారత్‌తో పోలిస్తే కాస్త భిన్నంగా ఉంటాయని వ్యాఖ్యానించారు. మానసిక సమస్యలు, ఆత్మహత్యలపై అక్కడ జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోందని.. ప్రభుత్వాలు కూడా ఈ అంశాలపై దృష్టిపెట్టి పరిష్కరిస్తున్నాయని వివరించారు.

కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమే: ఒవైసీ

ఎవరెన్ని చెప్పినా కశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని ఒవైసీ పేర్కొన్నారు. కశ్మీర్ ప్రజలు, యువకులు భారతీయులే అనడంలో సందేహించాల్సిన అవసరం లేదన్నారు. అయితే.. కశ్మీర్ సమస్య పరిష్కరించేందుకు జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు చిత్తశుద్ధితో పనిచేయడం లేదని ఆయన వ్యాఖ్యానించారు. 'కశ్మీర్ లోయలో సాధారణ పరిస్థితులు నెలకొనాలంటూ అందరూ ప్రకటనలు చేస్తారు. తీరా పరిస్థితులు చక్కబడగానే కశ్మీర్‌లో చేయాల్సిన అభివృద్ధిని మరిచి పోతున్నారు'అంటూ కాంగ్రెస్, బీజేపీలపై విమర్శలు చేశారు. ఈ వివాదంపై కేంద్రానికి ఓ స్థిరమైన విధానం లేదని.. నాలుగున్నరేళ్లలో కశ్మీరీ పండిట్ల కోసం గానీ.. అక్కడి యువత కోసం గానీ.. మోదీ ప్రభుత్వం చేసిందేమీ లేదని ఒవైసీ ఆరోపించారు. ప్రభుత్వాలు తమను పట్టించుకోవడం లేదనే అభిప్రాయం అక్కడి యువతలో ఉందన్నారు. అయితే కశ్మీర్ సమస్య సినిమాల్లాగా యుద్ధం చేసి పరిష్కరించేది కాదని.. ఇరువర్గాల్లో ఒకరు రాజనీతిజ్ఞతతో వ్యవహరించాలని అన్నారు.

దేశమంతా ఒక్కటేనని గుర్తిస్తే..

జనాభా నియంత్రణ పథకాలు సమర్థవంతంగా అమలుచేసిన దక్షిణాది రాష్ట్రాలకు కేంద్ర నిధుల్లో వాటా తక్కువగా ఉండటంపై కవిత మాట్లాడారు. ఈ విషయంలో దేశమంతా ఒక్కటేనని అందరూ గుర్తించాలని.. రాష్ట్రాలకు కేంద్ర నిధుల పంపిణీ విధానంలో మార్పులు చేయడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చని ఆమె పేర్కొన్నారు. పేదరికం, ఉపాధి కల్పన వంటి చాలా అంశాలు అన్ని రాష్ట్రాల్లోనూ దాదాపు ఒకే తీరుగా ఉంటాయని.. ఈ అంశాలకు సంబంధించి జనాభా ప్రాతిపదికన నిధుల పంపిణీ చేయడం తప్పేమీ కాదన్నారు. అయితే.. మిగిలిన అంశాల్లో మెరుగైన పనితీరు కనబరిచే రాష్ట్రాలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని సూచించారు. యువతను రాజకీయాల్లోకి ప్రోత్సహించేందుకు రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరంపైనా చర్చ జరగాలని ఆమె పేర్కొన్నారు. అసోం ఎంపీ గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ.. దేశంలో ఆర్థిక సరళీకరణలకు పాతికేళ్లు దాటినా.. ఈశాన్య రాష్ట్రాల్లో అభివృద్ధి మాత్రం 2 దశాబ్దాలు వెనుకబడే ఉందన్నారు. ఇందుకు కారణాలేమైనా.. దీని ప్రభావం మాత్రం యువతపై స్పష్టంగా కనబడుతోందన్నారు. తండ్రులు రాజకీయాల్లో ఉండటం తమకు కొంతవరకు కలిసొచ్చినా.. దీర్ఘకాలం ఈ రంగంలో కొనసాగేందుకు మాత్రం కష్టపడాల్సిందేనని గౌరవ్, అసదుద్దీన్, కవిత స్పష్టం చేశారు.



శనివారం సీఎం కేసీఆర్‌కు పోడు భూముల సమస్యలపై వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ ఎమ్మెల్యేలు

ఫిబ్రవరిలో ప్రత్యేక సమావేశం

కాంగ్రెస్ ఆదివాసీ ఎమ్మెల్యేలతో సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆదివాసీ ఎమ్మెల్యేలు శనివారం సమావేశమయ్యారు. ఎమ్మెల్యేలు పోడెం వీరయ్య, రేగా కాంతారావు, ఆత్రం సక్కు, సీతక్క శాసనసభలోని ముఖ్యమంత్రి చాంబర్‌లో కేసీఆర్‌తో భేటీ అయ్యారు. పోడు భూముల సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేలు సీఎంకు విజ్ఞప్తి చేశారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. ఫిబ్రవరి మొదటి వారంలో ఆదివాసీ ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తానని చెప్పారు. ఆదివాసీల కోసం అభివృద్ధి ప్రణాళిక రూపొందిస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే ప్రతి ఆదివాసీ నియోజకవర్గాన్ని సందర్శించి పోడు భూముల సమస్యను అక్కడికక్కడే పరిష్కరిస్తామని సీఎం తెలిపారు. ములుగు జిల్లా ఏర్పాటు చేసినందుకు ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే సీతక్క సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆదివాసీ ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా కేసీఆర్‌ను కలవడంతో అన్ని పార్టీల ఎమ్మెల్యేల్లో దీనిపై చర్చ జరిగింది.

సర్కార్‌ను నిలదీస్తాం: రాజగోపాల్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రజాసమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. గతంలో ఇచ్చిన హామీలు, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా చేసిన వాగ్దానాల అమలుపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. తమకు కాంగ్రెస్ పార్టీ కన్నతల్లి లాంటిదని ఆ పార్టీని వీడే ప్రసక్తి లేదన్నారు. ఎమ్మెల్యేల సంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పోరాడుతుందన్నారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ, సీఎల్పీ నేత పదవికి పోటీపడిన నలుగురిలో తాను కూడా ఉన్నట్టు తెలిపారు. అయితే మొత్తం 19 మంది ఎమ్మెల్యేలు నిర్ణయాధికారాన్ని పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి అప్పగించామన్నారు. రాహుల్‌గాంధీ తీసుకున్న నిర్ణయాన్ని తాము గౌరవిస్తామన్నారు. సీఎల్పీ నాయకుడిగా నియమితులైన భట్టివిక్రమార్కకు ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా చేసిన అనుభవంతో పాటు డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్‌గా పనిచేసిన అనుభవం ఉందన్నారు. పార్టీ ప్రయోజనాలతో పాటు తెలంగాణ సాధన కోసం తాము ఎన్నో త్యాగాలు చేశామని రాజ్‌గోపాల్‌రెడ్డి చెప్పారు.



సీఎల్పీ నేతగా ఎంపికైన భట్టి విక్రమార్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న స్పీకర్ పోచారం. చిత్రంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తదితరులు

భట్టికి ఘనంగా సన్మానం

- సీఎల్పీ నేత హోదాలో గాంధీభవన్‌కు
- ఒకే వాహనంలో వెళ్లిన ఉత్తమ్, భట్టి, శ్రీధర్‌బాబు, గండ్ర
- అక్కడి నుంచి పార్టీ తరపున లేఖ తీసుకుని మళ్లీ అసెంబ్లీకి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) నేతగా ఎంపికైన మల్లు భట్టివిక్రమార్కను టీపీసీసీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సీఎల్పీ నేత హోదాలో తొలిసారి గాంధీభవన్‌కు వెళ్లిన ఆయనకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లుకిషన్ తదితరులు శాలువా కప్పి సన్మానం చేశారు. పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్, భట్టిలకు గజమాల వేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, గండ్ర వెంకటరమణారెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒకే వాహనంలో ఆ నలుగురు..

అంతకుముందు జరిగిన అసెంబ్లీ సమావేశానికి కాంగ్రెస్ సభ్యులంతా హాజరయ్యారు. గవర్నర్ ప్రసంగం అనంతరం సభ వాయిదా పడిన తర్వాత, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గాంధీభవన్‌కు బయలుదేరారు. తనతోపాటు రావాలని భట్టిని కోరడంతో భట్టి, శ్రీధర్‌బాబు, గండ్ర వెంకటరమణారెడ్డిలు ఉత్తమ్ వాహనంలోనే గాంధీభవన్‌కు వెళ్లారు. అక్కడి నుంచి సీఎల్పీ నేతగా భట్టిని నియమిస్తూ పార్టీ పక్షాన ఇచ్చిన లేఖను తీసుకుని మళ్లీ గాంధీభవన్‌కు వచ్చారు. అప్పుడు ఉత్తమ్ గాంధీభవన్‌లోనే ఉండిపోయారు. భట్టితో పాటు శ్రీధర్‌బాబు, గండ్రలు మళ్లీ అసెంబ్లీకి వచ్చి, పార్టీకి చెందిన ఇతర ఎమ్మెల్యేలతో కలిసి స్పీకర్ చాంబర్‌కు వెళ్లారు. అక్కడ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డిని కలిసి భట్టిని సీఎల్పీ నేతగా నియమిస్తూ ఇచ్చిన లేఖను అందజేశారు. సీఎల్పీ నేతగా భట్టిని గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ఈ లేఖలో కోరారు. స్పీకర్‌ను కలిసిన వారిలో శ్రీధర్‌బాబు, గండ్రతోపాటు మాజీ మంత్రి షబ్బీర్‌అలీ, సీనియర్ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, పార్టీ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, పొడెం వీరయ్య ఉన్నారు.

భట్టిని అభినందించిన కేటీఆర్

అసెంబ్లీ ప్రాంగణంలో ఆత్మీయ ఆలింగనం



సాక్షి, హైదరాబాద్: సీఎల్పీ నేతగా ఎంపికైన భట్టివిక్రమార్కకు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు శుభాకాంక్షలు తెలియజేశారు. శనివారం ఉదయం అసెంబ్లీ సమావేశాల ప్రారంభానికి ముందు భట్టి, కేటీఆర్‌లు యాదృచ్ఛికంగా కలిశారు. టీఆర్ఎస్ఎల్పీ, సీఎల్పీ కార్యాలయాలున్న భవనం ముందు భట్టికి పలువురు శుభాకాంక్షలు తెలుపుతున్న సమయంలో కేటీఆర్ కూడా టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయం నుంచి అసెంబ్లీ సమావేశ మందిరానికి వెళుతున్నారు. ఆ సమయంలో ఎదురుపడిన భట్టిని కేటీఆర్ ఆత్మీయంగా పలకరించారు. ఆయన్ను ఆలింగనం చేసుకుని అభినందనలు తెలియజేశారు. ప్రతిపక్ష నేతగా బాగా పనిచేయాలని కోరారు. వాస్తవానికి, పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలపాల్సి ఉన్నా యాదృచ్ఛికంగా మీరు కలవడంతో ఇవ్వలేకపోతున్నానని భట్టితో అన్నారు. భట్టి కూడా కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పీఏసీ చైర్మన్‌గా వనమా!

- సామాజిక సమీకరణాల దృష్ట్యా ఆయనకు అవకాశం
- పార్టీ సంప్రదాయం ప్రకారం ఎక్కువసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వారికి చాన్స్
- పీసీసీ చీఫ్‌గా ఉన్న ఉత్తమ్.. ఎస్సీ నేతకు సీఎల్పీ పదవి
- సీఎల్పీ ఉపనేతగా కోమటిరెడ్డి దాదాపు ఖరారు.. సబిత, సీతక్క, గండ్రలకూ అవకాశం



సాక్షి, హైదరాబాద్: ప్రతిపక్ష పార్టీకి లభించే ప్రజాపద్దుల కమిటీ (పీఏసీ) చైర్మన్‌గా కాంగ్రెస్‌కు చెందిన సీనియర్ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఎంపికయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. వెనుకబడిన సామాజిక వర్గానికి చెందిన వనమా కొత్తగూడెం నియోజకవర్గం నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్‌లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తర్వాత ఎక్కువ సార్లు గెలుపొందిన ముగ్గురు ఎమ్మెల్యేల్లో సీనియర్ ఈయన. సీఎల్పీ నేతగా ఎస్సీ నాయకుడిని ఎంపిక చేయడం, పీసీసీ అధ్యక్షుడిగా ఓసీ వర్గానికి చెందిన ఉత్తమ్ ఉండటంతో పీఏసీ చైర్మన్ పదవిని బీసీ వర్గానికి కేటాయిస్తారని, ఆ కోటాలో బీసీల్లో సీనియర్ ఎమ్మెల్యే అయిన వనమా వెంకటేశ్వరరావును ఈ పదవికి ఎంపిక చేస్తారని టీపీసీసీ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కాంగ్రెస్ పార్టీ తరపున ఎక్కువ సార్లు గెలిచిన సీనియర్ ఎమ్మెల్యేలకు పీఏసీ చైర్మన్ ఇచ్చే సంప్రదాయానికి పార్టీ శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే నారాయణ్‌ఖేడ్ నియోజకవర్గం నుంచి నాలుగు సార్లు గెలిచిన పి.కిష్టారెడ్డిని పీఏసీ చైర్మన్‌గా నియమించింది. అయితే అప్పటికే ఐదుసార్లు గెలిచిన రాంరెడ్డి వెంకటరెడ్డి ఉన్నప్పటికీ ఈయన కంటే 13 ఏళ్ల ముందు ఎమ్మెల్యే అయిన కిష్టారెడ్డిని పీఏసీ చైర్మన్‌గా నియమించారు. ఆ తర్వాత కిష్టారెడ్డి చనిపోవడంతో రాంరెడ్డి వెంకటరెడ్డిని పీఏసీ చైర్మన్‌గా నియమించారు. వెంకటరెడ్డి కూడా అదే టర్మ్‌లో చనిపోవడంతో నాలుగు సార్లు గెలిచిన ఎమ్మెల్యేలలో సీనియర్ అయిన జె.గీతను ఆ పదవికి ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో ఐదుసార్లు గెలిచిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఈసారి పీఏసీ చైర్మన్ పదవికి ఎంపిక చేయాల్సి ఉంటుంది. కానీ ఉత్తమ్ ఇప్పటికే టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నారు. దీంతో ఈసారి గెలిచిన 19 మంది ఎమ్మెల్యేలలో ముగ్గురు నాలుగుసార్లు గెలిచిన ఎమ్మెల్యేలు ఉన్నారు. వనమా వెంకటేశ్వరరావుతో పాటు సబితా ఇంద్రారెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నాలుగుసార్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. సబితారెడ్డి, శ్రీధర్‌బాబు పీఏసీ చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. వీరిద్దరి కంటే సీనియర్ ఎమ్మెల్యే కావడంతో వనమా వెంకటేశ్వర్‌రావును పీఏసీ చైర్మన్‌గా నియమించే అవకాశముందని టీపీసీసీ వర్గాలు చెబుతున్నాయి. పీసీసీ అధ్యక్షుడిగా ఓసీ నాయకుడు, సీఎల్పీ నేతగా ఎస్సీ నేత ఉన్నారని, ఇప్పుడు పీఏసీ చైర్మన్ పదవిని బీసీలకు ఇవ్వాలని పార్టీలోని బీసీ నేతలు కూడా డిమాండ్ చేస్తున్నారు. దీంతో పార్టీలో సీనియర్ ఎమ్మెల్యే కావడం, సామాజిక సమీకరణలు కూడా అనుకూలంగా ఉండటం వల్ల వనమా వెంకటేశ్వరరావుకే పీఏసీ చైర్మన్ పదవి దక్కే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. లేదంటే శ్రీధర్‌బాబు, సబితలలో ఒకరిని నియమించే అవకాశముంది.

ఉపనేతగా రాజ్‌గోపాల్‌రెడ్డి

సీఎల్పీ నాయకుడిగా భట్టి విక్రమార్కను పార్టీ అధిష్టానం నిర్ణయించడంతో అసెంబ్లీలోని ఇతర పదవులపై పార్టీ నేతల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా పార్టీ ఉపనేతలుగా ఎవరిని నియమిస్తారన్నది చర్చనీయాంశంగా మారింది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి ఉపనేత పదవి ఖరారైనట్టు తెలుస్తోంది. ఆయనతో పాటు ఎస్టీ మహిళా కోటాలో సీతక్క, సీనియర్ ఎమ్మెల్యేగా సబిత, గండ్ర వెంకటరమణారెడ్డిల పేర్లు వినిపిస్తున్నాయి. సీఎల్పీ కార్యదర్శి, విప్ పదవులకు పార్టీ తరపున రెండు మూడుసార్లు ఎమ్మెల్యేలుగా గెలిచిన పొడెం వీరయ్య, చిరుమర్తి లింగయ్య, ఆత్రం సక్కు, రేగా కాంతారావు, జగ్గారెడ్డి, సుధీర్‌రెడ్డిలతో పాటు మహిళా కోటాలో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన హరిప్రియా నాయక్ పేరు కూడా వినిపిస్తోంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం ఉత్తరాయణం, హేమంత ఋతువు పుష్యమాసం, తిథి శు.చతుర్దశి ప.1.54 వరకు, తదుపరి పౌర్ణమి, నక్షత్రం ఆరుద్ర ఉ.7.41 వరకు, తదుపరి పునర్వసు వర్జ్యం రా.6.57 నుంచి 8.26 వరకు దుర్ముహూర్తం సా.4.14 నుంచి 5.01 వరకు అమృతఘడియలు... తె.3.58 నుంచి 5.25 వరకు (తెల్లవారితే సోమవారం).

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం : 5.43
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

అమిత్ షా (బీజేపీ అధ్యక్షుడు)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

నాలుగు రోజులుగా ఆసుపత్రిలో ఉన్నాను. చూడ్డానికి ఒక్కరూ రావడం లేదు! చూసి చూసి, ఐదో రోజు నేనే అడిగాను.

"సిస్టర్.. ఎయిమ్స్‌లోకి సందర్శకులను రానివ్వరా?" అని.

"సందర్శకులను రానిస్తారు కానీ, మిమ్మల్ని చూడ్డానికి సందర్శకులెవరూ రావడం లేదు" అంది ఆ అమ్మాయి.

"నేను అమిత్‌షాని సిస్టర్. బీజేపీ ప్రెసిడెంట్‌ని" అని చెప్పాను.

"మీరు అమిత్‌షా అని నాకు తెలుసు అమిత్‌జీ" అంది ఆ అమ్మాయి మృదువైన చిరునవ్వుతో.

"కానీ సిస్టర్.." అని ఆగాను.. తనేదో చెప్పబోతోందని అర్థమై.

"నేను సిస్టర్‌ని కాదు అమిత్‌జీ. డాక్టర్‌ని. మీరు నన్ను సిస్టర్ అని పిలవడం నాకు సంతోషకరమైన సంగతే కానీ, నేను సిస్టర్‌ని కాదు డాక్టర్‌ని అని మీకు తెలియడం వల్ల మీరు నన్ను మీ సందర్శకుల గురించి మాత్రమే కాకుండా, మీ ఆరోగ్యం గురించి కూడా అడగవచ్చునన్న భావన మీలో కలుగుతుంది కదా అని నా తాపత్రయం" అన్నారు ఆవిడ!

"ఓ! ఎలా ఉన్నాను డాక్టర్ నేనిప్పుడు" అని అడిగాను ఆమె అలా అనగానే.

నవ్వారు ఆవిడ. "మీరు నన్ను డాక్టర్ అని అనడం నాకు సంతోషకరమైన సంగతే కానీ, మీ స్వైన్‌ఫ్లూ పూర్తిగా నయం అయిందన్న సంగతిని మీకు చెప్పడంలోనే నాకు ఎక్కువ సంతోషం లభిస్తుంది అమిత్‌జీ" అన్నారు.

ధన్యవాదాలు చెప్పి, "నన్నెప్పుడు డిశ్చార్జ్ చేస్తున్నారు డాక్టర్" అని అడిగాను. ఆవిడ మళ్లీ నవ్వారు. "ఎందుకు మీరు డిశ్చార్జ్ చేయబడటం కోసం అంతగా త్వరపడుతున్నారు" అన్నారు.

నాకర్థమైంది. నాకింకా నయం కాలేదని.



"బహుశా మీరు డిశ్చార్జ్ అయ్యేటప్పుడైనా మీకోసం కొంతమంది సందర్శకులు వస్తారని, అలా వారు రావడం కోసమే మీరు త్వరగా డిశ్చార్జ్ అవ్వాలని కోరుకుంటున్నారని నాకు అనిపిస్తోంది అమిత్‌జీ. అయితే మన కోసం వచ్చేవారెవరూ ఉండరని తెలుసుకున్నప్పుడే అది మనకు నిజమైన డిశ్చార్జ్ అవుతుంది" అని చెప్పి, దుప్పటిని నా గొంతు వరకు లాగి, ఆ లేడీ డాక్టర్ వెళ్లిపోయారు. ఇంటి నుంచి నేను తెచ్చుకున్న దుప్పటి అది. అదొక్కటే ఇప్పుడు నాకు తోడుగా ఉన్నది. కళ్లు మూసుకున్నాను.

"అమిత్‌జీ.. మీకోసం రాజ్‌నాథ్‌జీ, యోగి ఆదిత్యానాథ్ జీ.." అంటూ ఓ అమ్మాయి వచ్చి లేపింది. ప్రాణం లేచి వచ్చింది!

"ఎక్కడున్నారు వాళ్లు! విజిటర్స్ లాంజ్‌లోనా?" అని అడిగాను.

"అమిత్‌జీ వాళ్లు ఆసుపత్రికి రాలేదు. లైన్‌లో ఉన్నారు" అని ఫోన్ నా చేతికి ఇచ్చి వెళ్లిపోయింది.

"భలే టైమ్‌కి బెడ్ రిడెన్ అయ్యారు అమిత్‌జీ. కర్మ కాకపోతే ఏంటి?" అంటున్నాడు యోగి. వెంటనే రాజ్‌నాథ్ అందుకున్నాడు. "అమిత్‌జీ.. టీవీ చూస్తున్నారా? బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో మమత ర్యాలీ జరిగిన చోటే, అంతకన్నా భారీగా మన ర్యాలీ జరగాలని మోదీజీ అంటున్నారు. ఆదివారం జరగాల్సిన ర్యాలీ ఇప్పటికే మీ వల్ల మంగళవారానికి వాయిదా పడింది. ఆ లోపు మీరు డిశ్చార్జ్ కావాలి" అంటున్నాడు!

"అలాగే.. డిశ్చార్జ్ అవుతాను" అని చెప్పాను.

'ఎలా ఉన్నారు అమిత్‌జీ?' అని యోగి కానీ, రాజ్‌నాథ్ గానీ ఒక్కమాట అడగలేదు! మనసుకు బాధగా అనిపించింది.

వెంటనే మోదీజీకి ఫోన్ చేశాను. రింగ్ అయిన కాసేపటికి, లిఫ్ట్ అయ్యాక కూడా కాసేపటికి.. "చెప్పండి" అన్నారు మోదీజీ!!

'చెప్పండి' అన్నారే గానీ, 'ఎలా ఉన్నారు అమిత్‌జీ' అని అడగలేదు!

"చెప్పరే! ఏంటి?" అన్నారు విసుగ్గా మళ్లీ.

"ఎలా ఉన్నారు మోదీజీ?" అని అడిగాను.

త్రికాలమ్



కె. రామచంద్రమూర్తి

పూటకో మాట.. రోజుకో బాట!

'అసూయాపరులంతా ఒక్కటై రాష్ట్రంలో చిచ్చు పెడుతున్నారు. గద్దల్లా వాలుతున్నారు. అవినీతి గొంగళిపురుగును కేసీఆర్ కౌగలించుకున్నారు.' ఇవి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు నోటినుంచి వెలువడిన మాటలు. ఎవరు అసూయపడుతున్నారు చంద్రబాబునాయుడిని చూసి? నరేంద్రమోదీనా? కల్వకుంట్ల చంద్రశేఖరరావా (కేసీఆర్)? వైఎస్ జగన్ మోహన్‌రెడ్డా? ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పన్నెండు సంవత్సరాలూ, సువిశాల దేశానికి ప్రధానిగా సుమారు అయిదేళ్ళూ పని చేసిన రాజకీయ నాయకుడు మోదీ. చంద్రబాబును చూసి ఆయన ఎందుకు ఈర్ష్య పడాలి? 2019 ఎన్నికలలో బీజేపీకి ఎన్ని స్థానాలు దక్కుతాయో, మోదీ మళ్ళీ ప్రధానిగా ప్రమాణం చేస్తారో లేదో తెలియదు. కానీ ఇప్పటికీ దేశంలో అత్యంత ప్రాబల్యం కలిగిన నేత మోదీ అని ఆయన ప్రత్యర్థులు సైతం అంగీకరిస్తారు. తమ కంటే గొప్ప భాషాపరిజ్ఞానం కలిగిన వక్త చంద్రబాబును చూసి మోదీ, కేసీఆర్ అసూయ చెందుతున్నారా? ఆయన తమ కంటే సమర్థ పాలకుడనీ, పరిపాలనా దక్షుడనీ మోదీ, కేసీఆర్ అసూయతో రగిలిపోతున్నారా? తమ కంటే ఎక్కువ విశ్వసనీయత ఉన్నదనీ, ప్రజాదరణ ఉన్నదనీ మోదీ, కేసీఆర్, జగన్‌మోహన్‌రెడ్డి ఈర్ష్యతో కుమిలిపోతున్నారా? జీవితంలో పొత్తులు లేకుండా ఒక్కసారి కూడా ఎన్నికలలో పోటీ చేయలేని టీడీపీ అధినేతను చూసి ఒంటరిగా పోరాడి కాంగ్రెస్, టీడీపీ, టీజేఎస్, సీపీఐ కూటమిపైన ఇటీవలనే ఘనవిజయం సాధించిన కేసీఆర్ ఉడుక్కుంటారా? ఎవరు గద్దలో, ఎవరు సింహాలో ప్రజలకు తెలియదా? జగన్‌మోహన్‌రెడ్డిపైన కేసులు ఎవరు పెట్టించారో, కాంగ్రెస్ నాయకుడు శంకరరావు వేసిన పిటిషన్‌లో ఎర్రన్నాయుడు ఎట్లా ఇంప్లీడ్ అయ్యారో ఎవరికి తెలియదు? అది బహిరంగ రహస్యం కాదా? సోనియాగాంధీ, చిదంబరంలతో చేతులు కలిపి బూటకపు కేసులు పెట్టించిన సంగతీ, జైలులో పెట్టించి బెయిల్ రాకుండా 16 మాసాలు మేనేజ్ చేసిన విషయం ప్రత్యేకించి ఎవ్వరూ చెప్పక్కరలేదు. ఎవరు అవినీతి గొంగళి పురుగు? 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా, 1984 నుంచి 1995 వరకూ ఎన్‌టీఆర్ 'నమ్మిన' బంటుగా పనిచేసిన చంద్రబాబుకి అవినీతికి ఒడిగట్టే అవకాశం ఉన్నదా లేక ఒక్కరోజైనా అధికారంలో లేకుండా, తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నకాలంలో హైదరాబాద్‌కు రాకుండా బెంగుళూరులోనే తన మానాన తాను వ్యాపారం చేసుకుంటూ ఉన్న జగన్‌మోహన్‌రెడ్డికి అవకాశం ఉన్నదా? గుజరాత్, కర్ణాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్, తెలంగాణ ఎన్నికలలో కాంగ్రెస్‌కి ఆర్థిక సహాయం చేయడానికి బాబుకు అన్ని వందల కోట్లు ఎక్కడ నుంచి వచ్చాయో ప్రజలు ఊహించుకోలేరా? ఇవన్నీ అసహ్యించుకోవలసిన పనులే కానీ అసూయపడవలసిన ఘన కార్యాలైతే కాదు కదా! సంపద తప్ప ఏమున్నది చంద్రబాబు దగ్గర ఇతరులు ఈర్ష్యపడేందుకు?

స్వవచోవ్యాఘాతాలు

లెక్కలేనన్ని పరస్పర విరుద్ధమైన ప్రకటనలూ, స్వవచోవ్యాఘాతాలూ, అసత్యాలూ దేశంలో మరే ఇతర రాజకీయ నాయకుడి నోటి నుంచైనా వచ్చాయా? గతంలో కానీ వర్తమానంలో కానీ ఇన్ని యూ–టర్న్‌లు తీసుకున్న మరో రాజకీయ నాయకుడు దేశ చరిత్రలో ఉన్నాడా? 1995 ఆగస్టులో వైస్రాయ్ డ్రామా జరిగినప్పుడు టీవీలు లేవు. ఉన్న నాలుగు పత్రికలూ చంద్రబాబు చెప్పుచేతలలో ఉండేవి. ఎన్‌టిఆర్‌కు అనుకూలమైన వార్తలు, వ్యాఖ్యలు పత్రికలలో కానీ రేడియోలో కానీ వచ్చేవి కావు. అందుకనే సింహంలాంటి ఎన్టీఆర్‌ని బోనులో పెట్టగలిగారు. ఇప్పుడు ఆ ఆట సాగదు. అబద్ధాలు అతకవు. మీడియాలో బహుళత్వం ఉన్నది. నాణేనికి రెండో పార్శ్వం చూపించే పత్రికలూ, చానళ్ళూ ఉన్నాయి. టీవీలు వచ్చిన తర్వాత నేతలు మాట్లాడిన ప్రతి అక్షరం రికార్డు అవుతుంది. ఆ రికార్డులు న్యూస్‌చానళ్ళ లైబ్రరీలలో భద్రంగా ఉంటాయి. టీవీ తెర మీద ముఖకవళికలను కూడా వీక్షకులకు గమనిస్తారు. ఎవరు నిజం చెబుతున్నారో, ఎవరు బొంకుతున్నారో ఇట్టే పసిగట్టగలుగుతారు. చంద్రబాబు ఈ రోజు ఏమి మాట్లాడినా అందుకు విరుద్ధంగా గత నాలుగు సంవత్సరాల ఎనిమిది మాసాలలోనే మాట్లాడి ఉంటారు. టీడీపీలో అధ్యక్షులవారే అందరికంటే ఎక్కువ మాట్లాడతారు. జన్మభూమి కమిటీల నుంచి ఐక్యరాజ్య సమితి వరకూ అన్ని విషయాలపైనా శ్రీవారే వ్యాఖ్యానిస్తారు. నిర్ణయాలు అప్పటికప్పుడే, అక్కడికక్కడే ప్రకటించేస్తారు. వ్యూహరచన చేస్తారు. ఎత్తుగడలు వేస్తారు. తక్కిన వారంతా ఆయన చెప్పినట్టు చేయవలసిందే. అందుకని ప్రతి పరిణామం పైనా



చంద్రబాబు 'బైట్' ప్రతి టీవీ న్యూస్‌చానల్‌లోనూ ఉంటుంది. యజమానులకు ఇష్టం లేకపోతే చంద్రబాబుకి ఇబ్బంది కలిగించే సన్నివేశాలు చూపించరు. అది వేరే విషయం. చూపించాలని అనుకున్న చానళ్ళ దగ్గర బోలెడు సామగ్రి ఉంటుంది. తాజాగా చంద్రబాబు నిగ్రహం కోల్పోవడానికి దారి తీసిన పరిణామం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్)కలుసుకొని ఫెడరల్ ఫ్రంట్ నిర్మాణం గురించి ప్రాథమిక చర్చలు జరపడం. దీనికి చంద్రబాబు వక్రభాష్యాలు చెప్పారు. రాష్ట్ర ద్రోహులు కుట్ర చేస్తున్నారంటూ నిందించారు. గద్దల్లా వాలుతున్నారన్నది ఈ సందర్భంలోనే. ఈ విమర్శలకు సమాధానంగా ఆయన చర్యలను గుర్తు చేస్తే చాలు.

నానారాష్ట్ర సందర్శనం

ఆంధ్రప్రదేశ్‌లో కరువు పరిస్థితులు నెలకొన్నప్పటికీ ప్రత్యేక విమానంలో కోల్‌కతా, భువనేశ్వర్, చెన్నై, ఢిల్లీ వెళ్లి బీజేపీ వ్యతిరేక కూటమి నిర్మాణానికి ప్రయత్నాలు చేయడం గుర్తు చేయవచ్చు. ఆ పర్యటనలో చంద్రబాబు పోలవరం నిర్మాణాన్ని గట్టిగా ప్రతిఘటిస్తున్న ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను కలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదాను వ్యతిరేకిస్తున్న స్టాలిన్ నివాసానికి వెళ్ళి చర్చలు జరిపారు. రాహుల్‌గాంధీ నివాసానికి వెళ్ళి ఆయనతో కరచాలనం చేసినప్పుడు రాహుల్‌ని 'పప్పు' అంటూ అవహేళన చేయడం, సోనియాను ఇటలీ రాక్షసి అంటూ నిందించడం చూపించవచ్చు. కేటీఆర్–జగన్‌మోహన్ రెడ్డిల భేటీని ఆక్షేపించినప్పుడు కేసీఆర్‌ని చంద్రబాబు కౌగలించుకున్న దృశ్యం, తెలంగాణ ముఖ్యమంత్రి ఇంటికి వెళ్ళి అమరావతి శంకుస్థాపనకు ఆహ్వానించినప్పటి సన్నివేశం, హరికృష్ణ పార్థివదేహం ఉండగానే తెలంగాణ ఎన్నికలలో పొత్తు గురించి కేటీఆర్‌తో ప్రస్తావించిన వైనం సచిత్రంగా గుర్తు చేయవచ్చు. 2009 ఎన్నికలతో టీఆర్ఎస్‌తో కలసి మహాకూటమి నిర్మించడం, ఎన్నికలలో ఓడిపోగానే కేసీఆర్‌ని తూలనాడటం గురించి చెప్పవచ్చు. అంతకు ముందు ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు చేస్తే ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అభ్యంతరం లేదంటూ అనుచరుల కమిటీతో చెప్పించి, ఆ మేరకు టీడీపీ పొలిట్‌బ్యూరో చేత తీర్మానం చేయించి, ప్రణబ్ ముఖర్జీ కమిటీకి లేఖ రాసిన సంగతి దృశ్యసహితంగా చెప్పవచ్చు. పరిటాల సునీత కుమారుడి వివాహానికి కేసీఆర్ హాజరైనప్పుడు ఆయనకు స్వాగతం చెప్పిన తెలుగు తమ్ముళ్ళ ఆనందోత్సాహాలను ప్రస్తావించవచ్చు. మోదీతో కుమ్మక్కు అయ్యారని విమర్శిస్తే, మోదీకి తిరుపతి లడ్డూల సంచీ అందిస్తూ అతివినయం ప్రదర్శించిన చంద్రబాబు దృశ్యం ఎన్ని విడతలైనా ప్రదర్శించవచ్చు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా గురించి మాట్లాడితే ప్రతిపక్ష నాయకుడు నాలుగున్నరేళ్ళుగా చేసిన పోరాటాల వివరాలు చెప్పవచ్చు. ప్రత్యేకప్యాకేజీ ఇచ్చినందుకు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీకి అర్ధరాత్రి మీడియా సమావేశం పెట్టి ధన్యవాదాలు చెప్పడం, ఎన్‌డీఏ ప్రభుత్వానికి ధన్యవాదాలు చెబుతూ అసెంబ్లీతో తీర్మానం చేయించడం, ప్యాకేజీ ఇప్పించినందుకు వెంకయ్యనాయుడినీ, ఇచ్చినందుకు అరుణ్‌జైట్లీని ఘనంగా సన్మానించడం, హోదా సంజీవని కాదంటూ దబాయించడం, హోదా కోసం ఉద్యమిస్తే జైలుకు పంపిస్తానంటూ యువతను హెచ్చరించడం గుర్తు చేయవచ్చు. సత్తెనపల్లిలో ఎన్‌టీఆర్ విగ్రహావిష్కరణ సందర్భంగా చంద్రబాబు మాట్లాడిన మాటలకు సమాధానంగా 1995లో ఎన్‌టీఆర్ గురించి చంద్రబాబు ఏమి మాట్లాడారో, ఆయన గురించి ఎన్టీఆర్ ఏమన్నారో పత్రికలలో రాయవచ్చు. టీవీలలో చూపించవచ్చు. తప్పించుకోలేరు. 'బైట్స్' క్షేమంగా ఉన్నాయి.

కోల్‌కతాలో నారావారి భేరీ

శనివారం కోల్‌కతాలో తృణమూల్ కాంగ్రెస్ అధినేత మమతా బెనర్జీ ఏర్పాటు చేసిన బ్రహ్మాండమైన 'యునైటెడ్ ఇండియా' బహిరంగ సభకు మోదీనీ, బీజేపీనీ వ్యతిరేకించే నేతలలో చాలామంది హాజరైనారు. 2018 మార్చి వరకూ మోదీతో స్నేహం చేసిన చంద్రబాబు కూడా వెళ్ళారు. సమాజ్‌వాదీ నాయకుడు అఖిలేష్ యాదవ్, ఆర్జేడీ అధినేత తేజస్వియాదవ్ వంటి యువకులు మోదీని విమర్శిస్తే ఎవ్వరూ తప్పు పట్టరు. వారు మోదీతో అంటకాగలేదు. ప్రధానిగా మోదీ తప్పులు చేయలేదని కాదు. ఆయన ఒప్పులకుప్ప కాదు. కానీ విమర్శించేవారికి విశ్వసనీయత ఉండాలి. మోదీ వంటి అద్భుతమైన ప్రధాని ఈ దేశానికి చారిత్రక అవసరమని చంద్రబాబు అసెంబ్లీలో గంభీరమైన ఉపన్యాసం ఇచ్చిన విషయం ఆయన విస్మరించవచ్చు కానీ ప్రజలు ఎట్లా మరచిపోతారు? అంతగా పొగిడి ఇప్పుడు కేవలం ప్రచారంపైన ఆధారపడిన ప్రధాని అనీ, పని బొత్తిగా చేయడం లేదనీ విమర్శిస్తే నప్పుతుందా? కర్ణాటకలో పార్టీ ఫిరాయింపులను బీజేపీ ప్రోత్సహించడాన్ని ప్రస్తావిస్తూ, ఎంఎల్‌ఏలను పశువులను కొన్నట్టు కొనుగోలు చేస్తున్నారనీ, మోదీ తగిన మూల్యం చెల్లించుకోవాలనీ చంద్రబాబు గర్జించారు. తన పనుపున తెలంగాణ ఎంఎల్‌ఏ ఎల్విస్ స్టీఫెన్సన్‌కు అప్పటి టీడీపీ ఎంఎల్‌ఏ రేవంత్‌రెడ్డి రూ. 50 లక్షల నగదు చెల్లిస్తూ కెమేరాకు చిక్కిన ఉదంతం ఫలితంగా పదేళ్ళు ఉండవలసిన హైదరాబాద్ నగరం నుంచి ఆకస్మికంగా నిష్క్రమించి చంద్రబాబు ప్రభుత్వ ఉద్యోగులతో సహా లేని అమరావతికి వెళ్ళవలసి వచ్చింది. అంతకు ముందు తెలంగాణలో టీడీపీ అభ్యర్థిగా గెలిచి టీఆర్ఎస్‌లో చేరి మంత్రి అయిన తలసాని శ్రీనివాసయాదవ్‌పైన ధ్వజమెత్తిన సంగతి మరచిపోయారు. అందుకే తలసాని ఇటీవల విజయవాడ, ఏలూరు వెళ్ళినప్పుడు చంద్రబాబుపై రెచ్చిపోయి విమర్శలు గుప్పించారు. 'ఓటుకు కోట్లు' కేసుతో గుణపాఠం నేర్చుకున్నా టీడీపీ అధినేత పరువు కృష్ణాలో కలిసేది కాదు. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యేలు 23 మందిని అడ్డగోలుగా, పశువుల కంటే హీనంగా కొనుగోలు చేశారు. రవ్వంత సంకోచం కానీ, పిసరంత బిడియం కానీ లేకుండా పార్టీ ఫిరాయించిన నలుగురికి మంత్రి పదవులు కూడా కట్టబెట్టారు. ఫిరాయింపుల చట్టాన్ని తుంగలో తొక్కి, పంచాయితీలను నిర్వీర్యం చేసి, స్థానిక సంస్థల అధికారాలన్నింటినీ అస్మదీయులతో నిండిన జన్మభూమి కమిటీలకు అక్రమంగా అప్పగించిన చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు ఉద్యమించాలంటూ పిలుపునిస్తే ఇదేం బూటకమంటూ ఆంధ్రప్రదేశ్ ప్రజలు నవ్వుకోరా? 'నన్ను మించిన నటుడు చంద్రబాబు,' అంటూ జీవిత చరమాంకంలో గుండె పగిలి ఎన్టీఆర్ చేసిన వ్యాఖ్యలను జనం గుర్తు చేసుకోరా? పెద్దనోట్లు రద్దు చేయాలని మోదీకి సలహా ఇచ్చింది తానేనంటూ గొప్పగా చెప్పుకున్న ముఖ్యమంత్రే అది ఘోరమైన తప్పిదమంటూ నిందించారు. ఒక ప్రధాని లేదా ఒక ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాలు బెడిసికొట్టిన సందర్భాలు అనేకం ఉంటాయి. నిజాయితీపరుడైన నాయకుడైనా, విమర్శకుడైనా, సంపాదకుడైనా ఏమి చేయాలి? సదరు చర్య సత్ఫలితాలు ఇస్తుందని తాము కూడా ఆశించామనీ, అందుకే మొదట్లో స్వాగతించామనీ, అమలు క్రమంలో అది ఆర్థిక వ్యవస్థకు హానికరంగా పరిణమించిందనీ చెప్పాలి. తప్పు ఒప్పుకోవాలి. అంతటి నిజాయితీ ఎక్కడుంది? అటువంటి విలువలు ఎక్కడున్నాయి? గుడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ (జీఎస్‌టీ) విషయంలోనూ ఇదే అవకాశవాద ధోరణి. జీఎస్‌టీని ప్రవేశపెట్టినప్పుడు స్వాగతించి ఎన్‌డీఏ నుంచి నిష్క్రమించిన తర్వాత అదే పనిగా విమర్శించడం సీనియర్ రాజకీయ నాయకుడికి శోభనిస్తుందా? అక్షరం బలి కోరుతుందని ప్రముఖ కవి అజంతా తరచూ అనేవారు. తన అనుభవానికీ, వయస్సుకీ, హోదాకీ తగినట్టు ఆచితూచి మాట్లాడితే చంద్రబాబు మరింత నవ్వులపాలు కాకుండా మర్యాద కాపాడుకుంటారు. వైఖరి మార్చుకోవాలో లేక ఇదే విధంగా ముందుకు సాగిపోవాలో నిర్ణయించుకోవలసింది ఆయనే.

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

దొంగల దంగల్



"కోల్‌కతాలో విపక్షాలు భారీ ర్యాలీ తలపెట్టాయి. పాములు, తేళ్లు, జెర్రులు బ్రిగేడ్ పెరేడ్ గ్రౌండ్‌లో కలిసి రావణ వధకు సిద్ధమవుతున్నాయి. నిజమే రావణ వధ జరగాల్సిందే. ఎందుకంటే, ఆధునిక రావణుడు అన్ని హద్దులూ దాటేశాడు. కానీ, వీళ్లందరూ కలిసి చేసేదేంటి? వీళ్లంతా దొంగలు, దోపిడీదారులు, మోసగాళ్లు, నీచులు, మాయగాళ్లు. గ్యాంగ్‌స్టర్లు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే ప్రణాళిక ఏమైనా వీళ్లదగ్గర ఉందా?"

– మార్కండేయ కట్జూ, మాజీ చీఫ్ జస్టిస్

ప.గో. ఎన్టీఆర్



"లక్ష్మీస్ ఎన్టీఆర్ సినిమాలో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నందమూరి తారక రామారావుగా పశ్చిమ గోదావరికి చెందిన నాటక కళాకారుడు నటించారు. ఎన్టీఆర్ శరీర కదలికలు, నడవడిక, ప్రవర్తన, మాటతీరు విషయంలో అతడికి కొన్ని నెలలపాటు శిక్షణ ఇప్పించా"

– రామ్ గోపాల్ వర్మ, దర్శకుడు

మహాత్మ



"హేట్ హఠావో' యాప్‌ను మహాత్ముడి అమరత్వం రోజైన ఈనెల 30న నెటిజెన్స్ ఫర్ డెమొక్రసీ కార్యకర్తలు విడుదల చేయబోతున్నారు. మంచి ఆలోచన. ఈ కాలంలో గాంధీ మహాత్ముడు ఉంటే ఆయన్ను జాతి వ్యతిరేకిగా చిత్రించి ట్రోల్ చేసేవారు"

– రాజ్‌దీప్ సర్దేశాయ్
సీనియర్ పాత్రికేయుడు

మనుగడ



"కశ్మీరీ పండిట్లను ఉగ్రవాదులు బెదిరించి రాష్ట్రం నుంచి వెళ్లగొట్టి 29 ఏళ్లవుతోంది. తిరిగి వారిని స్వస్థలానికి తీసుకొచ్చే ప్రక్రియ ఎప్పటికైనా ప్రారంభమవుతుందని నా ప్రగాఢమైన ఆశ. అప్పటివరకూ కశ్మీర్‌కు సంపూర్ణత సిద్ధించదు. అది ప్రశాంతంగా మనుగడ సాగించలేదు"

– ఒమర్ అబ్దుల్లా
జమ్మూ–కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి

స్మృతి సిద్ధాంతం



"తప్పుడు కేసులు పెట్టడం, బెయిల్ నిరాకరించడం, కటకటాల్లో బంధించడం, ప్రతిపక్షాల నోరుమూయించడమే కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ సిద్ధాంతం. ప్రజాస్వామ్యమా వర్ధిల్లు. 'బెయిల్ అనేది చట్ట నిబంధన అనీ, జైలు అనేది మినహాయింపని' ఆరోపణలు చేసే గౌరవనీయురాలైన ఆ మహిళామణికి తెలుసా?"

– పి.చిదంబరం, కేంద్ర మాజీ మంత్రి

మైక్ పెన్స్ అవాక్కులు

అతని కంటె ఘనుడు ఆచంట మల్లన్న' అన్నట్టు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రివాజుగా మాట్లాడే మాటలు విని విస్మయపడే జనానికి ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ కూడా అప్పుడప్పుడు షాక్‌లిస్తున్నారు. శనివారం వాషింగ్టన్‌లో జరిగిన అబార్షన్ వ్యతిరేక ర్యాలీకి హాజరైన పెన్స్ ట్రంప్‌ను, ఆయన తీసుకుంటున్న చర్యలను మైమరిచి కీర్తించారు. అబార్షన్ కేసుల సంగతి తేల్చడానికి అప్పిలేట్ కోర్టుల్లో జడ్జీలుగా సంప్రదాయవాదుల్ని నియమించడం, అబార్షన్‌లకు తోడ్పడే విదేశీ స్వచ్ఛంద సంస్థలకు అమెరికా నుంచి విరాళాలు అందకుండా నిషేధం విధించే చట్టాన్ని తిరిగి ప్రవేశపెట్టడం వంటి నిర్ణయాలు తీసుకున్న ఘనత ట్రంప్‌కే దక్కుతుందని కొనియాడారు. న్యాయమూర్తుల నియామకానికి అబార్షన్ల వ్యతిరేకత కొలబద్దా అని అందరూ ఆశ్చర్యపోయారు. ఇదే సభలో వీడియో సందేశమిచ్చిన ట్రంప్, డెమొక్రాట్ల ఆధిక్యత ఉన్న సభలో అబార్షన్లకు అనుకూలంగా ఉండే చట్టాలు తీసుకురావడానికి ప్రయత్నిస్తే ఊరుకోబోనన్నారు. దేవుడిచ్చిన జీవితాన్ని తుంచడానికి ఎవరికీ అధికారం లేదని కూడా చెప్పారు. 1973లో అమెరికా సుప్రీంకోర్టు అబార్షన్ చట్టవిరుద్ధం కాదని తీర్పునిచ్చిన మరుసటి ఏడాది నుంచి 'మార్చ్ ఫర్ లైఫ్' పేరిట దేశమంతటా జనవరి 19న అబార్షన్ వ్యతిరేక ర్యాలీని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

రెండు తెలుగు రాష్ట్రాలు వనరుల పంపకంలో పరస్పరం ప్రయోజనాలు పొందవలసిన నేపథ్యంలో ఫెడరల్ ఫ్రంట్‌లో భాగంగా ఇరువైపులా ఇప్పుడున్న యువ నాయకత్వాల–కేటీఆర్, వైఎస్సార్– కలయిక, దీర్ఘకాలంలో రాష్ట్ర ప్రయోజనాలకు మేలుచేసేది గానే ఉంటుంది. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు.. ప్రాంతాల మధ్య, కాలాతీతంగా సుహృద్భావ వాతావరణం ఏర్పడ్డానికి ఆస్కారం కలిగించింది. సోదర తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి సంక్షేమ రంగాల్లో ఇప్పటికే జరిపిన అపారమైన మేధోమథనం, ప్రాధమ్యాల ఎంపిక, వాటి ద్వారా టీఆర్ఎస్ ఆ రాష్ట్రంలో పొందుతున్న ప్రతిఫలనాల విలువను, ఏపీ ప్రజానీకం ఇప్పటికైనా గ్రహించడం అవసరం. వీరిద్దరి కలయిక తెలుగు సమాజాలకు గెలుపు సందర్భం కావాలి.

ఈ కలయిక విస్తృత ప్రయోజనాలకు నాంది

సందర్భం



జాన్‌సన్ చోరగుడి

తెలుగు ప్రజలంతా సంక్రాంతి సంతోషాల్లో ఉండగా జరిగిన ఒక రాజకీయ సంఘటన, మున్ముందు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ప్రాంతాల మధ్య, కాలాతీతంగా సుహృద్భావ వాతావరణం ఏర్పడ్డానికి ఆస్కారం కలిగించింది. స్వల్పకాలిక రాజకీయ ప్రయోజనాలు లక్ష్యంగా, చిన్నగా మొదలయ్యేవి – చరిత్రలో కీలక మలుపులు కావడం మనకు కూడా కొత్తకాదు! తెలంగాణ రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. తారక రామారావు, ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి, తన తండ్రి కేసీఆర్ ప్రతిపాదించిన ఫెడరల్ ఫ్రంట్‌లో చేరమని కోరడం–ఇప్పుడు అటువంటిదే కానుంది. రెండు తెలుగు రాష్ట్రాలు, రెండు కొత్త ప్రాంతీయ పార్టీలు, ఇద్దరు యువనాయకుల ఈ కలయిక సన్నివేశం; ఇరువైపుల ఉన్న తెలుగు సమాజాలకు 'విన్–విన్ సిచ్యుయేషన్' కావాలి.

తెలంగాణ ఉద్యమం అంచెలంచెలుగా అరవైల నుంచి పలు విరామాల మధ్య పొరలు పొరలుగా రాజకీయ ఉపరితలం మీదికి వస్తూ 2010 నాటికి విస్మరించడానికి వీలులేని స్థాయికి చేరింది. అయితే, ఏనాటికైనా, ఏ కారణంతోనైనా రాష్ట్రం రెండయితే కలిగే తదనంతర పరిణామాలను భరించవలసిన– ఆంధ్ర రాయలసీమ ఉత్తరాంధ్ర ప్రాంతాలు; దాన్ని ఎదుర్కోవడానికి ఎటువంటి ముందస్తు కసరత్తూ చేయలేదు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ కూడా 2010 తర్వాత ఇక్కడ ఏర్పడిన రాజకీయ బలహీన స్థితిని, అధిగమించలేకపోయింది. తెలంగాణ ఉద్యమ నాయకత్వం దాన్ని అనుకూలంగా మల్చుకోవడంతో 2014 జూన్ 2న రాష్ట్ర విభజన జరిగింది.

2019 ఎన్నికల ముందు రెండు రాష్ట్రాల్లో పరిస్థితి ఇలా ఉంది. విభజనను ఎదుర్కోవడానికి 'సమైక్య ఆంధ్ర ఉద్యమం' నడపడం ఒక్కటే పరిష్కారం అని నమ్మిన ఆంధ్రప్రదేశ్ ఒక వైపు, ఉద్యమ విజయాన్ని, మరోసారి ఎన్నికల్లో తనకు అనుకూలంగా మలచుకున్న తెలంగాణ మరొకవైపు ఉన్నాయి. అయితే, ఆంధ్రప్రదేశ్‌లో అప్పట్లో ఈ సమైక్య ఆంధ్ర ఉద్యమాన్ని నడిపించిన ఉద్యోగ సంఘ నాయకులు కాలక్రమంలో విశ్వసనీయత కోల్పోగా, 2019కి గాను తెలంగాణలో, మరో ఐదేళ్ళు మీరే అధికారంలో ఉండమని టీఆర్ఎస్‌కు అనుకూలంగా అక్కడి ప్రజలు తీర్పు ఇచ్చారు.

అయితే సమైక్య ఆంధ్ర ఉద్యమ నాయకులు గడచిన నాలుగున్నర ఏళ్లలో – అప్పట్లో ఎందుకు తాము విభజనను వ్యతిరేకించామని ఒక డాక్యుమెంట్‌నూ



విడుదల చేయలేకపోయారు. కనీసం ఇప్పుడైనా ఏపీ ప్రజలకోసం, తమ ప్రాంతం కోసం ప్రభుత్వం, రాజకీయ పార్టీలు ఏమి చేయాలి అనే దిశలో పౌర సమాజాలను కలుపుకుని, ప్రాంతీయ సమావేశాలను నిర్వహించలేక పోయారు. పోనీ దానివల్ల ప్రయోజనం లేదనుకుంటే, విభజన చట్టం అమలు మీద నిరంతర నిఘాతో దాన్ని సమీక్షిస్తూ రాజకీయాలకు ప్రభుత్వాలకు సమాంతరంగా ఒక ఒత్తిడి బృందాన్ని ('ప్రెషర్ గ్రూప్') నిర్మించలేకపోయారు. ఈ పరిస్థితికి భిన్నంగా తెలంగాణ ప్రభుత్వంలో ఉన్న టీఆర్ఎస్ విభజన లక్ష్యంగా ఒక దశాబ్ద కాలంపైగా ప్రజలు, ప్రాంతం, ప్రభుత్వం.. అనే కోణం నుంచి విస్తృతమైన మేధోమథనం చేసి ఉంది. అలాంటిది ఇటు ఆంధ్రవైపు ఉద్యమకాలంలో జరగలేదు.

రెండు ప్రాంతాల ప్రభుత్వాల మధ్య తేడా విభజన జరిగిన మొదటి ఏడాదే స్పష్టమైంది. తెలంగాణా వెంటనే మరో పది కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. విడిపోతే బాగుపడతాం అనే తమ పాత సూత్రాన్ని వాళ్ళు సూక్ష్మ స్థాయి వరకు తీసుకు వెళ్ళారు. నైసర్గిక ప్రదేశం అంటే కేవలం భూమి మాత్రమే కాదు, 'భూమి' కేంద్రంగా దాని చుట్టూ 'పొలిటికల్ పవర్' కూడా ఉంటుంది. అది తెలంగాణలో వారి నాయకుడికి తెలిసినట్టుగా బహుశ ఇంకెవ్వరికీ తెలియకపోవచ్చు. మొన్నటి ఎన్నికల విజయంలో తాయిలాలు గెలిపించాయని అంటున్న వారు అంతర్లీనమైన ఈ అంశాన్ని గుర్తించలేదు! అసంఖ్యాకంగా ఉన్న తెలంగాణ ఉత్పత్తి కులాలు ఇప్పుడు ఈ కొత్త జిల్లాల కారణంగా స్థానిక సంస్థల రాజకీయ అధికార ఫలాలకు చేరువ అవుతారు. టీఆర్ఎస్ అక్కడితో ఆగకుండా ప్రజల సాంస్కృతిక మూలాల మూలుగుల్లోకి చొచ్చుకుని వెళ్ళింది.

విభజన కోసం ఇంత పని ఇప్పటికే పూర్తిచేసి, ఇక రాష్ట్రం కోసం ఇప్పుడు చేయవలసింది ఏమిటి అనే విషయంలో కూడా టీఆర్ఎస్ ప్రభుత్వానికి ఒక 'రోడ్ మ్యాప్' ఉంది. కేసీఆర్ ఎన్నికల ఫలితాల తర్వాత జరిగిన పత్రికా సమావేశంలో రాజ్యాంగపరమైన అంశాలను ప్రస్తావిస్తూ–కేంద్ర రాష్ట్ర జాబితాలు, ఉమ్మడి జాబితాల ప్రస్తావన లేవనెత్తారు. దాంతో ఇప్పుడు మూడవ ప్రత్యామ్నాయం లేదా ఫెడరల్ ఫ్రంట్ వంటి ప్రకటనలు చేస్తున్నచాలా మంది సీనియర్ సీఎంలకంటే, కేసీఆర్ ఇందుకోసం ఎక్కువ 'హోంవర్క్' చేసినట్టుగా స్పష్టమైంది.

రెండు తెలుగు రాష్ట్రాలు వనరుల పంపకంలో పరస్పరం ప్రయోజనాలు పొందవలసిన పరిస్థితుల్లో ఇరువైపులా ఇప్పుడున్న యువ నాయకత్వాల కలయిక, దీర్ఘకాలంలో రాష్ట్ర ప్రయోజనాలకు మేలుచేసేది గానే ఉంటుంది. సోదర తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి సంక్షేమ రంగాల్లో ఇప్పటికే జరిపిన అపారమైన మేధోమథనం, ప్రాధమ్యాల ఎంపిక, వాటి ద్వారా టీఆర్ఎస్ ఆ రాష్ట్రంలో పొందుతున్న ప్రతిఫలనాల విలువను, ఏపీ ప్రజానీకం ఇప్పటికైనా గ్రహించడం అవసరం. అయినా తాము ప్రతిపాదిస్తున్న 'ఫెడరల్ ఫ్రంట్'తో కలిసివచ్చే వారిని కూడగట్టుకోవడంలో భాగంగా టీఆర్ఎస్ తనకు తానే ఆంధ్రప్రదేశ్ లోని ప్రధాన రాజకీయ పార్టీల సహకారం కోరితే, అందుకోసం వాళ్ళు వచ్చి ఇక్కడి ప్రతిపక్ష నాయకుణ్ణి కలిస్తే, దాన్ని ఇక్కడి పౌర సమాజం ఎలా చూడాలి? రాజకీయంగా మాత్రం చూడవలసిన పనిలేదు. రాజకీయ పార్టీలు ఎటువంటి నిర్ణయాలు తీసుకున్నప్పటికీ, వాటిలో–ప్రజలు ప్రాంతం వాటి ప్రయోజనాలు ఏమిటి అనే దృష్టి కోణం నుంచి, పౌరసమాజం కొంచెం కూడా పక్కకు జరగాల్సిన పని లేదు. ఉద్యమ కాలంలో దాని నిర్మాత, నాయకుడు కేసీఆర్‌కు సలహా సంప్రదింపులకోసం విస్తృత శ్రేణిలో ఆలోచనాపరులు, నిపుణులతో ఒక 'థింక్ ట్యాంక్' ఇప్పటికే ఏర్పడి ఉంది. దాని సేవలు, అవసరం అయినప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు కూడా ఇక్కడి ప్రజల మేలుకోసం వాటిని వినియోగించుకోవచ్చు. ఎందుకంటే, ఇప్పటివరకు ఇక్కడ అంటే ఏపీలో అటువంటివి నామమాత్రంగా కూడా మనకు లేవు అన్నది గుర్తించి తీరాలి.

వ్యాసకర్త అభివృద్ధి–సామాజిక విశ్లేషకులు



నా లైన్ నాదే. నా లైఫ్ నాదే.
'ఇండస్ట్రీలో అలా ఉంటుంది కదా..
ఇలా ఉంటుంది కదా' అంటే..
ఎలాగున్నా..
మనం మనలా ఉండగలిగితే
మన వరకు ఇబ్బందులు రావు.
అంటే.. మనల్ని మనం ప్రొటెక్ట్ చేసుకోగలగాలి.
అందరికీ అది చేత కాకపోవచ్చు.
నా వరకైతే, నేనే రాణి. నేనే మంత్రి!
అంటున్న కాజల్ అగర్వాల్‌తో సాక్షి ఎక్స్‌క్లూజివ్..

కాజల్ అగర్వాల్

నేనే రాణి.. నేనే మంత్రి

■ **చాలా సన్నగా అయిపోయారు. ఏం చేశారేంటి?**

కాజల్: అవునా? చూడ్డానికి సన్నగా కనిపిస్తున్నానేమో కానీ యాక్చువల్లీ నేను బరువు పెరిగాను. విచిత్రంగా చాలామంది నన్ను సన్నగా అయ్యారేంటి? అని అడుగుతున్నారు.

■ **ఇంతకీ ఎంత పెరిగారు? తగ్గాలనుకుంటున్నారా?**

ఇంతకుముందు 54 ఉండేదాన్ని.. 3 కిలోలు పెరిగినట్టున్నా. అయితే తగ్గాలని మాత్రం అనుకోవడంలేదు. ఎందుకంటే కంఫర్ట్‌బుల్‌గానే ఉన్నాను (నవ్వుతూ).

■ **గతంలో వంద సూర్య నమస్కారాలు చేసేవారు? ఇప్పుడూ చేస్తున్నారా?**

లేదు. దిష్టి తగిలినట్టుంది (నవ్వుతూ). మళ్లీ స్టార్ట్ చేస్తాను.

■ **హీరోయిన్ అయి పదేళ్లవుతోంది? ఈ టెన్ ఇయర్స్ జర్నీ ఎలా అనిపిస్తోంది?**

చాలా బాగుంది. పదేళ్లు గడిచాయి అని మాత్రం అనిపించడం లేదు. గ్రేట్ రన్. నేను చాలా 'బ్లెస్డ్' అనుకుంటున్నాను. ఎందుకంటే ఇక్కడ నాకు ఇంత ప్రేమ దొరుకుతుందని అనుకోలేదు. నన్ను తెలుగమ్మాయిగా స్వీకరించిన నా ఫ్యాన్స్‌కు కృతజ్ఞతలు. అఫ్‌కోర్స్ అవకాశం ఇచ్చిన దర్శక–నిర్మాతలను మరచిపోకూడదు.

■ **ఈ పదేళ్లలో ఎప్పుడైనా బ్రేక్ వస్తుందని భయపడిన సందర్భాలున్నాయా?**

ఆ భయం ఎప్పుడూ కలగలేదు. ఎందుకంటే ఒక సినిమా కంప్లీట్ అయ్యేసరికి ఇంకో సినిమా చేతిలో ఉండేది. ఒక్కోసారి రెండు మూడు సినిమాలు ఉండేవి. అయితే రెండే రెండు సార్లు బ్రేక్ వచ్చింది. అవి కూడా నా అంతట నేను తీసుకున్నవి. నా చెల్లెలు నిషా పెళ్లి కోసం ఒక బ్రేక్ తీసుకున్నాను. అక్కగా అన్నీ దగ్గరుండి చేయాలి కాబట్టి నెల రోజులు షూటింగ్స్‌కి ఎటెండ్ కాలేదు. ఆ తర్వాత 2018 స్టార్టింగ్‌లో ఆరోగ్యం బాగాలేక మూడు నెలలు ఇంటిపట్టున ఉన్నాను.

■ **పదేళ్లు కంటిన్యూస్‌గా పని చేసి, ఏదో అలా రిలాక్స్ అవ్వడానికి కొన్ని రోజులంటే ఓకే. ఏకంగా మూడు నెలలంటే బోరింగ్‌గా అనిపించిందా?**



బోర్ సంగతి పక్కన పెడితే ప్రతి రోజూ జ్వరంతో ఒళ్లు కాలిపోయేది. 'హెల్త్ ఈజ్ వెల్త్' అంటారు కదా. ఆరోగ్యంగా ఉండటం లైఫ్‌లో అన్నింటికన్నా ముఖ్యం. అందుకే ఫుల్‌గా రిలాక్స్ అవ్వాలని ఏ టెన్షన్నూ పెట్టుకోలేదు. ఈ మూడు నెలలు 'ఆటో ఇమ్యూన్ డిజార్డర్'తో బాధపడ్డా.

■ **మూడు నెలలూ మీవాళ్లు మిమ్మల్ని కంటికి రెప్పలా కాపాడుకుని ఉంటారు...**

మా అమ్మానాన్నలకు పిల్లలంటే చాలా శ్రద్ధ. నేను సినిమాల్లోకి వచ్చాక నాతో పాటే ఉంటూ, నాక్కావాల్సినవన్నీ సమకూర్చేవారు. అమ్మ అయితే స్వయంగా వంట చేసి పెట్టేది. ఇప్పుడు అమ్మని షూటింగ్ స్పాట్‌కి రావద్దని నేనే చెప్పేశాను. ఎందుకంటే ఇంకా ఎంతకాలం నాకోసం కష్టపడతారు. ఇది విశ్రాంతి తీసుకునే వయసు కదా. అమ్మ నాతో రావడంలేదు కాబట్టి నేను హోమ్ ఫుడ్‌ని చాలా మిస్సవుతున్నాను. అందుకే ఇంట్లో ఉన్న ఆ 3 నెలలూ మా అమ్మమ్మ, అమ్మ నెయ్యి విపరీతంగా దట్టించి, పరాటాలు చేసి పెట్టేశారు. పంజాబీ ఇల్లంటే స్వీట్లు, నెయ్యి, పన్నీర్ పుల్లుగా ఉంటాయి. అందుకే కాస్త బరువు పెరిగాను.

■ **ఇండస్ట్రీకి వచ్చి పదేళ్లయింది కాబట్టి బోలెడంత మంది ఫ్రెండ్స్, పార్టీలు కామన్. కానీ మీరు పార్టీల్లో పెద్దగా కనిపించరెందుకని?**

నా ఫ్రెండ్స్‌తో పార్టీ చేసుకుంటాను. వాళ్లంతా ముంబైలో ఉంటారు. ఇండస్ట్రీలో కూడా ఏదైనా పార్టీ ఉంటే ఫార్మాలిటీగా అటెండ్ అవుతాను. పర్సనల్, ప్రొఫెషనల్ జీవితాన్ని మిక్స్ చేయకూడదని అనుకుంటాను. నా చైల్డ్ హుడ్ ఫ్రెండ్స్‌తో కంఫర్ట్‌బుల్‌గా ఉంటుంది. స్విచ్చాన్ స్విచ్చాఫ్ బటన్‌లాగా. వర్క్ అప్పుడు పార్టీలు చేసుకోలేను. ఎందుకంటే మళ్లీ మరుసటి రోజు నిద్ర లేవాలి. జిమ్‌కి వెళ్లాలి. షూట్‌కి వెళ్లాలి. ఇన్ని పనులు చేశాక ఎప్పుడెప్పుడు ముసుగు తన్నేద్దామా అనిపిస్తుంటుంది. ఇక పార్టీ అనే ఆలోచన ఉంటుందా? టీవీ చూస్తుంటాను. ఇంట్లో వాళ్లతో ఫోన్‌లో మాట్లాడతాను.

● **కెరీర్‌ని సొంతంగా బిల్డ్ చేసుకోగలగడం ఎలా అనిపిస్తోంది?**
సినిమా ఇండస్ట్రీలో ఎలాంటి బ్యాగ్రౌండ్ లేదు. 'మీరు సెల్ఫ్ మేడ్' అని నాతో కొందరు అంటుంటారు. అది కరెక్టే అయినా నా ఫ్యామిలీ సపోర్ట్ నాకెప్పుడూ ఉంది. హార్డ్‌వర్క్, లేట్‌నైట్ షూట్స్ అన్నీ నావైనా కూడా వాళ్ల సపోర్టే కీలకం అంటాను నేను. ఎందుకంటే నా వెనకాల నా ఫ్యామిలీ ఉందనే భరోసానే నేను పదేళ్లు కొనసాగేలా చేయడంతో పాటు ఇంకా ముందుకెళ్లాలనే నమ్మకాన్ని కలిగించింది.

■ **అయితే జనరల్‌గా మీ రోజు ఎలా మొదలవుతుంది?**

ఉదయం ఐదు గంటలకు నిద్రలేస్తాను. అలారంతో పని లేదు. కొన్నేళ్లుగా ఐదింటికి నిద్రలేస్తున్నాను కాబట్టి శరీరం అలవాటు పడిపోయింది. అయితే షూటింగ్స్ లేనప్పుడు ఎక్కువసేపు నిద్రపోతా. రాత్రి నిద్రపోవడానికి దాదాపు పదకొండు అవుతుంది. 5 టు 11 వర్కవుట్స్, షూటింగులు. షూటింగులు లేకపోతే వేరే పనులు.. అలా బిజీబిజీ.

■ **ఈ మధ్య కొందరు హీరోయిన్లు పెళ్లి చేసుకున్న నేపథ్యంలో 'ఇది పెళ్లిళ్ల సీజన్. నాకూ పెళ్లి చేసుకోవాలని ఉంది' అని ఓ సందర్భంలో అన్నారు. మరి పెళ్లెప్పుడు?**

ఏదో సరదాగా జోక్ చేశాను. అంతేకానీ ఇప్పటికిప్పుడు పెళ్లి చేసుకుని సెటిల్ అవ్వాలని లేదు.

■ **లవ్ మ్యారేజా? అరేంజ్డ్ మ్యారేజా?**

లవ్ అంటే లవ్ అనలేను. నచ్చిన అబ్బాయి దొరికితే ఓకే. లేకపోతే అరేంజ్డ్ మ్యారేజ్ చేసుకుంటా. ఇండస్ట్రీ వ్యక్తిని పెళ్లి చేసుకోవాలనుకోవడంలేదు.

■ **ఇండస్ట్రీలో వాళ్లను చేసుకోకూడదని ఎందుకు అనుకుంటున్నారు?**

అలా అని కాదు. ఒకవేళ ఎవరైనా నచ్చితే తప్పకుండా చేసుకుంటా. ఇండస్ట్రీలో అందరూ నాకు తెలుసు. అందరూ చాలా ఫ్రెండ్లీగా ఉంటారు. వాళ్లలో నాకు లైఫ్ పార్టనర్ కనిపించలేదు. అందుకే ఇండస్ట్రీ నుంచి ఎవర్నీ పెళ్లాడను అన్నాను.

■ **ఇండస్ట్రీలోకి అడుగుపెట్టబోయే ముందు ఇది సాధించాలి, అది సాధించాలి అని పెట్టుకున్న లిస్ట్ అంతా ఫినిష్ చేసేశారా?**

రాసుకున్న లిస్ట్ అంటూ ఏదీ లేదు. మైండ్‌లోనే క్వాలిటీ సినిమాలు చేయాలనుకున్నాను. కెరీర్‌లో చెప్పుకోవడానికి ఓ 5 సినిమాలుంటే చాలనుకున్నా. ఆ సినిమాల గురించి ఎప్పుడు అనుకున్నా గర్వంగా అనిపించాలి. 'మగధీర, నేనే రాజు నేనే మంత్రి, మిస్టర్ పర్ఫెక్ట్, వివేగమ్ (తమిళం), అ!' సినిమాలు నాకు బాగా ఇష్టం. 'అ!'లో నాది చిన్న రోల్ కానీ చాలా ఇంపాక్ట్ ఉంటుంది. ఇప్పుడు తేజాగారితో ఓ సినిమా చేస్తున్నాను. అందులో నాది అద్భుతమైన పాత్ర. నేను గర్వంగా చెప్పుకునే సినిమాలలో ఇది కూడా ఉంటుంది.

■ **హిస్టారికల్ సినిమాలో నటించాలనుందా? ఉంటే.. ఎలాంటి పాత్ర?**

ఇండియన్ హిస్టరీ గురించి తెలుసుకోవాల్సింది చాలా ఉంది. నాకు ఝాన్సీ లక్ష్మీ భాయ్ అంటే ఇష్టం. ఆమె భయం లేని గుణం, ఆత్మవిశ్వాసం గురించి మనందరం చదువుకున్నాం. స్క్రీన్ మీద ఆవిడ పాత్ర చేయాలని ఉంది.

■ **ఝాన్సీ లక్ష్మీభాయ్ లక్షణాల్లో మీకున్నవి?**

ఆవిడ అంత ధైర్యం లేకపోయినా కొంతవరకూ ధైర్యవంతురాలినే. కొన్నిసార్లు లక్ష్మీభాయ్ అవ్వాల్సి వస్తుంది కూడా. ఇక ఆ సమయంలో చుట్టు పక్కలవారి గురించి, పరిసరాల గురించి పట్టించుకోను కూడా. కొన్నిసార్లు సౌమ్యంగా, కొన్నిసార్లు సింహంలా, కాళీ మాతలా మారాల్సి ఉంటుంది.

■ **కాళీలా మారిన సందర్భం ఏదైనా గుర్తుందా?**

మా ఫ్రెండ్‌తో ఒక అబ్బాయి తప్పుగా ప్రవర్తించాడని రోడ్డు మీద కాలర్ పట్టుకుని ముఖం వాచిపోయేలా కొట్టాను. అది ప్లస్ టు చదువుతున్నప్పుడు అనుకుంటా. మేం ఉండే ఏరియాలో రాత్రి ఎనిమిదింటికి ఫ్రెండ్స్ అందరం సరదాగా మాట్లాడుకుంటూ ఉండగా, ఎవరో గుర్తు తెలియని వ్యక్తి నా ఫ్రెండ్‌తో తప్పుగా ప్రవర్తించాడు. అప్పుడు మా గ్యాంగ్‌లో ఒక అబ్బాయి కూడా ఉన్నాడు. వాడు పారిపోయాడు. నాకు చాలా చిరాకు, కోపం వచ్చేశాయి. ఆకతాయి ఒంటి మీద ఒక్కటిచ్చి కళ్లు కనిపించడం లేదా? అన్నాను. ఆ తర్వాత ఇంటికెళితే మా నాన్నగారు అలా కొట్టకూడదు అన్నారు.

■ **సినిమాల్లోకి వచ్చాక చేదు అనుభవాలేవైనా?**

లేవు.

■ **కానీ కొందరు హీరోయిన్లు 'క్యాస్టింగ్ కౌచ్' అంటూ తమను వేధించారని పలువురు ప్రముఖుల పేర్లు బయటపెట్టారు కదా?**

క్యాస్టింగ్ కౌచ్ అస్సలు లేదు అనను. బయటకు వచ్చి చెబుతున్న వాళ్లందరి బాధ వింటున్నాం. వాళ్లు అబద్ధాలు చెప్పరు కదా. అయితే నాకు అలాంటి అనుభవం ఏదీ లేదంటున్నాను. ప్రతి ఒక్కరి ప్రయాణం వేరే కదా. నాకు మా ఫ్యామిలీ సపోర్ట్ ఉండేది. చాలా ఏళ్లు మా అమ్మగారు నాతోనే ఉన్నారు. నావరకూ చేదు అనుభవం ఒక్కటి కూడా లేదు. అయితే నాకేం కాలేదని ఆనందపడిపోకూడదు. ఆడవాళ్లు హాయిగా పని చేసుకునే వాతావరణం ఒక్క సినిమా ఇండస్ట్రీలోనే కాదు.. అన్ని రంగాల్లోనూ ఉండాలి. ఎందుకంటే ప్రపంచంలో దారుణమైన మనుషులు అన్ని రంగాల్లోనూ ఉన్నారు. అందుకే 'నాతో పెట్టుకోవద్దు' అనే సంకేతాలను పంపిస్తా. బహుశా నా జోలికి ఎవరూ రాకపోవడానికి అది కూడా ఓ కారణం అయ్యుండొచ్చు.

● **మీరు పని చేసిన దర్శకుల్లో మీకు చాలెంజింగ్ అనిపించింది ఎవరు?**
ఒక్కళ్లు అని చెప్పలేను. ఒక్కొక్కరిదీ ఒక్కో స్టైల్. ఇంత మంది దర్శకులతో కలిసి పనిచేయడం అదృష్టం అని భావిస్తాను. చాలా నేర్చుకున్నాను. కొత్త దర్శకుడు అయినా స్టార్ డైరెక్టర్ అయినా కూడా నాకేదోటి నేర్పిస్తూనే ఉన్నారు. అది నా కెరీర్‌కు చాలా హెల్ప్ అవుతుంది.

■ **నటి తనుశ్రీ దత్తాను తీసుకుందాం.. ఎప్పుడో పదేళ్ల క్రితం జరిగిన హెరాస్‌మెంట్ ఇప్పుడు చెప్పారామె. నిజం చెప్పడానికి పదేళ్లు అవసరమా?**

ఏం చేస్తారో అని భయం. ఏ వ్యక్తికైనా కెరీర్ అంటే ఓ భయం ఉంటుంది. ఎవరైనా నష్టం చేస్తారనే భయంతో మాట్లాడలేరు.

■ **భయం లేకుండా చెప్పే ధైర్యం మీకుందా?**

ఓ. సపోజ్ నాకు ఏదైనా కాస్ట్యూమ్ ఇబ్బందిగా అనిపిస్తే చెప్పేదాన్ని. ఇది నాకు కంఫర్ట్‌బుల్‌గా ఉండదు.. వేసుకోలేను అని కరాఖండిగా చెప్పిన రోజులున్నాయి. అయితే ఇప్పుడు ఇంత అనుభవం సంపాదించుకున్న తర్వాత కాదు.. కెరీర్ స్టార్టింగ్‌లోనే అలానే ఉండేదాన్ని.

● **తమిళ్, తెలుగు రెండు భాషల్లో చేస్తున్నారు. హిందీ సినిమాలపై దృష్టి పెట్టడంలేదా?**
సౌత్‌లో నాకు ప్రాబ్లమ్ లేదు. ఎందుకంటే నేను తెలుగులో చేస్తున్న సినిమాలు తమిళంలోనూ, తమిళ సినిమాలు తెలుగులోనూ విడుదలవుతున్నాయి. అందుకే ఈ రెండు భాషల్లో ఎక్కడ సినిమా చేసినా ఇంకో భాషను మిస్సవుతున్న ఫీలింగ్ ఉండదు. నిజం చెప్పాలంటే సౌత్‌లో నాకు కావల్సినన్ని అవకాశాలు ఉన్నాయి. అందుకే హిందీ వైపు చూసే టైమ్ లేదు.

■ **అవకాశాలు తగ్గిపోతాయని భయపడలేదా?**

లేదు. అలా తెగువ చూపించడమే నన్ను సేవ్ చేసిందని భావిస్తాను. కోల్పోయేవాటి గురించి అసలు కేర్ చేయను. ఎలా రాసుందో అలా జరుగుద్ది అనుకుంటాను.

■ **ఒకవేళ అవకాశాలు కోల్పోయుంటే ధైర్యం...**

(మధ్యలో అందుకుంటూ) చాలా సినిమాలు మిస్ అయ్యాను. అవి పెద్ద పెద్ద సినిమాలు. వదులుకోవడానికి చాలా కారణాలు ఉన్నాయి. కానీ నేను సంతోషంగా ఉన్నాను. మనం తీసుకున్న చాయిస్‌ల వల్ల మనం హ్యాపీగా ఉండాలని నమ్ముతాను. వేరే వాళ్ల సంతోషం కోసం నేను బతకడంలేదు కదా.

■ **కొన్నిసార్లు పాత్ర స్వభావానికి, మీ పర్సనల్ అభిప్రాయాలకు తేడా వస్తే చేసేవారా? లేదా దర్శకుడితో డిస్కస్ చేసేవారా?**

ఈ మధ్య కాలంలో డిస్కషన్ పెట్టుకుంటున్నాను. ఎందుకంటే కెరీర్ స్టార్టింగ్‌లో క్యారెక్టర్స్ విషయంలో నాలెడ్జ్ లేదు. ఇప్పుడు ఏదైనా నచ్చకపోయినా, స్త్రీలను కొంచెం తక్కువగా, అసభ్యకరంగా చూపించడానికి ట్రై చేసినా నేను చేయనని చెప్పేస్తా. మార్చండి అని అడుగుతా. వీటిని ఎంకరేజ్ చేయను.

■ **కెమెరా యాంగిల్స్ మీద కూడా పూర్తి అవగాహన వచ్చే ఉంటుంది కదా?**

ఇప్పుడు వచ్చేసింది. కెరీర్ స్టార్టింగ్‌లో ఏం తెలుస్తుంది? ఇప్పుడు ఇబ్బందికరంగా ఉన్నా, నాకు నేను స్క్రీన్ మీద ఈ యాంగిల్‌లో బాగా కనిపించను అనిపించినా ఆ ఫ్రేమ్ మార్చండి అని అడుగుతాను.

■ **ఫైనల్లీ.. మీ పదేళ్ల కెరీర్‌ని ఒక పదంలో పెట్టమంటే?**

నేర్చుకుంటున్నాను.


– డి.జి. భవాని





చురక

డియర్ మిస్టర్ ప్లేయర్


హార్దిక్ పాండ్యా

''ఆడవాళ్లను చూడ్డం... వాళ్ల కదలికలను గమనించడం.. నాకు ఇష్టం.''

''ఒక పార్టీకి వెళ్లాం. అక్కడున్న అమ్మాయిలను చూసి ''వీళ్లలో నీ ఫ్రెండ్స్ ఎవరు? (తేరా వాలా కౌన్ కౌన్ హై)'' అని అడిగారు. నేను ఆ అమ్మాయిల దగ్గరకు వెళ్లి.. ''ఈమె.. ఈమె.. ఈమె'' అంటూ అందరినీ చూపించాను. ఎందుకంటే అందరితో ఏదో ఒకటి ఉంది నాకు. అప్పుడు మా పేరెంట్స్ ''వాహ్! ప్రౌడ్ ఆఫ్ యూ బేటా'' అన్నారు.

ఇవి కాఫీ విత్ కరణ్‌లో ప్రముఖ క్రికెటర్ హార్దిక్ పాండ్యా మాటలు. వివాదమై.. సుప్రీంకోర్ట్ దాకా వెళ్లింది వ్యవహారం.

ప్రియా మాలిక్ కూడా ఆ క్రికెట్ ప్లేయర్ మాటలపై స్పందించారు.

''అమ్మాయిలను అబ్జెక్టిఫై చేసే, చూసే పుత్రరత్నాలతో మేము ''వాహ్! ప్రౌడ్ ఆఫ్ యూ బేటా'' అని అనలేము కానీ.. అలాంటి ఆకతాయిలను జెంటిల్‌మెన్‌గా తీర్చిదిద్దుతాం. తోటి మనుషులు అమ్మాయి అయినా, అబ్బాయి అయినా.. థర్డ్ జెండర్ అయినా సరే.. వాళ్లకు గౌరవమివ్వాలని నేర్పుతాం. దయ, జాలి, కరుణ ఉండాలని చెప్తాం. డియర్ మిస్టర్ ప్లేయర్.. పవర్, పాపులారిటీతో పాటు బాధ్యతా వస్తుంది. మీలాంటి వాళ్లను యూత్ ఐకాన్స్‌గా తీసుకునే వాళ్లుంటారు. అందుకే జాగ్రత్తగా ఉండాలి. మీ షోని ఒక ఏడేళ్ల పిల్లాడు చూస్తే.. మీరన్న మాటలను వాడు ఎలా తీసుకుంటాడు? ఓహో.. ఆడవాళ్లను ఇలాగే ట్రీట్ చేయాలేమో అని అనుకోడా? అది పురుషాహంకారంగా స్థిరపడదా? వాడితోపాటే అదీ పెరిగి బలపడుతుంది. ఆడవాళ్లను చులకగా చూడ్డం, అగౌరవపరచడమే సహజమనే భావనలో ఉంటాడు. అదే ప్రవర్తనలో కనపడుతుంది. ఇది తల్లిదండ్రులకు గర్వకారణం కావద్దు'' అంటూ స్లామ్ పొయెట్రీతో హార్దిక్ పాండ్యాను చెంపదెబ్బ కొట్టినంత పనిచేసింది ప్రియా మాలిక్.


ప్రియా మాలిక్

ఎవరీ ప్రియా మాలిక్?!

ప్రియా మాలిక్ పుట్టిన ఊరు డెహ్రాడూన్. ఢిల్లీ యూనివర్శిటీలో ఇంగ్లిష్ హానర్స్ చదివారు. తర్వాత ఉన్నత చదువుల కోసం ఆస్ట్రేలియా వెళ్లారు. మిడిల్ అండ్ సెకండరీ స్కూల్ టీచర్ ట్రైనింగ్‌లో మాస్టర్స్ చేశారు. అక్కడే ''అవర్ లేడీ ఆఫ్ సేక్రెడ్ హార్ట్'' అనే స్కూల్లో టీచర్‌గా కూడా పనిచేశారు. తర్వాత ఆస్ట్రేలియాలోనే ''బిగ్ బ్రదర్'' టెలివిజన్ షోలో పాల్గొన్నారు. అందులో ఆమె రేసిజమ్నూ ఎదుర్కొన్నారు. అయినా వెనక్కి తగ్గలేదు ప్రియా. ఫైనలిస్ట్‌లో ఒకరిగా నిలిచారు. సహజంగానే ఆమె పొయెట్. సమయం దొరికినప్పుడల్లా స్లామ్ పొయెట్రీ చదువుతారు. అలా ''బిగ్ బ్రదర్'' షోలో తను ఎదుర్కొన్న రేసిజంను స్లామ్ పొయెట్రీతోనే తిప్పికొట్టారు. ఇప్పుడు హార్దిక్ పాండ్యాకూ అలాగే ఆన్సర్ ఇచ్చారు.

ఇండియా వచ్చాక నటనను వృత్తిగా స్వీకరించారు. ఇక్కడ కూడా ''బిగ్ బాస్'' సీజన్ 9 లోనూ కంటెస్టెంట్‌గా ఉన్నారు. స్లామ్ పొయెట్రీతోపాటు కామెడీ వీడియోస్‌కీ ప్రసిద్ధి ప్రియా మాలిక్. సినిమాల్లోకి కూడా ఎంట్రీ ఇచ్చారు.

– శరాది

బ్యూటిప్స్

తెల్లజుట్టు నివారణకు..

● ఉసిరిక కాయ ముక్కలను(ఎండిన వాటిని) రాత్రంతా నీటిలో నానబెట్టాలి. ఈ నీరు కేశాలకు మంచి పోషణనిస్తుంది. తలస్నానం పూర్తయిన తర్వాత చివరిగా ఈ నీటిని జుట్టు కంతటికీ పట్టేటట్లు తల మీద పోసుకోవాలి. దీని తర్వాత మరిక మామూలు నీటిని పోయకూడదు. అలాగే ఆరనివ్వాలి.



● తోటకూర ఆకులను కాడలతో సహా గ్రైండ్ చేసి రసం తీయాలి. ఈ రసాన్ని తలకు పట్టించి ఆరిన తర్వాత గాఢత తక్కువగా ఉన్న షాంపూతో కాని శీకాయ వంటి నాచురల్ ప్రొడక్ట్స్‌తో కాని తల రుద్దుకుంటే మంచిది. తోటకూర రసం జుట్టును నల్లబరచడంతోపాటు కేశాల పెరుగుదలకు, మృదుత్వానికి దోహదం చేస్తుంది.

ఈవెనింగ్ షాడోస్

కూర్చోనివ్వని సినిమా

మనుషులతో వాస్తవం నిత్యం దోబూచులాడుతూ ఉంటుంది. కళ్లకు కట్టిన గంతలు తెరిస్తే ఏం చూడాల్సి వస్తుందోనని భయం. చేదు నిజంలో కంటె, తియ్యని అబద్ధంలో జీవించడమే మనిషికి ఆనందం. అయితే ఒక చేదు నిజాన్ని విని గుండె ఆగినంత పనైంది ఆ తల్లికి! అయినప్పటికీ కుమారుడిని అర్థం చేసుకుంది. భర్తతో పోరాడింది. కొడుకుకు, భర్తకు మధ్య నలిగి పోయింది. ఈ థీమ్‌తో ఒక సంచలనాత్మక చిత్రాన్ని తెరకెక్కించారు క్వీర్ సినిమాలు (హోమో సెక్సువల్) తీయడంతో సిద్ధహస్తుడైన శ్రీధర్ రంగాయన్. ఆ చిత్రం పేరు 'ఈవెనింగ్ షాడోస్'. జనవరి 10న మెట్రో నగరాల్లోని పరిమిత థియేటర్లలో విడుదలై విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది.

అబ్బాయి ఊరి నుంచి రాగానే వివాహం చేయాలని సంకల్పించారు తల్లిదండ్రులు. పెళ్లిచూపులు ఏర్పాటు చేశారు. అబ్బాయికి విషయం చెప్పారు. అయితే ఆ అబ్బాయి.. ''అమ్మా! ఎందుకో నాకు అమ్మాయిల మీద మనసు పోవట్లేదు' అన్నాడు. తల్లి షాకయ్యింది. ఏం సమాధానం చెప్పాలో ఆమెకు అర్థం కాలేదు. 'ఈవెనింగ్ షాడోస్' చిత్రంలోని సీన్ ఇది.

ముంబైకి చెందిన ఒక యువకుడు కర్ణాటకలోని తన స్వగ్రామానికి చేరుకుంటాడు. ఇంట్లో పెళ్లిచూపులు ఏర్పాటు చేస్తారు. అమ్మాయిని చూడటానికి తనకు మనస్కరించడం లేదని, తాను ఒక అబ్బాయిని ప్రేమిస్తున్నానని, తాను 'గే' అని తల్లికి చెప్పుకుంటాడు. ఆవిడకు ఏం చేయాలో అర్థం కాదు. ఆ యువకుడి పేరు కార్తిక్ (దేవాంశ్ దోషి). మోనా అంబేగాన్‌కర్ కార్తిక్ తల్లిగా నటించారు. అనంత్ మహదేవన్, అర్పిత్ చౌదరీ, యామినీ సింగ్, అభయ్ కులకర్ణి, వీణా నాయర్, దిశా ఠాకూర్ ఇందులో నటించారు. 2018, జనవరి 11న ఈ


'ఈవెనింగ్ షాడోస్' చిత్రంలో ఓ సన్నివేశం




చిత్రాన్ని ఆస్ట్రేలియాలో ప్రదర్శించి, అవార్డులు అందుకున్నారు. చాలామంది గేలను కలిసి, వారి జీవితాల గురించి స్వయంగా తెలుసుకున్న అనుభవంతో ఈ చిత్రం తీశారు రంగయాన్. బెంగళూరు ఫిలిమ్ ఫెస్టివల్‌లో ఈ చిత్రాన్ని ప్రదర్శించినప్పుడు, చాలామంది ప్రేక్షకులు ఎంతో ఇబ్బందిపడడం గమనించారు రంగాయన్. ముఖ్యంగా మగవారు ఇబ్బంది పడటం ఆయనకు కనిపించింది. కొందరు హాలులో నుంచి బయటకు వెళ్లిపోయారు. ప్రేక్షకుల స్పందనను నేరుగా చూడటం వలన చిత్రం గురించి ప్రేక్షకుల అభిప్రాయాలను స్వయంగా తెలుసుకున్నారు రంగాయన్.

ఈ కథను రంగాయన్ 2009లో రాయడం ప్రారంభించారు. సినిమా తీయడానికి తగినంత డబ్బు దొరకడంలో ఆలస్యం జరగడంతో, ఏడు సంవత్సరాల తరవాత ఈ చిత్రాన్ని తెరకెక్కించే ప్రయత్నం ప్రారంభించారు. బాలారిష్టాలు దాటుకుని 2016లో చిత్ర నిర్మాణం ఊపందుకుంది. తియ్యడం వరకు బాగానే ఉంది కానీ, విడుదల చేయడం ఇబ్బందికరంగా మారింది. ట్రెడిషనల్ డిస్ట్రిబ్యూటర్స్ ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి ముందుకు రాలేదు. అందువల్ల ఈ చిత్రాన్ని ఇప్పుడు చాలా ప్రత్యేకంగా విడుదల చేయాలని ఆయన భావిస్తున్నారు. 200 థియేటర్లలో శుక్రవారం నాడు విడుదల చేసే పద్ధతి నుంచి బయటకు రావాలనుకుంటున్నారు. అన్ని థియేటర్లలో విడుదల చేస్తే ఎవ్వరూ వెళ్లి చూడరు. తక్కువ స్క్రీన్లు ఉన్నచోట విడుదల చేసి, ఈ సినిమాకి ఎటువంటి ఆదరణ వస్తుందో చూడాలనుకుంటున్నారు రంగాయన్.

– జయంతి

ఈ పాటకు ట్యూన్ తెలుసా?



పల్లవి: స్వర్గమే నేలపై వాలినట్టు
నింగిలోన తారలే చేతిలోకి జారినట్టు
గుండెలోన పూల వాన కురిసినట్టుగా
ఎంతో ఫన్ ఎంతో ఫన్
నెమలికే పాటలే నేర్పినట్టు
కోయిలమ్మ కొమ్మపై కూచిపూడి ఆడినట్టు
కొత్త కొత్త స్వరములే పుట్టినట్టుగా
ఎంతో ఫన్ ఎంతో ఫన్
కాళిదాసు కావ్యము త్యాగరాయ గేయము
కలిపి మనసు పాడినట్టుగా
అందమైన ఊహలు అంతులేని ఆశలు
వాకిలంత ఒంపినట్టుగా
ఎంతో ఫన్ ఎంతో ఫన్

చరణం-1: కళ్లు కళ్లూ కలుపుకుంటూ
కలలు కలలూ పంచుకుంటూ
కాలమంతా సాగిపోనీ
మోహమంతా కరిగిపోతూ
విరహమంతా విరిగిపోతూ
దూరమంతా చెరిగిపోనీ
రాతిరంత కమ్మనైన కౌగిలింత
పిలుపని తెల్లవార్లు మేలుకోవడం
ఉదయమంటే తియ్యనైన
ముద్దు మేలుకొలుపని
దొంగలాగ నిద్రపోవడం
ఎంతో ఫన్ ఎంతో ఫన్

చరణం-2: రోజుకొక్క బొట్టుబిళ్లే
లెక్కపెడుతూ చిలిపి అద్దం
కొంటె నవ్వే నవ్వుతోందే
బయటకెళ్లే వేళ నువ్వే
పిలిచి ఇచ్చే వలపు ముద్దే
ఆయువేదో పెంచుతోందే
ఇంటికెళ్లె వేళ అంటూ మల్లెపూల పరిమళం
మత్తు జల్లి గుర్తుచేయడం
ఇంటి బైట చిన్నదాన్ని ఎదురుచూపు కళ్లలో
కొత్త ఉత్సవాన్ని నింపడం
ఎంతో ఫన్ ఎంతో ఫన్

చిత్రం : ఎఫ్ 2 ; రచన : శ్రీమణి
సంగీతం, గానం : దేవిశ్రీ ప్రసాద్

కట్‌చేయ్...దాచేయ్...

కాసుకో సుడోకు

	1		5					9
9	5	2						8
	3		7	9	2			1
1				5	4		8	
	4	3				5	2	
	2		8	3				7
7			9	4	5		3	
3						1	9	4
2					8		6	

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

2	9	4	5	6	1	8	7	3
5	6	8	4	3	7	2	1	9
1	3	7	9	8	2	5	6	4
8	7	9	2	4	3	1	5	6
4	5	2	6	1	8	3	9	7
3	1	6	7	5	9	4	2	8
9	4	5	8	2	6	7	3	1
7	2	3	1	9	4	6	8	5
6	8	1	3	7	5	9	4	2

సైరా.. జాతర!


● చిరంజీవి


హైదారాబాద్ పరిసర ప్రాంతాల్లో భారీ సెట్ వేసి వారం రోజులుగా రిహార్సల్స్ చేస్తున్నారు 'సైరా: నరసింహారెడ్డి' టీమ్. ప్రస్తుతానికైతే యాక్షన్ సన్నివేశాల కోసం కాదు. ఓ సాంగ్ కోసం. స్వాతంత్య్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితం ఆధారంగా రూపొందుతున్న సినిమా 'సైరా: నరసింహారెడ్డి'. చిరంజీవి టైటిల్ రోల్ చేస్తున్నారు. సురేందర్‌రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. రేపటి నుంచి చిత్రీకరించబోయే ఈ సాంగ్‌లో చిరంజీవి, తమన్నా, జగపతిబాబు, సుదీప్ పాల్గొంటారని సమాచారం. జాతర నేపథ్యంలో సాగే ఈ సాంగ్‌ను దాదాపు వారం రోజుల పాటు చిత్రీకరిస్తారని తెలిసింది. అంతేకాదు.. వెయ్యి మంది డ్యాన్సర్లు ఈ పాటలో పాల్గొంటారట. నయనతార కథానాయికగా నటిస్తోన్న ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్, విజయ్ సేతుపతి, బ్రహ్మాజీ కీలక పాత్రలు చేస్తున్నారు. రామ్‌చరణ్ నిర్మిస్తున్న ఈ సినిమా ఈ ఏడాది ఆగస్టులో రిలీజ్ కానుందని తెలుస్తోంది.

నిను వీడను


● సందీప్ కిషన్

''మనిషి శత్రువుతో యుద్ధం చేస్తే గెలుస్తాడు.. కానీ, తన నీడతోనే యుద్ధం చేయాల్సి వస్తే ఎలా ఉంటుందో ఆలోచించండి.. అలాంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొన్న ఓ యువకుడు ఎలా బయట పడ్డాడు? ఎలా సక్సెస్ అయ్యాడు?'' అనే కథాంశంతో రూపొందుతోన్న చిత్రం 'నిను వీడని నీడను నేనే'. సందీప్ కిషన్, అన్య సింగ్ జంటగా కార్తీక్ రాజు దర్శకత్వంలో తెరకెక్కుతోంది. వెంకటాద్రి టాకీస్, విస్తా డ్రీమ్ మర్చంట్స్ పతాకాలపై దయా పన్నెం, వి.జి.సుబ్రహ్మణ్యన్ తెలుగు, తమిళ భాషల్లో నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. కార్తీక్ రాజు మాట్లాడుతూ– ''ఎమోషనల్ హారర్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోన్న చిత్రమిది. ఇప్పటి వరకు ఎవరూ టచ్ చేయని డిఫరెంట్ పాయింట్‌తో, హై టెక్నికల్ వేల్యూస్‌తో రూపొందిస్తున్నాం. సందీప్ కిషన్ తొలిసారి నటిస్తోన్న హారర్ చిత్రమిది. ఈ సినిమా ఫైనల్ షెడ్యూల్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరిస్తున్నాం'' అన్నారు. ''సినిమాను అనుకున్న ప్లానింగ్ ప్రకారం కార్తీక్ పూర్తి చేస్తున్నారు. ఫిబ్రవరిలో మా చిత్రాన్ని విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం'' అని దయా పన్నెం అన్నారు. పోసాని కృష్ణమురళి, మురళీ శర్మ, 'వెన్నెల' కిషోర్, రాహుల్ రామకృష్ణ, పూర్ణిమ భాగ్యరాజ్, ప్రగతి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: శివా చెర్రీ, సీతారాం, కిరుబాకరన్, కెమెరా: ప్రమోద్ వర్మ, సంగీతం: ఎస్.ఎస్.తమన్.

ప్రభాస్ పెళ్లి అప్పుడే


● కృష్ణంరాజు

"నటుడిగా 50 ఏళ్లు ప్రయాణం చేశాను. ఇంకా ప్రయాణం కొనసాగిస్తూనే ఉంటాను. ఎన్నో అద్భుతమైన సినిమాలు, పాత్రలు చేశాను. ఇప్పుడు కూడా అలాంటి పాత్రలే పోషించాలనుకుంటున్నాను. అలాగే రాజకీయాల్లో కూడా పార్టీ ఎలా కోరుకుంటే అలా ప్రయాణం చేస్తాను" అని నటులు కృష్ణంరాజు అన్నారు. ఇవాళ ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా కృష్ణంరాజు సినిమా, రాజకీయాలకు సంబంధించిన పలు విశేషాలను ఇలా పంచుకున్నారు..

● బర్త్‌డే ఫంక్షన్స్ అంటూ ప్రత్యేకంగా ఏం లేవు. ఫ్యాన్స్ వస్తారు. ఫ్రెండ్స్ విష్ చేస్తారు. మామూలుగానే ఉంటుంది. నటుడిగా 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సౌత్, నార్త్‌కు సంబంధించిన సెలబ్రిటీస్ అందర్నీ పిలిచి ఓ ఫంక్షన్ ఏర్పాటు చేయాలనుకుంటున్నాను. ఈ ఫంక్షన్ ఎప్పుడో చేయాలనుకున్నా కుదర్లేదు. మాతో ప్రయాణం కొనసాగిస్తున్న అభిమానులనూ సన్మానించాలనుకుంటున్నాను. త్వరలోనే ఆ వివరాలు తెలియజేస్తా.

● ఆ మధ్య కర్ణాటక ఎన్నికల్లో పార్టీ తరఫున ప్రచారం చేశాను. ఆంధ్రా ఎన్నికలు ఇంకా హీట్ ఎక్కలేదు. పార్టీ అడిగితే ప్రచారం చేస్తాను. సంక్రాంతికి మా ఊరు వెళ్లి సెలబ్రేట్ చేసుకోవాలనుకున్నాం. పార్టీ పనిమీద ఢిల్లీ వెళ్లి వచ్చాను. ఊరెళ్లడం కుదర్లేదు.

● నటుడిగా మంచి పాత్రలు ఎంపిక చేసుకోవాలి అనుకుంటున్నాను. అలా వచ్చి వెళ్లి పోయే పాత్రలు చేయాలని లేదు. మన పాత్ర కథకు, సినిమాకు కీలకంగా ఉండాలి. అందుకే పాత్రల ఎంపికలో జాగ్రత్తగా ఉంటున్నాను. ఓ 2 సినిమాలు డిస్కషన్‌లో ఉన్నాయి. త్వరలోనే ప్రకటిస్తాను.

● 'మహానటి' సినిమా చాలా ఎక్స్‌ట్రార్డినరీగా ఉంది. డైరెక్టర్ నాగీ, కెమెరామేన్ డ్యానీ అద్భుతంగా చేశారు. కీర్తీ సురేశ్‌కి అయితే ఫుల్ మార్క్స్. సావిత్రి జీవితంలో ఎత్తుపల్లాలను చూపించారు కాబట్టి బావుంది. యస్వీఆర్‌గారి బయోపిక్ చూడాలనుంది. ఆ పాత్రని ప్రకాశ్‌రాజ్ చేయగలడేమో అని అనుకుంటున్నాను.

● గోపీకృష్ణ మూవీస్ బ్యానర్ మీద ప్రభాస్‌తో ఓ లవ్‌స్టోరీ చిత్రం నిర్మిస్తున్నాం. ఆ సినిమా ఓ షెడ్యూల్ పూర్తి అయింది. అందులో ఓ కీలక పాత్ర చేస్తున్నాను. కథలు కుదిరితే కచ్చితంగా గోపీకృష్ణ మూవీస్ బ్యానర్‌పై నిర్మాణం కొనసాగిస్తాం.

● మన బిడ్డను ఐదేళ్ల వరకూ దేవుడిలా చూడాలి.. ఐదు నుంచి పద్దెనిమిదేళ్ల వరకూ సేవకుడిలా చూడాలి.. ఆ తర్వాత స్నేహితుడిలా చూడాలని మా నాన్నగారు నాకు చెబుతుండేవారు. నాకు, ప్రభాస్‌కి మధ్య అనుబంధం బావుంటుంది.

● యాక్టర్‌గా 50 ఏళ్ల నుంచి ఇండస్ట్రీలో ఉన్నాను.. ఇండస్ట్రీలో పెద్దగా మార్పులేం రాలేదు. అలానే కష్టపడుతున్నారు. అప్పటి హీరోస్ అందరం బాగానే ఉండేవాళ్లం. ఇప్పుడు యంగ్ హీరోస్ కూడా బావుంటున్నారు. మహేశ్, ఎన్టీఆర్, చరణ్ వీళ్లందర్నీ చూస్తూనే ఉన్నాం కదా. మా వాడు (ప్రభాస్) కూడా అందరితో బావుంటాడు. ప్రభాస్ పెళ్లి ఎప్పుడు? అని అందరూ నన్ను అడుగుతూనే ఉన్నారు. 'సాహో' సినిమా తర్వాత కచ్చితంగా ఉంటుంది.

● 'బాహుబలి' తర్వాత తెలుగు సినిమా ఖ్యాతి జాతీయంగా కాదు అంతర్జాతీయంగా పెరిగింది. అందరూ మన సినిమాలవైపు చూస్తుండటం చాలా సంతోషంగా ఉంది.

● 'సాహో' సినిమా చాలా భారీ లెవల్లో తీస్తున్నారు. మొన్నామధ్య దుబాయ్ వెళ్లి ఫైట్ సీన్స్ తీశారు. సినిమా చాలా బాగా వస్తోందట.

● కన్నడలో అంబరీష్ చనిపోవడం నాకు బాధ కలిగించింది. ఆరోగ్యం బాలేనప్పుడు కూడా చాలా సార్లు కలిశాను. వాణ్ని కన్నడలో రెబల్ స్టార్ అంటారు. నా పిక్చర్స్ కొన్ని రీమేక్ కూడా చేశాడు. 'గురువుగారు' అని పిలుస్తుంటాడు నన్ను.

హారోయిన్స్


● నయనతార ● అంజలి

కథానాయికలు లేటెస్ట్ ట్రెండ్‌కి మారిపోయారు. ఓన్లీ గ్లామర్, సాంగ్స్‌కే కాదు. యాక్షన్ సినిమాలు చేయడానికైనా, బయోపిక్స్‌లో ఒదిగిపోవడానికైనా, థియేటర్స్‌లో ఆడియన్స్‌ను భయపెట్టడానికైనా సై అంటున్నారు. వారి ఉత్సాహాన్ని బాక్సాఫీస్ కలెక్షన్స్ కూడా ప్రోత్సహిస్తున్నాయి. ఆడియన్స్‌ను భయపెట్టి మంచి కలెక్షన్స్ రాబట్టుకోవడానికి భయమే అభయంగా బాక్సాఫీస్ వద్ద వెండితెర ఆత్మలుగా హారర్ సినిమాల కోసం ప్రిపేర్ అవుతున్న కొందరి హారోయిన్స్ గురించి తెలుసుకుందాం.

ఐరాగా.. అందాల తార

రెండేళ్ల క్రితం 'డోరా' సినిమాతో భయపెట్టడానికి ఆడియన్స్‌ను థియేటర్స్‌లోకి పిలిచారు నయనతార. కానీ ప్రేక్షకులు అంతగా భయపడలేదు. ఇప్పుడు 'ఐరా' సినిమాతో మరోసారి భయపెట్టేందుకు రెడీ అవుతున్నారు నయన్. ఇటీవల విడుదలైన ట్రైలర్ చూస్తే ఈ సినిమాలో హారర్ అంశాలు పుష్కలంగానే ఉన్నట్లు అర్థం అవుతోంది. ఇందులో నయనతార డబుల్ రోల్ చేయగా ఒకటి డీ–గ్లామర్ రోల్ కావడం విశేషం. కేఎమ్. సర్జున్ దర్శకత్వం వహించిన 'ఐరా' చిత్రం ఈ ఏడాదే విడుదల కానుంది.

ఫాంటసీ హారర్


● రాయ్ లక్ష్మి

ప్రస్తుతం సౌత్‌లో మంచి బిజీగా ఉన్నారు రాయ్‌లక్ష్మీ. కన్నడలో 'ఝాన్సీ', తెలుగులో 'వేర్ ఈజ్ వెంకటలక్ష్మీ' సినిమాల షూటింగ్స్‌ను కంప్లీట్ చేసిన ఆమె 'సిండ్రెల్లా' అనే ఫ్యాంటసీ కమ్ హారర్ సినిమాలో కూడా నటిస్తున్నారు. ఇటీవలే సినిమా ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే. వినోద్ వెంకటేశ్ ఈ సినిమాకు దర్శకుడు. ఈ సినిమా ఈ ఏడాదే విడుదలవుతోంది.

థ్రిల్లింగ్ హారర్

థియేటర్లో 'అరుంధతి' సినిమా చూసిన ప్రేక్షకులు తర్వాత ఇంటికి ఒంటరిగా వెళ్లడానికి జంకేలా ఉన్నాయి ఆ సినిమాలో హారర్ సీన్స్. ఆ తర్వాత అనుష్క 'పంచాక్షరి, భాగమతి' వంటి సినిమాలను చేసినప్పటికీ ఆ రేంజ్ హిట్‌ను సాధించలేకపోయారనే చెప్పొచ్చు. మళ్లీ ఇప్పుడు 'అరుంధతి' రేంజ్‌లో ఆడియన్స్‌ను హడలెత్తించడానికి రెడీ అవుతున్నారట అనుష్క. హేమంత్ మధుకర్ దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నారామె. ఇది కేవలం హారర్ సినిమానే కాదు సస్పెన్స్ ఎలిమెంట్స్ కూడా బాగానే ఉంటాయట. ఇందులో మాధవన్, అంజలి, షాలినీ పాండే కూడా నటిస్తారు. కొంతమంది హాలీవుడ్ నటులు కూడా కనిపిస్తారట. మార్చిలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం అవుతుంది.


● 'భాగమతి'లో అనుష్క

ట్రిపుల్ టెర్రర్

కథానాయిక అంజలి చేతిలో ప్రస్తుతం ఉన్న సినిమా లిస్ట్‌ను చెక్ చేస్తే అందులో మూడు హారర్ సినిమాలు (గీతాంజలి 2, ఓ, లీసా)ఉన్నాయి. 2004 లో వచ్చిన 'గీతాంజలి' సక్సెస్ సాధించింది. ఇప్పుడు సీక్వెల్‌కు ప్రిపేర్ అవుతున్నారు. మరో హారర్ మూవీ 'లీసా' సినిమా షూటింగ్ పూర్తి కావొచ్చింది. ఈ సినిమాకు త్రీడీ టెక్నాలజీని వినియోగిస్తున్నారు. తెలుగు, తమిళంలో రూపొందుతున్న ఈ సినిమాని హిందీలో కూడా డబ్ చేయాలనుకుంటున్నారు. రాజు విశ్వనాథ్ దర్శకుడు. ఇక 'ఓ' సినిమా దగ్గరకు వస్తే... తన చుట్టూ ఏం లేకపోయినా ఏదో ఉందని ఊహించుకుని భయపడే క్యారెక్టర్‌లో అంజలి నటిస్తున్నారు. ఈ సినిమాకు ప్రవీణ్ దర్శకుడు. ఇలా.. ఈ ఏడాది ట్రిపుల్ హారర్ ధమాకా ఇవ్వనున్నారు అంజలి.

ఎక్స్‌ట్రా ఫియర్

'ఎక్కడికి పోతావు చిన్నవాడా' సినిమాలో ఆడియన్స్‌ను బాగానే కంగారు పెట్టారు నందితా శ్వేతా. ఇప్పుడామె 'ప్రేమకథా చిత్రమ్ 2' సినిమాలో నటిస్తున్నారు. 2013లో వచ్చిన 'ప్రేమకథా చిత్రమ్' చిత్రానికి ఇది సీక్వెల్. 'బ్యాక్ టు ఫియర్' అనేది ఉపశీర్షిక. హరి కిషన్ దర్శకత్వం వహిస్తున్నారు. సుమంత్ అశ్విన్, సిద్ధి ఇద్నానీ ముఖ్య తారలుగా నటించారు. ఆల్రెడీ రిలీజ్ చేసిన నందిత లుక్ ఆడియన్స్‌ను బాగా ఆకట్టుకుంది. ఏ.ఎల్. విజయ్ దర్శకత్వంలో 'దేవి 2' అనే సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. 2016లో వచ్చిన దేవి (తెలుగులో 'అభినేత్రి') సినిమాకు ఇది సీక్వెల్. హారర్ నేపథ్యంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో నందితా ఓ కీలక పాత్ర చేస్తున్నారు. ప్రభుదేవా, తమన్నా ముఖ్య తారలు. తమిళంలో 'నర్మద' అనే సినిమాకు కమిట్ అయ్యారు నందిత. ఈ సినిమాలో కూడా హారర్ అంశాలు ఉంటాయని టాక్. మరి.. ఈ మూడు సినిమాలతో నందితా ఆడియన్స్‌కు ఎక్స్‌ట్రా ఫియర్ ఇస్తారా? వెయిట్ అండ్ సీ.


● నందితా శ్వేత


మహా భయం

తన సినీ కెరీర్‌లో 50వ చిత్రాన్ని కాస్త డిఫరెంట్‌గా ట్రై చేద్దామని ఫిక్స్ అయ్యారు హన్సిక. ఆ ఆలోచనలోనే 'మహ' సినిమాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. హారర్ అండ్ సస్పెన్స్‌తో కూడిన చిత్రమిది. ఇటీవల రిలీజ్ చేసిన ఈ సినిమా ఫస్ట్ లుక్స్ పోస్టర్స్ వివాదం అయ్యాయి. కానీ, టీమ్ మాత్రం ఎప్పటికప్పుడు డిఫరెంట్ పోస్టర్స్‌ను రిలీజ్ చేస్తూ ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తూనే ఉన్నారు. తమిళం, తెలుగు భాషల్లో రూపొందుతున్న ఈ సినిమాకు యుఆర్ జమీల్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా ఈ ఏడాదే విడుదల కానుంది.


● హన్సిక


● సిద్ధార్థ్, కేథరీన్

హీరోలు కూడా హారర్ జానర్‌పై దృష్టిపెట్టారు. 2017లో 'గృహం' సినిమాతో బంపర్‌హిట్ అందుకున్న సిద్ధార్థ్ ఇప్పుడు 'అరువమ్' అనే హారర్ మూవీలో నటిస్తున్నారు. 'ముని' సిరీస్ మూవీస్‌తో రాఘవ లారెన్స్ ప్రేక్షకులను బాగా భయపెట్టారు. ఆయన తాజా హారర్ మూవీ 'కాంచన 3' (ముని 4) ఏప్రిల్‌లో విడుదల కానుంది. 'నిను విడని నీడను నేనే' చిత్రంతో తొలిసారి హారర్ జానర్‌లో నటిస్తున్నారు సందీప్ కిషన్. 'చీకట్లో చితక్కొట్టుడు' వంటి చిన్న సినిమాలు కూడా బాక్సాఫీస్ వద్ద అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి రెడీ అవుతున్నాయి.


● లారెన్స్

– ముసిమి


● శ్రీకాంత్ అడ్డాల

కూచిపూడివారి వీధిలో...

మంచి కుటుంబ కథా చిత్రాలను తెరకెక్కించి ప్రేక్షకులను మెప్పించారు దర్శకులు శ్రీకాంత్ అడ్డాల. ఆయన తెరకెక్కించిన 'కొత్త బంగారు లోకం, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, ముకుంద' చిత్రాలు మంచి ప్రేక్షకాదరణ పొందాయి. ఇప్పుడు మరో మంచి చిత్రాన్ని ఆడియన్స్‌కు అందించేందుకు రెడీ అవుతున్నారాయన. గీతా ఆర్ట్స్ పతాకంపై ఈ చిత్రం రూపొందనుందని సమాచారం. ఈ చిత్రానికి 'కూచిపూడి వారి వీధి' అనే టైటిల్‌ను అనుకుంటున్నట్లు తెలిసింది. హీరోహీరోయిన్ల పేర్లు కూడా దాదాపు ఖరారు అయ్యాయట. త్వరలో అధికారిక సమాచారం వెల్లడయ్యే అవకాశం ఉంది.


● వరుణ్ ధావన్, ఆలియా

టాటా.. బై బై

'కళంక్' టీమ్‌కు టాటా చెప్పేశారు వరుణ్ ధావన్. '2 స్టేట్స్' ఫేమ్ అభిషేక్ వర్మన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. మాధురీ దీక్షిత్, సంజయ్ దత్, వరుణ్ ధావన్, ఆదిత్యా రాయ్ కపూర్, ఆలియా భట్, సోనాక్షీ సిన్హా ముఖ్య తారలుగా నటిస్తున్నారు. ఈ సినిమాలో తన షూటింగ్ పూర్తి చేసినట్లు వరుణ్ ధావన్ పేర్కొన్నారు. ''ఇప్పటి వరకు నేను నటించిన వాటిలో పెద్ద సినిమా ఇది. నిజంగా చాలా కష్టపడ్డాను. సోనా, మాధురీ మేడమ్, సంజు సార్, ఆలియా మేడమ్‌లతో నేను బిగ్ స్క్రీన్‌ని షేర్ చేసుకోవడం హ్యాపీగా ఉంది. ఆలియా భట్‌తో నాలుగోసారి నటించడం సూపర్ ఎగ్జైటింగ్‌గా అనిపించింది'' అని పేర్కొన్నారు వరుణ్. ''హార్డ్‌వర్క్‌తో వరుణ్ ఎప్పటికప్పుడు సర్‌ప్రైజ్ చేస్తుంటాడు. 'కళంక్' సెట్‌లోనూ అదే చేశాడు. ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా'' అని ఆలియా పేర్కొన్నారు. 'కళంక్' సినిమా ఈ ఏడాదే రిలీజ్ కానుంది. ఈ సంగతి ఇలా ఉంచితే... 1994లో వచ్చిన 'అందాజ్ అప్నా అప్నా' సినిమా రీమేక్ లేదా సీక్వెల్‌లో వరుణ్ ధావన్, రణ్‌వీర్ సింగ్ నటించనున్నారనే ప్రచారం బాలీవుడ్‌లో జరుగుతోంది.

ఇటు వైఫ్ ..అటు సెక్రటరీ


● అనన్య, కార్తిక్, భూమి

1978లో బీఆర్ చోప్రా దర్శకత్వంలో వచ్చిన 'పతి పత్నీ ఔర్ ఓ' సినిమాను బాలీవుడ్‌లో అదే పేరుతో రీమేక్ చేస్తున్న సంగతి తెలిసిందే. 'హ్యాపీ భాగ్ జాయేగీ' ఫేమ్ ముదసార్ అజీజ్ దర్శకత్వం వహిస్తారు. భుషన్ కుమార్, అభయ్ చోప్రా, జునో చోప్రా నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమాలో కార్తీక్ ఆర్యన్, భూమి పడ్నేకర్, అనన్యపాండేలను ఫైనల్ చేసినట్లు చిత్రబృందం తెలిపింది. ''ఇంతకుముందు 'సోనూ కే టిట్టు కీ స్వీటీ' సినిమాలో కార్తీక్‌తో కలిసి వర్క్ చేశాం. ఆ సినిమా వంద కోట్ల క్లబ్‌లో చేరింది. ఇప్పుడు మళ్లీ ఈ సినిమా కోసం అతనితో కలిసి వర్క్ చేయనుండటం ఆనందంగా ఉంది. టాలెంటెడ్ యాక్ట్రస్‌గా ఇండస్ట్రీలో భూమి పడ్నేకర్ ప్రూవ్ చేసుకున్నారు. అనన్యపాండే కొత్త హీరోయిన్ అయినప్పటికీ ఆమె నటన ఆడియన్స్‌ను మెప్పిస్తుందన్న నమ్మకం ఉంది''అని నిర్మాతలు తెలిపారు. ఈ సినిమా నుంచి తనను తప్పించారని తాప్సీ ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై నిర్మాతలు స్పందించారు. ''స్క్రిప్ట్ కుదిరిన తర్వాత ప్రతి డైరెక్టర్, నిర్మాత నటీనటుల ఎంపిక కోసం అన్వేషిస్తారు. అది ప్రాథమిక నియమం. అలానే మేము చేశాం. ఈ సినిమా స్క్రిప్ట్ చాలా మంది నటీనటుల దగ్గరికి వెళ్లింది. ఫైనల్‌గా స్క్రిప్ట్‌కు తగ్గ వారినే ఎంపిక చేశాం. తాప్సీ మంచి నటి. భవిష్యత్‌లో ఆమెతో తప్పకుండా వర్క్ చేస్తాం'' అన్నారు. ఈ సినిమాలో కార్తీక్ భార్య పాత్రలో భూమి, సెక్రటరీ పాత్రలో అనన్య కనిపిస్తారని బాలీవుడ్ టాక్.

సాక్షి
ఫ్యామిలీ
సన్నిధి
నల్లగొండ ॥ ఆదివారం
20-1-2019



ఆధ్యాత్మిక స్నానం

మనిషి పుట్టుక, మరణం, జీవించడం అన్నీ మోక్ష సాధన కోసమే. మోక్షాన్ని సిద్ధింపచేసుకోవడానికి మనిషి చేయాల్సిన క్రతువులను నిర్వర్తించడానికి దేహం ఒక సాధనం. మనసును నిత్యం ఆధ్యాత్మిక బాటలో పయనింప చేయడంతోపాటు చేసిన్న పుణ్య క్రతువులలో భాగం చేయాలి. అందులో ముఖ్యమైనది కుంభమేళా. సామూహికంగా నిర్వహించే పవిత్ర స్నానాల మట్టం ఇది. కుంభమేళా పన్నెండేళ్లకోసారి వస్తుంది. మధ్యలో ఆరేళ్లకోసారి అర్ధ కుంభమేళా నిర్వహిస్తారు. ఈ ఏడాది నిర్వహిస్తున్న కుంభమేళా అర్ధకుంభమేళా. గంగ, యమున, సరస్వతి నదుల సంగమస్థలి త్రివేణీ సంగమంలో కుంభమేళా, అర్ధకుంభమేళాలతోపాటు ఏటా సంక్రాంతికి పుణ్యస్నానాలు ఆచరించడం ఆనవాయితీ.

ఈ ఏడాది కుంభమేళా జనవరి 15వ తేదీ (మకర సంక్రమణం)తో మొదలైంది. సంక్రాంతి నుంచి కుంభమేళా పుణ్యస్నానాలు మొదలయ్యాయి. ఈ ధార్మిక ప్రక్రియ ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్)లో రానున్న మహాశివరాత్రి (మార్చి నాలుగవ తేదీ) వరకు కొనసాగనుంది. ఈ పుణ్యకాలంలోనే పుష్య పూర్ణిమ, పుష్య ఏకాదశి, మౌని అమావాస్య, వసంతపంచమి, అచల సప్తమి, మాఘ ఏకాదశి, మాఘ పూర్ణిమ పర్వదినాలు కూడా ఉన్నాయి.


సంక్రాంతి నుంచి శివరాత్రి వరకు పుణ్యస్నానాలాచరించడం హిందూ సంప్రదాయం. పైన చెప్పుకున్న పర్వదినాల్లో పవిత్ర స్నానాలాచరించడం వల్ల మోక్షం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం. మోక్ష సాధన కోసం నిర్వహించిన సాధువులు, సర్వసంగ పరిత్యాగులు ఈ కుంభమేళాల్లో తప్పనిసరిగా పాల్గొంటారు. గృహస్థులు కూడా విశేష సంఖ్యలో కుంభమేళాలో పాల్గొని పుణ్యస్నానాలతో ధార్మిక, ఆలౌకిక చింతనలో నిమగ్నమవుతారు.

పుణ్యస్నానాల పరమార్థం

దేవతలు, రాక్షసులు అమృతం కోసం పాల సముద్రాన్ని చిలికినప్పుడు అమృతం పుట్టింది. ఆ అమృతాన్ని పంచుకునేటప్పుడు తలెత్తిన వివాదంలో రాక్షసులు అమృత భాండాన్ని పట్టుకుని పరుగెత్తినప్పుడు ఆ భాండం నుంచి కొన్ని అమృతపు చుక్కలు పుణ్యనదుల్లో పడ్డాయి. అమృతం చిందడం వల్లనే నేల మీద ప్రవహిస్తున్న ఆ నదులు పుణ్యనదులయ్యాయి. అది ఉత్తరాయణ సమయం. అందుకే ఆ కాలంలో నదుల్లో నీరు అమృతత్వాన్ని సంతరించుకుంటాయని విశ్వాసం. ఆ సమయంలో పుణ్యనదుల్లో పవిత్ర స్నానమాచరిస్తే ఆరోగ్యం సిద్ధించి, అకాల మరణం దూరమవుతుందని నమ్మకం.

– మంజీర

కుంభమేళాకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేయడం ఆనవాయితీ. ఉత్తరప్రదేశ్‌లో 2013 కుంభమేళాకు 1,700 హెక్టార్ల విస్తీర్ణంలో షామియానాలు, గుడారాలు వేశారు. ఇప్పుడు మూడు వేల రెండు వందల హెక్టార్ల విస్తీర్ణంలో ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్)కు అనుబంధంగా టెంట్ సిటీ వేసి తాత్కాలిక నగరాన్ని నిర్మించారు. ఇందుకోసం నాలుగువేల మూడు వందల కోట్ల రూపాయలు కేటాయించారు. లక్షా ఇరవై రెండు వేల ఐదు వందల టాయిలెట్లు నిర్మించారు. జనసమ్మర్దం పెరిగిన చోట అంటువ్యాధులు ప్రబలకుండా వైద్యసహాయ కేంద్రాలు, మందుల పంపిణీ, మంచినీటి వసతి కల్పిస్తున్నారు. అసాంఘిక శక్తుల కార్యకలాపాలను నిరోధించడానికి, నియంత్రించడానికి ఆధునికమైన నిఘా కెమెరాలు, డ్రోన్ కెమెరా వీక్షణం వంటి పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక పోలీస్ బృందాలతో భద్రత కట్టుదిట్టంగా ఉండేటట్లు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కుంభమేళా దృశ్యాలను వీక్షించడానికి నగరమంతా డిజిటల్ స్క్రీన్లు పెట్టారు. గాలి కలుషితం కాకుండా ఎలక్ట్రానిక్ రిక్షాలను ప్రవేశపెట్టారు. భక్తులు విశ్రమించడానికి గుడారాలు నిర్మాణం జరిగింది. ఈ టెంట్‌సిటీ మార్చి నెలాఖరు వరకు ఉంటుంది. పర్వదినాల ప్రకారం శివరాత్రి వరకే, అయినప్పటికీ పుణ్యస్నానాల కార్యక్రమం మార్చి నెలాఖరు వరకు కొనసాగుతుంది.





ధర్మజిజ్ఞాస

మా అత్తగారికి నాకూ పడేది కాదు. తన మరణ సమయంలోనూ ఆమె నన్ను చూడటానికి కూడా ఇష్టపడలేదు. మేము ఆమె తిథులు పెట్టాలా?

–కవిత, హైదరాబాద్


ఆడపిల్ల వివాహం అయిన తరువాత అత్తారింట్లో ఆమె ముఖ్యమైన స్థానం పొందుతుంది. అదే వర్గత్రయంలో స్థానం. అంటే తాను, తన అత్తగారు, తన అత్తగారి అత్తగారు అనే పరంపరలో స్థానం పొందడం. ఇది మన ఇష్టానిష్టాల మీద ఆధారపడి ఉండదు. ఇష్టం ఉన్నా లేకున్నా ఆమెకు ముందుగా తిలోదకాలు ఇవ్వకుంటే తనకు చెందవని గమనించాలి. బతికి ఉన్నప్పటి రాగద్వేషాలు మృతులకు అంటవు. ఎందుకంటే వారు పితృదేవతలు అవుతారు. శరీరంతో వచ్చిన కోపతాపాలు శరీరంతోనే పోతాయి. కనుక వాటిని విస్మరించి వారి ఉత్తమగతులకు కృషి చేయాలి. వారిని పెట్టకపోవడం వలన పితృదోషాలు కలుగుతాయి. సంతానం వృద్ధిలోకి రాదు. పెళ్ళిళ్ళు కాకపోవడం, పిల్లలు పుట్టక పోవడం, ధనసమస్యలు సంభవించడం వంటివి జరుగుతాయి. అత్తకు పిండప్రదానాలు చేయించడం వలన ఆమే కాక పరంపరలో కూడా ఫలం ఉంటుంది. ఆమెను తృణీకరిస్తే ఆమె తరువాత స్థానం పొందాల్సిన కోడలికి వర్గత్రయంలో స్థానం దక్కదు. బతికి ఉన్నంత కాలం కష్టాలు నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. కాబట్టి ఇష్టం ఉన్నా లేకపోయినా, శ్రాద్ధకర్మలు తప్పనిసరి అని గుర్తించాలి.

పేతురు వేసిన విశ్వాసపు తొలి అడుగు

కలాం కలలు

ఈసురోమని యువత ఉంటే...

నిర్వహణ: డి.వి.ఆర్. భాస్కర్



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

ఎప్పుడూ నిర్వేదం. ప్రతి దానికీ దుఃఖం, శోకం, బాధ... యువత అలా ఉండకూడదు. ఉత్సాహంతో 'ఈ కార్యాన్ని నేను సాధిస్తాను'... అన్న ఆనందంతో ఉండాలి. 365 రోజులూ చదివి పరీక్షకు వెడుతుంటే... భయపడవలసిన అవసరం ఏమిటి? ఏడాదంతా చదివావు, నిష్ణాతులైన గురువుల దగ్గర విద్యాభ్యాసం చేశావు. పరమ సంతోషంతో పరీక్ష రాస్తాను... అని సంతోషంగా పరీక్ష రాయడానికి వెళ్ళాలి. విశ్వాసంతో వెళ్ళాలి. అంతే కానీ ప్రతి విషయానికి బెంగ పెట్టేసుకోకూడదు.

హనుమ ఒక్కడే నూరు యోజనాల సముద్రాన్ని దాటారు. మిగిలిన వానరులెవ్వరూ సముద్రాన్ని దాటలేకపోయారు. సముద్రాన్ని దాటితే కానీ దరికిరాని రావణుని లంకకు చేరలేరు. దాన్నిండా రాక్షసులు, పాములు... ఎవరు దాటుతారు? మానసికంగా భయపడిపోయి అక్కడే కూర్చున్నారు. "జాంబవంతుడు మనసా మనస్సి" అంటారు మహర్షి. మనసుతో హనుమ లంకా పట్టణానికి ఇప్పటికే చేరిపోయాడు...అన్నాడు. ఆ ఉత్సాహం ఉండాలి విద్యార్థులకు. రాముడి గురించి మనం అంతగా ఎందుకు చదువుతాం? తెల్లవారితే పట్టాభిషేకం అనుకున్నాడు. అదికూడా అడవులకు వెళ్ళమన్నారు. అది కూడా 14 ఏళ్ళు. ఆయనేం బెంగ పెట్టుకోలేదు. అంత సంతోషంగా వెళ్ళి లోకమంతా కాంతిగా ఉండడానికి వీలుగా రాక్షస సంహారం కూడా చేసాడు. టంగుటూరి ప్రకాశంపంతులుగారు బారిష్టరు చదివి లక్షలు సంపాదించాడు. ఆ సమయంలో స్వాతంత్ర్యోద్యమంలోకి వచ్చాడు. ఒకసారి మద్రాస్ పట్టణానికి సైమన్ కమిషన్ వచ్చింది. సైమన్ అని ఒక దొరగారిని లండన్ నుంచి పంపారు. అప్పటికి ఈ దేశాన్ని పరిపాలించడానికి ఉపయోగిస్తున్న రాజ్యాంగంలో ఏవైనా మార్పులు చేయవచ్చా? అన్న విషయంపై సిఫార్సులు చేయడానికి 'సైమన్' వచ్చాడు. ఆ కమిషనులో ఒక్క భారతీయుడు కూడా లేడు. అసలు మమ్మల్ని పరిపాలించడానికి ఏం కావాలో మమ్మల్ని అడగకుండా ఎక్కడో లండన్ నుంచి దొరగారిని పంపించడమేమిటని ఉద్యమకారులు "సైమన్ గోబ్యాక్" కు పిలుపిచ్చారు. అతి పెద్ద నినాదమయింది. ఆయన ఎక్కడికెళ్ళినా వెళ్ళిపొమ్మని నినాదాలు చేస్తూ ప్రజలు పెద్ద ఎత్తున వీధుల్లోకి వచ్చారు. అలాగే మద్రాసులో కూడా ఆయన రాక సందర్భంగా ఆందోళన జరుగుతున్నది. 14 మైళ్ళ దూరం జనంతో నిండిపోయింది. పోలీసులు కాల్పులు జరిపితే ఒక పిల్లవాడు మరణించాడు. ప్రకాశం పంతులుగారికి ఈ విషయం తెలిసి అక్కడికి చేరుకున్నారు. పిల్లవాడిని చూడడానికి వెడుతున్న ఆయనకు పోలీసులు ఎదురొచ్చి 'ముందుకడుగు వేయడానికి వీల్లేదు. అక్కడికి వెళ్లొద్దు' అన్నారు. 'నువ్వెవడివి చెప్పడానికి. నా దేశబిడ్డను కడసారి చూడడం మా హక్కు. వెడతా...' అని గర్జించాడు ప్రకాశం. "కాలు ముందుకుపెడితే కాల్చేస్తా" అని తుపాకీ ఎక్కుపెట్టాడు ఆ పోలీసు.

"ఎంతమందిని కాల్చగలవు. కాల్చు చూస్తా" అంటూ చొక్కా గుండీలు తీసి గుండెలు చూపించాడు. హడలిపోయిన పోలీసు తుపాకీ దించేసాడు. ఆ తరువాత ఆయనను 'ఆంధ్రకేసరి' అని ప్రజలు ముద్దుగా పిలుచుకున్నారు. విద్యార్థులూ మీకు ఆ ధైర్యసాహసాలు, ఉత్సాహం ఉద్దేశంతో కలాం గారు విద్యార్థుల చేత "ఈ దేశ యువతగా నా లక్ష్యాల సాధనలో ధైర్యంగా పనిచేసి ఇతరుల విజయాలను కూడా ఆస్వాదిస్తాను" అని ప్రతిజ్ఞ చేయించారు.

సువార్త

గలిలయ సముద్రం ఆకస్మాత్తుగా వచ్చే తుఫానులకు ప్రసిద్ధి. యేసుప్రభువు శిష్యులు ఒక రాత్రి నావలో ప్రయాణిస్తున్నప్పుడు, భీకరమైన తుఫాను సంభవించింది. అతి వేగంగా వీస్తున్న గాలులు, కుండపోతగా కురుస్తున్న వర్షం, పడిలేచే అలలతో నావ మునిగిపోయేంత పరిస్థితి ఏర్పడింది. ఆ శిష్యులకు తుఫానులు కొత్తేమీ కాకున్నా, ముఖ్యంగా తమతో యేసుప్రభువు లేని కారణంగా వారు ప్రాణభయంతో వణికిపోతున్నారు. ... యేసుప్రభువు నీళ్లమీద నడుస్తూ వారి దగ్గరికి వచ్చాడు. ఆయనను చూసి భూతమనుకొని శిష్యులు భయపడ్డారు. "నేనే, భయపడకండి" అని ప్రభువు వారికి ధైర్యం చెప్పాడు.

అంతలో యేసుప్రభువు గలిలయ సముద్రపు నీళ్లమీద నడుస్తూ తమవైపు రావడం శిష్యుడైన పేతురు చూశాడు. నావలోనే ఉండి ప్రభువు దగ్గరకు వెళ్లే తాను బతికిపోవచ్చు. అందుచేత "ప్రభువా నేను కూడా నీళ్లమీద నడిచి నీ దగ్గరకు రావడానికి అనుమతి ఇవ్వు" అని పేతురు అడిగాడు. "రమ్మని" ప్రభువు అనగానే పేతురు నావ దిగి నీళ్లమీద నడవసాగాడు. అయితే గాలిని, అలలను చూసి భయపడి 'ప్రభువా నన్ను రక్షించు' అని అరిచాడు. వెంటనే యేసు చెయ్యి చాపి అతన్ని పట్టుకుని 'అల్పవిశ్వాసీ, ఎందుకు సందేహపడ్డావు?' అన్నాడు. ఇద్దరూ నావ ఎక్కగానే గాలి ఆగిపోయింది. ... మనుషుల ఆలోచనలకు, ప్రణాళికలకు అతీతమైనవి దేవుని కార్యాలు. విశ్వాసంతో దేవుని మీద ఆధారపడినప్పుడు అసాధ్యమైనవి సాధ్యమవుతాయి. మనిషి నీళ్లమీద నడవడం అసంభవం. కానీ విశ్వాసం ఆ అసంభవాన్ని సంభవం చేసింది. విశ్వాసంతో వేసిన తొలి అడుగు పేతురు జీవితాన్ని మార్చివేసింది. ఎందుకంటే విశ్వాసం ఒక సిద్ధాంతం కాదు, ఆదొక ప్రయత్నం... నీళ్లమీద నడవడం కన్నా అసంభవమైన ఒక మహా కార్యాన్ని యేసుప్రభువు తన మరణ, పునరుత్థానంతరం తన శిష్యులకు అప్పగించాడు. శిష్యులంతా తన ప్రేమ, క్షమా సువార్తను ప్రపంచమంతా ప్రకటించాలన్నది ఆయన అభిమతం, ఆదేశం. నిరంకుశ రోమా ప్రభుత్వాన్ని ధిక్కరించి ఆ ఉద్యమాన్ని చేపట్టి విజయవంతం చేయడం నీళ్లమీద నడిచేంత అసంభవమైన కార్యమే. కానీ యేసుక్రీస్తు అనే పరమ రక్షకుని ప్రేమ, ఆ బోధకుని తర్ఫీదుతో అపొస్తలులంతా విశ్వాసపాత్రులై సువార్తను లోకమంతా ప్రకటించి నీళ్ళమీద నడిచారు. చివరికి రోమా ప్రభుత్వం క్రైస్తవాన్ని తెరమరుగైంది కాని వాళ్లు వెలిగించిన 'సువార్త ప్రభ' మాత్రం ఇన్ని వేల ఏళ్లుగా వెలుగునిస్తూనే ఉంది. 'విశ్వాసం అనే నిఘంటువు'లో 'అసంభవం' అనే పదం లేదన్నది అపొస్తలుల సువార్త ఉద్యమ సారాంశం.



–రెవ.డా.టి.ఎ.ప్రభుకిరణ్

తత్త్వరేఖలు

ఆత్మసందర్శనం


చరాచర జగత్తుకు హేతువు ఆత్మ అన్నదే అద్వైతం. ఆత్మను, జీవాత్మను వేరుచేసి చూడటం సిద్ధాంతపరంగా సాధ్యమేగాని, అవి విడిపడడం అనేదే ఉండదు. భౌతికంగా జీవాత్మ, జీవి, నిర్జీవి అనేవి ఆత్మతో భేదించినట్లు కనిపించినా, అది తాత్కాలికమే! భేదించే రూపాలు కాలాంతరంలో ఆత్మలో ఒదిగేవే. కాలాతీత ఆత్మను భౌతిక ప్రపంచ దృష్ట్యా చూడడంతోనే ఈ చిక్కులన్నీ. బ్రహ్మజ్ఞానంతో బ్రహ్మాండాన్ని అర్థం చేసుకున్నప్పుడు అన్ని ప్రశ్నలకూ సులభంగా సమాధానాలు దొరుకుతాయి.

భూమి మీద తొలిజీవి ఏకకణజీవి. తర్వాత పరిణామంలో బహుకణ జీవులు ప్రవేశించాయి. ఈ ఉదాహరణలన్నీ పదార్థ పరిణామాన్ని అద్దం పడతాయి. మన మూలాల విషయానికి వస్తే కూడా అదే విషయాన్ని నిర్ధారిస్తాయి. అరవై లక్షల సంవత్సరాలకు పూర్వం వానర జాతి నుండి విడిపడ్డట్టు మానవుడి డిఎన్ఏ చింపాంజీ డిఎన్ఏతో తొంభై తొమ్మిది శాతం పోలి ఉండటం నిర్ధారిస్తోంది. అంతేకాక, మన సహజీవులతో కూడా అత్యంత దగ్గరి జైవిక సంబంధాలు కలిగి ఉన్నాయి. చివరికి కీటకమైన ఈగతో కూడా మానవుడు అరవై శాతం డిఎన్ఏ పోలి ఉండటం ప్రకృతిలో మన పరిణామ స్థానాన్ని గుర్తించమంటోంది. అంతస్సూత్రమైన అద్వైతాన్ని బోధిస్తోంది.

ఆధ్యాత్మికంగా ఆత్మ అని చెప్పబడే అనంతశక్తి నుండే ఈ దృశ్యమాన ప్రపంచాలు పుట్టుకొచ్చాయి. ప్రతీ జీవిలోనూ ఒకే సూక్ష్మ జైవిక పదార్థాలు ఏవిధంగా ఉన్నాయో, అదేవిధంగా అతి సూక్ష్మమై ఉన్నా అత్యంత సాంద్రమైన శక్తే అన్నింటా విస్తృతమై ఉంది. ఆత్మ ఒకానొక భాగాన్ని పదార్థాలుగా మార్చుకుని, అది వాటిల్లోనే నిగూఢంగా దాగుంది. ఆ ఆత్మనుండి పదార్థాలు, ఆ పదార్థాల నుండి కాంతి, శబ్దం, ఉష్ణం లాంటి శక్తి రూపాలు ఏవిధంగా ఉత్పన్నమౌతున్నాయో, అదేవిధంగా జీవి శరీరం, ఆ శరీరంలో ప్రాణం ఉత్పన్నమౌతున్నాయి. వర్షం చినుకు నేలపై పడగానే ఎలా ఇంకి పోతుందో, ఆ శక్తి రూపాలు తమ కర్తవ్యాన్ని పూర్తి చేసుకున్న తర్వాత అలాగే ఆ అనంతశక్తిలో ఇంకిపోతాయి. అదే బాటలో జీవి శరీరం, ప్రాణాలు కూడా. మానవుడు తన తోటి మానవునితో 99.9 శాతం డిఎన్ఏను పోలి ఉంటాడు. ప్రతి జీవి కూడా తన జాతి జీవులతో అంతే శాతంలో డిఎన్ఏను పోలి ఉంటుంది. కానీ, మానవ సమాజం వివిధ భేదాభిప్రాయాలు పులుముకొని తనను తాను చీల్చుకొని బాధల్లో మునిగి పోతోంది. విశ్వాంతరాలను మొదలుకొని, ప్రాణాంతరాల వరకూ వ్యాపించి ఉన్న ఆత్మ ఒకటేనన్నదే నిత్యసత్యం. దానిని సందర్శించడమే ఓ అద్భుతం. ఆ దృశ్యాన్ని జ్ఞానం ఆవరించి ఉన్న విశాల హృదయమెంత ఆనందంగా ఆస్వాదిస్తుందో ఆత్మసందర్శన సాధించిన సాధకునికే తెలుసు.

– గిరిధర్ రావుల

ప్రశ్నోత్తర భారతం



72. ఇందులో ఎన్ని క్లిష్టమైన శ్లోకాలు ఉన్నాయి?
73. ఆ శ్లోకాల అర్థం ఎవరెవరికి తెలుసు?
74. భారతాన్ని పూర్తిచేసినప్పటికీ వ్యాసమహర్షికి ఎందుకు సంతృప్తి కలగలేదు.
75. ఎవరెవరిని ప్రచారానికి నియోగించాడు?
76. జనమేజయుడు ఏ యాగం చేశాడు?
77. ఆ సందర్భంగా వైశంపాయనుడు ఏం చేశాడు?
78. ఆ కథ చెబుతున్న సమయంలో అక్కడ ఎవరు ఉన్నారు?
79. ఉగ్రశ్రవుడు ఎవరి కుమారుడు?
80. మహాభారత ప్రాశస్త్యాన్ని ఏమని వివరించారు?
81. మహాభారతం గురించి ఇంకా ఏమని ప్రశంసించారు?

- నిర్వహణ: వైజయంతి పురాణపండ

జవాబులు

72. 8800 శ్లోకాలు అతి క్లిష్టంగా ఉంటాయి. 73. వ్యాసుడికి, శ్రీశుకునికి తెలుసునన్నాడు. సంజయుడికి తెలియునో తెలియదో అని సందేహం వెలిబుచ్చాడు. అంతటితో మహాభారత రచన ముగిసింది. 74. రచన పూర్తయింది. మానవాళికి అందించవలసి ఉంది. అందుకు ప్రచారం అవసరం. అందుకని వ్యాసుడు నలుగురిని ప్రచారానికి నియమించాడు. 75. దేవలోకంలో నారద మహర్షిని, పితృలోకంలో అసితదేవలుని, గంధర్వలోకంలో శుకదేవుని, మానవ లోకంలో వైశంపాయనుడిని నియమించాడు. 76. సర్పయాగం చేశాడు. 77. మహాభారత కథను వినిపించాడు. 78. ఉగ్రశ్రవుడు అక్కడే ఉన్నాడు. కథను ఆసాంతం విన్నాడు. ఆ కథను నైమిశారణ్యంలో ఉన్న మునులకు వినిపించాడు. 79. రోమహర్షణుని కుమారుడు. అతడు మునులకు వినిపించిన కథయే మన మహాభారత సంహిత. 80. సర్వప్రాణులకు పర్జన్యుడు జీవనప్రదాత. ఈ మహాభారత వృక్షం అటువంటిదే. కవులు రచించే ముఖ్యరచనలకు ఈ మహాభారతం పర్జన్యునిలాగ ఆధారభూతం అవుతుంది. 81. ఈ పురాణం పూర్ణచంద్రుని వంటిది. వేదాల వెన్నెలలు విరజిమ్ముతుంది. మనిషిలో మనోరూపమైన వెన్నెలలను విరబూయిస్తుంది అని ప్రశంసించారు.

కథాశిల్పం

బసవన్న దర్శనం... భవబంధ హరం

శివసేవకు సర్వకాలాలలోనూ సిద్ధంగా ఉన్న తొలి భక్తుడు నందీశ్వరుడు. శ్రీశైలంలో మల్లికార్జున స్వామి వారిని దర్శించడానికి ముందుగా ప్రత్యేక మండపంలో నందీశ్వరుడు కొలువుతీరి ఉన్నాడు. ఈయనను శనగల బసవన్న అంటారు. నిజానికి చెన్నకల్లు బసవన్న అనే కన్నడపదం తెలుగులో ఇలా మారింది. చెన్నకల్లు అంటే మంచి రాయి అని, బసవన్న అంటే నందీశ్వరుడనీ అర్థం. మంచి రాతితో చేసిన నంది అనే పదం చివరికి అది శనగల బసవన్నగా మారిపోయింది . శనగల బసవన్న అనే సార్థకత కోసం నేటికీ నందిసేవ తరువాత నానబెట్టిన శనగలను మూటగట్టి ఆయన నోటికి కడతారు. మల్లికార్జునస్వామికి ఎదురుగా కూర్చుని, ఆయనపై తదేక దృష్టి నిలిపి నిరంతర శివనామ ధ్యానంతో ఉన్నట్లు కనిపిస్తుంది. నందిని గురించి శైవాగమాల్లో ఈ వివరం ఉంది. నంది నాలుగు పాదాలు నాలుగు వేదాలతో సమానం. గంగడోలు విష్ణు స్వరూపం. ముఖం రుద్ర స్వరూపం. సూర్యచంద్రులు రెండు నేత్రాలు. అండం సకల తీర్థాలకు స్థావరం. హృదయం ధర్మ స్వరూపమని చెప్పబడింది. కలియుగంలో ధర్మం ఒక పాదం పై నిలుచుంది అని చెప్పడానికి ప్రతీకగా ఈ నంది ముందరి ఎడమ పాదం పైకి లేపి ఉంటుంది. తెలుగునాట లేపాక్షి, యాగంటి, మహానంది వంటి చోట్ల ఎన్నో పెద్ద నంది విగ్రహాలున్నా, శ్రీశైలంలో కనిపించే నందీశ్వరుడి విగ్రహం ప్రత్యేకమైనది. ఇది ఏకశిలతో తయారయింది. ఈ నందికి నందిసేవ పేరుతో ప్రతి మంగళవారం, త్రయోదశి తిథిన విశేష అభిషేకం, పూజలు జరుపుతారు. నందిని దర్శిస్తే సకలపాపాలు పటాపంచలైపోతాయి. అనారోగ్యాలు తొలగుతాయి. నందికి నివేదించిన ప్రసాదం స్వీకరిస్తే వంధ్యత్వం తొలగిపోతుందని, ఋణబాధలుండవని, అకాల మరణాలు రావనీ అంటారు.



– డాక్టర్ ఛాయా కామాక్షీదేవి

జెన్‌పథం

ఒకడు ఓ ఆవును కొన్నాడు. అతనికి అప్పటి వరకూ ఆవులను ఎలా మచ్చిక చేసుకోవాలో తెలీదు. కనుక ఆ ఆవు కొమ్ములు పట్టుకుని బలంగా లాగడానికి ప్రయత్నించాడు. కానీ ఆ ఆవు మొండికేస్తోంది. ఒక్క అడుగూ ముందుకు వెయ్యలేదు. తన పాత ఇంటికే, పాత యజమాని దగ్గరకే వెళ్ళిపోవాలనే పట్టుదలతో ఉంది.

ఇదంతా ఒకింత దూరంలో నిల్చుని చూస్తున్న ఓ సూఫీ గురువు ఆ మనిషితో చెప్పాడు "నువ్వు ఆ ఆవుకి బహుశా అపరిచితుడివనుకుంటాను. నీకు ఆవులతో ఎలా మెలగాలో తెలీదనుకుంటాను. అది నీతో రావడానికి మొండికేస్తోంది. కనుక నువ్వు బలవంతంగా దాన్ని లాక్కు పోవడానికి ప్రయత్నించకు..." అన్నారు.


"మరి నేనేం చెయ్యాలిప్పుడు... నేను ఆ ఆవంత బలవంతుడిని కాను. ఆ ఆవు నాకంటే చాలా బలంగా ఉంది... నేను దాన్ని లాగడం కాదండి. అదే నన్ను లాగుతోంది" అన్నారు.

అప్పుడు సూఫీ గురువు పచ్చటి గడ్డి కొంత అతనికి ఇచ్చి "దాని కొమ్ములు విడిచి పెట్టు. నువ్వు ఈ గడ్డిని తీసుకుని ముందుకు అడుగులు వేయి... దానికి అందీ అందని విధంగా గడ్డిని పట్టుకో... అది గడ్డి కోసం నీ దగ్గరకు వచ్చేసరికి నువ్వు మరింత ముందుకు జరిగిపో...అప్పుడు ఏం జరుగుతుందో చూడు...." అన్నారు.

ఆయన చెప్పినట్టే చేసాడు ఆ మనిషి.

గడ్డి పచ్చగా తాజాగా ఉండటంతో దాన్ని అందుకోవడం కోసం అతను కొత్తవాడా పాతవాడా అనే విషయాన్నే మరచిపోయింది ఆవు. దాని లక్ష్యమంతా గడ్డిని ఎలా అందుకోవాలా అనే తప్ప మరో ధ్యాస లేదు. అది దగ్గరకు వచ్చే టప్పుడల్లా అతను ఒకటి రెండు అడుగులు ముందుకు వేస్తున్నాడు. అతను తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. గడ్డికి, ఆవుకి మధ్య దూరం అలానే ఉంది. కానీ వారి ప్రయాణం సాఫీగా సాగిపోయింది ఏ అవాంతరమూ లేకుండా. అతను ఇంటికి చేరాడు. ఆవు కూడా లోపలికి ప్రవేశించింది. అతను తలుపులు వేసేశాడు.

మతాలూ అంతే. అవన్నీ మనముందుంటాయి. అవి ఎన్నో చెప్తాయి. ఎన్నో అనుసరించమంటాయి. చదివే కొద్దీ అనుసరించే కొద్దీ ఏదో ఒక కొత్తదనం ఉంటూనే ఉంటుంది. చివరికి ఏ మతమైనా చెప్పేదొకటే... తోటివారికి తలనొప్పిగా ఉండకూడదనే. వీలైన మేరకు మంచిచేయాలి. మంచిగా ఉండాలి తప్ప చెడనేది తలవకూడదు.



– యామిజాల జగదీశ్

ఇస్లాం వెలుగు



దైవం మెచ్చేది చిత్తశుద్ధినే!

నమాజులు, ప్రార్థనలు, పూజలు అధికంగా చేసే వారిని చూసి, వీరు చాలా బుద్ధిమంతులని, నీతిపరులని, శీలవంతులని అనుకోడానికి వీల్లేదు. కొంతమంది ఎప్పుడు చూసినా దైవచింతనలో లీనమై ఉంటారు. కాని సాటిమానవుల పట్ల వారి ప్రవర్తన, వ్యవహార శైలి ఏమాత్రం సంతృప్తికరంగా ఉండదు. సంప్రదాయ దుస్తుల్లో ఎంతో భక్తిపరులుగా కనిపించే చాలామంది పెద్ద మోసగాళ్ళుగా, వంచకులుగా బయట పడినవారూ ఉన్నారు. అంటే, బాహ్య వేషధారణ, పైపై మెరుగులు చూసి ఏ విషయంలో అయినా మనం ఒక అభిప్రాయానికి రాలేము. పైకి ఎంతో మంచివారుగా, దైవభక్తులుగా, చీమకు కూడా హాని చేయని సాధుజంతువుల్లా కనిపిస్తారు. కాని లోలోన కనబడకుండా మోసాలు చేస్తారు. నిజానికి ఇలాంటివాళ్ళకు దైవం పట్ల, దైవ ధర్మం పట్ల ఎంతమాత్రం విశ్వాసం ఉండదు. కేవలం ప్రజలను మోసంచేసి తమ పబ్బం గడుపుకోడానికి దైవాన్ని, భక్తిని ఒక సాధనంగా వాడుకుంటారు. సంప్రదాయ వేషధారణ చేసి భక్తి నటిస్తారు. పాపం ఇవేమీ తెలియని జనాలు అదంతా నిజమేనని నమ్మి, నిష్కారణంగా మోసపోతారు.

మరికొంతమంది, దైవంపట్ల, దైవధర్మం పట్ల సరైన అవగాహన లేని కారణంగా, 'ధర్మం వేరు.. ప్రపంచం వేరు' అన్న తప్పుడు భావనకు లోనవుతారు. భక్తిని భక్తివరకే ఉంచి, అంటే పూజలు, పునస్కారాల వరకే భక్తిని పరిమితం చేసి, దైనందిన వ్యక్తిగత జీవితంలో తమ ఇష్టానుసారం జీవితం గడుపుతారు. ధర్మం వేరు, ప్రపంచం వేరు అన్న తప్పుడు భావనే ఇలాంటి ప్రవర్తనకు మూల కారణం. కాని ఇస్లామీ ధర్మశాస్త్రం, వ్యక్తిగతజీవితమైనా, సామూహికజీవితమైనా, ఆధ్యాత్మికజీవితమైనా, ప్రాపంచిక జీవితమైనా సర్వకాల సర్వావస్థల్లో దైవభీతిని కలిగి ఉండాలని చెబుతోంది. సాటి మానవులపట్ల సత్ప్రవర్తన లేకపోతే ఆరాధనలన్నీ బూడిదలో పోసిన పన్నీరేనని హెచ్చరిస్తోంది.

అందుకే ఎన్ని నమాజులు చేసినా, ఎన్ని సత్కార్యాలు ఆచరించినా, ఎంత సంప్రదాయ వస్త్రాలు ధరించినా, సాటి మానవసోదరుల పట్ల మన బాధ్యత నెరవేర్చకపోతే, ఇతరేతర దైవ సృష్టితాల పట్ల దయ, జాలి, సానుభూతి, సమాజ సంక్షేమం పట్ల ఆసక్తి లేకపోతే, ఇలాంటి భక్తిని, ఇలాంటి ఆరాధనలనూ దేవుడు మెచ్చడు. అంగీకరించడు. దైవం చూసేది కేవలం చిత్తశుద్ధిని మాత్రమే.

దైవం మనందరికీ మంచీచెడుల విచక్షణా జ్ఞానాన్ని ప్రసాదించాలని, సదా సన్మార్గపథంలో నడపాలని, ఇహపర సాఫల్యాలు అనుగ్రహించాలని కోరుకుందాం.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్



● నాగచైతన్య, తమన్, వెంకీ అట్లూరి, అఖిల్, నిధీ అగర్వాల్, నాగార్జున, ఎన్టీఆర్, బీవీయస్‌యన్ ప్రసాద్

అఖిల్‌లో ఉన్న మంచి గుణం ఆత్మవిమర్శ

- ఎన్టీఆర్

''**ఈ** ఫంక్షన్‌కు అతిథిలా కాకుండా బంధువులా వచ్చాను. ఈ చిత్రానికి పని చేసిన చాలామంది నాకు కావాల్సిన వాళ్లు ఉన్నారు. ఒక నిర్మాత మంచి చిత్రాలు తీయాలంటే వ్యామోహం ఒక్కటే సరిపోదు. వ్యాపారం కూడా తెలియాలి. ప్రసాద్‌గారిలో వ్యాపారం చూడలేదు, కేవలం సినిమా మీద వ్యామోహం మాత్రమే చూశాను. ఈ సంస్థకు 'మిస్టర్. మజ్ను' మరో మైలు రాయి అవ్వాలి'' అని ఎన్టీఆర్ అన్నారు. అఖిల్, నిధీ అగర్వాల్ జంటగా వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన చిత్రం 'మిస్టర్. మజ్ను'. బీవీయస్‌ఎన్ ప్రసాద్ నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 25న రిలీజ్ కానున్న సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీ–రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా వచ్చిన

ఎన్టీఆర్ మాట్లాడుతూ – ''ప్రసాద్‌గారితో 'ఊసరవెల్లి, నాన్నకు ప్రేమతో' చేశాను. ఆ రెండు సినిమాలు నాకు చాలా ఇష్టమైనవి. సంపాదించిన ప్రతి రూపాయిని సినిమాకే ఖర్చు పెడతారాయన. అలాంటి నిర్మాత బావుంటే ఇంకా మంచి సినిమాలు అందిస్తారు. ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో నాకు ఉన్న ఫ్రెండ్స్‌లో వెంకీ ఒకరు. 'తొలిప్రేమ' అనే టైటిల్‌తో ఏం తీస్తాడు అనుకున్నాను. ఆ చిత్రం చూశాక, గర్వంగా ఫీల్ అవుతున్నాను. 'మిస్టర్ మజ్ను' కూడా మంచి సక్సెస్ అవుతుంది అనుకుంటున్నాను. తమన్ సంగీతంపై నాకు బాగా నమ్మకం ఉంది. ఆ మధ్య తన చుట్టూ ఒక నెగటివిటీ ఏర్పడింది. మళ్లీ తన సామర్థ్యాన్ని చూపించే చిత్రం రావాలి అనుకున్నాను. 'తొలిప్రేమ' రిలీజ్ అయింది. ఒక నటుడికి అన్నింటికంటే ముఖ్యంగా కావాల్సింది ఆత్మ విమర్శ. అలాంటి గొప్ప గుణం తమ్ముడు అఖిల్‌లో చూశాను. అఖిల్ చేసుకునేంత ఆత్మవిమర్శ ఎవ్వరూ చేసుకోలేరు. ఆత్మవిమర్శ చేసుకోవాలంటే దమ్ముండాలి. తనని తను మార్చుకుంటూ ఈ మజిలీకి చేరాడు. రాసిపెట్టుకోండి.. మనకున్న ఉత్తమ నటుల్లో అఖిల్ కూడా ఉంటాడు. స్టార్డమ్ గురించి మాట్లాడటం లేదు. ఉత్తమ నటుల్లో అఖిల్ మాత్రం కచ్చితంగా ఉంటాడు. ఆరోజు కోసం ఎదురుచూస్తున్నాను. అది కూడా ఎంతో దూరంలో లేదు. 'మిస్టర్ మజ్ను' అఖిల్‌కు బెస్ట్ మూవీ అవుతుంది'' అన్నారు.

నాగార్జున మాట్లాడుతూ – ''మా పెద్ద పెద్ద అబ్బాయి తారక్ (ఎన్టీఆర్). నన్ను చాలా ఆప్యాయంగా బాబాయ్ అని పిలుస్తాడు. తారక్ దగ్గరి నుంచి అఖిల్ నేర్చుకోవాల్సింది.. యాక్టింగ్ అండ్ మాస్. రేయ్ మాస్ నేర్చుకోరా అక్కడా (అఖిల్‌ని ఉద్దేశిస్తూ). ప్రసాద్‌గారు 25 సినిమాల్లో 2 బ్లాక్‌బస్టర్స్ ఇచ్చారు. ఈ సినిమా కూడా పెద్ద హిట్ అవుతుంది. తమన్ మంచి మ్యూజిక్ ఇచ్చాడు. తమన్ గారి తాతగారే నాన్నను (ఏయన్నార్) ఆర్టిస్ట్‌గా గుర్తించారు. ఆ విధంగా ఈ సర్కిల్ పూర్తయింది అనుకుంటున్నాను. వెంకీ అట్లూరి మా సినిమాలు చూసి ఇక్కడికి వచ్చాడని విన్నాను. 'మజ్ను' టైటిల్ నాన్నగారిది. ఆ తర్వాత నా దగ్గరకు వచ్చింది. ఇప్పుడు అఖిల్ చేశాడు. ఈ చిత్రం ఆ 2 సినిమాల కంటే పెద్ద హిట్ అవ్వాలి'' అన్నారు.

నాగ చైతన్య మాట్లాడుతూ – ''మజ్ను... మంచి టైటిల్ పెట్టావు వెంకీ. అఖిల్‌కి సూట్ అవుతుంది (నవ్వుతూ). అఖిల్‌ని ఫుల్ లవ్‌స్టోరీలో చూడాలనుకున్నాను. అఖిల్ ఫైట్స్, డ్యాన్స్ బాగా చేస్తాడని మనందరికి బాగా తెలుసు. తన బాడీ లాంగ్వేజ్‌కు లవ్‌స్టోరీ బావుంటుందని అనుకున్నాను. వెంకీ 'తొలిప్రేమ'తో తన మార్క్ చూపించాడు. 'మిస్టర్ మజ్ను' కూడా అలానే ఉంటుందనుకుంటున్నాను. నిధీకు సక్సెస్ రావాలి. బ్లాక్‌బస్టర్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్ ప్రసాద్‌గారు'' అన్నారు.

అఖిల్ మాట్లాడుతూ – ''ఈ సినిమాకు గాడ్ ఫాదర్ బీవీయస్‌ఎన్ ప్రసాద్‌గారు. తాతగారితో కూడా ఆయన సినిమా తీశారు. సినిమాకు పని చేసిన నిపుణులందరికీ థ్యాంక్స్. ఇంత స్పెషల్ ఆల్బమ్ ఇచ్చిన తమన్‌కు థ్యాంక్స్. వెంకీ నాకు పదేళ్ల నుంచి ఫ్రెండ్. మూడేళ్ల ముందే ఈ కథ చెప్పి, నా కోసం వెయిట్ చేశాడు. ప్రతి సినిమాకు నాన్నగారు చూపించే శ్రద్ధ చాలా గొప్పది. మీ ఇన్‌పుట్స్ లేకుంటే ఈ సినిమా ఇలా ఉండేది కాదు నాన్న. అన్నయ్య ఎన్టీఆర్‌ని నేను టైగర్ అని పిలుస్తాను. ఈ ఫంక్షన్ వస్తున్నందుకు థ్యాంక్స్ అంటే.. అది నా బాధ్యత అని చెప్పారు. థ్యాంక్యూ సో మచ్ అన్నయ్య'' అన్నారు.

దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ – ''నేను ఫస్ట్ థియేటర్‌లో చూసిన సినిమా 'శివ'. ప్రేమ్‌నగర్ సినిమాలో 'ఎక్స్‌క్యూజ్ మీ మిస్' డైలాగ్‌ని తీసుకొని ఇందులో పెట్టాను. ఈ సినిమా టీమ్ ఎఫర్ట్. చాలా కష్టపడ్డాం. ప్రేక్షకులు ఆశీర్వదించాలి'' అన్నారు.

ఈ వేడుకలో నిధీ అగర్వాల్, తమన్, శ్రీమణి, తదితరులు పాల్గొన్నారు.



● కె.జె.ఏసుదాస్

ఆ క్రెడిట్ వాళ్లదే

- కె.జె.ఏసుదాస్

''నేను అక్షరాల విషయంలో చాలా పర్‌ఫెక్ట్‌గా ఉండాలనుకుంటాను. ఇది నా తల్లి నుంచి నేర్చుకున్నాను. నేను క్రిష్టియన్ ఫ్యామిలీలో పుట్టినప్పటికీ సంస్కృతంలోని అక్షరాలను నేర్చుకోమని ఆమె చెప్పారు. అది ఆమె నాకు అందించిన ఆశీర్వాదం'' అని ప్రముఖ గాయకులు కె.జె.ఏసుదాస్ అన్నారు. చాలా కాలం తర్వాత ఆయన హైదరాబాద్‌లో ఈరోజు లైవ్ కాన్సర్ట్ చేస్తున్నారు. ఈ సంగీత విభావరిలో ఏసుదాస్‌తోపాటు గాయకులు విజయ్ ఏసుదాస్, కల్పన కూడా పాల్గొంటారు. ఈ సందర్భంగా ఏసుదాస్ మాట్లాడుతూ– ''మా అమ్మ అందించిన మరో ఆశీర్వాదం ఏంటంటే.. నాకు ఐదేళ్లున్నప్పుడు చదువు గురించి ఎలాంటి బెంగా పెట్టుకోవద్దు. నార్మల్‌గా చదువుకుంటే చాలు. కానీ, కర్నాటిక్ క్లాసికల్ మ్యూజిక్‌ని ప్రాపర్‌గా నేర్చుకోమని చెప్పారు. నాకు బ్రదర్స్, సిస్టర్ ఉన్నారు. వాళ్లు కూడా బాగా పాడేవారు. కానీ, ఈ విషయంలో నాన్నగారు నన్ను మాత్రమే ప్రోత్సహించారు. గురువు లేకుండా ఎవరూ గొప్పవారు కాలేరు. మనల్ని తీర్చిదిద్దిన గురువులంతా దేవుళ్లతో సమానమని నా నమ్మకం. నేను ఇప్పటివరకు ఏం సాధించినా అదంతా నా తల్లిదండ్రులు, గురువుల వల్లే సాధ్యమైంది. అలాగే నా పాటలు వినేవారు, సంగీత ప్రియుల ప్రార్థనల వల్లే నేను ఈ స్థాయికి వచ్చాను. అంతకుమించి మరేం లేదు. నా బ్రదర్ అలేఖ్య హోమ్స్ శ్రీనాథ్ నన్ను లైవ్ మ్యూజిక్ చెయ్యమని చెప్పారు. దాదాపు 10 సంవత్సరాల తర్వాత హైదరాబాద్‌లో లైవ్ మ్యూజిక్ చేస్తున్నాను. మా అబ్బాయి విజయ్ వయసు ఇప్పుడు 40. నా వయసు 79. కానీ, నేను ఇప్పటికీ విద్యార్థినే'' అన్నారు. విజయ్ ఏసుదాస్ మాట్లాడుతూ– '' మొదట్లో నాన్నగారి అడుగుజాడల్లోనే వెళ్లాను. ఆ తర్వాత నా సొంతదారిలోనే వెళ్లాలని డిసైడ్ అయ్యాను. కొన్ని విషయాల్లో ఆయన గైడెన్స్ తీసుకుంటాను. ఇళయరాజాగారితో కలిసి నాన్నగారు చాలా సినిమాలకు పనిచేశారు. ఇప్పుడు నేను, యువన్‌శంకర్‌రాజా కలిసి పనిచేస్తున్నాం. నేను రెండు సినిమాల్లో నటించాను కూడా. నాన్నగారి బయోపిక్ చేసే ఆలోచన ఉందా? అని అడుగుతున్నారు. అయితే నాకు అలాంటి ప్లాన్స్ ఏమీ లేవు. కానీ, ఎవరైనా చేస్తే నేను ఇన్‌వాల్వ్ అవ్వాలనుకుంటున్నాను'' అన్నారు.

నో కాంప్రమైజ్



● దీపికా పదుకోన్

స్క్రిప్ట్ నచ్చినా పారితోషికం దగ్గర కాంప్రమైజ్ కానంటున్నారు బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకోన్. అవసరమైతే ఆ సినిమా చాన్స్‌ను వదులుకోవడానికి కూడా సిద్ధం అంటున్నారామె. ఈ విషయం గురించి తను ఎదుర్కొన్న ఓ సంఘటనను షేర్ చేశారు దీపికా. ''ఇటీవల ఓ దర్శకుడు నాకు ఓ కథ చెప్పారు. క్రియేటివ్ యాంగిల్‌లో ఆ సినిమా నాకు నచ్చింది. ఆ తర్వాత రెమ్యూనరేషన్ డిస్కషన్స్ స్టార్ట్ చేశాం. నా మాట చెప్పాను. ఆ డైరెక్టర్ వెళ్లిపోయి మరలా రెండు రోజుల తర్వాత వచ్చారు. మెయిన్ లీడ్ యాక్టర్ కన్నా నాకు ఎక్కువ రెమ్యూనరేషన్ ఇప్పించలేనని తన అభిప్రాయం చెప్పారు. సినిమా చేయనని నేను చెప్పేశాను. ఎందుకంటే నా విలువ నాకు తెలుసు. నా ట్రాక్ రికార్డ్‌పై నాకు అవగాహన ఉంది. ఆ సినిమాను వద్దనుకున్నందుకు కూడా బాధపడటం లేదు. నేటి రోజుల్లో సినిమాల్లో మహిళల అవకాశాలకు కొదవ లేదు. మహిళల పాత్రలకు కూడా ప్రాముఖ్యత పెరిగింది. ఓ మార్పు వస్తోంది'' అని చెప్పుకొచ్చారు దీపికా. 'పద్మావత్' సినిమా సక్సెస్‌తో బాక్సాఫీస్ వద్ద తన సత్తా ఎంటో నిరూపించుకున్న దీపికా ప్రస్తుతం 'చెప్పాక్' అనే సినిమాలో నటించడానికి రెడీ అవుతున్నారు. 'రాజీ' ఫేమ్ మేఘనా గుల్జార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తారు. అదేవిధంగా ఓ సూపర్ ఉమెన్ సినిమాలో కూడా నటించబోతున్నట్లు ఓ సందర్భంలో దీపిక చెప్పిన విషయం తెలిసిందే.



● మహేశ్‌బాబు

శివరాత్రికి టీజర్?

మహేశ్‌బాబు హీరోగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'మహర్షి'. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ పొల్లాచ్చిలో జరుగుతోంది. ఫిబ్రవరి ఫస్ట్ వీక్‌లో హైదరాబాద్‌లో మరో షెడ్యూల్‌ను ప్లాన్ చేశారట చిత్రబృందం. ఆ తర్వాత కొన్ని కీలక సన్నివేశాల కోసం అబుదాబీ ఫ్లైట్ ఎక్కుతారట 'మహర్షి' టీమ్. అంతటితో ఈ సినిమా షూటింగ్ పూర్తవుతుందని సమాచారం. తాజాగా మహా శివరాత్రి సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేయాలని చిత్రబృందం ప్లాన్ చేస్తోందని టాక్. పూజాహెగ్డే కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాలో 'అల్లరి' నరేశ్ కీలక పాత్ర చేస్తున్నారు. 'దిల్' రాజు, అశ్వనీదత్, పీవీపీ నిర్మిస్తున్నారు. ఈ సినిమాను తొలుత ఏప్రిల్ 5న విడుదల చేయాలనుకున్నారు. కానీ, ఏప్రిల్ 26న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ సంగతి ఇలా ఉంచితే... 'ఎఫ్ 2' తో సూపర్ సక్సెస్‌ను అందుకున్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. మహేశ్‌కు అనిల్ ఓ స్టోరీ లైన్‌ను చెప్పగా ఇంప్రెస్ అయిన మహేశ్ స్క్రిప్ట్‌ను డెవలప్ చేయమని చెప్పారని ఫిల్మ్‌నగర్‌లో ప్రచారం జరుగుతోంది. 'మహర్షి' సినిమా తర్వాత సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై మహేశ్‌బాబు హీరోగా ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే.



● కల్యాణ్ దేవ్, శ్రీజ

నిత్య నూతనం

చిరంజీవి ఇంట్లో సందడి నెలకొంది. ఆయన చిన్నల్లుడు కల్యాణ్ దేవ్, శ్రీజ దంపతుల ముద్దుల తనయకు నవిష్క అని నామకరణం చేశారు. శుక్రవారం ఈ నామకరణ వేడుక జరిగింది. 'మా చిన్నారికి నవిష్క అని పేరు పెట్టాం' అంటూ కల్యాణ్‌దేవ్ సోషల్ మీడియాలోన ఈ విషయాన్ని పేర్కొన్నారు. 'నవిష్క' అంటే నిత్య నూతనం అని అర్థం అట.



● నరేశ్

పారితోషికం కాదు.. పాత్రే ముఖ్యం

"ఏ ఆర్టిస్ట్‌కైనా సక్సెస్, ఫెయిల్యూర్ కామన్. ఏడెనిమిదేళ్ల క్రితం మంచి హిట్ వస్తే బావుంటుంది అనుకున్నాను. గతేడాది వచ్చిన హిట్ సినిమాల్లో సుమారు 8 సినిమాల్లో నటించాను. నాపై దర్శకులు ఉంచిన నమ్మకంతోనే ఆ పాత్రలు వచ్చాయి. గతేడాది మన ఇండస్ట్రీ చాలా బావుంది. అలాగే నాకు కూడా. ఈ ఏడాదిని కూడా అలానే కొనసాగించాలనుంది. పాత్రల్లో ప్రాధాన్యత ఉండేలా చూసుకుంటున్నాను" అన్నారు నటుడు నరేశ్. ఈరోజు ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ..

● 'శతమానం భవతి' నా కెరీర్‌లో టర్నింగ్ పాయింట్. 2018 మన తెలుగు సినిమాలకు హెల్తీయస్ట్ ఇయర్. 'ఛలో, తొలిప్రేమ, రంగస్థలం, మహానటి, సమ్మోహనం, దేవదాస్, అరవింద సమేత.., శైలజారెడ్డి అల్లుడు'.. ఇలా చాలా సినిమాల్లో కనిపించాను. 'సమ్మోహనం' లో చేసిన పాత్ర నన్ను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లింది. దర్శకుడు ఇంద్రగంటి మోహన్‌కృష్ణగారికి థ్యాంక్స్ చెప్పాలి. సీనియర్ డైరెక్టర్స్‌తో పాటు యువ దర్శకులు కూడా ఆయా పాత్రలకు నన్ను ఎంచుకోవడం హ్యాపీ. నాకు పారితోషికం ముఖ్యం కాదు.. పాత్ర ముఖ్యం.

● నటుడిగా 47 ఏళ్లు పూర్తి చేసుకొని 48లోకి వెళ్తున్నాను. మరో రెండేళ్లలో గోల్డెన్ జూబ్లీ జరుపుకుంటాను. నా క్రమశిక్షణ, ఇండస్ట్రీలో పెంచుకున్న గుడ్‌విల్, వివాదాల్లోకి వెళ్లకపోవడం.. నా సుదీర్ఘ ప్రయాణానికి కారణం అయ్యాయనుకుంటాను. చిన్న బడ్జెట్ సినిమాలకు అందుబాటులో ఉండాలనుకుంటున్నాను, ఉంటాను కూడా. కొత్త కాన్సెప్ట్‌లు, కొత్త ఐడియాలకు సిద్ధం. వెబ్ సిరీస్‌లకు కూడా అడుగుతున్నారు కానీ మంచి కాన్సెప్ట్‌తో డిజిటల్‌గా కూడా ఎంట్రీ ఇవ్వాలనుకుంటున్నాను.

● గతేడాది మూడు షిఫ్ట్స్ పని చేశా. ఈ ఏడాది కూడా అలానే ఉండాలనుకుంటున్నాను. పాత్రల ఎంపికలో మంచి పాత్రలు ఎంచుకుంటున్నా. క్వాలిటీ, బ్యానర్లు ఇవన్నీ చూసుకొని ఎంచుకుంటాను. ప్రస్తుతం కార్తికేయతో అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో ఓ సినిమా, ఫణిరాజా అని బుర్రాసాయి మాధవ్ అసోసియేట్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాను. 'పవనిజం 2' సినిమాలో విలన్‌గానూ చేస్తున్నాను.

● రెండు బయోపిక్స్‌లో (మహానటి, ఎన్టీఆర్) మంచి పాత్రలు చేయడం సంతోషంగా ఉంది. ఎన్టీఆర్ బయోపిక్‌లో బీఏ సుబ్బారావు పాత్ర ఇచ్చినందుకు క్రిష్, బాలకృష్ణకు థ్యాంక్స్ చెప్పాలి.

● ఇంతకు ముందు తమిళ, మలయాళ రీమేక్స్ కోసం మనవాళ్లు వెళ్లేవారు. ఇప్పుడు వేరే భాషల వాళ్లే మన సినిమా రీమేక్స్ కోసం వస్తుండటం మంచి పరిణామం. మా అబ్బాయి నవీన్ 'ఊరంతా అనుకుంటున్నారు' సినిమాతో రాబోతున్నాడు.

అవసరమైతే 'మా' ఎన్నికల్లో నిలబడతా

సాధారణంగా నేను పదివులకి దూరంగా ఉంటాను. అయితే 'మా' మెంబర్‌గా 'మా' అసోసియేషన్‌లో అన్ని కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నా. 'మా' అధ్యక్ష ఎన్నికల్లో జయసుధ గారు నిలుచున్నప్పుడు దాసరిగారి ఆదేశంతో నేను పోటీ చేశాను. అప్పుడు 'మా' అసోసియేషన్ రెండుగా చీలిపోయినా మళ్లీ కలుపుకున్నాం. 'మా' అందించే సహాయాలకు అర్హులు ఎవరనే దాని మీద వర్క్ చేశాను. గతేడాది కొన్ని వివాదాలు జరిగాయి. రానున్న ఎన్నికలు కీలకంగా మారబోతున్నాయి. ఎన్నికలు అనివార్యం అయితే పెద్దలందర్నీ సంప్రదించి 'మా' ధర్మం, ప్రతిష్ఠల కోసం అవసరమైతే నిలబడతాను. అలా అని కుర్చీకే అతుక్కుపోను. ఒక టర్మ్ చేస్తానంతే.

సాక్షి స్పోర్ట్స్
ఆదివారం
20-1-2019

ప్రొఫెషనల్ సర్క్యూట్‌లో బాక్సర్ వికాస్ శుభారంభం



భారత బాక్సర్ వికాస్ క్రిషన్‌కు ప్రొఫెషనల్ సర్క్యూట్‌లో శుభారంభం లభించింది. న్యూయార్క్‌లో జరిగిన తన తొలి బౌట్‌లో వికాస్... స్టీవెన్ అండ్రడే (అమెరికా)పై గెలుపొందాడు. విఖ్యాత బాక్సింగ్ ప్రమోటర్ బాబ్ అరుమ్‌కు చెందిన 'టాప్ ర్యాంక్ ప్రమోషన్స్'తో ఇటీవల ఒప్పందం కుదుర్చుకున్న భారత బాక్సర్ వెల్టర్‌వెయిట్ కేటగిరీతో ప్రొఫెషనల్ కెరీర్ మొదలుపెట్టాడు. ఆరు రౌండ్ల ఈ బౌట్ కేవలం రెండు రౌండ్ల లోనే ముగిసింది. నిర్వాహకులు వికాస్ ప్రత్యర్థి అండ్రడే సాంకేతికంగా నాకౌట్ అయినట్లు ప్రకటించారు.



టెన్నిస్ గ్రేట్‌తో క్రికెట్ కింగ్

ఫెడరర్‌ను కలిసిన కోహ్లి

మెల్‌బోర్న్: అద్వితీయ విజయాలతో ఆస్ట్రేలియా పర్యటనను మరపురానిదిగా మార్చుకున్న భారత క్రికెట్ కెప్టెన్ విరాట్ కోహ్లి... ఓ అరుదైన చిత్రంతో దానిని మరింత గుర్తుండిపోయేలా చేసుకున్నాడు. భార్య అనుష్క శర్మతో కలిసి శనివారం ఇక్కడ జరుగుతున్న ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీని వీక్షించేందుకు వెళ్లిన అతడు... రాడ్ లేవర్ ఎరీనాలో టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెడరర్‌ను కలుసుకున్నాడు. ఈ మేరకు 'ఎప్పటికీ గొప్పగా నిలిచే ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఓ అద్భుతమైన రోజు. ఇక్కడి వేసవికి చక్కటి ముగింపు' అంటూ ఫొటోను ట్విట్టర్‌లో ఉంచాడు. 'ముగ్గురు దిగ్గజాలు... ఒక ఫొటోలో' అంటూ ఆస్ట్రేలియన్ ఓపెన్ నిర్వాహకులు సైతం ఓ ఫొటోను ట్విట్టర్‌లో పెట్టారు. కోహ్లి దంపతులు అంతకుముందు టోపీలు ధరించి ప్రపంచ నంబర్‌వన్ జొకోవిచ్ (సెర్బియా), షపవలోవ్ (కెనడా) మధ్య జరిగిన మ్యాచ్‌ను వీక్షించారు.

సైనా పోరు ముగిసె

మారిన్ చేతిలో ఓడిన భారత స్టార్

కౌలాలంపూర్: కొత్త సీజన్‌లో ఆడిన తొలి అంతర్జాతీయ టోర్నమెంట్‌లోనే ఫైనల్‌కు చేరాలని ఆశించిన భారత బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్‌కు నిరాశ ఎదురైంది. మలేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–500 టోర్నమెంట్‌లో సైనా సెమీఫైనల్ అడ్డంకిని దాటలేకపోయింది. ప్రపంచ చాంపియన్ కరోలినా మారిన్ (స్పెయిన్)తో శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ సైనా 16–21, 13–21తో ఓడిపోయింది. 40 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సైనా తొలి గేమ్ ఆరంభంలోనే 5–2తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే సైనాను గతంలో ఐదుసార్లు ఓడించిన మారిన్ వెంటనే కోలుకుంది. దూకుడుగా ఆడుతూ సైనాపై ఒత్తిడి పెంచుతూ వరుసగా ఏడు పాయింట్లు సాధించి 9–5తో ముందంజ వేసింది. ఆ తర్వాత ఇదే జోరును కొనసాగించిన మారిన్ తొలి గేమ్‌ను సొంతం చేసుకుంది. ఇక రెండో గేమ్‌లో మారిన్ మరింత విజృంభించగా... సైనా డీలా పడిపోయింది. ఈ గేమ్‌లో మొదటి పాయింట్ సైనా సాధించినా... ఆ తర్వాత మారిన్ ఆరు పాయింట్లు గెలిచి 6–1తో ఆధిక్యంలోకి వెళ్లి ఇక వెనుదిరిగి చూడలేదు. సెమీస్‌లో ఓడిన సైనాకు 5,075 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 3 లక్షల 61 వేలు)తోపాటు 6,420 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



సైనా

హలెప్ అలవోకగా...

- వీనస్‌పై గెలుపుతో ప్రిక్వార్టర్స్‌లోకి
- తదుపరి పోరులో సెరెనాతో సై
- శ్రమించిన ఒసాకా, ప్లిస్కోవా
- ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీ

గతేడాది ఆఖరి మెట్టుపై బోల్తా పడిన ప్రపంచ నంబర్‌వన్ క్రీడాకారిణి సిమోనా హలెప్ ఈసారి మాత్రం టైటిల్‌తో తిరిగి వెళ్లాలనే లక్ష్యం దిశగా మరో అడుగు ముందుకేసింది. సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఈ రొమేనియా అమ్మాయి అమెరికా వెటరన్ స్టార్ వీనస్ విలియమ్స్‌పై అలవోక విజయంతో ప్రిక్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. క్వార్టర్ ఫైనల్లో చోటు కోసం వీనస్ సోదరి సెరెనాతో హలెప్ అమీతుమీ తేల్చుకోనుంది. హలెప్‌తోపాటు సెరెనా, ముగురుజా సునాయాసంగా ముందంజ వేయగా... ఇతర సీడెడ్ క్రీడాకారిణులు నయోమి ఒసాకా, కరోలినా ప్లిస్కోవా, ఎలీనా స్వితోలినా మాత్రం మూడో రౌండ్ దాటేందుకు కష్ట పడ్డారు.

మెల్‌బోర్న్: టాప్ సీడ్ హోదాకు తగ్గ ప్రదర్శన చేస్తూ ప్రపంచ నంబర్‌వన్ టెన్నిస్ క్రీడాకారిణి సిమోనా హలెప్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. మాజీ నంబర్‌వన్ వీనస్ విలియమ్స్ (అమెరికా)తో శనివారం జరిగిన మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో హలెప్ 6–2, 6–3తో విజయం సాధించింది. 77 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో గతేడాది ఈ టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన హలెప్‌నకు ఏ దశలోనూ పోటీ ఎదురుకాలేదు. 19వసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడుతున్న వీనస్ మ్యాచ్ మొత్తంలో నాలుగు డబుల్ ఫాల్ట్‌లు, 33 అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకుంది. హలెప్ సర్వీస్‌లో ఆరుసార్లు బ్రేక్ పాయింట్లు సాధించే అవకాశం వచ్చినా 38 ఏళ్ల వీనస్ ఒక్కసారి మాత్రమే సద్వినియోగం చేసుకుంది. మరోవైపు 27 ఏళ్ల హలెప్ తన ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. సోమవారం సెరెనాతో జరిగే మ్యాచ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని హలెప్ వ్యాఖ్యానించింది. 'నేను ఓ గొప్ప చాంపియన్‌తో తలపడబోతున్నా. ఈ సవాల్‌కు నేను సిద్ధంగా ఉన్నా. ఫలితం ఎలా వచ్చినా కోల్పోయేదేమీ లేదు' అని తొలి రెండు రౌండ్ మ్యాచ్‌ల్లో మూడు సెట్‌లలో విజయాలను అందుకున్న హలెప్ తెలిపింది. మరోవైపు సెరెనా సునాయాస విజయం సాధించింది. 16వ సీడ్‌గా బరిలోకి దిగిన 37 ఏళ్ల సెరెనా 6–2, 6–1తో డయానా యెస్‌ట్రెంస్కా (ఉక్రెయిన్)పై గెలిచింది. ఆద్యంతం ఆధిపత్యం చలాయించిన సెరెనా ఎనిమిది ఏస్‌లు సంధించింది. ఓటమి తర్వాత కన్నీళ్లు పెట్టుకున్న డయానాను నెట్ వద్దకు వచ్చి సెరెనా ఓదార్చింది. ఇతర మూడో రౌండ్ మ్యాచ్‌ల్లో 17వ సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా) 6–3, 6–2తో 12వ సీడ్ ఎలీజ్ మెర్‌టెన్స్ (బెల్జియం)పై, 18వ సీడ్ గార్బిన్ ముగురుజా (స్పెయిన్) 7–6 (7/5), 6–2తో తిమియా బాసిన్‌స్కీ (స్విట్జర్లాండ్)పై, 13వ సీడ్ అనస్తాసియా సెవస్తోవా (లాత్వియా) 6–3, 6–3తో 21వ సీడ్ కియాంగ్ వాంగ్ (చైనా)పై గెలుపొంది ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు.

ఓటమి దిశ నుంచి...

మరోవైపు నాలుగో సీడ్ నయోమి ఒసాకా (జపాన్), ఆరో సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్), ఏడో సీడ్ కరోలినా ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్) మూడు సెట్‌లపాటు పోరాడి మూడో రౌండ్‌ను దాటారు. 28వ సీడ్ సు వె సెయి (చైనీస్ తైపీ)తో జరిగిన మ్యాచ్‌లో ఒసాకా 5–7, 6–4, 6–1తో గెలిచింది. గంటా 57 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఒసాకా తొలి సెట్‌ను కోల్పోయి రెండో సెట్‌లో 1–4తో వెనుకబడి ఓటమి దిశగా సాగింది. అయితే గత సంవత్సరం యూఎస్ ఓపెన్ ఫైనల్లో సెరెనాపై గెలిచి పెను సంచలనం సృష్టించిన ఒసాకా పట్టుదలతో పోరాడింది. వరుసగా ఐదు గేమ్‌లు గెలిచి రెండో సెట్‌ను 6–4తో దక్కించుకొని మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణాయక మూడో సెట్‌లో మాత్రం ఒసాకా ధాటికి సు వె సెయి ఎదురునిలువలేకపోయింది. 2 గంటల 55 నిమిషాలపాటు జరిగిన మరో మ్యాచ్‌లో స్వితోలినా 4–6, 6–4, 7–5తో షుయె జాంగ్ (చైనా)పై, 2 గంటల 11 నిమిషాల పోరులో ప్లిస్కోవా 6–4, 3–6, 6–2తో 27వ సీడ్ కామిల్లా జార్జి (ఇటలీ)పై గెలుపొందారు.



సిమోనా హలెప్



జొకోవిచ్ ముందుకు...

పురుషుల సింగిల్స్ విభాగంలో టాప్ సీడ్ జొకోవిచ్ (సెర్బియా), నాలుగో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ), ఎనిమిదో సీడ్ నిషికోరి (జపాన్) ప్రిక్వార్టర్ ఫైనల్లోకి చేరారు. జొకోవిచ్ 6–3, 6–4, 4–6, 6–0తో 25వ సీడ్ షపవలోవ్ (కెనడా)పై, జ్వెరెవ్ 6–3, 6–3, 6–2తో అలెక్స్ బోల్ట్ (ఆస్ట్రేలియా)పై, నిషికోరి 7–6 (8/6), 6–1, 6–2తో జోవో సుసా (పోర్చుగల్)పై గెలిచారు. ఇతర మూడో రౌండ్ మ్యాచ్‌ల్లో 11వ సీడ్ కొరిచ్ (క్రొయేషియా) 2–6, 6–3, 6–4, 6–3తో క్రాజ్నోవిచ్ (సెర్బియా)పై, 23వ సీడ్ కరెనో బుస్టా (స్పెయిన్) 6–2, 6–4, 2–6, 6–4తో 12వ సీడ్ ఫాగ్‌నిని (ఇటలీ)పై, 15వ సీడ్ మెద్వెదెవ్ (రష్యా) 6–2, 7–6 (7/3), 6–3తో 21వ సీడ్ గాఫిన్ (బెల్జియం)పై, 16వ సీడ్ రావ్‌నిచ్ (కెనడా) 6–4, 6–4, 7–6 (8/6)తో హెర్బర్ట్ (ఫ్రాన్స్)పై, 28వ సీడ్ లుకాస్ పుయి (ఫ్రాన్స్) 7–6 (7/3), 6–3, 6–7 (10/12), 4–6, 6–3తో పాపిరిన్ (ఆస్ట్రేలియా)పై నెగ్గారు.



పేస్ జంట శుభారంభం

మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత స్టార్స్‌కు మిశ్రమ ఫలితాలు లభించాయి. తొలి రౌండ్‌లో లియాండర్ పేస్ (భారత్)–సమంత స్టోసుర్ (ఆస్ట్రేలియా) ద్వయం 6–4, 7–5తో క్వెటా పెశెక్ (చెక్ రిపబ్లిక్)–వెస్లీ కూలాఫ్ (నెదర్లాండ్స్) జంటను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. అయితే రోహన్ బోపన్న (భారత్)–జావోజువాన్ యాంగ్ (చైనా) జోడీ 6–3, 3–6, 6–10తో 'సూపర్ టైబ్రేక్'లో రాబర్ట్ ఫరా (కొలంబియా)–అనా లెనా గ్రోన్‌ఫెల్డ్ (జర్మనీ) జంట చేతిలో ఓడిపోయింది.

సౌరాష్ట్ర సాధించెన్



- ఉత్తరప్రదేశ్‌పై రికార్డు లక్ష్యాన్ని ఛేదించి సెమీస్‌లోకి
- హార్విక్ సెంచరీ; రాణించిన పుజారా, జాక్సన్

లక్నో: దేశవాళీ ఫస్ట్‌క్లాస్ టోర్నీ రంజీ ట్రోఫీలో సౌరాష్ట్ర అద్భుతం చేసింది. ఉత్తరప్రదేశ్‌తో ఇక్కడ జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఏకంగా 372 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి సెమీఫైనల్ చేరింది. తద్వారా 2008–09 సీజన్‌లో సర్వీసెస్‌పై అసోం నెలకొల్పిన అత్యధిక పరుగుల ఛేదన రికార్డు (371 పరుగులు)ను బద్దలు కొట్టింది. బ్యాటింగ్ వైఫల్యంతో తొలి ఇన్నింగ్స్‌లో 177 పరుగులు వెనుకబడినా... రెండో ఇన్నింగ్స్‌లో తేరుకుని సెమీస్ గడపతొక్కింది. లక్ష్యాన్ని అందుకునే క్రమంలో ఓవర్‌నైట్ స్కోరు 195/2తో శనివారం చివరి రోజు ఆట కొనసాగించిన సౌరాష్ట్రను ఓపెనర్ హార్విక్ దేశాయ్ (259 బంతుల్లో 116; 16 ఫోర్లు) కెరీర్‌లో తొలి శతకంతో ముందుకు నడిపించాడు. అయితే, అతడితో పాటు మక్వానా (7) వెంటవెంటనే ఔటయ్యారు. ఈ దశలో టీమిండియా బ్యాట్స్‌మన్ చతేశ్వర్ పుజారా (110 బంతుల్లో 67 నాటౌట్; 9 ఫోర్లు), షెల్డన్ జాక్సన్ (109 బంతుల్లో 73 నాటౌట్; 11 ఫోర్లు, 1 సిక్స్) సంయమనం చూపారు. రెండుసార్లు ఔటయ్యే ప్రమాదాన్ని తప్పించుకున్న వీరు ఐదో వికెట్‌కు అజేయంగా 136 పరుగులు జోడించి జట్టును గెలిపించారు. దీంతో ఆరు వికెట్ల తేడాతో సౌరాష్ట్ర విజయం సాధించింది. కనీసం 'డ్రా' చేసుకున్నా తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ద్వారా సెమీస్ చేరే అవకాశాన్ని కోల్పోయిన ఉత్తరప్రదేశ్ ఉసూరుమంటూ వెనుదిరిగింది.

విదర్భ మరోసారి...

సొంతగడ్డ నాగ్‌పూర్‌లో ముగిసిన మరో క్వార్టర్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ విదర్భ ఇన్నింగ్స్ 115 పరుగులతో ఉత్తరాఖండ్‌పై గెలుపొంది సెమీస్ చేరింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం (274 పరుగులు)తో విదర్భ సెమీస్ బెర్త్ ముందే ఖాయమైంది. నామమాత్రమైన రెండో ఇన్నింగ్స్‌లో ఓవర్‌నైట్ స్కోరు 152/5తో శనివారం ఆట కొనసాగించిన ఉత్తరాఖండ్... టీమిండియా పేసర్ ఉమేశ్ యాదవ్ (5/23), ఎడంచేతి వాటం స్పిన్నర్ ఆదిత్య సర్వాతె (5/55) ధాటికి ఏడు పరుగులకే మిగతా ఐదు వికెట్లు కోల్పోయి 159 పరుగులకే ఆలౌటైంది. ఈనెల 24న మొదలయ్యే సెమీఫైనల్స్‌లో కేరళతో విదర్భ; కర్ణాటకతో సౌరాష్ట్ర తలపడతాయి.

రాహుల్, పాండ్యాలపై నిషేధం ఎత్తేయండి

సీఓఏను కోరిన బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా

న్యూఢిల్లీ: యువ క్రికెటర్లు కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యాలపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయాల్సిందిగా బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా... క్రికెట్ పాలకుల కమిటీ (సీఓఏ)కి లేఖ రాశారు. టీవీ షోలో మహిళలను కించపర్చే వ్యాఖ్యలు చేసినందుకు ఈ క్రికెటర్లిద్దరూ టీమిండియాకు దూరమైన సంగతి తెలిసిందే. అయితే, ప్రతిష్టాత్మకమైన ప్రపంచకప్‌నకు నాలుగు నెలలే ఉన్నందున వీరికి మ్యాచ్ ప్రాక్టీస్ అవసరమని, వర్ధమాన ఆటగాళ్లైనందున ఓ అవకాశం ఇద్దామని ఖన్నా కోరారు. 'వారు ఇప్పటికే బేషరతుగా క్షమాపణ కోరారు. విచారణ కొనసాగిస్తూనే, రాహుల్, పాండ్యాలను తక్షణమే జాతీయ జట్టులోకి తీసుకుని న్యూజిలాండ్ పంపాలని సీఓఏ, బీసీసీఐ అధికారులను కోరుతున్నా. ఆ ఇద్దరిది ముమ్మాటికీ తప్పే. అయినప్పటికీ చట్టాలను ఉల్లంఘించిన వారిగా చూడటం తప్పనేది నా వ్యక్తిగత అభిప్రాయం' అని లేఖలో ఖన్నా పేర్కొన్నారు. మరోవైపు ఈ విషయంలో విచారణ కోసం అంబుడ్స్‌మన్‌ను నియమించేందుకు ఖన్నా... బీసీసీఐ ప్రత్యేక సర్వసభ్య సమావేశం (ఎస్‌జీఎం) నిర్వహించాలని కోరుతున్నారు. ఇదే అభిప్రాయంతో బోర్డు కోశాధికారి అనిరుధ్ చౌదరి సైతం ఖన్నాకు లేఖ రాశారు. బీసీసీఐ రాజ్యాంగం ప్రకారం వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) ద్వారా ఈ మేరకు అధికారాలున్నాయి. కానీ, ఈ అంశం సుప్రీంకోర్టు పరిధిలోకి వెళ్లినందున తదుపరి ఏ చర్యలు తీసుకున్నా కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని బోర్డు సీనియర్ అధికారి ఒకరు చెప్పుకొచ్చారు.



ఎంపీ యోధపై హరియాణా గెలుపు



రవి

లుధియానా: ప్రొ రెజ్లింగ్ లీగ్ (పీడబ్ల్యూఎల్)లో యువ రెజ్లర్ రవికుమార్... సందీప్ కుమార్‌కు షాకిచ్చాడు. దీంతో శనివారం జరిగిన మ్యాచ్‌లో హరియాణా హ్యామర్స్ 4–3తో ఎంపీ యోధపై గెలుపొందింది. 86 కేజీల పురుషుల బౌట్‌లో అలీ షబనోవ్ 8–0తో దీపక్ (ఎంపీ యోధ)పై గెలుపొందగా, మహిళల 76 కేజీల విభాగంలో కిరణ్ 0–6తో అండ్రియా కరోలినా (ఎంపీ యోధ) చేతిలో కంగుతింది. పురుషుల 65 కేజీల కేటగిరీలో రజనీశ్ 0–5తో హాజి అలియెవ్ (ఎంపీ యోధ) చేతిలో కంగుతినడంతో హరియాణా 1–2తో వెనుకబడింది. ఈ దశలో హ్యామర్స్‌కు తయన ఒమెల్చెంకో (మహిళల 62 కేజీలు) 6–0తో ఎలైస్ మనొలొవ (ఎంపీ యోధ)పై గెలిచి స్కోరును 2–2తో సమం చేసింది. పురుషుల 74 కేజీల్లో ప్రవీణ్ రాణా 0–7తో వసిల్ మిఖాయిలొవ్ (ఎంపీ యోధ) చేతిలో పరాజయం చవిచూడగా, మహిళల 57 కేజీల విభాగంలో నిచిత 8–0తో పూజ ధండ (ఎంపీ యోధ)పై నెగ్గింది. స్కోరు 3–3తో సమమైన దశలో నిర్ణాయక పురుషుల 57 కేజీల విభాగంలో రవి 10–0తో సందీప్ తోమర్ (ఎంపీ యోధ)ను కంగుతినిపించడంతో లీగ్‌లో హ్యామర్స్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది.

ఆమ్లా సెంచరీ: దక్షిణాఫ్రికా 266/2

పోర్ట్ ఎలిజబెత్: వెటరన్ ఓపెనర్ హషీమ్ ఆమ్లా (120 బంతుల్లో 108 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్) చాన్నాళ్ల తర్వాత తనదైన స్థాయి ఇన్నింగ్స్ ఆడాడు. అతడి అజేయ శతకంతో పాటు అరంగేట్ర ఆటగాడు వాన్ డెర్ డసెన్ (101 బంతుల్లో 93; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరవడంతో శనివారం పాకిస్తాన్‌తో తొలి వన్డేలో దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 266 పరుగులు చేసింది. మరో ఓపెనర్ హెన్‌డ్రిక్స్ (67 బంతుల్లో 45; 5 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. ఆమ్లా, హెన్‌డ్రిక్స్ తొలి వికెట్‌కు 82 పరుగులు జోడించారు. 18వ ఓవర్లో షాదాబ్ ఖాన్ బౌలింగ్‌లో హెన్‌డ్రిక్స్ ఔటయ్యాడు. అనంతరం ఆమ్లా, వాన్ డెర్ రెండో వికెట్‌కు 155 పరుగులు జత చేశారు. సెంచరీ దిశగా సాగుతున్న వాన్ డెర్ 47వ ఓవర్లో హసన్ అలీ బౌలింగ్‌లో షోయబ్ మాలిక్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. హఫీజ్ వేసిన ఇన్నింగ్స్ 48వ ఓవర్ చివరి బంతిని సిక్సర్‌గా మలిచి ఆమ్లా కెరీర్‌లో 27వ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. అనంతరం 267 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్తాన్ కడపటి వార్తలు అందే సమయానికి 42 ఓవర్లలో నాలుగు వికెట్లకు 223 పరుగులు చేసింది.



హాజల్‌వుడ్ ఔట్

గాయంతో శ్రీలంక సిరీస్‌కు దూరం



మెల్‌బోర్న్: అసలే భారత్‌తో సొంతగడ్డపై ఎదురైన పరాభవాల నుంచి కోలుకోని ఆస్ట్రేలియాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. సీనియర్ పేసర్, వైస్ కెప్టెన్ హాజల్‌వుడ్ గాయంతో ఆటకు దూరమయ్యాడు. వెన్నునొప్పితో బాధపడుతున్న అతను త్వరలో శ్రీలంకతో జరిగే రెండు టెస్టుల సిరీస్‌లో పాల్గొనడం లేదు. ఈ ఆసీస్ వైస్ కెప్టెన్ గతేడాది కూడా వెన్నుగాయంతో ఇబ్బందిపడ్డాడు. మరోవైపు క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ఫిజియోథెరపిస్ట్ డేవిడ్ బెక్లే తమ పేసర్... ప్రపంచకప్ సమయానికల్లా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటాడనే ధీమా వ్యక్తం చేశారు. స్కానింగ్‌లో కింది వెన్నుభాగంలో ఇబ్బందులున్నట్లు తేలింది. త్వరలోనే అతనికి పునరావాస శిబిరంలో శిక్షణ ఇస్తామని ఆయన చెప్పారు. లంకతో డేనైట్‌లో జరిగే తొలిటెస్టు ఈ నెల 24న బ్రిస్బేన్‌లో మొదలవుతుంది. అనంతరం రెండో టెస్టు వచ్చే నెల 1 నుంచి కాన్‌బెర్రాలో జరుగుతుంది.

అర్జున్ పరాజయం

చెన్నై: వరుసగా రెండు విజయాలు సాధించిన తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఎరిగైసి అర్జున్‌కు మూడో రౌండ్‌లో చుక్కెదురైంది. చెన్నై ఓపెన్ అంతర్జాతీయ గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో అర్జున్‌కు తొలి ఓటమి ఎదురైంది. రాసెట్ జియాత్‌దినోవ్ (అమెరికా)తో శనివారం జరిగిన మూడో రౌండ్ గేమ్‌లో అర్జున్ 61 ఎత్తుల్లో ఓడిపోయాడు. తొలి రౌండ్‌లో అర్జున్ 47 ఎత్తుల్లో బద్రీ నారాయణ (భారత్)పై, రెండో రౌండ్‌లో 37 ఎత్తుల్లో రెహమాన్ (బంగ్లాదేశ్)పై విజయం సాధించాడు. మూడో రౌండ్ తర్వాత మూడు పాయింట్లతో 24 మంది సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు.

ఆ రైలెక్కితే బడే..


రైలు ఎక్కుతున్నట్లుగా విద్యార్థులు

ఈ విద్యార్థులు విహార యాత్ర కోసం రైలు బోగీలోకి ఎక్కుతున్నారని అనుకుంటున్నారా.. అయితే పప్పులో కాలేసినట్లే. ఇది నిజమైన రైలు కాదు. విద్యార్థులను పాఠశాలకు రప్పించడం కోసం తరగతి గదులనే బోగీలుగా మలిచి రైలు బండిగా రూపొందించారు ఆ స్కూలు ప్రధానోపాధ్యాయుడు మనోహర్. సిద్దిపేట జిల్లా రూరల్ మండల పరిధిలోని బుస్సాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఇలా వినూత్నంగా చిన్నారులను ఆకర్షిస్తోంది. పాఠశాలలో ఐదు గదులు ఉన్నాయి. దుద్దెడకు చెందిన చిత్రకారుడు భాస్కర్‌తో కలసి ప్రధానోపాధ్యాయుడు మనోహర్ పాఠశాల భవనాన్ని రైలు ఇంజిన్, బోగీలుగా తీర్చిదిద్దారు. దీనికోసం రూ.60 వేల ఖర్చుకాగా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అందించారు. తరగతి గదుల్లో పాఠ్యాంశాలకు సంబంధించిన చిత్రాలు గీయించి పిల్లలకు బడి అంటే ఆసక్తి కలిగేలా కృషి చేస్తున్నారాయన. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులను రప్పించడం కోసం ఇలాంటి వినూత్న ఆలోచనలతో అడుగులు వేసిన ప్రధానోపాధ్యాయుడిని అందరూ అభినందిస్తున్నారు.

– సిద్దిపేట



అనాథను అమ్మ చేశారు!

- బస్టాండ్‌లో అష్టకష్టాలు పడుతున్న యువతి
- ఆదుకునే వారు లేక బిత్తర చూపులు చూస్తున్న వైనం
- ఆకలి తీరుస్తున్న ఆర్టీసీ సిబ్బంది



నర్సంపేట: వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట బస్టాండ్‌లో సుమారు 28 సంవత్సరాల యువతి బిత్తర చూపులు చూస్తూ అటూ ఇటూ తిరుగుతూ ఉంటుంది. ఏ ఊరో తెలియదు.. మతి స్థిమితం లేదు. బాగానే మాట్లాడుతుంది. నా అన్న వారు అందరూ ఉన్నారంటుంది. కాని ఆమెను ఎవరూ తీసుకెళ్లరు. ఫుట్‌పాత్‌లు, బస్టాండ్‌లో జీవనం గడుపుతోంది. రాత్రిళ్లు ఫుట్‌పాత్‌లపై నిద్రించే ఆ యువతిపై ఎవరు అఘాయిత్యం చేశారో తెలియదు కాని ఆమె ఇప్పుడు నిండు గర్భవతి అయింది. బస్టాండ్ సెంటర్‌లో ఉండే హోటళ్లవారు, ఆర్టీసీ సిబ్బంది వారు ఇచ్చే తినుబండారాలే ఆమె ఆహారం.. రాత్రివేళ బస్టాండ్ ప్రాంగణంలోనే నిద్రిస్తోంది. బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులను చిల్లర డబ్బులు అడుగుతూ యాచించడం అందరినీ కలిచివేసింది. ఆర్టీసీ జూనియర్ అసిస్టెంట్ నామిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీనివాస్, జానీలతో పాటు క్యాంటీన్ నిర్వాహకుడు వినయ్‌లు ప్రతిరోజు పండ్లు, పాలు అందిస్తూ దాతృత్వం చాటుకుంటున్నారు. రేపో మాపో డెలివరీకి అవకాశాలు ఉన్న ఆ యువతికి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. వెంటనే ఆమెకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం ఉందని స్థానికులు తెలుపుతున్నారు.

అడిగితే అన్నీ చెబుతోంది..

నిండు గర్భవతిగా ఆ యువతి తన పేరు గర్నెపల్లి రజిని అని, తన తాత రేబల్లె గ్రామంలో సైకిల్ పంచర్లు అతుకుతుంటాడని, తన తండ్రి పేరు కుంటాల రమేష్ అని తల్లి రాజేశ్వరిని చెబుతుంది. అయితే అన్నీ విషయాలు చెబుతున్న ఆమె ఇంటికి ఎందుకు వెళ్లడం లేదని అడిగితే మాత్రం చెప్పడం లేదు..

పట్టించుకోని ఐసీడీఎస్ అధికారులు

అందరూ ఉండి అనాథగా మారి ఆకతాయిల చేతిలో వంచనకు గురయిన ఆ యువతిని రక్షించాల్సిన బాధ్యత ఐసీడీఎస్ అధికారులపై ఉంది. ఏడాది కాలంగా బస్టాండ్‌లో జీవనం గడుపుతూ గర్భవతి అయిన ఆ యువతిని ఐసీడీఎస్ అధికారులు గుర్తించక పోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గర్భిణి రజినికి రక్షణ కల్పించడంతో పాటు ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

తుది దశకు అన్నారం బ్యారేజీ పనులు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం బ్యారేజీ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఫిబ్రవరి చివరి నాటికి పనులు పూర్తి చేసి ఇరిగేషన్ అధికారులకు అప్పగించడానికి కాంట్రాక్టర్లు శ్రమిస్తున్నారు. ఇప్పటికే బ్యారేజీలో 66 గేట్లు, వంతెన పనులు పూర్తయ్యాయి. బ్యారేజీ పైనుంచి రాకపోకలు సాగించడానికి అప్రోచ్ రోడ్డు మంచిర్యాల జిల్లా వైపు 1.25 కిలోమీటర్లు, జయశంకర్ జిల్లా వైపు 800 మీటర్ల పనులు పూర్తయ్యాయి. బ్యారేజీకి కుడి వైపున 16 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి పనులకు 2లక్షల క్యూబిక్ మీటర్ల పనులు చేపట్టారు. మట్టి పైన టీఎస్ఈఆర్ఎల్ (తెలంగాణ స్టేట్ ఇంజనీరింగ్ రీసెర్చ్ లాబోరేటరీ) బృందం టెస్టింగ్ నిర్వహించారు. నీరు బ్యారేజీ గుండా సమాంతరంగా తరలి వెళ్లడానికి పరిశోధన చేశారు. మిగిలిన సీసీ చూట్ డ్రైన్స్, ప్యారపెట్ వాల్స్, ప్రొఫైల్ వాల్స్, రివిట్‌మెంట్ వాల్స్, గార్డు స్టోన్, పెయింటింగ్ వర్క్స్, క్వాలిటీ ఫెక్సింగ్, ప్రిపొల్యూషన్ పెస్టింగ్, ఎలక్ట్రోటర్మ్ టెస్ట్, 370 మైక్రో పేయింటింగ్ వర్క్ చేయాల్సి ఉందని ఇంజినీర్లు తెలిపారు. ఇవన్నీ ఫిబ్రవరి లోపు పూర్తవుతాయని ఈఈ యాదగిరి పేర్కొన్నారు.

అత్యాధునిక క్రేన్ వినియోగం

అన్నారం బ్యారేజీలో అత్యాధునిక టెక్నాలజీతో నడిచే గ్యాంట్రీ క్రేన్‌ను గేట్ల బిగింపు పనులకు వినియోగిస్తున్నారు. గేట్లకు మరమ్మతులు చేసినప్పుడు 50 మెట్రిక్ టన్నుల బరువును లేపడానికి ఈ క్రేన్‌ను వినియోగిస్తామని ఇంజనీర్లు చెప్పారు.


గ్యాంట్రీ క్రేన్

ప్రాణం తీసిన భూ తగాదా

ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం

రాయికల్ (జగిత్యాల): వ్యవసాయ భూపంపిణీ తగాదా ఓ వ్యక్తి ప్రాణం తీసింది. ఈ సంఘటన జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కుర్మపల్లిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై కరుణాకర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పుల్ల మల్లయ్యకు నలుగురు కుమారులు. మొదటి కొడుకు హన్మంతు, రెండో కుమారుడు పోశాలు, మూడో కుమారుడు లస్మయ్య, నాలుగో కుమారుడు రాజేశం ఉన్నారు. రెండో కుమారుడు పోశాలు పేరిట 299 సర్వే నంబర్‌లో 1.07 ఎకరాల భూమి ఉంది. మూడో కుమారుడు లస్మయ్యతోపాటు పోశాలుకు గ్రామ శివారులో పక్కపక్కనే చెరో రెండెకరాల భూమి ఉంది. కొంతకాలంగా వీరి మధ్య గెట్ల విషయంతో పాటు 1.07 ఎకరాల విషయంలో పంచాయితీ నడుస్తోంది. ఈ భూమిలో తనకు వాటా ఉంటుందని, తన పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని లస్మయ్య కోరుతున్నాడు. దీనిపై పలు మార్లు పంచాయితీలు జరిగాయి. అప్పటి నుంచి ఇద్దరి మధ్య తీవ్ర కక్షలు పెరిగాయి. ఇటీవల లస్మయ్య కొడుకు మహేశ్ దుబాయ్ నుంచి వచ్చాడు. శనివారం పోశాలు, ఆయన కొడుకు గంగమల్లయ్య (35) కలసి వ్యవసాయ పనులకు వెళ్లారు. వారి వెంటే పుల్ల లస్మయ్య, ఆయన భార్య గంగవ్వ, కొడుకు మహేశ్ వెళ్లారు. పొలం వద్ద మాటామాట పెరిగింది. దీంతో లస్మయ్య, ఆయన కుమారుడు గంగమల్లయ్యపై గొడ్డలితో తలభాగంపై దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోశాలుపైనా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను కరీంనగర్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.


మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

చకచకా యాగం ఏర్పాట్లు

పనులను పర్యవేక్షిస్తున్న శృంగేరి పండితులు

జగదేవ్‌పూర్: సీఎం కేసీఆర్ ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో మరో యాగం నిర్వహించనున్నారు. దీనికోసం ఏర్పాట్లు చివరి దశకు చేరాయి. ఈ నెల 21 నుంచి 25 వరకు మహారుద్ర సహిత సహస్ర చండీ మహాయాగం నిర్వహించడానికి వేద పండితులు నిర్ణయించారు. గతంలో నిర్వహించిన ఆయుత చండీయాగం మాదిరిగానే శృంగేరి పీఠం సంప్రదాయంలో ఈ యాగాన్ని కూడా నిర్వహించడానికి పండితులు నిర్ణయించారు. శృంగేరి పీఠం పండితులు ఫణిశశాంక శర్మ, గోపికృష్ణ శర్మల ఆధ్వర్యంలో యాగాన్ని నిర్వహించనున్నారు. ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. మూడు యాగశాలలతో పాటు 27 హోమగుండాలను ఏర్పాటు చేస్తున్నారు.

వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్న రుత్వికులు

సీఎం కేసీఆర్ నిర్వహించనున్న యాగంలో పాల్గొనే రుత్వికులు శనివారం సాయంత్రం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్నారు. శృంగేరి పీఠానికి చెందిన పండితులతోపాటు కర్ణాటక నుంచి 200 మంది రుత్వికులు ఫాంహౌస్‌కు చేరుకున్నారు. హైదరాబాద్ నుంచి వారిని ప్రత్యేక వాహనాల్లో వ్యవసాయ క్షేత్రానికి తీసుకువచ్చారు. వారు బస చేయడానికి ఫాంహౌస్ ప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. వీరితో పాటు స్థానికంగా ఉన్న పది మంది పండితులు యాగ నిర్వహణలో పాల్గొననున్నారు. ఆదివారం సీఎం కేసీఆర్ హైదరాబాద్ నుంచి వ్యవసాయ క్షేత్రానికి చేరుకోనున్నారని సమాచారం.


ఎర్రవల్లిలోని యాగశాల

హంపి పీఠాధిపతికి తప్పిన ప్రమాదం

భూత్పూర్ (దేవరకద్ర): మహబూబ్‌నగర్ జిల్లా మీదుగా వెళ్లే జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున కారు, డీసీఎం వాహనం ఢీకొన్న ఘటనలో హంపి పీఠాధిపతి గోవిందానంద సరస్వతి స్వామికి తృటిలో ప్రమాదం తప్పింది. భూత్పూర్ ఎస్సై పర్వతాలు కథనం ప్రకారం.. భూత్పూర్ మండల సమీపంలోని శేరిపల్లి (హెచ్) వద్ద తెల్లవారుజామున హంపి పీఠాధిపతి గోవిందానంద సరస్వతి స్వామి తన శిష్యులతో కారులో కర్నూలు నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్నారు. ఈ సమయంలో ముందు వెళ్తున్న డీసీఎం వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఆ వాహనానికి కారు తగలడంతో డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. అయితే, కారులో ఉన్న హంపి పీఠాధిపతితో పాటు ఆరుగురు శిష్యులకు ఎలాంటి గాయాలు కాలేదు. కారు డ్రైవర్ సురేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో హంపి పీఠాధిపతి, ఆయన శిష్యులు మరో వాహనంలో హైదరాబాద్ బయలుదేరారు.


మరో వాహనంలో బయలుదేరుతున్న పీఠాధిపతి శిష్యులు

చీరలు పట్టివేత

వేములవాడరూరల్: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం మల్లారం గ్రామంలోని ఓ మాజీ ప్రజాప్రతినిధి ఇంట్లో చీరలను పంచుతుండగా ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు శనివారం పట్టుకున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా చీరలు నిల్వ చేసి మహిళా ఓటర్లకు పంచుతున్నట్లు సమాచారం అందడంతో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వెంటనే చేరుకుని తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 20కి పైగా చీరలు లభించాయి. రెండు వార్డుల్లో వాటిని పంపిణీ చేసేందుకు మాజీ ప్రజాప్రతినిధి లెటర్‌ప్యాడ్‌పై వివరాలు రాసి ఉన్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి తిరుమల్‌రెడ్డి తెలిపారు. ఆ లెటర్ ప్యాడ్‌లో కొన్ని చీరలు పంచినట్లు గుర్తులు పెట్టి.. మరికొన్నింటిని ఇతర ప్రాంతాలకు పంచాలని వార్డు నంబర్‌తోసహా ఉన్నట్లు పేర్కొన్నారు. చీరలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్మీ జవాన్ మృతి


అంజయ్య (ఫైల్)

మద్దూరు (కొడంగల్): మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఓ ఆర్మీ జవాన్ మృతి చెందాడు. మద్దూరు మండలంలోని పల్లెర్ల గ్రామానికి చెందిన పి.అంజయ్య(28) 2010 జూన్ 14న ఆర్మీలో చేరాడు. ప్రస్తుతం ఆయన భార్యాపిల్లలతో కలసి ఉత్తరప్రదేశ్‌లోని బబినా జిల్లాలో ఉంటూ ఆర్మీ ఆస్పత్రిలో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. డ్యూటీలో భాగంగా ఆర్మీకి సంబంధించిన కొత్త వాహనాలను శనివారం ఢిల్లీ నుంచి బబినాకు వస్తుండగా.. హైవేపై ఓవర్‌టేక్ చేసే క్రమంలో ముందర ఉన్న భారీ వాహనాన్ని ఢీకొట్టడంతో అంజయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. గ్వాలియర్ వద్ద జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో మరో జవాను కూడా మృతి చెందాడు. అంజయ్య మృతి చెందిన వార్త తెలియడంతో ఆయన కుటుంబంలో విషాదం అలుముకుంది.

మొదటి విడతలో 74 లక్షల జీవాల పంపిణీ

నల్లగొండ అగ్రికల్చర్: మొదటి విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంలో 74 లక్షల జీవాలను 3.5 లక్షల మంది లబ్ధిదారులకు అందజేసినట్టు రాష్ట్ర గొర్రెల అభివృద్ధి సహకార సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మారెడ్డి తెలిపారు. శనివారం ఆయన నల్లగొండలో విలేకరులతో మాట్లాడుతూ, మొదటి విడత గొర్రెల పంపిణీ కోసం రూ.3,300 కోట్ల నిధులను వెచ్చించామన్నారు. ఇప్పటివరకు 50 లక్షల గొర్రె పిల్లలు పుట్టాయన్నారు. వీటి ద్వారా గ్రామ స్థాయిలో రూ.2,500 కోట్ల సంపదను సృష్టించినట్లు తెలిపారు. మొదటి విడత గొర్రెల పంపిణీలో నల్లగొండ జిల్లా రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. జీవాలకు పశుగ్రాసం, నీటి ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. గడ్డి విత్తనాలను అందజేయడంతో పాటు నీటితొట్లు, గొర్రెల షెడ్ల నిర్మాణం కోసం ఉపాధి హామీ నిధులను వినియోగించుకునేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చిందన్నారు.

అశ్రునయనాలతో అంతిమవీడ్కోలు

గుర్రపు తండాలో ముగ్గురు పిల్లల మృతదేహాలకు అంత్యక్రియలు

చందంపేట : అగ్నిప్రమాదంలో మృతిచెందిన ముగ్గురు విద్యార్థులకు తండావాసులు, పలువురు ప్రముఖులు శనివారం కన్నీటి వీడ్కోలు పలికారు. నల్లగొండ జిల్లా నేరెడుగొమ్ము మండలం గుర్రపుతండాకు చెందిన శ్రీనివాస్‌నాయక్, సుజాత దంపతుల పిల్లలు సాత్విక (18) సుహాస్‌నాయక్ (16) జై సుచిత (14) గత ఏడాది డిసెంబర్‌లో అమెరికాలో జరిగిన అగ్ని ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. 25 రోజుల తర్వాత ఆ ముగ్గురి మృతదేహాలను శుక్రవారం గుర్రపుతండాకు తీసుకువచ్చారు. శనివారం క్రైస్తవ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. వివిధ ప్రాంతాలనుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన క్రైస్తవ మత పెద్దలు, బంధుమిత్రులు నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్‌నాయక్‌కు చెందిన వ్యవసాయ క్షేత్రంలో ముగ్గురి మృతదేహాలకు అంత్యక్రియల కార్యక్రమం పూర్తిచేశారు.



సాక్షి పెళ్ళిచూపులు

ఆదివారం 20-1-2019

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

పన్ను దొంగలిస్తున్న కంపెనీలు ఇవే..

- రాజమండ్రిలో 1, కడపలో 2 కంపెనీలు
- రూ. 3 కోట్ల మేర రికవరీ చేసిన జీఎస్టీ కమిషనరేట్

సాక్షి, హైదరాబాద్: ఐరన్ అండ్ స్టీల్ వ్యాపారం పేరుతో నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించి ఎలాంటి వ్యాపారం చేయకుండానే కోట్ల రూపాయలను ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) రూపంలో కొల్లగొడుతున్న మూడు కంపెనీలను హైదరాబాద్ జీఎస్టీ కమిషనరేట్ గుర్తించింది. రాజమండ్రి, కడప కేంద్రాలుగా కాగితాలపై సృష్టించిన మూడు షెల్ కంపెనీలను గుర్తించి వాటి నుంచి రూ.3 కోట్ల మేర రికవరీ చేసినట్లు శనివారం జీఎస్టీ కమిషనరేట్ వర్గాలు వెల్లడించాయి. ఈ కేసులో గతేడాది నవంబర్‌లో ఆరుగురు షెల్ కంపెనీల సృష్టికర్తలను అరెస్టు చేయగా, ఇప్పుడు ఆ కంపెనీల ద్వారా లాభం పొందుతున్న వారిని గుర్తించామని కమిషనరేట్ అధికారులు వెల్లడించారు. వారి నుంచి రూ.3 కోట్లు పన్ను రికవరీ చేయడంతో పాటు దీనికి బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా, ఈ ఏడాది వాణిజ్య పన్నుల ద్వారా రూ.3,343 కోట్ల రెవెన్యూ రాగా, వ్యాపారులు ఐటీసీ పేరుతో రూ. 6 వేల కోట్ల వరకు క్లెయిమ్ చేసుకుంటున్నారని, ఇలా క్లెయిమ్ చేసుకుంటున్న వాటిలో దాదాపు 70% నకిలీవేనని ఆ శాఖ అధికారులే చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇలాంటి దొంగ కంపెనీలను గుర్తించి నకిలీ క్లెయిమ్‌లను నివారించినప్పుడే ప్రభుత్వ ఖజానాకు లాభం కలగనుంది.

వచ్చేనెల 15 నుంచి టెన్త్ ప్రీ-ఫైనల్

సాక్షి, హైదరాబాద్: టెన్త్ ప్రీ–ఫైనల్ పరీక్షలను వచ్చేనెల 15వ తేదీ నుంచి నిర్వహించేందుకు రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) షెడ్యూల్ జారీ చేసింది. అలాగే ఒకటో తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు మార్చి 30 నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు సమ్మేటివ్ అసెస్మెంట్–2 (ఎస్‌ఏ–2) పరీక్షలను నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఈ మేరకు శనివారం ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ డీఈవోలకు ఆదేశాలు జారీ చేశారు.

టెన్త్ ప్రీ-ఫైనల్ పరీక్షల తేదీలు

తేదీ	పేపర్
15.02.2019	ప్రథమ భాష పేపర్-1
16.02.2019	ప్రథమ భాష పేపర్-2
18.02.2019	ద్వితీయ భాష పేపర్
19.02.2019	తృతీయ భాష పేపర్-1
20.02.2019	తృతీయ భాష పేపర్-2
21.02.2019	మ్యాథమెటిక్స్ పేపర్-1
22.02.2019	మ్యాథమెటిక్స్ పేపర్-2
23.02.2019	ఫిజికల్ సైన్స్ పేపర్-1
25.02.2019	బయోలాజికల్ సైన్స్ పేపర్-1
26.02.2019	సోషల్ స్టడీస్ పేపర్-1
27.02.2019	సోషల్ స్టడీస్ పేపర్-2

టీఆర్టీ ఫలితాలు విడుదల: టీఎస్‌పీఎస్సీ

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో భాగంగా స్కూల్ అసిస్టెంట్, పీఈటీ, ఎస్జీటీ ఫలితాలను శనివారం టీఎస్‌పీఎస్సీ విడుదల చేసింది. ఇందులో మొత్తం 925 పోస్టులు ఉండగా, కొన్నింటికి అర్హత కలిగిన అభ్యర్థులు లేకపోవడంతో ఖాళీగా ఉండిపోయినట్లు పేర్కొంది. స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ (ఇంగ్లిష్ మీడియం)–04, స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ (హిందీ మీడియం)–01, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (తెలుగు మీడియం)–09, పీఈటీ (ఉర్దూ మీడియం)–04, పీఈటీ (ఇంగ్లిష్ మీడియం)–01, ఎస్జీటీ (ఉర్దూ మీడియం)–281, స్కూల్ అసిస్టెంట్ గణితం (తెలుగు మీడియం)–191 పోస్టులు ఉన్నాయని తెలిపింది. ఎస్జీటీ ఉర్దూ మీడియంలో 636 పోస్టులకు గానూ 320 పోస్టులు అర్హత కలిగిన అభ్యర్థులు లేక ఖాళీగా ఉన్నాయని వెల్లడించింది. ఇందులో 35 పోస్టులను దివ్యాంగుల కోటా కింద మెడికల్ రిపోర్టులు అందిన తర్వాత ప్రకటిస్తామని తెలిపింది. స్కూల్ అసిస్టెంట్ గణితం (తెలుగు మీడియం) 215 పోస్టుల్లో 16 పీహెచ్ పోస్టులను మెడికల్ రిపోర్టులు అందిన తర్వాత ప్రకటిస్తామని స్పష్టం చేసింది. వివరాలు www.tspsc.gov.in లో పొందవచ్చని సూచించింది.

కాకతీయ వర్సిటీ దూరవిద్య అడ్మిషన్లకు ఆహ్వానం

హైదరాబాద్: కాకతీయ యూనివర్సిటీలో దూరవిద్య ద్వారా బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సుల్లో చేరటానికి అడ్మిషన్లు జరుగుతున్నాయని సింధూ డిగ్రీ కళాశాల స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ జె.వెంకట చలపతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సెస్సీ, ఇంటర్ పాస్/ఫెయిల్ అయిన విద్యార్థులు డిగ్రీలో చేరటానికి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. డిగ్రీ పూర్తి చేసిన వారు ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ, ఎంబీఏ, బీఎల్ఐఎస్సీ, ఎంఎల్ఐఎస్సీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో చేరుటకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 95330 58899, 99088 60079 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

దళిత సామాజిక వర్గాలకు మంత్రి పదవులివ్వాలి

మాలమహానాడు అధ్యక్షుడు చెన్నయ్య

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో దళిత సామాజికవర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలని మాలమహానాడు అధ్యక్షుడు చెన్నయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో మాల సామాజిక వర్గం పాత్ర కీలకంగా ఉందని, ఈసారి మాల వర్గానికి మంత్రి పదవి కేటాయించాలన్నారు. ఇకపై జరిగే అన్ని ఎన్నికల్లో మాలలకు సీట్లు కేటాయించాలని, ఐక్యంగా గెలిపించుకునేందుకు కృషి చేస్తామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును కోరారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొలి ప్రభుత్వంలో మాలలకు మంత్రి పదవి రాలేదని, ఈసారి తప్పకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. నామినేటెడ్ పదవుల్లోనూ దళితులకు అధికంగా పదవులు ఇవ్వాలన్నారు.

రక్షణలో స్వావలంబనకు ‘డేర్ టు డ్రీమ్’!

కొత్త టెక్నాలజీల కోసం పోటీ నిర్వహిస్తున్నాం

- డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ సతీశ్‌రెడ్డి వెల్లడి
- యువ శాస్త్రవేత్తలు, స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహిస్తున్నాం
- రక్షణ తయారీ రంగంపై హైదరాబాద్‌లో రెండ్రోజుల సదస్సు ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: రక్షణ రంగంలో భారత్ ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు అత్యాధునిక టెక్నాలజీల అవసరం ఎంతైనా ఉందని డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ సతీశ్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. అలాంటి టెక్నాలజీలను దేశీయంగానే సంపాదించుకునేందుకు యువ శాస్త్రవేత్తలను, స్టార్టప్ కంపెనీలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. రేపటి తరం టెక్నాలజీలను అందిపుచ్చుకునేందుకు డీఆర్‌డీవో ‘డేర్ టు డ్రీమ్’పేరుతో పోటీని నిర్వహిస్తోందని తెలిపారు. కృత్రిమ మేధతోపాటు డ్రోన్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ, క్వాంటమ్ కంప్యూటింగ్, స్మార్ట్ మెటీరియల్స్ వంటి రంగాల్లో అత్యంత ప్రభావశీల, వినూత్న ఆలోచనలు, టెక్నాలజీలతో ముందుకు వచ్చే వారిని ఈ పోటీ ద్వారా గుర్తిస్తామని వివరించారు. స్టార్టప్ కంపెనీలతోపాటు వ్యక్తులు కూడా ఇందులో పాల్గొనవచ్చునని, వచ్చే నెలలో పోటీ గడువు ముగుస్తుందని వివరించారు. రక్షణ తయారీ రంగంలో స్వావలంబన అనే అంశంపై ఫోరం ఫర్ ఇంటిగ్రేటెడ్ నేషనల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో ప్రారంభమైన రెండు రోజుల జాతీయ సదస్సుకు డాక్టర్ సతీశ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ, ఏవియేషన్, రొబోటిక్స్ రంగాల్లో వస్తున్న మార్పులతో యుద్ధం తీరుతెన్నులు మారిపోతున్నాయన్నారు. అందుకు తగ్గట్లుగా భారత్ కూడా తగిన శక్తియుక్తులను సమకూర్చుకోవాల్సిన అవసరమెంతైనా ఉందన్నారు. రక్షణ రంగంలో అన్ని రకాల శక్తిసామర్థ్యాలను దేశం కలిగి ఉందని, ఇదే క్రమంలో ఈ రంగంలో స్వావలంబన అనేది ముఖ్యమన్నారు. ఆ దిశగా మరిన్ని పరిశోధనలు జరిపి అధునాతన ఆయుధాలను మన దేశంలోనే తయారు చేసుకునే స్థాయికి ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తు మార్పులకు అనుగుణంగా సాంకేతికత రూపు దిద్దుకోవాలని, ఆ దిశగా విద్యార్థుల్లో పరిశోధన బీజాలు వేయాలన్నారు. విద్యార్థుల్లో సృజనను ప్రేరేపించేలా ఇంక్యుబేషన్ సెంటర్స్ లాంటివి మరిన్ని నెలకొల్పాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ దేశాలకు సవాల్‌గా మారిన సైబర్‌వార్ టెక్నాలజీ రంగంలో వచ్చే సాంకేతికతను అందిపుచ్చుకునేలా భావిపౌరులను తయారుచేయాల్సిన బాధ్యత యూనివర్సిటీలు, ఆర్ అండ్ డీ, సంబంధిత పరిశ్రమలపై ఉందన్నారు. ఆర్ అండ్ డీ, పరిశ్రమలు, విద్యాసంస్థలు సమ్మిళితమైతే రాబోయే రోజుల్లో పరిశోధనలను విస్తృతం చేయవచ్చనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

రాజతంత్రమే ఆధారం: ఆర్ఎన్ రవి, జాతీయ భద్రతా ఉప సలహాదారు

బలమైన రాజతంత్రంపైనే దేశ రక్షణ ఆధారపడి ఉంటుందని డిప్యూటీ నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్, జాయింట్ ఇంటెలిజెన్స్ కమిటీ చైర్మన్ ఆర్ఎన్ రవి పేర్కొన్నారు. పూర్వీకులు మనకు నేర్పిన రక్షణరంగ తంత్రాలను మరచిపోయి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఏర్పడిన ప్రభుత్వాలు గత కొన్ని దశాబ్దాలుగా పాశ్చాత్య ధోరణిలో పనిచేయడం వల్ల ఎన్నో ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. గత నాలుగున్నర ఏళ్లుగా దీన్ని సరిచేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. రక్షణ రంగంలో స్వావలంబన దిశగా విద్యాసంస్థలు, పరిశ్రమలు, శాస్త్రవేత్తలు, కలసికట్టుగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఎస్ఎస్ హస్బినిస్, డాక్టర్ డీబీ షేకత్కర్, మేజర్ జనరల్ ఏబీ గోర్తీ, సంజయ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. సదస్సులో మొదటి రోజు స్ట్రటీజిక్ ఓవర్‌వ్యూ, సైబర్‌వార్ ఫేర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ బిగ్ డేటా ఎనలిటిక్స్, అటానమస్ సిస్టమ్ అంశాలపై నిపుణులు చర్చించారు.



సదస్సులో కరచాలనం చేసుకుంటున్న డాక్టర్ సతీశ్‌రెడ్డి, ఆర్.ఎన్.రవి

నేలమాళిగలు.. ఈస్ట్రోజన్ ఇంజెక్షన్లు లేవు!

- అదంతా కొన్ని సంస్థల ప్రచారం మాత్రమే: హెచ్‌ఆర్‌ఎఫ్
- గుట్ట వేశ్యాగృహాల్లోని పరిస్థితులపై ప్రభుత్వానికి నివేదిక
- పీడీ యాక్టుపై జైలుకు వెళ్లి వచ్చిన వారి పరిస్థితి దుర్భరం
- వ్యభిచార వృత్తి వారికి పునరావాసం కల్పించాలని విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: యాదగిరిగుట్ట కేంద్రంలోని వేశ్యాగృహాల్లో నేలమాళిగలు లేవని, అలాగే ఈస్ట్రోజన్ ఇంజక్షన్లు వాడలేదని మానవ హక్కుల వేదిక (హెచ్‌ఆర్‌ఎఫ్) తెలిపింది. ఇది కేవలం కొన్ని సంస్థలు చేస్తున్న ప్రచారం మాత్రమేనని అభిప్రాయపడింది. యాదగిరిగుట్టలో వేశ్యావృత్తిని నిర్వహిస్తున్న వారిపై పోలీసులు, రెవెన్యూ అధికారులు దాడులు జరిపి పీడీ యాక్టు కింద అరెస్టు చేసి జైళ్లకు తరలించి ఆర్నెల్లుగా జైళ్లలో ఉంచిన నేపథ్యంలో ఈ నెల 8న మానవ హక్కుల వేదిక బృందం యాదగిరిగుట్టకు చేరుకుని అక్కడి పరిస్థితులపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.

అన్నీ హృదయవిదారక అంశాలే...

యాదగిరిగుట్ట వేశ్యాగృహాలను నిర్వహిస్తున్న పలువురిని పోలీసులు అరెస్టు చేసి జైళ్లకు, బాలికల సంరక్షణ గృహాలకు తరలించారు. వారి ఇళ్లకు తాళం వేయడంతో మిగిలిన కుటుంబ సభ్యులు రోడ్డున పడ్డారు. ఈ క్రమంలోనే అక్కడికి చేరుకున్న హెచ్‌ఆర్‌ఎఫ్ బృందం బాధితులను పరామర్శించడంతో వారు తమ గోడును వెళ్లబోసుకున్నారు. అరెస్టు కాని కుటుంబ సభ్యుల్లో కొందరు ఇతర ప్రాంతాల్లో ఇళ్లు అద్దెకు తీసుకోగా.. మరికొందరికి అవి కూడా దొరకలేదు. కొందరు గుడారాలు వేసుకుని నివసిస్తున్నారు. ఈ గుడారాల్లో ఓ బాలింత సైతం పసికందుతో అవస్థలు పడుతూ ఉంది. ఇటు పీడీ యాక్టుపై జైలుకు వెళ్లి వచ్చిన వారి పరిస్థితి మరి దుర్భరంగా మారింది. దీన్ని చూసి హెచ్‌ఆర్‌ఎఫ్ సభ్యులు చలించిపోయారు.

అవన్నీ నిరాధారం..

వేశ్యాగృహాల్లో పిల్లలను నేలమాళిగల్లో రహస్యంగా పెంచుతున్నట్లు, వారు త్వరగా ఎదిగేందుకు ఈస్ట్రోజన్ ఇంజక్షన్లు చేస్తున్నట్లు పలు పత్రికల్లో కథనాలు వచ్చాయి. కానీ అదంతా ప్రచారమేనని హెచ్‌ఆర్‌ఎఫ్ బృందం అభిప్రాయపడింది. అక్కడ అలాంటి పరిస్థితేమీ లేదని.. అందుకు తగ్గ ఆధారాలు కూడా ఏమీ కనిపించలేదని వెల్లడించింది. ‘ఈ ఆరోపణల ఆధారంగా ఓ ఆర్ఎంపీ వైద్యుడి క్లినిక్‌పై పోలీసులు దాడి చేసి అరెస్టు చేశారు. ఆస్పత్రి సీజ్ చేసినప్పటికీ అక్కడ ఈస్ట్రోజన్‌కు సంబంధించిన ఆధారాలు దొరకలేదు. మరి ఆ వైద్యుడిని ఎందుకు అరెస్టు చేశారో అర్థం కాలేదు. 33 మంది బాధిత బాలికలను రెండు హోంలకు తరలించారు. ఆమన్‌గల్‌లో ప్రజ్వల నడుపుతున్న హోంలో 20 మంది, మిగిలిన 13 మందిని నల్లగొండలోని శిశు విహార్‌కు పంపించారు. అయితే ప్రజ్వల హోంలోని పిల్లలను చూసే అవకాశం కూడా ఇవ్వడం లేదు..’అని హెచ్‌ఆర్‌ఎఫ్ పేర్కొంది.



యాదగిరిగుట్టలో ఓ వేశ్యా గృహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్ ఫొటో)

పునరావాసం ఎక్కడ...

వేశ్యావృత్తిని మానేసిన వారు ఇతర ఉపాధి పనులకు వెళ్తున్నారని హెచ్‌ఆర్‌ఎఫ్ తెలిపింది. ‘వేశ్యావృత్తిని మానేసినట్లు ప్రత్యేకంగా బోర్డులు తగిలించారు. గృహ నిర్మాణ పనులు, కూలీ, పూలకొట్లు.. తదితరాలు ఏర్పాటు చేసుకున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి పునరావాసం, ఆర్థిక సాయం అందలేదు. బాధితులకు పునరావాసం కల్పించడంతో పాటు వారి ఇళ్లను వారికే అప్పగించాలి. హోంలలోని పిల్లలను వారి తల్లిదండ్రుల దగ్గరకు చేర్చాలి..’ అని నివేదికలో కోరింది.

మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు రేపు నోటిఫికేషన్

- ఈ నెల 28 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష
- షెడ్యూల్ జారీ చేసిన విద్యా శాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు సోమవారం (21న) నోటిఫికేషన్ జారీ కానుంది. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ శనివారం షెడ్యూల్‌ను జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 192 మోడల్ స్కూళ్లలో 6వ తరగతిలో ప్రవేశాలకు ఈ నోటిఫికేషన్‌ను జారీ చేసేందుకు ఏర్పాట్లు చేసింది. 7, 8, 9, 10 తరగతుల్లో మిగిలిపోయిన సీట్లను కూడా ప్రవేశ పరీక్ష ద్వారా భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టింది. 2019–20 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం ఈ నెల 28 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనుంది. ఈ నెల 28 నుంచి వచ్చే నెల 28 వరకు 6వ తరగతిలో, ఫిబ్రవరి 1 నుంచి 28 వరకు 7, 8, 9, 10 తరగతుల్లో మిగిలిపోయిన సీట్ల కోసం ప్రవేశ పరీక్షకు హాజరు కావాలనుకునే వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించింది. ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపింది. ఆరో తరగతిలో ప్రవేశాల కోసం ప్రవేశ పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు, 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాల కోసం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 వరకు ప్రవేశ పరీక్షను అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు వివరించింది. విద్యార్థులు ఏప్రిల్ 9 నుంచి 12 వరకు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేలా ఏర్పాట్లు చేస్తోంది.

మే 18కి ఫలితాలు సిద్ధం..

పాఠశాలల వారీగా ఫలితాలను మే 18 నాటికి సిద్ధం చేయాలని, మే 19 నుంచి 26వ తేదీలోగా జిల్లా జాయింట్ కలెక్టర్ల నేతృత్వంలో ఎంపిక జాబితాను సిద్ధం చేయాలని నిర్ణయించింది. ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థుల జాబితాను మే 27న ప్రకటించనుంది. అదే నెల 28 నుంచి 30వ తేదీ వరకు విద్యార్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించి, అకడమిక్ కేలండర్ ప్రకారం తరగతులను ప్రారంభించనుంది. విద్యార్థులు అడ్మిషన్ ఫీజుగా రూ. 100 చెల్లించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీలైతే రూ. 50 చెల్లించాలని వివరించింది. దరఖాస్తుల ఫార్మాట్‌ను ఈ నెల 28 నుంచి తమ వెబ్‌సైట్ (telangan ams.cgg.gov.in) ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపింది. పూర్తి వివరాలను తమ వెబ్‌సైట్‌లో పొందవచ్చని పేర్కొంది.

అమెరికాకు చెందిన క్రూజర్ బ్రెవింగ్ కంపెనీ ప్రపంచంలోనే మొదటిసారి 1935, జనవరి 24న కేన్‌లో బీర్ అమ్మకాలు ప్రారంభించింది.



అమెరికాను మించిపోతాం..!

- వచ్చే పదేళ్లలో ఆర్థిక వ్యవస్థలో భారత్ హవా..
- స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంకు నివేదికలో వెల్లడి
- మన ఆర్థిక వ్యవస్థ 30 శాతం పెరుగుతుందని జోస్యం

2030 నాటికి స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో భారత్ అమెరికాను మించిపోగలదని బ్రిటన్‌కు చెందిన స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంకు ఇటీవల విడుదల చేసిన నివేదిక అంచనా వేసింది. అమెరికాతో పోలిస్తే మన ఆర్థిక వ్యవస్థ పరిమాణం 30 శాతం మేరకు పెరుగుతుందని జోస్యం చెప్పింది. చైనా ఆర్థిక వ్యవస్థ మరింత పుంజుకుని మొదటి స్థానంలో ఉంటుందని, అమెరికాకు రెండింతలు అవుతుందని వివరించింది. ఈ నివేదిక ప్రకారం.. అధిక జనాభా ఉన్న దక్షిణ అమెరికా, ఆసియా, ఆఫ్రికాల్లోని దేశాలు రానున్న కాలంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో తమ ఆధిక్యత చాటుకోనున్నాయి. ఆర్థికంగా బలమైన జపాన్, జర్మనీలను ఈజిప్ట్, ఇండోనేసియా, రష్యాలు అధిగమించనున్నాయి. పట్టణీకరణ కారణంగా మధ్యతరగతి వర్గం భారీగా పెరుగుతుండటం వల్ల బ్రిక్స్ దేశాలు (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) అంతకంతకూ బలం పుంజుకుంటున్నాయని పేర్కొంది.



10 కోట్ల కొత్త ఉద్యోగాలు..

వృద్ధి రేటును వృద్ధ జనాభా ప్రభావితం చేస్తుండటం, సీనియర్ సిటిజన్లు పెరిగిపోయిన జపాన్ వంటి దేశాల్లో శ్రామికుల కొరత ఏర్పడుతుండటం వంటి విషయాలు మనకు తెలిసినవే. భారత్‌లో ఇందుకు భిన్నమైన పరిస్థితి. యువ జనాభా ఎక్కువగా ఉండటం భారత్‌కు కలిసొచ్చే అంశమని ఈ నివేదిక పేర్కొంది. ప్రభుత్వం 2030 నాటికి తయారీ, సేవా రంగాల్లో 10 కోట్ల కొత్త ఉద్యోగాలు కల్పించాలని, ఇందుకు నైపుణ్యపరంగా ఏర్పడిన లోటును పూడ్చేందుకు పూనుకోవాలని, మహిళలను పనుల్లో భాగస్వామ్యం చేయాలని, కార్మిక చట్టాలను సరళీకరించాలని సూచించింది.

కోటి మందికి శిక్షణ ఇవ్వాలి..



భారత్ ఏడాదికి ఒక కోటి మందికి శిక్షణ ఇవ్వాల్సి ఉన్నా.. ప్రస్తుతం 45 లక్షల మందికి శిక్షణ ఇవ్వగల సామర్థ్యం మాత్రమే కలిగి ఉందని నివేదిక వివరించింది. మౌలిక సదుపాయాలపై వెచ్చించే మొత్తాలను పెంచేందుకు, పెరుగుతున్న ఆర్థిక అసమానతలను తగ్గించేందుకు పాలకులు తగు చర్యలు చేపట్టాలని ఈ నివేదిక సూచించింది. జీడీపీ పరంగా ప్రస్తుతం అమెరికా, చైనా, జపాన్, జర్మనీ, యూకే, ఇండియా, ఫ్రాన్స్, బ్రెజిల్, ఇటలీ, కెనడాలు మొదటి 10 స్థానాల్లో ఉన్నాయి.

2030 నాటికి అగ్రశ్రేణిలో ఉండే 10 ఆర్థిక వ్యవస్థల జీడీపీలు ఇలా ఉంటాయని అంచనా..

దేశం	జీడీపీ (ట్రిలియన్ డాలర్లలో)	దేశం	జీడీపీ (ట్రిలియన్ డాలర్లలో)
చైనా	64.2	బ్రెజిల్	8.6
ఇండియా	46.3	ఈజిప్ట్	8.2
అమెరికా	31.0	రష్యా	7.9
ఇండోనేసియా	10.1	జపాన్	7.2
టర్కీ	9.1	జర్మనీ	6.9

సాగుకు స్కానింగ్



ప్రత్యేకంగా దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం

- రైతు వారీగా పండించే పంటల డేటా సేకరణకు కసరత్తు
- ప్రజలు రోజువారీ వినియోగించే ఆహార డేటా కూడా
- స్వయం సమృద్ధికి 'పంట కాలనీలు'
- రైతు ఆదాయం పెంపు, మార్కెట్ వసతి కల్పించాలన్నదే ఉద్దేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఆహార రంగంలో స్వయం సమృద్ధి సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. తద్వారా వివిధ ఆహార పదార్థాలను దిగుమతి చేసుకునే పరిస్థితికి చరమగీతం పాడాలని, రైతు ఆదాయాన్ని మరింత పెంచాలని భావిస్తోంది. విరివిగా ఆహార శుద్ధి పరిశ్రమలు స్థాపించాలని యోచిస్తోంది. అందుకు రాష్ట్ర వ్యవసాయాన్ని పంట కాలనీలుగా తయారు చేయాలని నిర్ణయించింది. ఇటీవల సీఎం కేసీఆర్ వ్యవసాయశాఖ, దాని అనుబంధ విభాగ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. సీఎం ఆదేశాల మేరకు పంట కాలనీల ఏర్పాటుపై సర్వే చేపట్టాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. పంటల వివరాలతోపాటు రైతుల వివరాలను సేకరించనుంది. రాష్ట్రంలో ఉన్న దాదాపు 60 లక్షల మంది రైతులు ఒక్కొక్కరు ఎన్ని ఎకరాల్లో ఏయే పంటలు సాగు చేస్తారో తెలుసుకునేందుకు రంగం సిద్ధం చేసింది. దాదాపు 3 నెలల పాటు సర్వే చేపట్టాలని నిర్ణయించింది. అందుకు అవసరమైన 26 అంశాలతో కూడిన నమూనా సర్వే పత్రాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. క్షేత్రస్థాయిలో పనిచేసే వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవో) రైతుల వద్దకు వెళ్లి ఈ సమాచారాన్ని సేకరించనున్నారు. అందుకు సంబంధించిన కార్యాచరణను ఈ నెల 25 లోపు పూర్తిచేసి, వచ్చే ఖరీఫ్‌లో పైలట్ ప్రాజెక్టు కింద పంట కాలనీలు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఏఈవోలు సేకరించే సమాచారంతో పట్టాదారు నంబర్, రైతు పేరు, తండ్రి పేరు, ఆధార్ నంబర్, పుట్టిన తేదీ, ఫోన్ నంబర్, బ్యాంకు ఖాతా వివరాలు, సామాజిక పరిస్థితి, ఎన్ని ఎకరాల్లో విస్తీర్ణం ఉంది సర్వే నంబర్ వారీగా నమోదు చేసుకుంటారు. నీటి సదుపాయం, బోరు బావుల ద్వారా ఎంత పండుతుంది.. కాలువల కింద ఎంత సాగవుతుందో అంచనా వేస్తారు. వర్షాధార సాగు విస్తీర్ణం, భూసార పరీక్ష కార్డులు అందాయో లేదో సేకరిస్తారు.

పంట రకం.. దిగుబడి కూడా..

సాగయ్యే పంటలు.. వాటిల్లో ఏ రకం, ఏ సర్వే నంబర్‌తో ఎంత విస్తీర్ణంతో సాగు చేస్తున్నారో ప్రత్యేక టేబుల్‌లో నమోదు చేస్తారు. ఎంత దిగుబడి వస్తుందో కూడా తెలుసుకుంటారు. ఇలా ఖరీఫ్, రబీలకు వేర్వేరుగా వివరాలు నమోదు చేస్తారు. అలాగే వ్యవసాయ యాంత్రీకరణ, సూక్ష్మనీటి సేద్యం ఎంతమేరకు అందుబాటులో ఉందనే వివరాలను సేకరించనుంది. పంట రుణాలు కూడా ఎంత మొత్తంలో తీసుకున్నారు.. ఎంత విస్తీర్ణంలో పంటకు బీమా చేయించారనే సమగ్ర వివరాలు నమోదు చేయనున్నారు. పండించిన పంటలో మార్కెట్‌లో ఎంత విక్రయించారనే వివరాలు కూడా ఉంటాయి. అధిక ఉత్పత్తి ఉన్న పంటలకు ఆహారశుద్ధి పరిశ్రమల స్థాపన ద్వారా విలువ ఆధారిత ఉత్పత్తులను స్వయం సహాయక బృందాల ద్వారా ప్రోత్సహించటానికి ఈ ప్రణాళిక రూపొందిస్తున్నారు.

వచ్చే ప్రయోజనం?



రాష్ట్రంలో రైతులు సంప్రదాయ పంటలనే సాగు చేస్తున్నారు. లాభ నష్టాలను లెక్క చేయకుండా జీవనం కోసం పంటలు పండిస్తున్నారు. దీనివల్ల అనేకసార్లు రైతులు నష్టాల పాలవుతున్నారు. పంటలు సరిగా పండకపోవడం, పండినా మద్దతు ధర రాకపోవడంతో అప్పుల పాలవుతున్నారు. శాస్త్రీయ అంచనా లేకుండా ఎవరికి వారు ఇలా పంటలు సాగు చేస్తుండటంతో రైతుల పరిస్థితి అధ్వానంగా మారుతోంది. ఈ దుస్థితిని మార్చాలని సీఎం కేసీఆర్ ఏడాది కిందటే పంట కాలనీలు అంశం తెరపైకి తెచ్చారు. గ్రామాలు, మండలాలు, జిల్లాల వారీగా ఎక్కడెక్కడ ఎలాంటి పంటలు పండుతాయో శాస్త్రీయ పద్ధతిలో గుర్తించి, ఆ మేరకు పంట కాలనీలు ఏర్పాటు చేస్తారు.

ఉదాహరణకు..

ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో మిరప పంట అధికంగా సాగవుతుందనుకుందాం. ఆ ప్రాంతాన్ని మిర్చి పంట కాలనీగా ప్రకటిస్తారు. ఆ మేరకు రైతులకు అవసరమైన సాంకేతిక సాయం అందజేస్తారు. నాణ్యమైన విత్తనాలను అందిస్తారు. ఉత్పత్తి, ఉత్పాదకత పెంచేలా అవగాహన కల్పిస్తారు. మార్కెట్‌లో దానికి సరైన ధర అందించేలా ప్రభుత్వమే పూనుకుంటుంది. మిర్చితో కారం పొడి తయారు చేయించేలా ప్రత్యేకంగా ఆహారశుద్ధి పరిశ్రమ నెలకొల్పుతారు. నిజామాబాద్ జిల్లాలో పసుపు పండే ప్రాంతాన్ని కూడా ఓ పంట కాలనీగా గుర్తిస్తారు. రాష్ట్రానికి అవసరమైన కూరగాయలు దిగుమతి చేసుకుంటున్నాం. దాదాపు 60 శాతం కూరగాయలు ఇతర రాష్ట్రాల నుంచే వస్తున్నాయని మార్కెటింగ్ వర్గాలు చెబుతున్నాయి. కూరగాయలు పండించే ప్రాంతాల రైతులకు అవసరమైన సాయం లేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కూరగాయలు పండించే ప్రాంతాలను కూడా పంట కాలనీలుగా గుర్తిస్తారు. రాష్ట్రంలో ఏ పంటలకు కొరత ఉందో గుర్తించి ఆ మేరకు కొత్త పంటలను ప్రోత్సహిస్తారు. పంట కాలనీల ప్రధాన ఉద్దేశం స్వయం సమృద్ధి. కాబట్టి రాష్ట్రంలో ప్రజలు ఏ ఆహారాలను ఏ మోతాదులో వినియోగిస్తున్నారన్న దానిపై గతేడాది జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సమగ్ర సర్వే నిర్వహించింది. ఆ నివేదికను సీఎంకు అందజేసింది.

సర్వే వివరాలు ఇలా..

ఆహారం	తలసరి వినియోగం (నెలకు)
ఆహార ధాన్యాలు	12.56 కేజీలు
పప్పు ధాన్యాలు	1.74 కేజీలు
ఉల్లి, టమాట	1 కేజీ
మాంసాహారం	1.38 కేజీలు
పాలు	4.58 లీటర్లు
నూనెలు	1.22 కేజీలు
డ్రై ఫ్రూట్స్	109.5 గ్రాములు
అరటి పండ్లు	5
ఖర్చు	రూ.2,156

మాంసాహారంలో అత్యధికంగా 40% చికెన్‌నే వినియోగిస్తున్నారు

ఆహార ధాన్యాల వినియోగం ప్రాంతాల వారీగా..

యాదాద్రి భువనగిరి	17.5 కేజీలు (అధికం)
మంచిర్యాల	10.53 కేజీలు (అత్యల్పం)
గ్రామీణం	14.1 కేజీలు
పట్టణం	11.46 కేజీలు

అధికంగా 77 శాతం వరి అన్నం (రైస్) వినియోగిస్తున్నారు

పప్పు ధాన్యాలు..

ఆదిలాబాద్ 2.69 కేజీలు (అధికం)


సూర్యాపేట జిల్లాలో 1.3 కేజీలు (అత్యల్పం)

పాల వినియోగం..

రాజన్న సిరిసిల్ల	6.27 లీటర్లు (అధికం)
ఆదిలాబాద్	2.34 లీటర్లు (అత్యల్పం)

నూనెలు..

పట్టణాలు	1.27 కేజీలు
గ్రామాలు	1.15 కేజీలు



మూడో విడతలో 26,106 మంది సర్పంచ్ అభ్యర్థులు

- 36,729 వార్డులకు 93,518 మంది వార్డు మెంబర్లు
- ముగిసిన నామినేషన్ల పరిశీలన

సాక్షి, హైదరాబాద్ : గ్రామ పంచాయతీ మూడో దశ ఎన్నికల్లో మొత్తం 4,116 గ్రామపంచాయతీలకు 26,106 మంది సర్పంచ్ అభ్యర్థులు, మొత్తం 36,729 వార్డులకు 93,518 మంది వార్డు మెంబర్ అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. శుక్రవారం నామినేషన్ల దాఖలు ముగిసేసరికి అభ్యర్థులు తమ పత్రాలను సమర్పించినట్టు రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) తెలిపింది. శనివారం నామినేషన్ల పరిశీలన కూడా ముగిసింది. ఈ నెల 23 వరకు మూడోవిడత నామినేషన్లు ఉపసంహరించుకునే అవకాశం ఉంటుంది. ఈ నెల 30న మూడో విడత పంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 257 సర్పంచ్ స్థానాలకు 2,144 మంది అభ్యర్థులు, 2,322 వార్డు మెంబర్ స్థానాలకు 7,959 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 227 స్థానాలకు 1,361 మంది, 2,024 వార్డు సభ్యుల సీట్లకు 4,888 మంది నామినేషన్లు దాఖలు చేశారు. సంగారెడ్డి జిల్లాలో 199 స్థానాలకు 1,271 మంది, 1,782 వార్డు మెంబర్ స్థానాలకు 4,288 మంది అభ్యర్థులు నామినేషన్ వేశారు. రంగారెడ్డి జిల్లాలో 198 స్థానాలకు 1,222 మంది అభ్యర్థులు, 1,756 వార్డు మెంబర్ స్థానాలకు 5,296 మంది పోటీ పడుతున్నారు. సూర్యాపేట జిల్లాలో 154 స్థానాలకు 1,223 మంది అభ్యర్థులు, 1,404 వార్డు మెంబర్ స్థానాలకు 4,683 మంది అభ్యర్థులు, నిజామాబాద్ జిల్లాలో 211 సర్పంచ్ స్థానాలకు 1,218 మంది అభ్యర్థులు, 1,890 వార్డు మెంబర్ స్థానాలకు 3,982 మంది నామినేషన్లు సమర్పించారు.

జాబితాను సరిచూసుకోండి

- అర్హులంతా ఓటర్లుగా గడువులోపు నమోదు చేసుకోవాలి
- ఈనెల 22న రాష్ట్ర ప్రభుత్వంతో సీఈసీ వీడియో కాన్ఫరెన్స్

సాక్షి, హైదరాబాద్: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో శనివారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి డీజీపీ మహేందర్‌రెడ్డి, రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి రజత్‌కుమార్‌తో సమావేశమయ్యారు. ఈ నెల 21 నుంచి 23వరకు కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వాలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనుంది. ఇందులో భాగంగా ఈనెల 22న రాష్ట్ర ప్రభుత్వంతో వీడియో కాన్ఫరెన్స్ జరగనుంది. ఈ క్రమంలో తీసుకోవల్సిన చర్యలు, ఏర్పాట్లపై సీఎస్ జోషి సమీక్షించారు. అసెంబ్లీ ఎన్నికలు గత నెలలో ముగియగా... ఉద్యోగుల బదిలీల ప్రక్రియ సైతం అప్పటికే పూర్తయింది. రాష్ట్రంలో అదనపు బలగాలు కూడా అవసరం ఉంటే సీఈసీని వీడియో కాన్ఫరెన్స్‌లో అడగాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఓటరు జాబితా నమోదు జరుగుతుందని రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి రజత్‌కుమార్ తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ఈనెల 25 వరకు గడువు ఇచ్చిందని, కానీ ఫిబ్రవరి 4 వరకు గడువు ఇవ్వాలని కోరనున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఆదివారం ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారన్నారు. అర్హులంతా ఓటరు నమోదు చేసుకోవాలని, ఓటుహక్కు ఉన్న వారు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి సరిచూసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 13 లక్షల అభ్యంతరాలు వచ్చాయని, కొత్త ఓటర్ల నమోదు కూడా పెరిగిందన్నారు. ఓటర్లకు 40 లక్షల కార్డులు రాశామని, పండుగ నేపథ్యంలో కొంత ఆలస్యం అవుతుందన్నారు. గత ఎన్నికల్లో ఓటరు నమోదుపై పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించామన్నారు. పట్టభద్రుల మండలి ఎన్నికల షెడ్యూల్ ఇంకా రాలేదన్నారు. ఇందుకు గాను ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ప్రాణహితనా.. వార్ధానా?

- తమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై మరోసారి అధ్యయనానికి సీఎం ఆదేశం
- ప్రాణహితపై అయితే 6.45 కి.మీ బ్యారేజీ, 107 గేట్లు
- వార్ధాపై అయితే కిలోమీటర్ బ్యారేజీ, 28 గేట్లు
- నీటి లభ్యత, వరద ఉండే కాలం ఆధారంగా నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: ప్రాణహిత ప్రాజెక్టులో భాగంగా నిర్మించ తలపెట్టిన తమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం మళ్లీ తెరపైకి వచ్చింది. కొన్నేళ్లుగా పక్కన పెట్టిన ఈ బ్యారేజీ నిర్మాణాన్ని ఏ నదిపై నిర్మించాలన్న తర్జనభర్జన మొదలైంది. వెయిన్‌గంగ, వార్ధా నదుల సంగమం అనంతరం ఏర్పడే ప్రాణహిత నదిపై తమ్మిడిహెట్టి నిర్మాణాన్ని తొలుత ప్రతిపాదించగా, కొత్తగా కేవలం వార్ధా నదిపై వీర్దండ వద్ద నిర్మించాలన్న ప్రతిపాదనపైనా అధ్యయనం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. ఈ రెండు ప్రతిపాదనల్లో ఏది పూర్వ ఆదిలాబాద్ జిల్లాకు మేలు చేస్తుందో తనకు నివేదిక ఇవ్వాలని సూచించారు.

ఇప్పుడైనా తేలుతుందా..

వెయిన్‌గంగ, వార్ధా నదులు కలిసిన అనంతరం ప్రాణహిత నదిపై తమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మించడం ద్వారా ఆదిలాబాద్ జిల్లాలో 56 వేల ఎకరాలకు నీరందించాలని 2004లో నిర్ణయించారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం బ్యారేజీలో రీడిజైన్ తర్వాత జిల్లాలో మరో 1.44 లక్షల ఎకరాలను కలిపి మొత్తం 2 లక్షల ఎకరాలకు నీరిచ్చేలా ప్రణాళిక రూపొందించారు. తమ్మిడిహెట్టి వద్ద 4.5 టీఎంసీల సామర్థ్యంతో బ్యారేజీ నిర్మించి 20 టీఎంసీల నీటిని ఎత్తిపోసేలా మొదట రూ.639 కోట్లతో అంచనా వేశారు. వన్యప్రాణి సంరక్షణ కారణంగా ప్రాణహిత నదిపైనే ఒకటిన్నర కిలోమీటర్ ఎగువకు బ్యారేజీ ప్రాంతాన్ని మార్చడంతో అంచనా వ్యయం రూ.1,918.70 కోట్లకు చేరింది. ప్రాణహిత నదిపై 6.45 కిలోమీటర్ల మేర బ్యారేజీ నిర్మాణానికి 107 గేట్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, స్పిల్‌వే నిర్మాణమే 3 కిలోమీటర్లు ఉంటుందని ఇంజనీర్లు పేర్కొన్నారు. ఈ నిర్మాణంతో మహారాష్ట్రలోని చంద్రాపూర్, గడ్చిరోలి జిల్లాల్లో 509 ఎకరాల ముంపు, ప్రస్తుత ఆసిఫాబాద్ జిల్లాలో 300 ఎకరాల ముంపు ఉంటుందని అంచనా వేశారు. బ్యారేజీ నిర్మాణం గత ఐదేళ్లుగా జరగకపోవడంతో ప్రస్తుత లెక్కల ప్రకారం అంచనా వ్యయం రూ.1,918.70 కోట్ల నుంచి రూ.2,600 కోట్లకు చేరుతోంది.

పునరాలోచనలో ప్రభుత్వం...

బ్యారేజీ వ్యయం భారీగా పెరుగుతుండటంతో పునరాలోచించిన ప్రభుత్వం కేవలం వార్ధా నది వరకే పరిమితం చేయాలని నిర్ణయించింది. వార్ధాపై నిర్మాణంతో కేవలం కిలోమీటర్ మేరకే బ్యారేజీ నిర్మాణం అవసరమవుతుండగా ఇందుకు 28 గేట్లు సరిపోనున్నాయి. ముంపు ప్రాంతం 400 ఎకరాలకు మించదని, వ్యయం సైతం రూ.700 కోట్లు దాటదని నీటిపారుదల వర్గాలు అంచనా వేశాయి. వార్ధా నదిలో 60 టీఎంసీల నీటి లభ్యత ఉండగా ఇందులో 20 టీఎంసీలు ఆదిలాబాద్ జిల్లా అవసరాలకు సరిపోతాయని లెక్క గట్టాయి. ఈ ప్రాజెక్టుపై శుక్రవారం సమీక్షించిన సీఎం గత ప్రతిపాదనలతో పాటు కొత్త ప్రతిపాదనలపై సమగ్ర అధ్యయనం చేయాలని ఆదేశించారు. వార్ధా వద్ద నీటి లభ్యత ఉన్నా అది తక్కువ సమయంలోనే భారీగా ఉంటుంది. ప్రస్తుతం ప్రతిపాదిస్తున్న బ్యారేజీ సామర్థ్యం 1.5 టీఎంసీలే కావడంతో అంత తక్కువ సమయంలో నిర్ణీత 20 టీఎంసీలు మళ్లించడం సాధ్యమా? అన్న అనుమానాన్ని సమీక్ష సందర్భంగా ఇంజనీర్లు లేవనెత్తారు. ఈ నేపథ్యంలో నీటి లభ్యత, లభ్యత కాలం, మళ్లింపు అవకాశాలపై అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించారు. దీంతోపాటు పెద్దవాగులో సైతం 16 నుంచి 18 టీఎంసీల మేర లభ్యత ఉన్న దృష్ట్యా, ఆ నీటిని కాళేశ్వరంలో భాగంగా ఉన్న సుందిళ్ల వరకు ఎలా తరలించాలన్న దానిపైనా పరిశీలన చేయాలని సూచించారు.

కూరగాయల లోటుకు...సాగు పెంపే మార్గం

- రాష్ట్ర అవసరాల కంటే 6.34 లక్షల మెట్రిక్ టన్నుల లోటు
- 2.52 లక్షల ఎకరాల్లో అదనంగా సాగు చేయాలని నిర్ణయం



సాక్షి, హైదరాబాద్ : కూరగాయల ఉత్పత్తిలో రాష్ట్రం అత్యంత వెనుకబడి ఉంది. దీంతో ఇతర రాష్ట్రాలపై ఆధారపడుతోంది. ఈ నేపథ్యంలో ఈ సాగు విస్తీర్ణం, ఉత్పత్తి పెంచడమే సరైన పరిష్కారమని ఉద్యానశాఖ భావించి తాజాగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. రాష్ట్ర ప్రజలు రోజువారీ ప్రధానంగా 20 రకాల కూరగాయలను వినియోగిస్తుంటారు. ఇలా ఏడాదికి 22.28 లక్షల మెట్రిక్ టన్నుల కూరగాయలు అవసరం కాగా, కేవలం 15.94 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే లభిస్తున్నాయి. అంటే 6.34 లక్షల మెట్రిక్ టన్నుల లోటు ఉంది. ఈ 20 రకాల్లో టమాట, వంకాయ, బెండ, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, ముల్లంగి వంటి ఆరు రకాలు అవసరానికి మించి ఉత్పత్తి అవుతుండగా, పచ్చిమిర్చి, కాకర, బీర, సొరకాయ, దోసకాయ, బీన్స్, క్యాప్సికం, ఆలుగడ్డ, చేమగడ్డ, క్యారట్, కందగడ్డ, ఆకుకూరలు, ఉల్లిగడ్డలుసహా 14 రకాలకు తీవ్ర కొరత నెలకొని ఉంది. ఇక ఆరు రకాల్లో వినియోగం 7.99 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, ఉత్పత్తి 8.66 లక్షల మెట్రిక్ టన్నులుంది. అంటే 66,760 మెట్రిక్ టన్నులు అదనంగా ఉత్పత్తి అవుతున్నాయి. మిగిలిన 14 రకాలు 14.29 లక్షల మెట్రిక్ టన్నులు అవసరం కాగా, ఉత్పత్తి 7.28 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే. ఈ 14 రకాల వరకు చూస్తే 7.01 లక్షల మెట్రిక్ టన్నుల కొరత ఉంది. దీంతో ఈ సాగును అదనంగా 2.13 లక్షల ఎకరాల్లో చేయాలని ఉద్యానశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదించింది.

ఎనిమిది రకాల పండ్లకూ కొరతే...

రాష్ట్రంలో వినియోగించే ఎనిమిది రకాల పండ్ల ఉత్పత్తి తక్కువగా ఉంది. జామ, ద్రాక్ష, యాపిల్, కర్బూజ, నేరేడు, అరటి, పైనాపిల్, దానిమ్మ అవసరానికంటే 4.46 లక్షల మెట్రిక్ టన్నుల లోటు ఉంది. యాపిల్ ఇక్కడ పండే పంట కాదు కాబట్టి ఆ చర్చ లేదు. జామ 23 వేల మెట్రిక్ టన్నులు అవసరం కాగా, రాష్ట్రంలో కేవలం 13వేల మెట్రిక్ టన్నులే పండుతోంది. ద్రాక్ష 27 వేల మెట్రిక్ టన్నులు అవసరం కాగా, కేవలం 3 వేల మెట్రిక్ టన్నులే ఉత్పత్తి అవుతోంది. అరటి పండ్లు 3.39 లక్షల మెట్రిక్ టన్నులు గాను, 73 వేల మెట్రిక్ టన్నులే. దానిమ్మ 49 వేల మెట్రిక్ టన్నులకు గాను, కేవలం 11 వేల మెట్రిక్ టన్నులే ఉత్పత్తి అవుతోంది. అందువల్ల ఆయా పండ్ల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలంటే అదనంగా 38వేల ఎకరాల్లో పండ్ల సాగు చేయాలని ఉద్యానశాఖ నివేదించింది. ఇక మామిడి, బొప్పాయి, కర్బూజ, సపోటా, కమలా, బత్తాయి పండ్ల ఉత్పత్తి అవసరానికి మించి 9.43 లక్షల మెట్రిక్ టన్నులు అదనంగా ఉత్పత్తి అవుతుండటం గమనార్హం. అందులో మన జనాభాకు మామిడి 60 వేల మెట్రిక్ టన్నులు అవసరం కాగా, 4.82 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అవుతోంది. బొప్పాయి 3 వేల మెట్రిక్ టన్నులు అవసరం కాగా, రాష్ట్రంలో 51 వేల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అవుతోంది. అదనంగా ఉత్పత్తి అవుతున్న పండ్లను ఎగుమతి చేయాలని ఉద్యానశాఖ భావిస్తోంది. అందుకోసం ఆహార శుద్ధి పరిశ్రమలు స్థాపించాల్సిన అవసరం నెలకొని ఉంది. మరోవైపు కొరత నెలకొన్న పండ్ల కోసం అదనంగా 38 వేల ఎకరాల్లో సాగు చేయాలని ప్రతిపాదించింది.

సంక్రాంతి ఆదాయం రూ. 3.99 కోట్లు

దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో రాకేష్

సాక్షి, హైదరాబాద్: సంక్రాంతి సందర్భంగా దక్షిణ మధ్య రైల్వేకు ఈ ఏడాది రూ. 3.99 కోట్ల ఆదాయం వచ్చిందని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది రూ.3.08 కోట్ల ఆదాయంరాగా, ఈసారి 29 శాతం పెరిగిందని పేర్కొన్నారు. ఇక పండుగ సందర్భంగా ఈ నెల 11, 12, 13 తేదీల్లో 4.49 లక్షల మంది రిజర్వేషన్ లేకుండా ప్రయాణించారని వెల్లడించారు. ఈ సంఖ్య గతేడాది 3.79 లక్షలు ఉండగా, ఈ ఏడాది 18 శాతం పెరిగిందని చెప్పారు. అధికారుల సమన్వయంతో సంక్రాంతి రద్దీకి అనుగుణంగా ప్రత్యేక రైళ్లను నడిపామని తెలిపారు. వారాంతం, పండుగ కలిసి రావడంతో ప్రయాణికుల రద్దీ పెరిగిందని, ముఖ్యంగా 11, 12, 13 తేదీల్లో జంట నగరాల నుంచి ఎక్కువ మంది వారి వారి స్వస్థలాలకు ప్రయాణం చేశారని పేర్కొన్నారు.


ఐక్యతా వేదికపై నుంచి అభివాదం చేస్తున్న శత్రుఘ్న సిన్హా, యశ్వంత్ సిన్హా, స్టాలిన్, అఖిలేశ్, కుమారస్వామి, చంద్రబాబు, ఫరూక్ అబ్దుల్లా, దేవెగౌడ, మమతా బెనర్జీ, మల్లికార్జున్ ఖర్గే, శరద్ పవార్, అరవింద్ కేజ్రీవాల్, శరద్ యాదవ్ తదితరులు

విపక్షాల సమరశంఖం

ప్రధాని మోదీని సాగనంపాలని ముక్తకంఠంతో పిలుపు

- విభేదాలు మరచి, ఐక్యంగా ఎన్డీయేను ఢీకొట్టాలని ప్రతిన
- కోల్‌కతా ర్యాలీ విజయవంతం
- హాజరైన పలు పార్టీల అధినేతలు, కీలక నేతలు

కోల్‌కతా

లోక్‌సభ ఎన్నికలకు విపక్షాలు కలిసికట్టుగా సమరశంఖం పూరించాయి. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ఐక్యంగా పోరాడాలని ప్రతినబూనాయి. మోదీ ప్రభుత్వ విధానాలు, పనితీరుపై ముప్పేట దాడి చేశాయి. బీజేపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని, హస్తినలో ప్రభుత్వం మారాల్సిందేనని ముక్తకంఠంతో నినదించాయి. ప్రతిపక్షాల ఐక్యతను చాటేందుకు తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ నేతృత్వంలో శనివారం కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ మైదానంలో నిర్వహించిన భారీ ర్యాలీ విజయవంతమైంది. ప్రధాన విపక్షం కాంగ్రెస్ సహా 20 ప్రాంతీయ, జాతీయ పార్టీలకు చెందిన నేతలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో విభేదాల్ని పక్కనపెట్టి బీజేపీకి వ్యతిరేకంగా పోరాడాలని ప్రతిపక్షాలు నిర్ణయించాయి. ఎన్నికలు ముగిసిన తరువాతే ప్రధాని అభ్యర్థిని ప్రకటించాలని నిర్ణయించారు. ర్యాలీకి టీఎంసీ కార్యకర్తలు లక్షల్లో వచ్చారు. కోల్‌కతా విపక్ష సభ సక్సెస్‌కావడంతో అదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో ఢిల్లీ, ఏపీ రాజధాని అమరావతిలోనూ ఇలాంటి ర్యాలీలు నిర్వహించాలని నిర్ణయించారు.

మోదీ ప్రభుత్వ గడువు తీరింది: మమతా

మోదీ ప్రభుత్వంపై ఈ ర్యాలీకి అధ్యక్షత వహించిన మమత నిప్పులు చెరిగారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి కాలం చెల్లిందని, రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో విపక్షాలదే అధికారమని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో మార్పు రావాలంటే ఢిల్లీలో ప్రభుత్వం మారాలని ఉద్ఘాటించారు. సమష్టి నాయకత్వం గురించి తరచూ మాట్లాడే మోదీ, అమిత్ షాలు బీజేపీ సీనియర్ నాయకులు సుష్మా స్వరాజ్, గడ్కరీ, రాజ్‌నాథ్ తదితరులకు ఇవ్వాల్సినంత గౌరవం ఇవ్వడంలేదని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో రాజ్యాంగబద్ధ సంస్థలు సీబీఐ, ఆర్‌బీఐ, ఇతర విచారణ సంస్థలు నిర్వీర్యమయ్యాయని ఆరోపించారు. మొండి బకాయిలు గుట్టల్లా పేరుకుపోయాయని, రఫేల్ లాంటి కుంభకోణాలు వెలుగుచూశాయన్నారు.

ఏకమవకుంటే అణచివేత తప్పదు: ఖర్గే

కాంగ్రెస్ తరఫున హాజరైన సీనియర్ నాయకుడు మల్లికార్జున ఖర్గే.. సోనియా పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. సోనియా, రాహుల్ గాంధీలు ఈ సభ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారని వెల్లడించారు. 'మోదీ తాను తినకపోయినా తన కార్పొరేట్ స్నేహితులు అంబానీలు, అదానీలకు లబ్ధి చేకూరుస్తున్నారు. నోట్లరద్దు, జీఎస్టీతో దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయింది. గమ్యస్థానం చాలా దూరం ఉంది. దారి క్లిష్టంగా ఉంది. కానీ మనం అక్కడికి చేరాలి. మన మనసులు కలిసినా కలవకపోయినా, ఒకరి చేతులు ఒకరు పట్టుకుని ముందుకుసాగాలి' అని ఓ హిందీ వాక్యంతో ఖర్గే ప్రసంగాన్ని ముగించారు.

ఎలాగైనా బీజేపీని ఓడించాలి: కేజ్రీవాల్

కేంద్రంలో ప్రమాదకర బీజేపీని ఎలాగైనా ఓడించాలని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ పిలుపునిచ్చారు. దేశాన్ని కాపాడుకోవాలంటే మోదీ ప్రభుత్వాన్ని మార్చాల్సిందేనన్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఆ ఒక్క సీటు(వారణాసి)నైనా ఎలా గెలుచుకోవాలో బీజేపీకి అర్థం కావడం లేదని ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఎద్దేవా చేశారు. ఓ వైపు అవినీతి గురించి మాట్లాడుతూనే కర్ణాటకలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు బీజేపీ ప్రయత్నించిందని కర్ణాటక సీఎం కుమారస్వామి ఆరోపించారు. 2014 ఎన్నికలకు ముందు ఇచ్చిన అన్ని వాగ్దానాల్ని విస్మరించి కేంద్ర ప్రభుత్వం ప్రజల్ని మోసగించిందని ఏపీ సీఎం చంద్రబాబు ఆరోపించారు.

అది అవకాశవాదుల ర్యాలీ: బీజేపీ

సాక్షి, న్యూఢిల్లీ: విపక్ష ర్యాలీ.. పరస్పర విరుద్ధ సిద్ధాంతాలున్న అవకాశవాదుల సమావేశమని బీజేపీ అభివర్ణించింది. లోక్‌సభ ఎన్నికల్లో అధికారం నిలబెట్టుకుంటామని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేసింది. వ్యక్తిగత ద్వేషంతో ఒకరి మొహం ఒకరు చూసుకోవడానికి ఇష్టపడని నేతలు ఒక చోట చేరారని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి రాజీవ్ ప్రతాప్ రూఢీ ప్రశ్నించారు. 'వారు మాట్లాడుతున్న కొత్త ఫ్రంట్ రెండోదా? మూడోదా? తెలియదు. ఈ పార్టీల్లో ఒకరినొకరు తిరస్కరించిన వారున్నారు. యూపీలో కాంగ్రెస్‌ను వద్దనుకున్న ఎస్పీ–బీఎస్పీ ఈ ర్యాలీలో పాల్గొనడం వారి అవకాశవాదాన్ని సూచిస్తోంది' అని అన్నారు.


శనివారం కోల్‌కతాలో జరిగిన విపక్ష ర్యాలీలో భారీ సంఖ్యలో పాల్గొన్న ప్రజలు

హాజరైన పార్టీలు, నాయకులు..

తృణమూల్ కాంగ్రెస్, జేడీఎస్, కాంగ్రెస్, ఎన్సీపీ, డీఎంకే, ఎన్సీ, ఎస్పీ, బీఎస్పీ, ఆర్జేడీ, టీడీపీ, ఆప్, లోక్‌తాంత్రిక్ జనతాదళ్, జీజేఎం, ఏఐడీయూఎఫ్, జోరం నేషనలిస్ట్ పార్టీ ఆఫ్ మిజోరం, జేఎంఎం, పటీదార్ ఆందోళన్ సమితి, శత్రుఘ్న సిన్హా(బీజేపీ), జిగ్నేశ్ మేవానీ(దళిత ఎమ్మెల్యే), అరుణాచల్ మాజీ సీఎం గెగాంగ్ అపాంగ్(ఇటీవలే బీజేపీ నుంచి బయటికి వచ్చారు).

ఈవీఎం ట్యాంపరింగ్‌పై నలుగురితో కమిటీ

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్(ఈవీఎం)ల పనితీరు, వాటి దుర్వినియోగాన్ని అడ్డుకోవడంపై సూచనలు చేసేందుకు నలుగురు విపక్ష నాయకులతో కమిటీ ఏర్పాటైంది. దీనిలో అభిషేక్ సింఘ్వీ(కాంగ్రెస్), అఖిలేశ్(ఎస్పీ), సతీశ్ మిశ్రా(బీఎస్పీ), కేజ్రీవాల్(ఆప్) ఉన్నారు. ఈవీఎంల ట్యాంపరింగ్‌కు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయబోయే ఈ కమిటీ ఎన్నికల సంస్కరణలపై ఈసీకి నివేదిక సమర్పిస్తుందని మమతా చెప్పారు. ఎన్నికలకు వ్యవధి తక్కువ ఉందని, సంస్కరణల్ని ఈసీ వెంటనే చేపట్టాలని ఎన్సీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా డిమాండ్ చేశారు. ఉన్నపళంగా మళ్లీ బ్యాలెట్ విధానానికి వెళ్లాలని తాము కోరడం లేదని, కానీ ఓట్ల లెక్కింపునకు వీవీప్యాట్ పద్ధతిని విస్తృతం చేయాలని సింఘ్వీ అభిప్రాయపడ్డారు.

కాంగ్రెస్‌కు దెబ్బేనా?

సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ: విపక్షాలను ఒకతాటిపైకి తేవడానికి తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ చేసిన ప్రయత్నం సఫలమైంది. ఇదే స్ఫూర్తితో మహాకూటమి ఏర్పాటు యత్నాలు మరింత ముమ్మరమయ్యే అవకాశాలున్నాయి. అయితే ఇక్కడ గమనించాల్సిన ఒక ముఖ్య విషయం ఏంటంటే.. ప్రధాన విపక్షం కాంగ్రెస్ పాత్ర పెద్దగా లేకుండానే ప్రాంతీయ పార్టీలు కోల్‌కతాలో ఒకే వేదికపైకి వచ్చి ఎన్డీయే ప్రభుత్వంపై నిప్పులు చెరిగాయి. ఇలా ప్రాంతీయ పార్టీలు తమంతట తాము ఏకమవడం కాంగ్రెస్ బలం తగ్గిపోయిందనే సంకేతాన్నిస్తోంది. ఈ కోణంలో చూస్తే లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్ ప్రాధాన్యాన్ని మరింత తగ్గించే అవకాశాలున్నాయి. ప్రాంతీయ పార్టీలకు చుక్కాని లేదని, వాటికి ఓ దిశానిర్దేశం లేదని ఇన్నాళ్లు బీజేపీ, కాంగ్రెస్ ప్రచారం చేస్తూ వస్తున్నాయి. కానీ ఇటీవలి కాలంలో చిన్నా చితకా పార్టీలు కూడా ఎన్నికల తరువాత ఒప్పందం కుదుర్చోవడానికి గట్టిగానే బేరమాడుతున్నాయి. బీజేపీ, కాంగ్రెస్‌లు లేకుండా తామెన్ని సీట్లు గెలుస్తామోనని లెక్కలేసుకుంటున్నాయి. కోల్‌కతా ర్యాలీతో బీజేపీకి ప్రత్యామ్నాయంగా రెండు ఫ్రంట్‌లు ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందులో ఒకటి కాంగ్రెస్ నేతృత్వంలో కాగా, మరొకటి కాంగ్రెస్ రహిత ఫెడరల్ ఫ్రంట్(వేర్వేరు రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలు కలిసి ఏర్పాటుచేయబోయేది) అని భావిస్తున్నారు. ఇక కోల్‌కతా ర్యాలీ విషయానికి వస్తే..ఇతర నాయకులు 5 నుంచి 10 నిమిషాలు మాట్లాడగా, ఆతిథ్యమిచ్చిన మమతా బెనర్జీ మాత్రం బెంగాలీలో సుమారు అరగంట సేపు ప్రసంగించారు. దీనిని బట్టి రాబోయే మహాకూటమి ర్యాలీల్లో స్థానిక పార్టీనే ఎక్కువ ప్రాచుర్యం పొందేందుకు ప్రయత్నించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీలో జరిగితే ఆప్, చెన్నైలో డీఎంకే ప్రభావం ఎక్కువ ఉండొచ్చు.


ర్యాలీకి వచ్చిన ముఖ్యనేతలకు భోజనం వడ్డిస్తున్న మమతా బెనర్జీ

ఫిబ్రవరిలో ట్రంప్, కిమ్ భేటీ



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌తో ఫిబ్రవరిలో మరోసారి సమావేశమవుతారని వైట్‌హౌస్ తెలిపింది. ఉత్తరకొరియా అణు నిరాయుధీకరణ, క్షిపణి అభివృద్ధి కార్యక్రమంపై ట్రంప్, కిమ్‌లు చర్చిస్తారని వెల్లడించింది. ఈ సమావేశం జరిగే వేదికను త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొంది. గతేడాది జూన్ 12న సింగపూర్‌లోని ఓ హోటల్‌లో ట్రంప్, కిమ్ తొలిసారి భేటీ అయ్యారు. కాగా, ఉత్తరకొరియా అణ్వస్త్రాలను త్యజించేవరకూ ఆంక్షలను కొనసాగిస్తామని వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి సారా శాండర్స్ తెలిపారు. మరోవైపు, అమెరికా దక్షిణ సరిహద్దులో నెలకొన్న మానవతా సంక్షోభంతో పాటు షట్‌డౌన్‌పై శనివారం మధ్యాహ్నం 3 గంటలకు (స్థానికకాలమానం) కీలక ప్రకటన చేస్తానని ట్రంప్ ట్విట్టర్‌లో తెలిపారు.

అనుమతుల్లేకుండా చార్జిషీటా?

కన్హయ్య కేసులో పోలీసులను ప్రశ్నించిన ఢిల్లీ కోర్టు

న్యూఢిల్లీ: ఢిల్లీ ప్రభుత్వ ఆమోదం లేకుండా జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు కన్హయ్య కుమార్, ఇతరులపై చార్జిషీట్ దాఖలు చేయడంపై ఢిల్లీ కోర్టు పోలీసులను తప్పుబట్టింది. 'ఆమోదం లేకుండా ఎలా మీరు చార్జిషీట్ దాఖలు చేశారు. మీకు న్యాయ సలహాలు ఇచ్చే శాఖ లేదా' అని పోలీసులను ప్రశ్నించింది. దీనిపై పోలీసులు సమాధానమిస్తూ.. మరో 10 రోజుల్లో ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో అనుమతి తీసుకుంటామని పేర్కొన్నారు. దీంతో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ దీపక్ షెరావత్ ఫిబ్రవరి 6వ తేదీ వరకు పోలీసులకు గడువు ఇచ్చారు. కన్హయ్య కుమార్ 2016 ఫిబ్రవరిలో జేఎన్‌యూలో దేశ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడ్డారంటూ ఢిల్లీ పోలీసులు జనవరి 14న చార్జిషీట్ దాఖలు చేశారు.

రూ.16 కోట్ల జకీర్ ఆస్తుల అటాచ్‌మెంట్

న్యూఢిల్లీ: వివాదాస్పద ఇస్లాం మత బోధకుడు జకీర్ నాయక్‌కు సంబంధించిన రూ. 16.40 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ స్వాధీనం చేసుకుంది. మనీ లాండరింగ్ కేసుకు సంబంధించి ఈ ఆస్తులను జప్తు చేసినట్లు శనివారం వెల్లడించింది. జకీర్ కుటుంబసభ్యుల పేరిట ముంబై, పుణేలో ఉన్న ఈ స్థిరాస్తులను ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ (పీఎమ్‌ఎల్‌ఏ) కింద జప్తు చేసినట్లు పేర్కొంది. జకీర్ బ్యాంక్ ఖాతాకు వచ్చిన విరాళాలను తన భార్య, కొడుకు, మేనకోడలు అకౌంట్లకు పంపినట్లు ఆధారాలు సేకరించిన ఈడీ ఈ ఆస్తులను జప్తు చేసింది. జప్తు చేసిన వాటిలో ముంబైలోని ఫాతిమా హైట్స్, ఆఫియా హైట్స్ భవంతులతో పాటు బాందప్ ప్రాంతంలోని ఆస్తులు, పుణేలోని కొన్ని ప్రాజెక్టులు ఉన్నాయి.

రేప్ బెదిరింపులతోనే భయ్యూ ఆత్మహత్య

ఇండోర్: మధ్యప్రదేశ్‌లోని ఆధ్యాత్మిక గురువు భయ్యూ మహరాజ్(50) ఆత్మహత్య వెనుక మిస్టరీ వీడింది. తనను పెళ్లి చేసుకోకుంటే రేప్ కేసు పెడతానని సేవకురాలు పలక్ పురాణిక్(25) బెదిరించడంతోనే 2018, జూన్ 12న భయ్యూ తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారని ఇండోర్ డీఐజీ మిశ్రా తెలిపారు. తగు సాక్ష్యాలు ఉన్నాయన్నారు. ఆశ్రమానికి చెందిన వినాయక్(42), శరద్(34)లు పలక్‌తో చేతులు కలిపి భయ్యూ మహారాజ్‌కు హైడోస్ మందులు ఇచ్చారని వెల్లడించారు. వీరంతా కలిసి ఆయన్ను ఆత్మహత్యకు పురిగొల్పా రని వ్యాఖ్యానించారు. ఈ ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా, 15 రోజుల కస్టడీకి కోర్టు అప్పగించిందన్నారు.


ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళాలో టాయిలెట్ కమోడ్‌లతో తయారు చేసిన సీట్లపై కూర్చుని కాఫీ ఆస్వాదిస్తున్న యాత్రికులు. బహిరంగ మలమూత్ర విసర్జనకు స్వస్తిపలకాలని కోరుతూ ఈ కెఫెను ఏర్పాటుచేశారు.

దోపిడీని ఆపినందుకే మహాకూటమి

- విపక్ష నేతల సభపై ప్రధాని మోదీ వ్యాఖ్య
- హజీరాలో యుద్ధ ట్యాంకుల ఫ్యాక్టరీ ప్రారంభించిన మోదీ

సిల్వస్సా/గాంధీనగర్/ముంబై: దేశాన్ని దోచుకోకుండా ఆపినందుకే ప్రతిపక్షాలన్నీ ఏకమై 'మహాకూటమి'గా ఏర్పడ్డాయని ప్రధాని మోదీ ధ్వజమెత్తారు. ఆ కూటమి దేశ ప్రజలకు వ్యతిరేకంగా ఏర్పడిన కూటమి అని మండిపడ్డారు. కోల్‌కతాలో టీఎంసీ అధినేత మమతా బెనర్జీ ఏర్పాటు చేసిన సభకు హాజరైన విపక్షనేతలపై పరోక్షంగా మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్ర పాలిత ప్రాంతం దాద్రా నగర్ హవేలీ రాజధాని సిల్వస్సాలో శనివారం ప్రధాని మోదీ వైద్య కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశాక సభలో మాట్లాడారు. 'ప్రజాధనం దోపిడీకి, అవినీతిని అడ్డుకునేందుకు నేను తీసుకున్న చర్యలపై కొందరికి కోపం వచ్చింది. భయంతో వారంతా ఒక్కటయ్యారు' అని మండిపడ్డారు. 'మా పార్టీకి ఆ రాష్ట్రంలో ఒకే ఒక్క ఎమ్మెల్యే ఉన్నారు. అయినప్పటికీ తృణమూల్ కాంగ్రెస్‌కు భయం పట్టుకుంది. దీంతో రక్షించండంటూ ఆ పార్టీ నేతలు కేకలు వేస్తున్నారు. ఎన్నికల సమయంలో బీజేపీ కార్యకర్తలను చంపేస్తున్నారు. రాష్ట్రంలో పార్టీ కార్యక్రమాలు కొనసాగకుండా టీఎంసీ కార్యకర్తలు అడ్డుకుంటున్నారు.


ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం సందర్భంగా యుద్ధట్యాంకుపై కూర్చున్న ప్రధాని మోదీ

యుద్ధట్యాంకుల ఫ్యాక్టరీ ప్రారంభం

ప్రైవేట్ రంగంలో దేశంలో ప్రప్రథమంగా గుజరాత్‌లోని హజీరాలో ఎల్ అండ్ టీ కంపెనీ ఏర్పాటు చేసిన కే9 వజ్ర–హౌవిట్జర్ యుద్ధ ట్యాంకుల తయారీ కర్మాగారాన్ని శనివారం ప్రధాని మోదీ ప్రారంభించారు. 2017లో కేంద్ర ప్రభుత్వంతో కుదిరిన రూ.4,500 కోట్ల ఒప్పందం ప్రకారం ఎల్ అండ్ టీ సంస్థ 42 నెలల్లో 100 కే9 యుద్ధ ట్యాంకులను అందించాల్సి ఉంది. ఇప్పటికే 10 ట్యాంకులను సైన్యానికి అందించింది. వీటి తయారీకి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం బదిలీ కోసం ఆ సంస్థ దక్షిణ కొరియా హన్వ్హా కార్పొరేషన్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. కాగా, 50 టన్నుల బరువుండే కే9 ట్యాంకు 47 కేజీల బరువైన బాంబును 43 కిలోమీటర్ల దూరంలో ఉండే లక్ష్యాల పైకి పేల్చగలదు.

మాతృమూర్తితో ప్రధాని

ప్రధాని మోదీ శనివారం ఉదయం తన తల్లి హిరాబా(90)ను కలుసుకున్నారు. రైసన్ గ్రామంలో సోదరుడు పంకజ్ ఇంట్లో ఉంటున్న మాతృమూర్తితో పాటు ఇతర కుటుంబసభ్యులతో మోదీ ముచ్చటించారు.

సినిమా మాదిరిగా దేశమూ మారుతోంది

భారతీయ సినిమా ఇతివృత్తం కాలానుగుణంగా మారుతోందని మోదీ అన్నారు. ముంబైలో 'నేషనల్ మ్యూజియం ఆఫ్ ఇండియన్ సినిమా' ప్రారంభించిన అనంతరం పలువురు సినీ రంగ ప్రముఖులు హాజరైన సభనుద్దేశించి మాట్లాడారు. 'సినిమాలు, సమాజం పరస్పర ప్రతిబింబాలు. గతంలో పేదరికం, అసహాయతనే ఎక్కువగా చూపేవారు. నేడు సమస్యలతోపాటు వాటికి పరిష్కారాలనూ చూపుతున్నారు. లక్షల్లో సమస్యలుంటే కోట్లాది పరిష్కారాలు చూపుతున్నారు' అని అన్నారు. ఈ మ్యూజియంలో రెండో ప్రపంచ యుద్ధంలో మన వీరుల త్యాగాలను కళ్లకు కట్టే 30 గంటల నిడివి గల డిజిటైజ్డ్ ఫుటేజీ ఉందని వెల్లడించారు.

పేలిన ఆయిల్ పైప్‌లైన్

మెక్సికోలో 66 మంది దుర్మరణం



త్లాహులిల్‌పాన్: దక్షిణ అమెరికాలోని మెక్సికోలో ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. హిడాల్గో రాష్ట్రంలోని త్లాహులిల్‌పాన్ పట్టణంలో శుక్రవారం రాత్రి ఓ ఆయిల్ పైప్‌లైన్‌కు అక్రమంగా అమర్చిన ట్యాప్ లీక్ కావడంతో పెట్రోల్‌ను పట్టుకునేందుకు స్థానికులు భారీ సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. ఇంతలో ఒక్కసారిగా మంటలు అంటుకోవడంతో భారీ పేలుడు సంభవించింది. ఈ దుర్ఘటనలో 66 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 76 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, అధికారులు ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను హుటాహుటిన ఆసుపత్రులకు తరలించారు. ఈ ప్రమాదంలో చనిపోయినవారికి అధ్యక్షుడు ఆండ్రెస్ మాన్యుయెల్ లోపెజ్ సంతాపం తెలిపారు. ప్రభుత్వరంగ ఆయిల్ సంస్థ పెమెక్స్ పైప్‌లైన్ల నుంచి మాఫియా, డ్రగ్ డీలర్లు ఇంధనాన్ని దొంగలించడం మెక్సికోలో సర్వసాధారణం. దీనివల్ల ఒక్క 2017లోనే రూ.21,376 కోట్ల ఆదాయాన్ని మెక్సికో కోల్పోయింది.


చైనాలోని సిచువాన్ ప్రావిన్సులో కోళ్ల అందాల పోటీల సందర్భంగా వాటిని అందంగా ముస్తాబు చేసిన దృశ్యం

హెచ్1బీ భాగస్వామి ఉద్యోగం హుళక్కే!

వాషింగ్టన్: అమెరికాలో ఉంటున్న హెచ్–1బీ వీసాదారులైన వారి జీవిత భాగస్వాముల ఉద్యోగం గాలిలో దీపంలా మారింది. వీరితోపాటు ఉద్యోగానుమతుల కోసం ఎదురు చూస్తున్న మరికొందరు తమ కెరీర్ ప్రమాదంలో పడిందనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. హెచ్1–బీ వీసాపై అమెరికాలో ఉంటూ గ్రీన్‌కార్డు కోసం ఎదురు చూస్తున్న భారతీయ వృత్తి నిపుణుల భర్త/భార్య ఉద్యోగం చేసుకునేందుకు ఒబామా హయాంలో ప్రభుత్వం చట్టం చేసింది. అయితే, ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ వలసదారుల కారణంగా ఉద్యోగాలు కోల్పోయిన అమెరికన్ల తరఫున 'సేవ్‌జాబ్స్ యూఎస్ఏ' అనే సంస్థ 2015లో కోర్టులో కేసు వేసింది. అప్పటి నుంచి ఈ కేసు పెండింగ్‌లో ఉంది. అయితే, ఈ కేసుపై విచారణ చేపట్టాల్సిందిగా నెల క్రితం యూఎస్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్ ఆదేశాలిచ్చింది. ఇందుకు సంబంధించిన వాదనలు వినిపించేందుకు.. వలస ఉద్యోగుల సమస్యలపై పోరాడుతున్న 'ఇమిగ్రేషన్ వాయిస్' అనే సంస్థకు కూడా అవకాశమిచ్చింది. అయితే, కోర్టు నిర్ణయం హెచ్–1బీ వీసాదారులకు అనుకూలంగా వచ్చినా తన ప్రతిపాదనలను అమలు చేయాల్సిందేనని ట్రంప్ ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం.



కర్ణాటక ప్రభుత్వంపై 'అవిశ్వాస' అస్త్రం!


- అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు బీజేపీ వ్యూహం
- బీజేపీ ఆఫర్‌కు ఏడుగురు కాంగ్రెస్ రెబెల్స్ అంగీకారం!

సాక్షి బెంగళూరు: కన్నడనాట రాజకీయ సమరం ముదిరింది. కాంగ్రెస్ పార్టీలోని అసంతృప్తులను బీజేపీలోకి ఫిరాయించేలా చేయాలన్న వ్యూహం పనిచేయకపోవడంతో కమలనాథులు మరో ఎత్తుగడ వేశారు. ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలు మాత్రమే తమవైపునకు వచ్చిన నేపథ్యంలో సీఎం కుమారస్వామి ప్రభుత్వానికి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు బీజేపీ సిద్ధమవుతోంది. ఇటీవల ఢిల్లీలో జరిగిన జాతీయ మండలి సమావేశాల కోసం బీజేపీ తమ ఎమ్మెల్యేలను గురుగ్రామ్‌లోని ఓ రిసార్ట్‌కు తరలించింది. వీరంతా శనివారం రాత్రి కర్ణాటకకు చేరుకుంటారని బీజేపీ వర్గాలు తెలిపాయి. తర్వాత ఎమ్మెల్యేలంతా కలిసి కుమారస్వామి ప్రభుత్వంపై విశ్వాసం కోల్పోయామని రాష్ట్ర గవర్నర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించాయి. ప్రభుత్వ వ్యవహారశైలితో అసంతృప్తిగా ఉన్న కొందరు ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీ బలవంతంగా ఈగల్‌టన్ రిసార్ట్‌కు తరలించిందని ఫిర్యాదు చేస్తారని పేర్కొన్నాయి. ఈ పరిస్థితుల దృష్ట్యా అసెంబ్లీని సమావేశపర్చి బలనిరూపణకు ఆదేశించాల్సిందిగా బీజేపీ నేతలు గవర్నర్‌ను కోరనున్నారు. ఇందుకు గవర్నర్ ఓకే చెప్తే కాంగ్రెస్–జేడీఎస్ ప్రభుత్వంపై బీజేపీ సభ్యులు అసెంబ్లీలో అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నారు.

ఏడుగురు రెబెల్స్‌పై గంపెడాశలు

కుమారస్వామి ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు కాంగ్రెస్‌కు చెందిన ఏడుగురు అసంతృప్త ఎమ్మెల్యేలపై బీజేపీ గంపెడాశలు పెట్టుకుంది. శుక్రవారం సీఎల్పీ భేటీకి గైర్హాజరైన నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల చేత రాజీనామా చేయించేందుకు కమలనాథులు యత్నిస్తున్నారు. దీని వల్ల సభలో ప్రభుత్వాన్ని కూల్చడానికి కేవలం ముగ్గురు ఎమ్మెల్యేల మద్దతు అవసరం కానుంది. ఈ సందర్భంగా అవిశ్వాసం పెడితే మిగిలిన ముగ్గురు కాంగ్రెస్ అసంతృప్త ఎమ్మెల్యేల చేత క్రాస్ ఓటింగ్ చేయించాలని కమలనాథులు యోచిస్తున్నారు. ఒకవేళ స్పీకర్ అనర్హత వేటువేసినా, బీజేపీ ప్రభుత్వం వచ్చాక తగిన ప్రతిఫలం ఉంటుందని వీరందరికీ ఆశచూపుతున్నారు. సీఎల్పీకి గైర్హాజరైన నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రస్తుతం ముంబైలో ఉన్నట్లు తెలుస్తోంది. నేడు బీజేపీ కర్ణాటక అధ్యక్షుడు బీఎస్ యడ్యూరప్ప సొంత పార్టీ ఎమ్మెల్యేలతో భేటీ కానున్నారు.





ప్రభుత్వాన్ని కూల్చబోం: యడ్యూరప్ప

కాంగ్రెస్–జేడీఎస్ ప్రభుత్వాన్ని పడగొట్టాల్సిన అవసరం తమకు లేదని కర్ణాటక బీజేపీ చీఫ్ బీఎస్ యడ్యూరప్ప తెలిపారు. కాంగ్రెస్ నేతలే సమన్వయ లోపంతో తమపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. సంకీర్ణ ప్రభుత్వం పతనమవుతుందని తామెన్నడూ చెప్పలేదన్నారు. బెంగళూరులోని డాలర్స్ కాలనీలో ఉన్న స్వగృహంలో మీడియాతో మాట్లాడుతూ.. సంకీర్ణ ప్రభుత్వం ఎలాంటి భయం లేకుండా సురక్షితంగా కొనసాగవచ్చని యడ్యూరప్ప వెల్లడించారు. తాము ప్రతిపక్ష పాత్రను పోషిస్తామని పేర్కొన్నారు. కాగా, కర్ణాటక ప్రభుత్వం కూలిపోతుందన్న ప్రచారం వెనుక మాజీ సీఎం సిద్దరామయ్య ఉన్నారని కేంద్ర మంత్రి సదానంద గౌడ ఆరోపించారు. సీఎం కుమారస్వామి ఏ పని చేసినా సిద్దరామయ్య అడ్డు తగులుతున్నారని విమర్శించారు. మరోవైపు యడ్యూరప్ప ప్రకటనను స్వాగతిస్తున్నట్లు సీఎల్పీ నేత సిద్దరామయ్య తెలపగా, కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా పార్టీతో టచ్‌లోనే ఉన్నారని మంత్రి శివకుమార్ చెప్పారు. అసంతృప్తుల్ని బుజ్జగించడంలో భాగంగా అధిష్టానం ఆదేశిస్తే మంత్రి పదవులు వదులుకోవడానికి తనతో సహా సీనియర్ నేతలంతా సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు.

అంతరిక్షానికి నిచ్చెన వేద్దాం..

గగన్‌యాన్‌కు టెక్నాలజీ, వసతులను సిద్ధం చేస్తున్న ఇస్రో..



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రతిష్టాత్మక ప్రాజెక్టు గగన్‌యాన్‌కు రంగం సిద్ధమవుతోంది. రూ.10 వేల కోట్ల ఖర్చుతో వ్యోమగాములు వారం రోజుల పాటు అంతరిక్షంలో ఉండేందుకు ఉద్దేశించిన ఈ భారీ ప్రయోగానికి అవసరమైన అన్ని సాంకేతికతలు, వసతులను ఇస్రో ఒక్కొక్కటిగా సిద్ధం చేసుకుంటోంది. డిజైన్ రూపకల్పన, పారాచూట్స్, స్పేస్ సూట్ల తయారీకి సంబంధించి ఇస్రో చేస్తున్న ప్రయత్నాలు క్లుప్తంగా..

ముందుగా రోబోలు

గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా ముందుగా రోబోలతో కొన్ని ప్రయోగాలు నిర్వహించాలని ఇస్రో ప్రణాళిక సిద్ధం చేసింది. 2022లో మనుషులను అంతరిక్షంలోకి పంపేందుకు ముందుగా మనుషులను పోలిన రోబోల (హ్యూమనాయిడ్స్)తో ప్రయోగాలు నిర్వహిస్తామని ఇస్రో చైర్మన్ కె.శివన్ అంటున్నారు. హ్యూమనాయిడ్ రోబో సిద్ధమైపోయిందని వివరించారు. మానవులను అంతరిక్షంలోకి పంపే సత్తా భారత్‌కు ఉందని నిరూపించడంతో పాటు సురక్షితంగా వెనక్కి తీసుకురావడం కూడా సాధ్యమని చాటి చెప్పాలన్నది తమ లక్ష్యమంటున్నారు. 'ఇస్రో సిద్ధం చేసిన హ్యూమనాయిడ్ రోబో మనిషి చేయగల అన్ని పనులు చేయగలదు. గగన్‌యాన్ సన్నాహక ప్రయోగాల్లో భాగంగా చేసే తొలి ప్రయోగంలోనే దీన్ని వాడతాం. బయో ఫిల్టర్లు, సెన్సర్లు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన ప్రయోగాలు చేపడతాం'అని చెప్పారు. దేశంలోని పరిశోధన సంస్థలు కూడా తమ ప్రతిపాదనలు ముందుకు తెచ్చాయని నిపుణుల కమిటీ వాటిని విశ్లేషించి కొన్నింటినీ చేపట్టే అవకాశం ఉందని అంచనా. గగన్‌యాన్ డిజైన్‌కు సంబంధించిన పనులు వచ్చే వారానికల్లా పూర్తవుతాయని శివన్ తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే 11 కమిటీలను ఏర్పాటు చేశామని ఇవి ఒక్కో ఉపవ్యవస్థ డిజైన్‌ను పరిశీలించి ఓకే చేస్తుందన్నారు. డిజైన్ ఖరారు తర్వాత అవసరమైన సామగ్రిని సమకూర్చుకోవడం మొదలవుతుందని, పరిశోధన శాలలో నమూనా వ్యవస్థలను తయారు చేస్తామని చెప్పారు.

త్వరలో 'మాడ్యూల్స్'డిజైన్లు ఖరారు

గగన్‌యాన్‌కు అవసరమైన క్రూ మాడ్యూల్ (వ్యోమగాములు ఉండే గది), క్రూ సర్వీస్ మాడ్యూల్ డిజైన్ల కరారు ప్రక్రియ తుదిదశకు చేరుకుందని, త్వరలో డిజైన్లు ఖరారు చేస్తామని శివన్ చెప్పారు. హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్ పేరుతో కొత్తగా ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, గగన్‌యాన్‌కు సంబంధించిన పనులన్నీ అక్కడే జరుగుతున్నాయని తెలిపారు. క్రూ మాడ్యూల్, క్రూ సర్వీస్ మాడ్యూళ్లను ఇప్పుడే మొదటిసారిగా రూపొందించట్లేదని, వీటికి అవసరమైన మౌలికవసతులు ఇప్పటికే తమకు ఉన్నాయని చెప్పారు. ఇస్రో కొన్ని సంవత్సరాల కిందటే క్రూ మాడ్యూల్‌ను ప్రయోగాత్మకంగా అంతరిక్షంలోకి పంపి మళ్లీ వెనక్కి తీసుకొచ్చింది. గతేడాది క్రూ ఎస్కేప్ సిస్టం (రాకెట్‌లో వెళ్తుండగా ఏదైనా ప్రమాదం జరిగితే వ్యోమగాములు తప్పించుకునే వ్యవస్థ)ను కూడా పరీక్షించింది. 259 సెకన్ల పాటు జరిగిన ఈ ప్రయోగంలో క్రూ ఎస్కేప్ వ్యవస్థ, క్రూ మాడ్యూల్ సహా రాకెట్ నుంచి విడిపోయింది. అది బంగాళాఖాతంపై ఉండగా, దానికి అమర్చిన పారాచూట్‌లు విచ్చుకున్నాయి. వాటి సహాయంతో శ్రీహరికోటకు 2.9 కిలోమీటర్ల దూరంలో సముద్రంపై దిగింది. అక్కడ నుంచి దాన్ని భూమి మీదకు తెచ్చారు. క్రూ మాడ్యూల్‌కు అమర్చిన ప్రత్యేకంగా రూపొందించిన 7 మోటార్లు క్రూ మాడ్యూల్‌ను అతివేగంతో రాకెట్ నుంచి ప్రమాదం జరగనంత దూరానికి తీసుకెళ్లాయి. 2022లో మానవులను పంపిస్తామని చెప్పారు.

చాలా గొప్ప విషయం...



భారత్ అంతరిక్షానికి మనుషుల్ని పంపడానికి సిద్ధమవడం చాలా గొప్ప విషయం. రెక్కలు కట్టుకొని అంతరిక్షంలోకి వాలితే మనుషుల ఆలోచనల్లోనూ మార్పులు వస్తాయి. గగన్‌యాన్‌తో భారత్ తన సాంకేతిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటి చెబుతుంది. ప్రపంచంలోనే శక్తిమంతమైన దేశంగా నిలుస్తుంది. ఈ కార్యక్రమంతో అంతరిక్ష రంగంలో విద్యార్థులకు ఆసక్తి పెరిగి స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్) కోర్సులకు డిమాండ్ పెరుగుతుంది. ఇదంతా దేశ ఆర్థిక పురోగతికి దోహదపడుతుంది.

జెర్రీ రోజ్, నాసాకు చెందిన మాజీ వ్యోమగామి, ఏడుసార్లు అంతరిక్షానికి వెళ్లి రికార్డు సృష్టించిన వ్యోమగామి


వడోదరా స్పేస్ సూట్



అంతరిక్ష యాత్రలో వ్యోమగాములు ధరించే స్పేస్ సూట్‌కు ఎన్నో ప్రత్యేకతలున్నాయి. మేకిన్ ఇండియా ప్రాజెక్టులో భాగంగా దీన్ని గుజరాత్‌లోని వడోదరాలో రూపొందించారు. విదేశాలు రూపొందిస్తున్న స్పేస్ సూట్లతో పోలిస్తే ఇది 20% తక్కువ బరువుంటుంది. ఇతర దేశాలు స్పేస్ సూట్ తయారీకి చేసిన వ్యయం కంటే వందో వంతు తక్కువ ఖర్చుతో రూపొందించారు. 4 పొరల ఈ స్పేస్‌సూట్‌ను ప్రత్యేకమైన పోగులతో అత్యాధునిక టెక్నాలజీతో తయారు చేశారు. అంతరిక్షంలో ఉండే అధిక పీడన పరిస్థితులను తట్టుకునేలా రూపొందింది. శరీర ఉష్ణోగ్రతల్ని కొలిచే బయో సెన్సర్లు, అత్యవసర పరిస్థితుల్లో వినియోగించుకోవడానికి ఆక్సిజన్ సిలిండర్లు, చేతులకు వేసుకోవడానికి మృదువైన తొడుగులు, తేలిగ్గా ఉండే షూస్ అన్నీ ఇందులోనే ఉంటాయి. వీటిని పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతోనే రూపొందించారు. ఈ స్పేస్ సూట్ మైనస్ 40 డిగ్రీల అతిశీతల పరిస్థితుల నుంచి 80 డిగ్రీల సెల్సియస్ వేడి వరకు ఉష్ణోగ్రతలను తట్టుకునేలా రూపకల్పన చేశారు.

ఆగ్రా పారాచూట్...

అంతరిక్షంలో వారం రోజులు గడిపి తిరిగి పయనమయ్యే ముగ్గురు భారతీయ వ్యోమగాములు భూమికి చేరుకునేటప్పుడు అవసరమయ్యే పారాచూట్‌లను ఆగ్రాలో తయారు చేశారు. డీఆర్‌డీవోకి చెందిన ఏరియల్ డెలివరీ రీసెర్చ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ వీటిని రూపొందించింది. తిరుగుప్రయాణంలో భూమికి 120 కి.మీ. ఎత్తులో క్రూ మాడ్యూల్, సర్వీసు మాడ్యూల్ వేరవుతాయి. అప్పట్నుంచి వ్యోమగాములు భూమి మీదకి చేరుకోవడానికి 36 నిమిషాలు పడుతుంది. గుజరాత్‌లో అరేబియా సముద్ర తీర ప్రాంతంలో క్రూ మాడ్యూల్ దిగడానికి ముందు ఈ పారాచూట్‌లు తెరుచుకుంటాయి. పారాచూట్‌లు క్రూ మాడ్యూల్ వేగాన్ని సెకనుకు 216 మీటర్ల నుంచి 11 మీటర్లకి తగ్గిస్తాయి.



- సాక్షి నాలెడ్జ్ సెంటర్

ఉపకారం ఇక చకచకా!

- స్కాలర్‌షిప్ నిధుల విడుదలే ప్రథమం
- వాటి తర్వాతే కాలేజీ ఖాతాకు రీయింబర్స్‌మెంట్
- విద్యార్థులకు ఉపశమనం కలిగించేందుకు సర్కారు నిర్ణయం
- 2018–19 స్కాలర్‌షిప్ నిధుల విడుదలకు గ్రీన్‌సిగ్నల్
- తొమ్మిదేళ్లలో తొలిసారిగా విద్యాసంవత్సరం మధ్యలో ఉపకారవేతనాలు

సాక్షి, హైదరాబాద్: పోస్టుమెట్రిక్ విద్యార్థులకు శుభవార్త. ఇకపై విద్యాసంవత్సరం ముగిసేలోపే ఉపకారవేతనం అందుతుంది. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ కంటే ముందే ఉపకారవేతనాన్ని ఇవ్వాలని ప్రభుత్వం సంక్షేమ శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. గత కొన్నేళ్లుగా పోస్టుమెట్రిక్ విద్యార్థులకు ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు కోర్సు ముగిశాకే అందుతున్నాయి. దాదాపు తొమ్మిదేళ్లుగా నిధుల విడుదలలో జాప్యం అవుతుండటంతో విద్యార్థులకు ఆలస్యంగా అందుతున్నాయి. కొన్ని సందర్భాల్లో రెండు, మూడేళ్ల తర్వాత అందిన ఘటనలూ ఉన్నాయి. దీంతో ఉపకారవేతనం ఉద్దేశం గాడితప్పుతోంది. అలాకాకుండా విద్యాసంవత్సరం మధ్యలోనే అందిస్తే ఆ మొత్తం విద్యార్థుల అకడమిక్ కార్యకలాపాలకు ఉపయోగకరమవుతుందని భావించిన ప్రభుత్వం ఈ దిశగా చర్యలకు ఆదేశించింది.

ఉపకారం వస్తేనే ఫీజు..

ఉపకారవేతనాలను ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో అనుసంధానం చేస్తోంది. విద్యార్థుల ఉపకారవేతన దరఖాస్తులు ఆమోదించి బిల్లును ఖజానా శాఖకు పంపిన తర్వాతే ఫీజు బిల్లులు తయారు చేయాలని సంక్షేమ శాఖలకు ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో తొలుత ఉపకారవేతన బిల్లులను క్లియర్ చేసేందుకు సంక్షేమ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. 2018–19 విద్యా సంవత్సరానికి సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ఈ నెలాఖరుతో ముగియనుంది. కానీ దరఖాస్తుల పరిశీలనను అధికారులు ఇప్పటికే ప్రారంభించారు. ఇప్పటికే రూ.145 కోట్ల మేర ఉపకారవేతన బిల్లులను క్లియర్ చేసి ఖజానా శాఖకు పంపినట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు పేర్కొంటున్నారు. మరోవైపు 2017–18 విద్యా సంవత్సరానికి సంబంధించి నిధులు దాదాపు విడుదల కావడంతో ఉపకార, ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులను వేగవంతంగా క్లియర్ చేస్తున్నారు.

కాలేజీల నిర్లక్ష్యానికి చెక్...

విద్యార్థుల ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాల్లో కాలేజీ యాజమాన్యాల పాత్ర కీలకం. విద్యార్థులు ఆన్‌లైన్లో చేసుకున్న దరఖాస్తులను తొలుత ఆమోదించాల్సింది యాజమాన్యమే. వీటిని ఆమోదించిన తర్వాత సంక్షేమ శాఖాధికారుల వద్దకు ఫైళ్లు పంపడం... వాటిని ఆమోదించడంలోనూ యాజమాన్యాలు చురుగ్గా ఉంటాయి. ఉపకారవేతనాల కంటే ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులు క్లియర్ చేయించేలా యాజమాన్యాలు సంక్షేమాధికారులపై ఒత్తిడి తేవడంతో ఉపకారవేతనాల మంజూరీలో జాప్యం జరిగేది. దీంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడేవారు. ఈ పరిస్థితిని గమనించిన ప్రభుత్వం ఉపకారవేతనానికి ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అనుసంధానం చేసింది. ఉపకారవేతనం మంజూరైన తర్వాతే ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలయ్యేలా సాంకేతిక మార్పులు తీసుకొచ్చింది. దీంతో కాలేజీల అత్యుత్సాహానికి ప్రభుత్వం చెక్ పెట్టినట్లయింది.




'అగ్రవర్ణ పేదల రిజర్వేషన్లు అమలుచేయాలి'

సాక్షి, హైదరాబాద్: అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రం జారీ చేసిన ఆదేశాలను తక్షణమే దేశంలోని అన్ని రాష్ట్రాలతో పాటు ఏపీ, తెలంగాణలో కూడా అమలు చేయాలని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, ఆర్థిక వెనుకబాటు ప్రాతిపదికన కల్పించిన విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను ఈ విద్యాసంవత్సరం నుంచి అమలు చేసేందుకు తెలుగు రాష్ట్రాలు చొరవ తీసుకోవాలని, పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీ చేసే ఉద్యోగాలతో పాటు, ఇతర ఉద్యోగాలకు వర్తింప చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నిరుపేద ఓసీలకు రిజర్వేషన్లతో పాటు ఓబీసీలతో సమానంగా వయో పరిమితి సడలించి, ప్రభుత్వ పథకాలు వర్తింప చేయాలని కోరారు.

'ఇన్నోసెంట్'గా మోసం చేశారు

- సిమ్ స్వాపింగ్‌తో దాదాపు 13 కంపెనీలకు కోట్లలో కుచ్చుటోపీ
- సిటీకి చెందిన మూడు కంపెనీల్లో రూ.33 లక్షల వరకు చీటింగ్
- ఫిషింగ్ మెయిల్స్‌తో కంపెనీ వివరాల సేకరణ
- ఆరుగురిని అరెస్టు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు
- సైబరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ వెల్లడి




సాక్షి, హైదరాబాద్: ఇన్నోసెంట్..పేరులో అమాయకత్వం ఉన్నా మనిషి మాత్రం మాయ దారి మోసగాడే. ఫిషింగ్ మెయిల్స్ చేసి కం పెనీ వివరాలు, ఫోన్ నంబర్ తెలుసుకుని.. దాని ద్వారా సిమ్ స్వాప్ చేసి సైలెంట్‌గా కంపెనీల బ్యాంకు ఖాతాల్ని గుల్లచేసేస్తుందీ అ'మాయ'క బృందం. కంపెనీల ఖాతాలో డబ్బుల్ని కొల్లగొట్టే ప్రణాళికను నైజీరియాలో వేసి కోల్‌కతా కేంద్రంగా అమలుచేసి తప్పించుకునే ఎబిగో ఇన్నోసెంట్ ముఠాను అంతే చాకచక్యం గా సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకున్నారు. కోల్‌కతాలో అరెస్టు చేసి ట్రాన్సిట్ వారంట్‌పై శనివారం నగరానికి తీసుకొచ్చిన సైబర్ క్రైమ్ పోలీసులు ఈ కేసుకు సంబంధించిన వివరాల్ని గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో క్రైమ్స్ డీసీపీ జానకి షర్మిలా, సైబర్ క్రైమ్ ఏసీపీ శ్రీనివాస్‌తో కలిసి పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ మీడియాకు తెలిపారు.

సిమ్ స్వాపింగ్‌తో స్వాహా..

నైజీరియాకు చెందిన ఎబిగో ఇన్నోసెంట్ అలియాస్ జేమ్స్ కోల్‌కతాలో ఉన్న సమయంలో ఫుట్‌బాల్ ఆడేందుకు వచ్చిన మరో నైజీరియా వాసి ఒడాఫీ హెన్రీతో 2014లో పరిచయమేర్పడింది. వీరిద్దరూ కలిసి సిమ్ స్వాపింగ్ ద్వారా చేసే మోసాలకు తెరదీశారు. డబ్బుల బదిలీకి నకిలీ పేర్లతో బ్యాంక్ ఖాతాలు సమకూర్చే కోల్‌కతాకు చెందిన సంతోశ్ బెనర్జీ, రిజిష్టర్డ్ సెల్‌నంబర్ వివరాల ద్వారా నకిలీ డాక్యుమెంట్లు, చిరునామాలు సృష్టించి డూప్లికేట్ సిమ్ సంపాదించే రాజత్ కుందులను హెన్రీకి పరిచయం చేశాడు. అనంతరం నైజీరియాకు వెళ్లిపోయిన ఎబిగో ఇన్నోసెంట్ హ్యాకర్లు హ్యాక్ చేసిన కంపెనీ వివరాలను డార్క్‌నెట్‌లో కొనుగోలు చేశాడు. భారత్‌లోని కంపెనీల ఈ–మెయిల్స్‌కు ఫిషింగ్ మెయిల్స్ పంపించి ఇంటర్నెట్ బ్యాంకింగ్ లావాదేవీల వివరాలు, రిజిష్టర్డ్ మొబైల్ నంబర్, కంపెనీ పేరు, చిరునామాలను సేకరించి హెన్రీ, రాజత్ కుందు, సంతోశ్ బెనర్జీలకు చేరవేసేవాడు. మొబైల్ టెలికామ్ స్టోర్స్‌లో రాజత్ కుందు తనకు పరిచయమున్న వారి ద్వారా మొబైల్ నంబర్ వివరాలు తెలుసుకునేవాడు. కంపెనీకి చెందిన రబ్బర్ స్టాంప్‌ను తయారు చేసి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి కోల్‌కతాకు చెందిన చందన్ వర్మకు ఇచ్చేవాడు. అతడు సంజీవ్ దాస్ అనే వ్యక్తితో కలిసి వెళ్లి బాధితుడి సిమ్‌కు నకిలీ సిమ్ తీసుకునేవాడు.



కేసు వివరాలను వెల్లడిస్తున్న సజ్జనార్



ప్రధాన నిందితుడు ఎడిగో ఇన్నోసెంట్

అలసత్వంతో లక్షలు పోగొట్టుకున్నా..

2017 జూన్ 17న రాత్రి ఎనిమిది గంటల సమయంలో నా సెల్‌నంబర్ పనిచేయడం ఆగింది. ఎయిర్‌టెల్ కాల్‌సెంటర్‌కు కాల్ చేస్తే మీ నంబర్ పనిచేస్తుందని చెప్పారు. సోమవారం ఆ కంపెనీ మొబైల్ స్టోర్స్‌కు వెళితే మీ సిమ్ యాక్టివ్‌లోనే ఉంది. మీరు డూప్లికేట్ సిమ్ తీసుకున్నారా అని తిరిగి ప్రశ్నించారు. ఆధార్‌కార్డు, ఫింగర్ ప్రింట్ తీసుకొని మళ్లీ డూప్లికేట్ సిమ్ ఇచ్చారు. అయితే అప్పటికే నా సెల్ మొబైల్ ఇంటర్నెట్ ద్వారా రూ.24 లక్షల నగదు బదిలీలు కోల్‌కతాలోని బ్యాంక్‌లకు వెళ్లాయని తెలిసింది. సరైన తనిఖీ లేకుండా డూప్లికేట్ సిమ్ జారీ చేసిన సంస్థపై పోలీసులు క్రిమినల్ చర్యలు తీసుకోవాలి.

–గిరి, సిలికాన్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్

శనివారమే... పని కానిచ్చేస్తారు

ఆయా టెలికం స్టోర్స్ నుంచి అసలు సిమ్ కార్డులకు డూప్లికేట్‌లను శనివారాల్లోనే పొంది సాయంత్రానికల్లా రాజత్ కుందుకు చేర్చేవారు. అతడు అదేరోజు దానిని యాక్టివ్ చేసేవాడు. దీంతో ఆ కంపెనీలకు చెందిన వారి సెల్ నంబర్ల సేవలు రాత్రి ఎనిమిది గంటల సమయంలో నిలిచిపోయేవి. సెల్ సిగ్నల్స్ సరిగా లేవని భావించిన కంపెనీ యజమానులు తిరిగి సోమవారం లోపు ఆయా టెలికం స్టోర్స్‌కు వెళ్లేలోపు వీరి బ్యాంక్ ఖాతాల నుంచి దశలవారీగా నగదు ఖాళీ అయిపోయేది. అనంతరం కొంత డబ్బును వివిధ ప్రాంతాల్లోని ఏటీఎంల నుంచి విత్‌డ్రా చేయడంతో పాటు దుకాణాల్లో బంగారు ఆభరణాలు కొనుగోలుచేసేవారు. వీటిని సంతోశ్ బెనర్జీ విక్రయించి నగదు రూపంలోకి మార్చి హెన్రీకి అప్పగించేవాడు. అనంతరం ఈ డబ్బుతో బట్టలు, వస్తువులు కొనుగోలు చేసి నైజీరియాలోని ఇన్నోసెంట్‌కు పంపేవారు.

దొంగలు దొరికారిలా..



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు..

ఈ విధంగానే నగరంలో ఎలిమ్ కెమికల్స్, షాలోమ్ కెమికల్ ఇండస్ట్రీస్ కంపెనీ ఖాతాల నుంచి రూ. తొమ్మిది లక్షలు ఖాళీ కావడంతో చింతల్‌కు చెందిన వాటి యజమాని వెంకటకృష్ణ గతేడాది డిసెంబర్ 17న సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు బ్యాంక్‌ఖాతా వివరాలతో పాటు సెల్‌నంబర్ల లోకేషన్ ఆధారంగా కోల్‌కతాలో ఉంటున్న ఆరుగురు నిందితులను అక్కడే అరెస్టు చేశారు. వీరి నుంచి 17 సెల్‌ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్, మూడు పాస్‌పోర్టులు, డెబిట్‌కార్డులు, ఆధార్ కార్డులు, లామినేషన్ మెషీన్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీరు చెన్నై,కోల్‌కతా,అహ్మదాబాద్, ఢిల్లీలోని 11 పరిశ్రమలను చీటింగ్ చేసినట్టు పోలీసు విచారణలో తేలింది. గతంలో నగరానికి చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిలికాన్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను రూ.24 లక్షలు మోసం చేసినట్టుగా నిందితులు ఒప్పుకున్నారు. ఈ నిందితుల్లో ఒకడైన సంతోష్ బెనర్జీని 2015లో ఇటువంటి కేసులో జైపూర్ పోలీసులు అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. నిందితులను పోలీసు కస్టడీలోకి తీసుకుంటే మరిన్ని విషయాలు తెలుస్తాయని సీపీ సజ్జనార్ అన్నారు. కాగా ఇందులో పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు ఎబిగో ఇన్నోసెంట్‌ను పట్టుకునేందుకు నైజీరియాకు లేఖ రాస్తామని తెలిపారు. వెరిఫికేషన్ లేకుండా సిమ్ జారీ చేసిన సంస్థపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆటా అధ్యక్షుడిగా పరమేశ్ భీమిరెడ్డి



హైదరాబాద్: అమెరికా తెలుగు అసోసియేషన్ (ఆటా) 2019–20 సంవత్సరానికి అధ్యక్ష పగ్గాలు తెలంగాణకు చెందిన వ్యక్తికి అప్పగించారు. మహబూబ్‌నగర్ జిల్లా పోతిరెడ్డిపల్లికి చెందిన పరమేశ్ భీమిరెడ్డి 'ఆటా'నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. పాలమూరు జిల్లాలో సాధారణ మధ్యతరగతి కుటుంబంలో పుట్టి అమెరికాలో స్థిరపడ్డ భీమిరెడ్డి ఎన్నో సేవా సంస్థల్లో ట్రస్టీగా సేవలు అందించి ఆటా అధ్యక్ష స్థాయికి అంచెలంచెలుగా ఎదిగారు. నిస్వార్థ సేవా ఫలానికి ఫలితం ఈ బాధ్యత అని భీమిరెడ్డి అన్నారు.

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792